ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 9-6-2019 ఆదివారం సిటీ సంపుటి 45 సంచిక 300

రూ. 8-00. పేజీలు 18+16+32 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

గులాబీ ఖిల్లాలు

జిల్లాలన్నీ తెరాస ఖాతాలోకే.. 32 జడ్పీల్లోనూ జయకేతనం

- ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులన్నీ ఆ పార్టీ సభ్యులకే
- జులై 5న బాధ్యతల స్వీకరణ
- అంతవరకు పాత పాలకవర్గాలే
- కొత్త జడ్పీ, మండల పరిషత్ అధ్యక్షులకు కేసీఆర్, కేటీఆర్ శుభాకాంక్షలు

పరిషత్ పీఠాలపై తెరాస పరిపూర్ణ విజయం అవిచ్ఛిన్నమైంది. ఇప్పటికే అత్యధిక ఎంపీపీ పీఠాలు కైవసం చేసుకున్న జోడు మీదున్న అధికార పార్టీ.. శనివారం జిల్లా పరిషత్‌లన్నింటిలోనూ దర్జాగా పాగా వేసింది. అన్నిచోట్ల స్పష్టమైన ఆధిక్యం సాధించిన గులాబీ దళం.. అదిలాబాద్ మినహా అంతటా ఏకగ్రీవంగా జడ్పీ పీఠాలను కైవసం చేసుకుంది.

32 జిల్లాల్లోనూ జడ్పీ ఛైర్‌పర్సన్లను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. పార్టీ శ్రేణులు గులాల్ చల్లుకొని సంబురాలు చేసుకున్నాయి. జిల్లా కేంద్రాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లు విజేతలు, వారి విజయం కోసం శ్రమించిన మంత్రులు, ఇతర నేతల్ని ప్రత్యేకంగా అభినందించారు. -వివరాలు 11లో

భూపాలపల్లి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన శ్రీహర్షిణి స్వగ్రామం కాటారం వచ్చిన సందర్భంగా కార్యకర్తల ర్యాలీ

ఆస్ట్రేలియాతో అమీతుమీ

నేటి పోరు భారత్‌కు కీలకం

లండన్: ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు కీలక సమరానికి సిద్ధమైంది. దక్షిణాఫ్రికాపై విజయంతో టోర్నీలో శుభారంభం చేసిన కోహ్లీసేన. . ఆదివారం తన రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఢీకొనబోతోంది. ఇప్పటికే టోర్నీలో ఆ జట్టు రెండు విజయాలు సాధించింది. చివరగా భారత్‌తో తలపడ్డ సిరీస్‌లో ఆస్ట్రేలియానే నెగ్గింది. బలాబలాల్లోనూ దీటుగా కనిపిస్తున్న కంగారూ జట్టుతో మ్యాచ్ అంటే భారత్‌కు సవాలే. బెటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఆస్ట్రేలియాను ఓడించి సెమీస్ దిశగా ముందడుగు వేయాలని కోహ్లీసేన ఆశిస్తోంది.

-వివరాలు 'ఛాంపియన్'లో..

విలీనంపై కాంగ్రెస్ నిరసన ఉద్ధృతం

2లో

- సత్యాగ్రహ దీక్ష ఆమరణ దీక్షగా మార్పు
- పట్టపగలే ప్రజాస్వామ్యం అపహాస్యం: మల్లు భట్టివిక్రమార్క
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి: ఉత్తమ్



ధర్నాచౌక్ వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణ సత్యాగ్రహ దీక్షలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్సీ కుంతియా. వేదికపై నేతలు సీతక్క, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, దనుమకుమార్, కోదండరాం, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, జీవన్‌రెడ్డి, వీహెచ్, రాపుల చంద్రశేఖర్‌రెడ్డి

ఏపీలో పండగలా మంత్రుల ప్రమాణం

- 25 మందితో ప్రమాణం చేయించిన గవర్నర్
- ఉద్యోగులకు 27% ఐఆర్
- సీపీఎస్ రద్దు 7లో
- సీఎం వైఎస్ జగన్ వెల్లడి

మంత్రులుగా ప్రమాణం చేస్తున్న పుష్పశ్రీవాణి, నారాయణస్వామి, సుభాష్ చంద్రబోస్, అంజాద్‌బాషా, ఆళ్ల నాని (వీరిని ఉప ముఖ్యమంత్రులుగా సీఎం జగన్ ప్రకటించారు)

నేడు ఎంసెట్ ఫలితాలు

- మధ్యాహ్నం 12.30 గంటలకు విడుదల 2లో

పుడమి పులకరింత

- రుతుపవనాలు వచ్చేశాయ్!
- జల్లులతో పరవశించిన కేరళ
- 13న తెలంగాణలోకి ప్రవేశం 2లో

54 లక్షల మందికి రైతుబంధు!

- ఇప్పటికి 13 లక్షల మంది రైతుల ఖాతాలే అప్‌లోడ్
- వీరిలో 8 లక్షల మంది ఖాతాల్లో రూ.790 కోట్లు జమ
- రైతులంతా ఏఈవోలకు బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలి
- లేకపోతే నిధులు విడుదల కావు
- వ్యవసాయశాఖ స్పష్టీకరణ

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలోని రైతులంతా గ్రామస్థాయిలో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)కి స్పష్టమైన వివరాలు ఇస్తేనే రైతుబంధు సొమ్ము అందుతుందని వ్యవసాయశాఖ తాజాగా స్పష్టం చేసింది. రెవెన్యూ శాఖ రాష్ట్రంలోని 54.60 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చిందని, మరికొందరికి పాసుపుస్తకాలు ఇవ్వడానికి తహసీల్దార్లు డిజిటల్ సంతకం చేశారని, వీళ్లందరి బ్యాంకు ఖాతా, సదరు బ్యాంకు ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ వివరాలను సేకరించి రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఏఈఓలకు ఆదేశాలిచ్చింది.

ఎకరానికి రూ.5 వేల చొప్పున

ఇప్పటివరకు కేవలం 13 లక్షల మంది రైతుల ఖాతాల వివరాలను మాత్రమే ఏఈఓలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీరిలో 8 లక్షల మంది ఖాతాల్లో వ్యవసాయశాఖ నేరుగా రూ.790 కోట్లను జమచేసింది. గతేడాది 4 లక్షల మంది రైతులు తమ బ్యాంకు ఖాతా వివరాలను ఇవ్వలేదు. ఈసారి కూడా వారి వివరాలు ఇప్పటివరకు అందకపోవడంతో గత యాసంగిలో డబ్బు జమ అయిన రైతుల ఖాతాలకే ఇప్పుడూ ఎకరానికి రూ.5 వేల చొప్పున జమ చేస్తున్నామని ఆ శాఖ అధికారులు తెలిపారు. వారితోపాటు కొత్త పాసుపుస్తకాలు అందిన రైతుల వివరాలు కూడా పంపాలని తాజాగా ఏఈఓలను ఆదేశించారు.

సందేహాలతో ఏఈఓలలో గందరగోళం

రైతుల వివరాలను అప్‌లోడ్ చేసే విషయంలో ఏఈఓలలో స్పష్టత కొరవడిందని, అందుకే వేగంగా వివరాలు ఆన్‌లైన్‌లోకి వెళ్లడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయశాఖ మార్గదర్శకాల ప్రకారం తొలుత ఏఈఓ రైతుల వివరాలను అప్‌లోడ్ చేయాలి. మండల స్థాయిలో ఉండే వ్యవసాయాధికారి(ఏఓ) వాటిని తనిఖీ చేసి ఆమోదించాక ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. వాటిని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఉండే రైతుబంధు నోడల్ అధికారి పరిశీలించి సొమ్ము విడుదల చేస్తారు. ఇలా సొమ్ము విడుదలకు అనుమతించిన రైతుల వివరాలను నోడల్ అధికారి తిరిగి ఏఈఓలకు పంపుతారు. మరోసారి బ్యాంకు ఖాతా సంఖ్యలను తనిఖీ చేయాల్సిందిగా సూచిస్తారు. ఇక్కడే గందరగోళం ఏర్పడుతోంది. నోడల్ అధికారి ఇలా పంపిన వివరాలనే ఏఈఓలు తనిఖీ చేసి పదిలే స్తున్నారు. మిగతా రైతుల వివరాలను అప్‌లోడ్ చేయడం లేదు. దీనివల్ల అందరి వివరాలు ఆన్‌లైన్‌లోకి వెంటనే రావడం లేదని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

వ్యవసాయ కమిషనర్ రాహుల్‌బొజ్జా

"గత యాసంగిలో 44 లక్షల మంది రైతులకే రైతుబంధు సొమ్ము ఐదిలీ అయింది. ఆ తరవాత మరో 10 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందినందున వారి వివరాలు ఇప్పుడు ఏఈఓలు అప్‌లోడ్ చేయాలి. లేకపోతే వారికి సొమ్ము రాదు. అందుకే అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఏఈఓలకు తాజాగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం" అని వ్యవసాయ కమిషనర్ రాహుల్‌బొజ్జా 'ఈనాడు'కు చెప్పారు. ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదని, దశలవారీగా రైతులందరి ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. రైతులంతా తమ గ్రామ ఏఈఓ వద్దకెళ్లి తమ బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేశారా? లేదా? అనేది తెలుసుకోవాలన్నారు. అక్కడ సరైన సమాధానం రాకపోతే ఏఓను సంప్రదించాలని అక్కడ కూడా స్పందనలేకపోతే జిల్లా నోడల్ అధికారికి ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు.

దక్షిణాదినా హిందీపై పట్టు సాధ్యమే!

ఈనాడు 1869 - 2019 మహోన్నతి 150వ జయంతి వేడుకలు

1915 ఏప్రిల్ 21న గాంధీజీ తన మద్రాసు పర్యటనలో భాగంగా ఆంధ్రపత్రిక విలేఖరితో ముచ్చటిస్తూ.. భారతీయ భాషల గురించి తన అభిప్రాయాలను వివరంగా ప్రస్తావించారు. ఆ నాటి సంభాషణ క్షుణ్ణంగా...

- **భారతదేశమంతటా వ్యవహారం కోసం ఏకభాష సాధ్యమని మీరు భావిస్తారా?**

ఒక్క భాష తప్పక సాధ్యమవుతుంది, అది హిందీ భాష అని నా నమ్మకం.

- **దక్షిణాదివారు హిందీని చక్కగా నేర్చుకొనగలరా?**

దక్షిణాఫ్రికాలో ఉన్న సమయంలో నాకు భారతీయ భాషలు మాట్లాడేవారందరితోనూ సంబంధాలున్నాయి. దక్షిణాదివారు హిందీని అద్భుతంగా నేర్చుకుంటారు. తమిళ, తెలుగు సోదరులకైతే హిందీ నేర్చుకునే సామర్థ్యంలో ఏ తారతమ్యం లేదు. మా ఆశ్రమంలోని గోవిందస్వామిగారి భార్య ఆంధ్ర స్త్రీ. ఆమె తెలుగు, తమిళ, హిందీ భాషలే కాదు, ఇంగ్లిషు, జులూ భాషల్లో కూడా అవలీలగా మాట్లాడతారు. వాళ్ల పిల్లలకూ హిందీతో సహా చాలా భాషలు పట్టుబడ్డాయి. ఇదొక ప్రత్యేక దృష్టాంతం కాదు, ఇలాంటి ఉదాహరణలు అనేకం! నా బిడ్డలు కూడా సాధారణ జనంతో కలిసి మెలసి ఉండటం ద్వారా ఎన్నో భాషలు నేర్చుకున్నారు. మన విద్యావ్యవస్థలోనే ఇటువంటి పరిస్థితులు కల్పించాలన్నది నా ఆశయం.

- **దక్షిణాదిలో హిందీ లేదు. ఇప్పటికే ఆంగ్లం దేశమంతా వ్యాపించి ఉంది, హిందీ కంటే ఆంగ్లమే సామాన్య భాషగా ఆమోదించవచ్చు కదా?**

ఇప్పటి పరిస్థితిని బట్టి చూస్తే ఇంగ్లిషుకు ప్రాబల్యం ఎక్కువుండటం నిజం. మనం దేశ భాషలను నిర్లక్ష్యం చేసి, దురవస్థల పాలు చేసినంత కాలం ఆంగ్ల ప్రాబల్యం అలాగే ఉంటుంది. ఇది అభిలషణీయం కాదు, గౌరవప్రదమూ కాదు. మనం పరజాతి ప్రభుత్వాన్ని సహించాచేమోగానీ మనలోని లోపాలను మనం సహించకూడదు. దేశభాషలను నేర్చుకోవటం విద్యావంతుల విధి. సామాన్యులకు ఆయా దేశభాషలు తప్పకపోవచ్చేమోగానీ విద్యావంతులైన భారతీయులంతా పెక్కు భాషలు మాట్లాడటం అవసరం. దీనికి ఇప్పటి విద్యావిధానం తగినదిగా లేదు, పది సంవత్సరాలలో మాతృభాష, హిందీ, సంస్కృతం, ఒక ద్రావిడ భాష, ఇంగ్లిషు.. అన్నింటినీ నేర్చవచ్చు. శాస్త్రాలన్నింటినీ మాతృభాషలోనే నేర్పాలి. ఇతర భాషలలో సంపూర్ణ పాండిత్యం అవసరం లేదుగానీ సాధారణ వ్యవహారం మాత్రం తప్పనిసరి అని నా అభిప్రాయం. ఈ దేశంలో విద్యావిధానకర్తలు మొదట మాతృభాషకు, తర్వాత జాతీయ భాషకు, తర్వాత ఇతర భాషలకు ప్రాముఖ్యం ఇవ్వాలన్నది నా కోరిక.

వ్యవసాయ బావిలో పడ్డ చిరుత

- మూడు గంటల పాటు శ్రమించి పైకి తీసిన అటవీ సిబ్బంది

భానాపూర్ (గ్రామీణం, న్యూస్‌టుడే): ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడిన చిరుతను అటవీసిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి బయటకు తీసిన సంఘటన ఇది. నిర్మల్ జిల్లా భానాపూర్ మండలం రాజూరా చందునాయక్‌తండా గ్రామశివారులోని పంటచేనులో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో శుక్రవారం రాత్రి చిరుతపులి ప్రమాదవశాత్తు పడింది. శనివారం ఉదయం ఆటుగా వెళ్లిన ఓ రైతు దీన్ని గుర్తించి ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. ప్రజలు చిరుతను చూసేందుకు భారీగా తరలివచ్చారు. సమాచారమందుకున్న భానాపూర్, పెంబి, దిమ్మదుర్తి అటవీరేంజ్ పరిధిలోని అధికారులు, సిబ్బంది, పెంబి ఎస్సై భవానిసేన్ వ్యవసాయబావి వద్దకు చేరుకున్నారు. రాజూరా ఎస్ఎస్‌వో సంధ్యారాణి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. జన్నారం నుంచి రెస్క్యూ టీం వచ్చేందుకు ఆలస్యం అవుతుందని తెలియడంతో కర్రలతో పెద్ద నిచ్చెన తయారుచేశారు. దాన్ని నెమ్మదిగా బావిలోకి దించి అందరూ దూరంగా వెళ్లిపోయారు. చిరుత నెమ్మదిగా నిచ్చెన ద్వారా పైకి చేరుకుని అనంతరం అటవీప్రాంతంలోకి వెళ్లిపోయింది. చిరుత వయసు మూడేళ్లు ఉంటుందని, దానికి ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా అటవీప్రాంతంలోకి పంపినట్లు భానాపూర్ ఎఫ్‌ఆర్వో వినాయక్ తెలిపారు.



నిచ్చెన ఎక్కి పైకి వస్తున్న చిరుత

నేడు ఎంసెట్ ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ అనుబంధ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఎంసెట్-2019 పరీక్ష ఫలితాలు ఆదివారం వెలువడతాయి. వీటిని మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో జేఎన్‌టీయూ హైదరాబాద్ అడిటోరియం వద్ద ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంసెట్ కన్వీనర్ ఎన్. యాదయ్య విడుదల చేయనున్నారు. ఎంసెట్‌లో వచ్చిన మార్కులు, ఇంటర్మీడియట్ ప్రధాన సబ్జెక్టుల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కుల వెయిటేజీతో కలిపి ఎంసెట్ ర్యాంకులు వెల్లడిస్తారు. ఫలితాలు, ర్యాంకులు www.eenadupratibha.net, www.eenadu.net, https://eamcet.tsche.ac.in వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి.

గోవా విమానాశ్రయం తాత్కాలిక మూత

దిల్లీ: గోవా విమానాశ్రయాన్ని శనివారం కొద్దిసేపు మూసేశారు. దాంతో పలు విమానాలను దారి మళ్లించారు. నౌకాదళ యుద్ధవిమానం ఇంధన ట్యాంక్ కారణంగా చిన్నపాటి అగ్నిప్రమాదం సంభవించడంతో విమానాల రాకపోకలను తాత్కాలికంగా ఆపాల్సి వచ్చింది.

నేడు తిరుమలకు ప్రధాని

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం తిరుమలకు రానున్నారు. ఈ క్రమంలో ఆయనకు స్వాగతం పలికేందుకు గవర్నర్ నరసింహన్ ఇప్పటికే అక్కడకు చేరుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్ కూడా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతికి రానున్నారు. శ్రీలంక రాజధాని కొలంబో నుంచి సాయంత్రం 4.30గంటలకు ప్రధాని మోదీ రేణిగుంట విమానాశ్రయం చేరుకుని.. సమీప మైదానంలో జరిగే బాజపా బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం రహదారి మార్గంలో తిరుమల శ్రీపద్మావతి విశ్రాంతి సముదాయానికి చేరుకుంటారు. స్నానాదుల తర్వాత మహద్వారం గుండా శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు. సూర్యాస్తమయం కాని పక్షంలో మోదీకి శ్రీవారి ఆలయ అత్యున్నత మర్యాద అయిన జ్ఞిస్కిపాల్ స్వాగతం లభిస్తుంది. రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం, ఆలయ సత్కారాలు ఉంటాయి. శ్రీవారి దర్శనానంతరం మోదీ దిల్లీకి ప్రయాణమవుతారు.

13న దిల్లీకి సీఎం కేసీఆర్!

- 14న నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు
- ప్రధానితో భేటీ అయ్యే అవకాశం!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 13న సాయంత్రం దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. 14న దిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనూ సీఎం భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలతో పాటు వ్యవసాయాన్ని జాతీయ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం, తదితర అంశాల గురించి కేసీఆర్ చర్చించనున్నారని తెలిసింది. తెలంగాణ సచివాలయ నిర్మాణం కోసం జైసన్ పోలో మైదానం, అభివృద్ధి పనులకు రక్షణ శాఖల భూముల కేటాయింపుపైనా ప్రధాని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోనూ కేసీఆర్ మాట్లాడనున్నారని సమాచారం.

విలీనంపై కాంగ్రెస్ నిరసన ఉద్ధృతం

హైదరాబాద్, కవాడిగూడ - న్యూస్‌టుడే

సీఎల్పీ విలీన చర్యను తీవ్రంగా నిరసిస్తున్న కాంగ్రెస్.. ఆందోళనను మరింత ఉద్ధృతం చేసింది. తాజా మాజీ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన 36 గంటల సత్యాగ్రహ దీక్షను అమరణ నిరాహార దీక్షగా మారుస్తున్నట్లు ప్రకటించింది. శనివారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణ సత్యాగ్రహ దీక్షను టీపీసీసీ అధ్యర్యంలో మల్లు భట్టివిక్రమార్క చేపట్టారు. ఈ దీక్షకు పలువురు కాంగ్రెస్, ఇతర పార్టీ నేతలు మద్దతు ప్రకటించారు.

రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన తెలంగాణలో ప్రజాస్వామ్యం పట్టపగలే అపహాస్యం అవుతోందని మల్లు భట్టివిక్రమార్క ఆవేదన చెందారు. సాగునీటి, తాగునీటి ప్రాజెక్టుల పునరాకృతి(రీ డిజైనింగ్)లో అవినీతిపై శాసనసభలో ప్రశ్నించినందుకే కాంగ్రెస్ శాసనసభ్యులను తెరాసఎల్పీలో విలీనం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ ఉడత ఊపులకు కాంగ్రెస్ భయపడదని.. ఆయన అవినీతిని బట్టబయలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి, భూముల కుంభకోణాలు, నయీం భూముల కుంభకోణం, అవినీతి చిట్టా ఆధారాలతో సహా బయట పెడ్తామన్నారు. సత్యాగ్రహ దీక్షను అమరణ నిరాహారదీక్షగా మారుస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్కలు ఈ సందర్భంగా ప్రకటించారు.

దీక్షాస్థలి నుంచి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆక్రమిత భూములు క్రమబద్ధీకరిస్తామని, కాంట్రాక్టులు ఇస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని, కేసుల్లో ఇరికిస్తామని.. ఇలా పలురకాలుగా కేసీఆర్ ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేసి ఎమ్మెల్యేలను తెరాసలో చేర్చుకుంటున్నారన్నారు. ఇది కిడ్నాప్‌లోకే కిందకే వస్తుందన్నారు. కేసీఆర్ అప్రజాస్వామిక విధానాలపై రాష్ట్రపతికి, లోక్‌పాల్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. రాజ్యాంగం ప్రకారం పార్టీ మారే ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేసి వేరే పార్టీలో చేరాలి. అలా కాని పక్షంలో వారిని స్పీకర్ అనర్హులుగా ప్రకటించాలని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు లిఖిత పూర్వకంగా సీఎల్పీ నేతగా ఫిర్యాదు చేసినా స్పీకర్ పట్టించుకోకపోగా.. దొంగతనంగా వారితో సమావేశమై విలీన లేఖ తీసుకున్నారని ఆవేదన చెందారు. సీఎల్పీ నేత, పీసీసీ అధ్యక్షుడు కలిసేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదని, అసెంబ్లీ కార్యదర్శి ద్వారా ఆదేశాలిప్పించి అరెస్టు చేయించారన్నారు. న్యాయనిర్ణేతగా ఉండాల్సిన స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, గవర్నర్ సైతం తమ ఫిర్యాదులపై స్పందించలేదని వాపోయారు. న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నామని.. ప్రగతిశీల, ప్రజాస్వామ్యవాదులు ఇప్పటికైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. కేసీఆర్ రాజకీయ మాపియాను అడ్డుకునేందుకే ఈ సత్యాగ్రహ దీక్ష చేపట్టానని.. ఈ పోరాటం అంతం కాదని, ఆరంభం మాత్రమేనని భట్టివిక్రమార్క పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ సత్యాగ్రహ దీక్షలో చర్చిస్తున్న కుంతియా, భట్టి విక్రమార్క

ప్రజాస్వామ్యానికి చీకటిరోజు: జైపాల్‌రెడ్డి

సీఎల్పీని తెరాసఎల్పీలో విలీనం చేయడం.. ప్రజాస్వామ్యానికి చీకటిరోజని కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌కు పరిమితమైన హక్కులు మాత్రమే ఉన్నాయని.. కాంగ్రెస్‌ను చీల్చడానికి స్పీకర్ ఎవరని ప్రశ్నించారు. పార్టీని విలీనం చేసే అధికారం కేవలం ఎన్నికల సంఘానికి మాత్రమే ఉందన్నారు. విలీనంపై హైకోర్టు నుంచి ఆర్డర్ తెస్తామన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం కేసీఆర్ నీచ రాజకీయాలకు పరాకాష్ఠ అని జైపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు.

ఇవి నియంత చర్యలు: కుంతియా

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలిలో విపక్షం లేకుండా చేయడం ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే నియంత చర్యలుగా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం నడవడానికి సరిపడినంత మంది ఎమ్మెల్యేలు ఉండగా విపక్ష ఎమ్మెల్యేలను బెదిరించి కలుపుకోవడం ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పోతే వారికంటే మొనగాళ్లను తెచ్చి పోటీకి నిలుపుతామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భయపెట్టి కేసీఆర్ తెరాసలో కలుపుకున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం తీరుపైన పత్రికలు, టీవీలు చర్చలు జరపాలని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తరువాత నుంచి కేసీఆర్‌లో అహంకారం హద్దులు దాటిందని సీనియర్‌నేత వి.హనుమంతరావు దుయ్యబట్టారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల పైన ప్రజలు తిరుగుబాటు చేయాలని కోరారు. తెదేపా సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్లు వేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన కేసీఆర్‌కు రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం ప్రసంగిస్తూ ఎన్నికల్లో టీఫారం ఇచ్చిన పార్టీ అనుమతి ఉంటేనే విలీనానికి అవకాశం ఉంటుందని లేకపోతే రాజ్యాంగ విరుద్ధమవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అంతరించి నియంత పాలన వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమకుమార్, ఉపాధ్యక్షుడు మల్లారపి, మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, పార్టీ నేతలు మల్‌రెడ్డి రంగారెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, అనిల్‌కుమార్ యాదవ్, గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

9-6-2019 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
సప్తమి: రా. 2-24 తదుపరి అష్టమి
మఘ నక్షత్రం: సా. 5-58 తదుపరి పుబ్బ
అమృత ఘడియలు: మ. 3-44 నుంచి 5-13 వరకు
వర్జ్యం: ఉ. 6-47 నుంచి 8-16 వరకు
తిరిగి రాత్రి 1-25 నుంచి 2-54 వరకు
దుర్ముహూర్తం: సా. 4-42 నుంచి 5-34 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6.00 వరకు
సూర్యోదయం: ఉ.5-28, సూర్యాస్తమయం: సా.6.26
భానుసప్తమి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	45.0	31.0
అదిలాబాద్	44.8	27.0
నిజామాబాద్	43.1	27.2
తిరుపతి	42.2	28.4
కరీంనగర్	42.0	28.0
విజయవాడ	41.4	29.6
మెదక్	40.0	21.8
గుంటూరు	39.8	29.6
సూర్యాపేట	38.0	28.0
హన్మకొండ	38.0	25.6
నల్గొండ	37.4	24.0
రామగుండం	37.2	28.2
విశాఖపట్నం	36.0	29.0
హైదరాబాద్	34.0	23.7
మహబూబ్‌నగర్	33.2	22.5

ఒమన్ బస్సు ప్రమాదంలో గురువారం మృతిచెందిన భారతీయుల మృతదేహాలను విమానంత త్వరగా భారతకు తరలించేందుకు... దుబాయ్‌లోని భారత కాన్సులేట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఫారెన్సిక్ పరీక్షలు, డాక్యుమెంటేషన్ తదితర ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

పుడమి పులకరింత

దిల్లీ: భగభగమనిపించిన వేసవి తాపానికి ముగింపు పలుకుతూ వర్షాకాలపు మేఘమాలికలు భారత్‌ను పలకరించాయి. వారం జాప్యం తర్వాత ఎట్టకేలకు నైరుతి రుతుపవనాలు శనివారం కేరళ తీరాన్ని తాకాయి. దీంతో దేశంలో నాలుగు నెలల వర్షాకాలం ఆరంభమైనట్లయింది. రుతుపవనాల ప్రభావం వల్ల కేరళలోని అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. పశ్చిమ, దక్షిణ భారత దేశంలోని రిజర్వాయర్లలో నీటి మట్టం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, కొన్ని చోట్ల వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో రుతుపవనాల రాక వైపులకు ఉపశమనాన్ని కల్పించనున్నాయి. ప్రత్యామ్నాయ సాగునీటి వనరు సరిగా లేకపోవడం వల్ల గ్రామీణ భారత్‌లో అనేక ప్రాంతాలకు ఇవే ఆధారం. దేశానికి 75 శాతం వర్షపాతం రుతుపవనాల ద్వారానే వస్తోంది. ఇవి సక్రమంగా ఉంటే ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రయోజనం కలుగుతుంది. స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో వ్యవసాయం వాటానే ప్రధానంగా ఉండటం ఇందుకు కారణం.

ఉత్తర భారత దేశ మైదాన ప్రాంతాలు, మధ్య భారతదేశం, దక్షిణాదిలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని రోజులుగా ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెల్సియస్‌ను మించి నమోదవుతోంది. రాజస్థాన్‌లోని కొన్ని చోట్ల 50 డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువ తాపం చోటుచేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రుతుపవనాలు వల్ల ప్రజలకు ఉపశమనం కలగనుంది. సాధారణంగా రుతుపవనాలు జూన్ 29 కల్లా దిల్లీ చేరుకుంటాయి. ఈసారి 2-3 రోజుల జాప్యం ఉండొచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. అయితే ఆ ఆలస్యం వారం మేర ఉంటుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1న కేరళ తీరాన్ని తాకాలి. ఆ రాష్ట్రంలోని 14 వాతావరణ పరిశీలన కేంద్రాల్లో 60 శాతం చోట్ల వరుసగా రెండు రోజుల పాటు కనీసం 2.5 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైతే ఈ రాష్ట్రంలోకి రుతుపవనాలు వచ్చినట్లు ఐఎండీ ప్రకటిస్తుంటుంది. 2016లో కూడా జూన్ 8న రుతుపవనాలు భారత్‌ను తాకాయి. వీటి రాకలో జాప్యం ప్రభావం సీజన్ మొత్తంలో కురిసే వర్షం పరిమాణంపై ప్రభావం ఉండకపోవచ్చు.

ఈసారి దీర్ఘకాల సరాసరిలో 96 శాతం వర్షపాతం కురుస్తుందని ఐఎండీ అంచనా వేసింది. ఇది సాధారణానికి, సాధారణం కన్నా తక్కువకు మధ్య స్థాయి. దీర్ఘకాల సరాసరి వర్షపాతాన్ని 89 సెంటీమీటర్లుగా నిర్ణేశించారు. పసిఫిక్ మహాసముద్ర జలాలు వేడెక్కే ఎల్ నినో కారణంగా ఈసారి జూన్‌లో కురిసే వర్షాలపై ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నారు.

మూడ్రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక, తెలంగాణపై 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రంలో అక్కడక్కడ ఆదివారం నుంచి మూడ్రోజులపాటు ఉరుములు, మెరుపులు గాలులతో ఒక మాదిరి వర్షాలు పడే సూచనలు ఉన్నాయన్నారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఈ నెల 13న తెలంగాణలోకి ప్రవేశించే అవకాశముందన్నారు.

'ఆర్డినెన్స్ ద్వారా మత్స్యకారుల ఎస్టీ బిల్లు అమలు చేయాలి'

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆర్డినెన్స్ ద్వారా మత్స్యకారుల ఎస్టీ బిల్లును అమలు పర్చాలని జాతీయ మత్స్యకారుల హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.ఎల్.మల్లయ్య, ఎర్రబోయిన మల్లేశంలు ఒక ప్రకటనలో ప్రధాని మోదీని కోరారు. 1970లో ఈ బిల్లుపై పార్లమెంటు ఉభయ సభల్లో నాలుగు రోజుల పాటు చర్చ జరిగిందన్నారు. బిల్లులోని ఎరుకల, యానాది, లంబాడి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి మత్స్యకారులను విస్మరించడం బాధాకరమన్నారు.

భాజపాలో సంస్థాగత ఎన్నికల సందడి

దిల్లీ: భాజపాలో సంస్థాగత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ విషయమై చర్చించేందుకు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 13, 14 తేదీల్లో వివిధ స్థాయిల నాయకులతో సమావేశం కానున్నారు. ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, హరియాణా తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాల కార్యవర్గాల ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రాల కార్యవర్గాలు జాతీయ అధ్యక్షున్ని ఎన్నుకుంటాయి. తొలుత సభ్యత్వ నమోదు జరిగిన తరువాత బూత్ స్థాయి కమిటీల నుంచి వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటవుతాయి.

ఇదీ సంగతి!



నాని నీ, శ్రీనివాస్‌నూ పిలువమన్నారుగా!

ఉద్యమకారులకు పెద్దపీట

- సామాజిక సమీకరణలు.. విధేయతకు ప్రాధాన్యం
- పరిషత్ చైర్‌పర్సన్, ఉపాధ్యక్షుల ఎంపికలో తెరాస ప్రత్యేక వ్యూహం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఉపాధ్యక్ష ఎన్నికల్లో తెరాస.. ఉద్యమకారులకు, పార్టీలో అది నుంచి ఉన్నవారికి పెద్దపీట వేసింది. అధ్యక్షుల ఎంపికలో విధేయతకు అగ్రతాంబూలం ఇచ్చింది. సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుంది. శాసనసభ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ బాగా ఉన్నందున బలహీనవర్గాలకు, మొదటి నుంచి పార్టీలో ఉన్నవారికి, ఉద్యమకారులకు ఆశించిన స్థానాలు దక్కలేదు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో తెరాస ఈ లోటును భర్తీ చేసింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధ్యర్యంలో అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ జరిగింది. పార్టీశ్రేణుల నుంచి వీరిపై సానుకూలత వ్యక్తమైంది. మొత్తం 64 జడ్పీ అధ్యక్ష ఉపాధ్యక్ష పదవుల్లో 40 ఎస్సీ, ఎస్టీ, బీసీ, బలహీనవర్గాలకు కేటాయించింది. గతంలో ఎమ్మెల్యేలుగా పోటీచేసి ఓడిపోయిన వారికి, పోటీకి అవకాశం లభించని వారికి పదవులు దక్కాయి. మంత్రులు, ఎమ్మెల్యేల బంధువులకూ పదవులు దక్కాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులకు కేబినెట్ హోదా ఉంటుంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం వారికి విశేషాధికారాలుంటాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని తెరాస అధిష్ఠానం అధ్యక్షులను ఎంపిక చేసింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రత్యేకంగా స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. జడ్పీటీసీ సభ్యుల మనోభావాలను తెలుసుకున్నారు.

ఉద్యమ నేపథ్యం..: తెలంగాణ ఉద్యమకారులు, 2001 నుంచి పార్టీలో పనిచేస్తున్న వారిని గుర్తించి, ఆరు జిల్లాల పరిషత్ చైర్‌పర్సన్లుగా పోటీకి అవకాశం కల్పించింది. కసుమ జగదీశ్వర్ (ములుగు) బండ నరేందర్‌రెడ్డి (నల్గొండ), మారెపల్లి సుధీర్‌కుమార్ (వరంగల్ నగరం), రాథోడ్ జనార్దన్ (ఆదిలాబాద్), దాదన్నగారి విఠల్‌రావు (నిజామాబాద్), పాగాల సంపత్‌రెడ్డి (జనగామ) ఈ జాబితాలో ఉన్నారు. మరో 10మంది జడ్పీ ఉపాధ్యక్షులయ్యారు. విద్యార్థి నాయకుడు సిద్దం వేణుకు రాజన్న సిరిసిల్ల జిల్లాపరిషత్ ఉపాధ్యక్ష పదవి దక్కింది. రాగూర్ బాలాజీ సింగ్ (నాగర్ కర్నూల్), కంచర్ల చంద్రశేఖర్‌రావు (భద్రాద్రి కొత్తగూడెం), ఎం.ధనమ్మ (ఖమ్మం), నాగజ్యోతి (ములుగు), ఆకుల శ్రీనివాస్ (వరంగల్ గ్రామీణం), హరి చరణ్‌రావు (జగిత్యాల), ఎం.లావణ్య (మెదక్), రాజి రెడ్డి(సిద్దిపేట), విజయ్‌కుమార్ (వికారాబాద్).

సామాజికంగా: జడ్పీ చైర్‌పర్సన్ పదవుల్లో బీసీలకు 7, ఎస్సీలకు 6, ఎస్టీలకు 4 కేటాయించింది. 15 ఓసీలకు ఇచ్చింది. వైస్ చైర్మన్ పదవుల్లో బలహీనవర్గాలకు 23, ఓసీ వర్గాలకు మిగిలిన 9 కేటాయించింది. పలు జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చింది.

మాజీ ఎమ్మెల్యేలు

- గతంలో ఎన్నికల్లో గెలుస్తామని భావించిన అభ్యర్థులు ఓడిపోవడంతో సీఎం కేసీఆర్ వారికి జడ్పీ చైర్‌పర్సన్లుగా అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇదే జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పెద్దపల్లి జడ్పీ చైర్మన్‌గా, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కోరెం కనకయ్య భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు భార్య భాగ్యలక్ష్మి మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచారు. మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుదాకర్‌రెడ్డి మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్ పదవి పొందారు.
- మధిర అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన లింగాల కమల్‌రాజ్ ఖమ్మం జిల్లా జడ్పీ చైర్మన్ అయ్యారు.
- మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తనయుడు శరత్ చంద్రారెడ్డికి జడ్పీ చైర్మన్ పదవి దక్కింది. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయరు తీగల కృష్ణారెడ్డి కోడలు అనిత రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అయ్యారు.
- మాజీ హోంమంత్రి మాధవరెడ్డి తనయుడు సందీప్ రెడ్డి భువనగిరి జడ్పీ చైర్మన్‌గా గెలిచారు.
- మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సలీతుణి సునీత గతంలో రంగారెడ్డి జడ్పీచైర్‌పర్సన్ పదవిని గతంలో రెండు దఫాలు నిర్వహించారు. ఈసారి ఆమె వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.
- నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దఫేదార్ రాజు భార్య శోభ కామారెడ్డి జడ్పీచైర్‌పర్సన్ అయ్యారు.

కేటీఆర్‌కు సీఎం అభినందనలు: జడ్పీ చైర్‌పర్సన్, ఉపాధ్యక్ష స్థానాలకు తెలంగాణ ఉద్యమకారులు, పార్టీని నమ్ముకొని పనిచేసిన వారిని ఎంపిక చేసి, సామాజిక సమతూకం పాటించేలా, అన్నివిధాలా అర్హతలు గల అభ్యర్థులను ఎంపిక చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను అభినందించారు.

శ్రీవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

శ్రీవారి ధర్మదర్శనానికి 30 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల భక్తజన సంద్రమైంది. వేసవి సెలవులు పూర్తికావస్తుండటం, వారాంతపు సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శదర్శనానికి మూడు కిలోమీటర్ల మేర యాత్రికులు బారులు తీరి వేచి ఉన్నారు. శ్రీవారి ధర్శదర్శనానికి 30 గంటలకు పైగా సమయం తీసుకుంటోంది. వరుసల్లో భక్తులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. దాదాపు లక్ష మందికిపైగా స్వామి దర్శనానికి వేచి చూస్తున్నారు. శ్రీవారి ఆలయంలో భోగ శ్రీనివాసమూర్తికి ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వార్షిక సహస్రకలశాభిషేకం జరగనుంది. దీంతో మూడు గంటల పాటు స్వామి దర్శనానికి విరామం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. సాయంత్రం శ్రీవారి దర్శనానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్నారు. ఈ సమయంలోనూ దాదాపు 3 గంటలపాటు శ్రీవారి దర్శనాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో రోజుతో పోల్చితే స్వామి దర్శనభాగ్యం 20 వేల నుంచి 30 వేల మందికి తగ్గనుంది. ఆత్యధిక రద్దీ, సహస్రకలశాభిషేకం, ప్రముఖుల రాక నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి కాలినడకన వచ్చే యాత్రికులకు దివ్యదర్శనం టోకెన్లు, సమయ నిర్దేశిత సర్వదర్శనానికి టోకెన్ల జారీని తితిదే ఆదివారం రద్దు చేసింది.

తెలంగాణలో పురావస్తు శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలి: అర్చక సమాఖ్య

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పురావస్తుశాఖ ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర అర్చక సమాఖ్య కేంద్ర పురావస్తు, సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి ప్రహ్లాద్ సింగ్‌ను కోరింది. రాష్ట్రంలోని 50 కట్టడాలను పురావస్తుశాఖ పరిధిలో చేర్చాలని అభ్యర్థించింది. అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, ఇతర నేతలు సుదాకర్ శర్మ, రాజేశ్వర్ శర్మ, క్రాంతికుమార్ శర్మలు దిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ప్రత్యేక బృందంతో అధ్యయనం చేయించాలని ఉపేంద్రశర్మ అన్నారు.

DR. K. N. MODI UNIVERSITY 76 Years
NEWAI, JAIPUR, (RAJ.) • www.dknmu.org
Nominal Fee | 100% Career Oriented | Limited Seats
B.Sc. Agriculture + ABM
South India Office: Heave Rich Technologies Pvt Ltd
Suite No: 110, Aditya Trade Centre, Passport Office Building, Ameerpet, Hyderabad
admissions@heaverich.in, admission@dknmu.org
9966948456, 7569173563, 9100757956, 8875010040

MBBS
Ministry Of Health Of Russia
SMOLENSK STATE MEDICAL UNIVERSITY
Invites Indian students for direct Government Admissions
Recognized by India, WHO, USA & UK, Min. Qual.-50% in XII in PCB
UNIVERSITY- Founded in 1920. Very high standards of education, English Medium in all years, 1250 Indian students (460 Girls) studying, 101 getting degree in 2019. Closed campus, 8 hospitals (6000 Beds).
MCI SCREENING TEST- Our graduates of 2008 to 2018 have given BEST results among graduates of all foreign medical colleges (Official web sites of Indian Embassy, Moscow and NBE, New Delhi who conducts Screening Test confirm this).
HOSTELS- 2 and 4 seated big rooms, separate blocks for boys and girls.
INDIAN MESS - Mess with Indian food cooked by Indian cooks.
Fee (Tuition+Hostel+Med.Ins.) - USD 6500/year (App. Rs. 4,50,000/-) (25% subsidy available if full fee of 6 years paid in 1st year) and one time payment of Rs.1,50,000/- (By Bank Draft only) which includes – Admission, student visa fee, air ticket Delhi - Moscow.
Bank loans are available. Scholarship for topper students.
Contact: Dr. Aeron, Tel: Russia +79605805555
Official Internet Site:www.sgmu.info
Information Center in A.P. (Parents of Students)
Mrs. M. Sujatha Naidu - 9491772471

TOP MBBS ABROAD CONSULTANTS IN AP / TS
MBBS • CHINA • KAZAKH • PHILIPPINES • UKRAINE • GEORGIA • KYRGYZSTAN • RUSSIA • NEPAL • BANGLADESH
★ అతి తక్కువ ఖర్చుతో ప్రపంచప్రఖ్యాత వైద్యవిద్యనభ్యసించాలనే కోర్కె అవశ్యకం. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల నుండి అత్యధిక సంఖ్యలో మధ్యతరగతి కుటుంబాలలో పుట్టిన విద్యార్థులు డాక్టర్లు కావడానికే రోపాదపడిన అభిప్రాయం.
★ కేవలం TV, Paper మరియు Mobile లో వచ్చే ప్రకటనలు చూసి కన్సల్టెంట్స్‌లను గుడ్డిగా నమ్మకండి. ప్రతి సంవత్సరం కొన్ని వందల మంది విద్యార్థులు కొనిన మంచి మోసపూరిత కన్సల్టెంట్స్ వల్ల అడ్మిషన్ తీసుకొని నష్టపోతున్నారు, తస్మాత్ జాగ్రత్త.
★ కన్సల్టెంట్స్ వద్ద అడ్మిషన్ తీసుకోనే ముందు వారి రాష్ట్రం వంబబడిన కనీసం 75 మంది 100 మంది MCI పాసయిన మరియు ప్రస్తుతం చదివారులో MBBS చదువుతున్న 150 మంది 200 మంది విద్యార్థుల పూర్తి వివరాలు తప్పక తీసుకొని మాట్లాడి మీకు పూర్తి సమర్థం కలిగినోనే బాయిన్ అవ్వండి. కొంత మంది కన్సల్టెంట్స్ చెప్పే మాయమాటలనుం ఎప్పటికీ నమ్మకండి.
APEX CONSULTANTS # 203, Apts., Sl., No.15, Himayathnagar, Hyd.29.
M: 9542895450, 9391347248, 9640872456, 9000225820

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

అధికారుల వేధింపులే కారణమని ఆరోపణ

మహ్మద్ గౌస్

నారాయణపేట, న్యూస్‌టుడే: విధుల కేటాయింపు విషయంలో అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ సంగారెడ్డి జిల్లా నారాయణపేట్ ఆర్టీసీ డిపో ఎదుట డ్రైవర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సిబ్బంది అడ్డుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన బాధితుడు మహ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం... 2007 నుంచి నారాయణపేట్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న మహ్మద్‌గౌస్ ఆరోగ్యం సహకరించకపోవడంతో గతనెల 27 నుంచి సెలవులో ఉన్నాడు. తర్వాతలోని ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి ఫిట్‌నెస్ ధ్రువపత్రంతో వచ్చి శుక్రవారం విధుల్లో చేరారు. ఆరోగ్యం ఇంకా కుదుట పడనందున నైట్‌హాల్ట్ డ్యూటీ ఇవ్వాలని కోరినా.. ఉన్నతాధికారులు పగటి విధులు కేటాయించారు. శనివారం మళ్లీ అదే డ్యూటీ వేయడంతో ఆయన వెళ్లలేదు. ఆరోగ్యం బాగోలేని తనకు పగలు డ్యూటీ వేస్తున్నారని అడిగినా అధికారులు పట్టించుకోవడంలేదని మనస్తాపానికి గురైన మహ్మద్‌గౌస్ శనివారం సాయంత్రం సీసాలో పెట్రోలు తెచ్చుకొని డిపో ఎదుట ఒంటిపై పోసుకున్నాడు. లైటర్‌తో నిప్పంటించుకుంటుండగా గమనించిన ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఆర్టీసీ డీఎం విజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. నిబంధనల ప్రకారమే విధులు కేటాయించామని, శనివారం కేటాయించిన విధులకు వెళ్లకుండా సిబ్బంది గదిలో పడుకొని అన్ని బస్సులు వెళ్లాక రావడంతో పంపలేక పోయామని పేర్కొన్నారు. డిపోలో బోదకుల కొరత వల్ల గౌస్ అడిగిన విధులు కేటాయించలేకపోయామన్నారు. ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని తెలిపారు.

ట్రాక్టర్ స్వాధీనం తీరు సక్రమంగా లేదు

- వేలం సొమ్ములో బకాయి తీసుకోని మిగిలిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించండి
- ఇండియా బుల్స్ ఫైనాన్స్ సర్వీస్‌కు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రుణ వాయిదాలు చెల్లించకపోవడంతో స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను వేలం వేయగా వచ్చిన సొమ్మును బకాయి మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలంటూ ఇండియా బుల్స్ ఫైనాన్స్ సర్వీసుకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

మెదక్ జిల్లాకు చెందిన అమీనాబీ వ్యవసాయ అవసరాల నిమిత్తం 2007లో రూ.5లక్షలకు ట్రాక్టర్ కొనుగోలు చేశారు. అనంతరం ఇండియాబుల్స్ రుణం ఇవ్వడానికి ఆసక్తి చూపడంతో రూ.3లక్షలు తీసుకున్నారు. 2008 నుంచి 2011 వరకు మూడు నెలలకో వాయిదాగా 36 నెలలపాటు రూ.34,375 చొప్పున చెల్లించాల్సి ఉంది. అయితే వాయిదాలను సక్రమంగా చెల్లించకపోవడంతో ఇండియా బుల్స్ ఫైనాన్స్ సర్వీస్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని వేలం వేసింది. దీన్ని సవాలు చేస్తూ అమీనాబీ జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. రూ.3లక్షల రుణం ఇచ్చినప్పటికీ ట్రాక్టర్ కొనుగోలు చేసిన శ్రీ వెంకటేశ్వర ట్రాక్టర్స్ పేరుతో చెక్ ఇచ్చారని, వారు తనకు రూ.2.20లక్షలు చెల్లించి, రెండు నెలల తరువాత రూ.78వేలు ఇచ్చారన్నారు. తనకు రూ.2.83 లక్షలు వచ్చినప్పటికీ రూ.3.09లక్షల రుణానికి వాయిదా చెల్లిస్తూ వచ్చినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగా లేక వాయిదాలు చెల్లించకలేకపోయానని, నోటీసు ఇవ్వకుండా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని వేలం వేశారన్నారు. వేలానికి ముందు వాయిదా రూ.34,375 చెల్లించానని, ట్రాక్టర్‌తోపాటు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ వాదనతో ఇండియాబుల్స్ విభేదిస్తూ వాణిజ్యావసరాల కోసం కొనుగోలు చేశారని, 'వినియోగదారు'గా పరిగణించడానికి వీల్లేదంది. వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వేలం వేశామన్నారు. వాయిదాల బకాయి రూ.1.66లక్షలు చెల్లించాల్సి ఉండగా, ట్రాక్టర్ వేలం వేయగా రూ.1.90లక్షలు వచ్చాయని, ఫిర్యాదుదారుకు రూ.52,907 ఇస్తామని తెలిపారు. అయితే ఈ మొత్తాన్ని ఫిర్యాదుదారుకు చెల్లించలేదు. ఇరుపక్షాల వాదనలను విన్న జిల్లా వినియోగదారుల ఫోరం ఫిర్యాదుదారు వాయిదాలు సక్రమంగా చెల్లించని విషయాన్ని ప్రస్తావించింది. అయితే ట్రాక్టర్‌ను ఇండియాబుల్స్ స్వాధీనం చేసుకున్న విధానం సక్రమంగా లేదని, చెల్లిస్తానన్న సొమ్ము రూ.52,907 చెల్లించకపోవడంతో రూ.1.74లక్షలను ఫిర్యాదుదారుకు వేలం తేదీ నుంచి 12శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ ఇండియా బుల్స్‌తోపాటు పరిహారం నిమిత్తం అమీనాబీ రాష్ట్ర కమిషన్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వాదనలను విన్న రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎంఎస్‌కే జైశ్వాల్, సభ్యులు కె.రమేశ్‌లతో కూడిన ధర్మాసనం జిల్లా వినియోగదారుల ఫోరం తీర్పును సవరించింది. ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో ఇండియా బుల్స్ వేలం వేసిందని, ఆ అంశాల జోలికి ఫోరం వెళ్లడం సరికాదంది. అయితే ఇరుపక్షాల అప్పీళ్లను పరిష్కరిస్తూ ఇండియా బుల్స్ ఇవ్వాల్సిన రూ.52,907ను వేలం తేదీ నాటి నుంచి 12శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది.

ప్రాణాల మీదకు తెచ్చిన ఫోన్ చాటింగ్

- రాజకీయాలపై వాగ్వాదం
- రక్తపోటు ఎక్కువై వ్యక్తి మృతి

రమేష్ (ప్రాతచిత్రం)

పెద్దేముల్, న్యూస్‌టుడే: రాజకీయాలపై చరవాణిలో జరిగిన చాటింగ్ ఒకరి ప్రాణాలు బలితీసుకుంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుక్మాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన చెర్కుపల్లి రమేష్(34) మంబాపూర్‌లో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్నాడు. ఆయన ఇటీవల భాజపా తరపున సర్పంచి ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూశారు. శుక్రవారం ఎంపీపీ ఎన్నిక పూర్తయిన తర్వాత గ్రామం వాట్సప్ గ్రూపులో చాటింగ్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అసభ్యకర సందేశం పోస్టు చేశారు. దీనిపై రమేష్ స్పందిస్తూ మరో పోస్టు చేశారు. కొంత సేపు విమర్శలు కొనసాగిన తర్వాత చాటింగ్ నిలిపి వేసి చరవాణిలో అతనితో వాగ్వాదానికి దిగారు. అరగంట పాటు వాగ్వాదం కొనసాగింది. ఈ క్రమంలో రమేష్‌కు రక్తపోటు ఎక్కువై అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరుగుతున్నాయంటూ భార్య సంతోషితో చెప్పి స్పృహ తప్పిపడిపోయారు. వెంటనే ఆమె తాండూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అధిక రక్తపోటు కారణంగా మెదడులో నరాలు చిట్లి అప్పటికే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తల్లిని హతమార్చిన తనయుడు

భారతమ్మ మృతదేహం

అచ్చంపేట, న్యూస్‌టుడే: ఇరుగు పొరుగు వారితో తరచూ గొడవపడుతూ కుటుంబసభ్యులకు ఇబ్బంది కలిగిస్తున్న కారణంగా తల్లినే తనయుడు హత్య చేసిన ఘటన ఇది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెవారిపల్లికి చెందిన భారతమ్మ (55) తరచూ ఇరుగు పొరుగు వారితో గొడవ పడుతుండటంతో ఆమెపై వారు కుటుంబసభ్యులకు చాలా సార్లు ఫిర్యాదు చేశారు. కుమారుడు సైదులు తల్లిని పలుమార్లు మందలించాడు. ఆమె వైఖరిలో మార్పు రాలేదు. శుక్రవారం కూడా ఆమె ఇతరులతో గొడవ పడటంతో మరోసారి కుమారుడికి ఫిర్యాదు చేశారు. దీంతో కుమారుడు తల్లిని మందలించగా సనేమిరా అంటూ పరుష పదజాలంతో దూషించడంతో ఆగ్రహించిన సైదులు రోకలిబండతో ఆమె తలపై మోదాడు. ఆమె చనిపోవడంతో గొంతు నులిమి హత్య చేశాడు. నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇద్దరు చిన్నారులను మింగిన చెరువు



మృతులు గణేశ్, ఆంజనేయులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: చాలా కాలం తరవాత చెరువులో నీరు చేరినట్టు తెలుసుకున్న ఇద్దరు చిన్నారులు అందులో దిగి ప్రాణాలు కోల్పోయారు. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలంలో శనివారం ఈ విషాదం జరిగింది. బొమ్మన్‌పల్లికి చెందిన ఆంజనేయులు (అంజి), గణేశ్, విష్ణుప్రసాద్ తరగతి పూర్తిచేశారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నల్లయేని చెరువులో నీరు చేరినట్టు తెలుసుకున్న ముగ్గురు స్నేహితులు శనివారం ఉదయం అక్కడికి వెళ్లారు. నీటిని చూసిన ఉత్సాహంలో అందులో దిగారు. చెరువులో మొరం తవ్వగా ఏర్పడిన గుంతలో ముందుగా ఆంజనేయులు(11), స్నేహితుణ్ని కాపాడేయత్నంలో గణేశ్(11) నీటమునిగారు. ప్రమాదాన్ని పసిగట్టి వెనుకే ఆగిపోయిన విష్ణుప్రసాద్ కేకలు విని సమీపంలోని వ్యక్తులు పరుగున వచ్చిన ఫలితం లేకపోయింది. అప్పటికే ఇద్దరు చిన్నారులు విగతజీవులై కనిపించారు.

'ఏడాది చివరకు టీ-హబ్ పూర్తి'

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద ఇంక్యుబేటర్ కేంద్రమైన టీ-హబ్ ఈ ఏడాది చివరికల్లా పూర్తవుతుందని పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ వెల్లడించారు. అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. నిదులు ఇవ్వడమేకాకుండా అన్నివిధాలుగా సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో శనివారం హెడ్ స్టార్ట్, టీ-హబ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఎస్‌ఎస్-2019 జాతీయ స్థాయి అంకుర సంస్థల సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా 23 ప్రధాన నగరాల నుంచి 600 మంది పెట్టుబడిదారులు, అంకుర సంస్థలు, ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. జయేష్‌రంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 4వేల అంకురాలు ఉన్నాయన్నారు. టీ-హబ్ సీఈఓ రవినారాయణ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఇంక్యుబేటర్ అంశంలో భారత్ మూడోస్థానంలో ఉండగా.. చైనా, అమెరికా తొలి, రెండు స్థానాల్లో ఉన్నట్లు వివరించారు.

ఎంపికైనా పోస్టింగులివ్వరేం..

టీసీ సంక్షేమ సంఘం ఆందోళన

గన్‌ఫౌండ్రి, సోమాజిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇప్పటికే ఎంపికైన 8792 మంది ఉపాధ్యాయులకు ఏడాదిగా పోస్టింగులు ఇవ్వకుండా జాప్యం చేయడం అన్యాయమని టీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తీవ్రంగా నిరసించారు. ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ శనివారం ప్రగతి భవన్‌ను ముట్టడించిన ఆందోళనకారులను పోలీసులు అరెస్టుచేసి షాహినాత్‌గంజ్ స్టేషన్‌కు తరలించారు. వారిని ఆయనతో పాటు తెలంగాణ టీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నిరుద్యోగ జాకసనేత నీల వెంకటేశ్, టీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర నాయకుడు కె.నర్సింహాగౌడ్ పరామర్శించారు.ఎంపికైన ఉపాధ్యాయులకు మద్దతు ప్రకటించిన అనంతరం కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ వైఖరి అనుచితంగా ఉందన్నారు. ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీచేయకుండే, రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదన్నారు.

'త్వరలోనే భర్తీ చేస్తామన్నారు'

ఎంపికైన ఉపాధ్యాయుల ఆందోళనకు సంబంధించి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి కృష్ణయ్య పోస్ట్‌ద్వారా వివరించారు. సమస్యను ఇకనైనా పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల నిర్వహణ, ఇతర కారణాల వల్ల ఉద్యోగాలు ఇవ్వలేకపోయామని, ఇక వారంరోజుల్లో పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని కృష్ణయ్య వెల్లడించారు.

ముట్టడి యత్నంతో ఉద్రిక్తత

ప్రభుత్వం వెంటనే నియామక పత్రాలివ్వాలంటూ అభ్యర్థులు అంతకు ముందు అన్ని జిల్లాల నుంచి ప్రగతి భవన్‌కు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మొదట వారిని పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని విడిచి స్వేచ్ఛనుకు తీసుకెళ్లారు. కొందరిని షాహినాత్‌గంజ్ ఠాణాకు చేర్చారు. ఇదే సందర్భంగా టీఆర్‌టీ-17 అభ్యర్థుల సంఘం రాష్ట్ర నాయకుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, 2017లో నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా పీఈటీలు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు (హిందీ), దివ్యాంగులు ఉద్యోగాలు పొందాల్సి ఉందన్నారు.

చేప ప్రసాదం కోసం వచ్చిన వారితో కిక్కిరిసిపోయిన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం

ప్రపంచానికే తలమానికం చేప ప్రసాదం

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



చేప ప్రసాదం పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, నాంపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచానికే తలమానికంగా మన చేప ప్రసాదం మారిందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిని సోదరుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మంత్రి తలసాని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి, ఇతర దేశాల నుంచి చేప ప్రసాదం స్వీకరించేందుకు ఆస్తమా బాధితులు వస్తున్నారన్నారు. వీరికి ఆసౌకర్యం కల్గకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. 174 సంవత్సరాల నుంచి ప్రజల్లో నాటుకుపోయిన నమ్మకానికి వారి విశ్వాసాలకు చేప ప్రసాదం పంపిణీ నిదర్శనంగా నిలుస్తోందన్నారు. బత్తిని సోదరుల నివాస గృహమైన పాతబస్తీ దూద్‌బౌలీలోనూ మరో రెండ

ఈనాడు

మాటా... మంచీ

చిన్న చదువు... పెద్ద బరువు

అమ్మ ఒడిని వీడి బడిలోకి అడుగిడటానికి బుడుగులు చేసే మారాం అంతా ఇంతా కాదు. బడిలోకి చేసిన ప్రతి అడుగు జ్ఞాన సముపార్జన కోసమని తెలియక, కమ్మనైన అమ్మ ఒడిని కాదని ఈ కొత్త వాతావరణంలోకి అయిష్టంగానే అడుగుపెడతారు. ఇంట్లో ఉండే ఆట బొమ్మలు ఇక్కడా కనిపిస్తున్నా తన సహజ స్వేచ్ఛ కోల్పోయానని లోలోన మదనపడిపోతారు. సాటి పిల్లలను తేరిపార చూస్తూ దిగులు మింగుకుని ప్రారంభించిన ఈ బడి నడక కొన్నాళ్లకు అలవాటుగా మారి జీవితంలో పావు వంతు తరగతి గదిలోనే గడిపేస్తారు. వీపు మీదున్న పుస్తకాల్లోని విజ్ఞానాన్ని తలలోకి ఎక్కించడానికి ఎన్ని తంటాలు పడాలో అనతికాలంలోనే గ్రహిస్తారు.

ఏ దశలో ఎంత జ్ఞానాన్ని విద్యార్థులకు అందజేయాలన్న అంశం, అందుకు గల మార్గాలను నిర్దేశించడానికి పార్లమెంటులో పెద్ద చర్చే జరిగింది. పిల్లల లేత మనసులు నొప్పించకుండా విజ్ఞానాన్ని వారి మస్తిష్కాల్లో ఎలా నిక్షిప్తం చేయాలన్న విషయమై ప్రభుత్వం ఆచార్య యశ్‌పాల్ కమిటీని నియమించింది. సమగ్ర అధ్యయనం తరవాత ఆ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అది పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఫలితంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బండెడు పుస్తకాలతో భారంగా పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల తీరుపై 'వారేమైనా వెయిట్ లిఫ్టర్లా' అంటూ గతంలో మద్రాసు హైకోర్టు మాటుగా వ్యాఖ్యానించింది. ఏయే తరగతులకు ఎంత బరువుండే పుస్తకాలు అవసరమో పేర్కొంటూ కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ విద్యా పరిశోధన మండలి (ఎన్‌సీఈఆర్‌టీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అనేక సూచనలు చేశాయి. విద్యార్థుల శరీర బరువులో పదో వంతుకు మించకుండా పుస్తకాల సంచి బరువు ఉండాలని అవి పేర్కొన్నాయి. పిల్లల బడి సంచుల బరువులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అమెరికాలో ఈ విషయమై అక్కడి ఆరోగ్య నిపుణులు కీలక సిఫార్సులు చేశారు. అమెరికన్ అకడమిక్ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ నివేదిక ప్రకారం విద్యార్థి శరీర బరువులో 10 నుంచి 15 శాతం కన్నా తక్కువ బరువుగల బడిసంచులు మాత్రమే ఉండాలని పేర్కొంది. సంచుల బరువు, పుస్తకాలు తగ్గించడానికి గల మార్గాలపై సలహాలు ఇవ్వడానికి ప్రత్యేక ప్రజాసలహా సమాచార వ్యవస్థ ఉంది. ఇంగ్లాండ్‌లో విద్యార్థులు పాఠశాలలకు తీసుకెళ్లే పుస్తకాలపై సమీక్ష చేయాలని ఇటీవల ఆరోగ్య నిపుణులు సూచించారు. కొన్ని ఐరోపా దేశాల పాఠశాలల తరగతి గదుల్లో పుస్తకాలు భద్రపరచుకోవడానికి లాకర్ సదుపాయం ఉంది. హోమ్‌వర్క్ అన్ని పాఠ్యాంశాలకు కాకుండా రోజుకు ఒకటి లేదా రెండింటికి మాత్రమే ఇచ్చేలా సమయపట్టిక రూపొందిస్తున్నారు.

ప్రయత్నాల పరంపర

పిల్లల బడిసంచుల భారం తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని 2004లో కేరళ హైకోర్టు అక్కడి విద్యాశాఖను, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌ను ఆదేశించింది. 2014లో దిల్లీ రాష్ట్రప్రభుత్వం 'పిల్లల స్నేహపూర్వక బడి సంచులు' కార్యక్రమం కింద తమ పరిధిలోనున్న అన్ని విద్యాసంస్థలకు, తల్లిదండ్రులకు మార్గదర్శకాలు జారీచేసింది. 2015లో బొంబాయి హైకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర విద్యాశాఖ పాఠశాల సంచుల బరువు తగ్గించడానికి మార్గదర్శకాలు జారీచేసింది. 2016 జూన్‌లో జమ్మూకశ్మీర్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసింది. తెలంగాణ లేదా మహారాష్ట్ర విధానాలను తమిళనాడులోనూ అనుసరించాలని 2018 మే 30న మద్రాసు హైకోర్టు ఆదేశించింది. విద్యార్థుల బడిసంచుల భారంపై తెలంగాణ సర్కారు భారీ కసరత్తు చేసింది. సర్వేలు నిర్వహించింది. ప్రభుత్వ స్థానిక సంస్థలు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల బడిపిల్లల సంచుల బరువులపై మార్గదర్శక సూత్రాలు అమలుచేయాలని 2017 జులైలో ఉత్తర్వులు జారీచేసింది. వాటి ప్రభావం 2017-18 విద్యా సంవత్సరం నుంచి కనిపిస్తోంది. ప్రతి శనివారం పుస్తకాలు తీసుకురావాల్సిన అవసరం లేదని, ఆ రోజు విద్యార్థులు ఇతర కార్యక్రమాలపై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆలోచనగా ఉంది. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడంపైనే పాఠశాలలు దృష్టి సారించాలి. వారు తమ భావాలను వ్యక్తీకరించడానికి స్వేచ్ఛనివ్వాలి. పుస్తకాలు చదవడం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేట్లు ప్రేరేపించాలి. విద్యార్థుల అభ్యసన తీరును ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అంచనావేస్తూ, లోపాలను సరిదిద్దుతూ చర్యలు తీసుకోవడం అవసరం. అభ్యసన ప్రక్రియలో 'గైడ్'లను పూర్తిగా నిషేధించి వారి సొంత పరిజ్ఞానంతోనే సమాధానాలు ఆలోచించేలా ప్రోత్సహించాలి.

చిన్నారులకు బడి సంచుల భారం

విద్యార్థుల బడి సంచుల బరువులను నియంత్రించడానికి దేశంలో సరైన చట్టం రూపొందించలేదు. ప్రభుత్వాలు మార్గదర్శక సూత్రాలు రూపొందించినా వాటి అమలు తీరు అంతంతమాత్రంగా ఉంది. 2006లో కేంద్రం నియమించిన యశ్‌పాల్ కమిటీ 'భారం లేకుండా విద్యార్థులు నేర్చుకోవడం' అనే అంశంపై అధ్యయనం చేసింది. పిల్లలు పాఠశాలలకు బరువైన సంచులను తీసుకువెళ్లరాదని ఆ కమిటీ స్పష్టం చేసింది. 2010లో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ దేశంలో 891 పాఠశాలల్లో సంచుల బరువు తొలగింపు అంశంపై పైలెట్ ప్రాజెక్టును అమలు చేసింది. అన్ని తరగతుల్లో బడి సంచులపై పరిమితి విధించినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇటీవల 25 కేంద్రీయ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతిలో 'డిజిటల్ లెర్నింగ్' విధానాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాలల్లో రెండో తరగతి వరకు బడిసంచులు ఉండరాదని తదుపరి తరగతులకు నియంత్రణ ఉండాలని మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని అమలుచేయడానికి సరైన యంత్రాంగం లేకపోవడం పెద్దలోటు. దేశంలోని పాఠశాలల్లో అధిక భాగం రాష్ట్రప్రభుత్వాల పరిధిలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలు తక్కువే. అందువల్ల కేంద్రం మార్గదర్శకాలకే పరిమితమవుతుంది.

మార్గదర్శకాలతో సరి...



కేంద్ర ప్రభుత్వం 1993లో నియమించిన యశ్‌పాల్ కమిటీ 'భారం లేకుండా విద్యార్థులు నేర్చుకోవడం' అనే అంశంపై అధ్యయనం చేసింది. పిల్లలు పాఠశాలలకు బరువైన సంచులను తీసుకువెళ్లరాదని ఆ కమిటీ స్పష్టం చేసింది. 2010లో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ దేశంలో 891 పాఠశాలల్లో సంచుల బరువు తొలగింపు అంశంపై పైలెట్ ప్రాజెక్టును అమలు చేసింది. అన్ని తరగతుల్లో బడి సంచులపై పరిమితి విధించినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇటీవల 25 కేంద్రీయ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతిలో 'డిజిటల్ లెర్నింగ్' విధానాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాలల్లో రెండో తరగతి వరకు బడిసంచులు ఉండరాదని తదుపరి తరగతులకు నియంత్రణ ఉండాలని మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని అమలుచేయడానికి సరైన యంత్రాంగం లేకపోవడం పెద్దలోటు. దేశంలోని పాఠశాలల్లో అధిక భాగం రాష్ట్రప్రభుత్వాల పరిధిలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలు తక్కువే. అందువల్ల కేంద్రం మార్గదర్శకాలకే పరిమితమవుతుంది.

రూపొందించిన నిబంధనల మేరకు నర్సరీ, కిండర్‌గార్డెన్ తరగతులకు బడిసంచులు ఉండకూడదు. తరవాతి తరగతులు చదివే విద్యార్థుల బరువులో 10 శాతం బరువుగల సంచులు ఉండాలి. పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ పుస్తకాలు, క్రీడా పరికరాలు భద్రపరచుకునేందుకు లాకర్లు ఉండాలి. దీన్ని ఉల్లంఘించిన పాఠశాలలకు జరిమానా విధిస్తారు. వీటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. ఫలితంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పాఠశాల సంచుల భారం పిల్లలపై దుష్ప్రభావాలు చూపుతోంది. ఈ మార్పును పిల్లలు తమంతట తాముగా గుర్తించలేరు. అలసట, కండరాల ఒత్తిడి, వెన్నెముక, నడుం భుజం, కీళ్ల నొప్పుల వంటి సమస్యలను వారు ఎదుర్కొంటారు. చాలా పాఠశాలల్లో క్రీడామైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. దీంతో సమయమంతా చదువులకే వెచ్చించాల్సి వస్తోంది. దీనికితోడు అదనపు తరగతులు, ట్యూషన్ల భారం ఉండనే ఉంది. కర్ణాటకలోని చిక్కబళ్లాపుర జిల్లా బోర్డులోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెలలోని రెండు శని వారాల్లో పుస్తకాలను (నో బ్యాగ్ డే) నిషేధించారు. కేరళలోని కొన్ని పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పిల్లల ఇళ్లకు వాహనం పంపించి బడిసంచులను పాఠశాలకు చేరవేస్తున్నారు. విద్యార్థులు రేపటి తరగతికి ఏయే పుస్తకాలు తీసుకురావాలో ఉపాధ్యాయులు ముందురోజే తెలియజేయడం వల్ల కొంతమేరకు ఒత్తిడి తగ్గుతుంది. బరువైన సంచుల మోత వల్ల విద్యార్థులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను తల్లిదండ్రులకు వివరించాలి. ప్రభుత్వం సూచించిన పుస్తకాలకు లిన్నమైన, అదనపు అనుబంధ పుస్తకాలను పాఠశాలలు పరిహరించాలి.

'డిజిటల్' పరిష్కారం

పాఠశాలల సమయాలు, పరీక్షల కాలపట్టిక, సమాధాన పత్రాల విశ్లేషణ, నిరంతర మూల్యాంకనం తదితర అంశాలపై నిర్దిష్టంగా వ్యవహరించాలి. మారుతున్న కాలంలో సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించి డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయాలి. ప్రస్తుత పాఠ్యాంశాలను ఈ-పుస్తకాలుగా మార్చగలిగితే బడిసంచుల భారం చాలావరకు తగ్గించవచ్చు. ఆన్‌లైన్ హోమ్‌వర్క్ ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ అభ్యసనకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. 70 ఏళ్ల క్రితం ప్రారంభమైన 'ఆపరేషన్ బ్లాక్‌బోర్డు' పథకంలో దేశంలోని కోట్లాది మంది చదువుకోగా, నేడు మారిన సాంకేతికత ఆధారంగా 'ఆపరేషన్ డిజిటల్ బోర్డు' పథకం ముందుకొచ్చింది. ఈ పథకం అంచనా వ్యయం 10వేల కోట్ల రూపాయలు. ఇందులో కేంద్ర రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో ఖర్చులను భరించాలని నిర్ణయించారు. ప్రతీ తరగతి గదిలో 55-77 అంగుళాల టెలివిజన్ అమర్చుతారు. డిజిటల్ బోర్డుకు అవసరమైన విద్యా సమాచారం, బోధనాంశాలు సమకూర్చడానికి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తికానున్న దృష్ట్యా తరగతి గదులో వంద శాతం డిజిటల్ తెరలు అమర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ బోర్డులు దేశవ్యాప్తంగా ఏడు లక్షల పాఠశాలలు, రెండు లక్షల కళాశాలలు, విశ్వవిద్యాలయ తరగతి గదుల్లో ఏర్పాటు కానున్నాయి.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అభ్యసన పద్ధతుల్లో సమూల మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు సులభంగా బోధించడం నేటి అవసరం. 'ఆపరేషన్ డిజిటల్ బోర్డు' పథకాన్ని కేంద్రం మరింత సమర్థంగా ముందుకు నడిపిస్తే బడిపిల్లలకు అభ్యసన మరింత సులభమవుతుంది. బడిసంచుల భారమూ గణనీయంగా తగ్గిపోతుంది. డిజిటల్ అభ్యాసనకు విద్యార్థులు అలవాటుపడితే వారు కంప్యూటర్ ఆధారిత కొలువులను సులభంగా అందుకోగలుగుతారు!

– డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి

(రచయిత– అసోసియేట్ ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

బీమా కోసం 'చంపేస్తున్నారు'!

జీవిత బీమా అంటే ఎందరికో- ఓ నమ్మకం, పెద్ద భరోసా; తమకు జరగరానిది ఏమైనా జరిగితే అయినవాళ్లకు కాస్తో కూస్తో రక్షణ దొరుకుతుందనే ధీమా! ముందుచూపు కొరవడ్డ సంపాదనపరుడు ఉన్నట్టుండి భౌతికంగా లేకుండాపోతే మరే ఆసరా లేని కుటుంబం ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులవుతుంది. పిల్లలు, వయోవృద్ధులు, ఇతరత్రా ఆధారపడినవారి భవితవ్యం అగమ్యగోచరమవుతుంది. అటువంటి ఉత్పాతాలనుంచి కాచి ఎంతో కొంత గొడుగు పట్టి ఆదుకుంటుందన్న సామాన్యుల ఆశే జీవితబీమా వ్యాపారానికి ప్రధాన పెట్టుబడి. అటు పాలసీదారుల నమ్మకాన్ని, ఇటు సంస్థ ఆర్థిక సౌష్ఠవాన్ని చిద్రం చేస్తూ- ఆ చెట్టెక్కి కొమ్మలు నరికేసే ప్రబుద్ధుల బాగోతాలకిది తాజా దాఖలా. 190 మందిని బతికుండగానే చంపేసిన ఎల్‌ఐసీ ఉద్యోగులు, ఏజెంట్ల మహామాయ- కొత్తపుంతలు తొక్కుతున్న మోసగాళ్ల వంచనాశిల్పానికి ఓ మచ్చుతునక!

కోదాడ జీవిత బీమా శాఖ అంతర్గత తనిఖీల్లో ఇటీవల ఓ విస్ఫోటం బట్టబయలైంది. దాదాపు పదేళ్లుగా ఫలానావారు చనిపోయారంటూ అర్జీ పెట్టుకున్నాక పరిష్కారమైన క్లెయిముల సొమ్ము కొన్ని ఖాతాల్లోనే జమ అవుతుండటమేమిటని అనుమానం వచ్చి అధికారులు తీగలాగితే పెద్దడొంకే కదిలింది. అది ఇద్దరు ఎల్‌ఐసీ ఉద్యోగులు, తొమ్మండుగురు ఏజెంట్లతో కూడిన ముఠా చేతివాటంగా నిర్ధారణమైంది. కొన్ని నెలలపాటు కిస్తులు చెల్లించని పాలసీదారుల జాబితా తయారయ్యాక, ఏజెంట్లు రంగంలోకి దిగుతారు. ఏదొక కథ చెప్పి వారి నుంచి బాండ్ పేపర్లు తీసుకుంటారు. మధ్యలో ఆగిపోయిన పాలసీ పునరుద్ధరణ కోసం సంబంధీకులు ఎదురుతెన్నులు కాస్తుండగా- ముఠా గుట్టుగా తమ పని కానిచ్చేస్తుంది. పాలసీదారుల నామినీలుగా తమ చుట్టాలు పక్కాల పేర్లు చేర్చించడం, బ్యాంకు ఖాతాలు తెరిపించడం నిక్షేపంగా పూర్తయ్యాక- తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి వాటంతా సొమ్ము కాజేస్తుంది. ఇప్పటికే వెలుగైన వివరాల ప్రకారం, గత ఆరేళ్లలోనే అలా మూడు కోట్ల రూపాయలకుపైగా ఎల్‌ఐసీ సొమ్ముకు రెక్కలొచ్చి ఎగిరిపోయింది. మంజాకోణం లోతుపాతుల్ని సమగ్రంగా పరిశీలిస్తేనేగాని మొత్తం నష్టమెంతన్నది నిర్ధారించలేమంటున్నారు. ఈ బాగోతానికి ప్రధాన సూత్రధారి బీకు నాయక్ తన తండ్రి పేరిటా పాలసీ చేసి, జీవించి ఉండగానే ఆయనను రికార్డుల్లో చంపేసి, క్లెయిమ్ సొమ్మును భార్య ఖాతాలోకి మళ్లించుకున్నట్లు వెల్లడైంది. బీమా సొమ్ము కోసం భారీ కుట్ర రూపొందించి పకడ్బందీగా అమలుపరచిన నేరముఠాపై అవినీతి నిరోధక చట్టం, భారత శిక్షాస్మృతిలోని పలు నిబంధనలకింద కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. విచారణ ఊపందుకుంటే ఇంకెందరి జాతకాలు వీధిన పడతాయో చూడాలి.



సంవత్సరం కిందట మిర్యాలగూడలోనూ ఇటువంటి బాగోతమే రచ్చకెక్కింది. ఒకే నెలలో పాతిక దాకా పాలసీలకు చెందిన బీమా క్లెయిములు వచ్చేసరికి సందేహం చిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాల లోగుట్టు బట్టబయలైంది. అక్కడా ఓ ఉద్యోగి తన సమీప బంధువులు, పరిచయస్తులతో జట్టుకట్టి పాలసీదారుల తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఎనభై లక్షల రూపాయలకు పైగా బీమా సొమ్మును దారి మళ్లించాడు. పోలీసుల విచారణలో అతగాడు అడ్డంగా దొరికిపోయాక, ఏ పాలసీ మొత్తానికి ఎంత శాతం కమిషన్‌గా ఎవరెవరికి ముట్టిందన్న లెక్కలన్నీ వెలుగు చూశాయి.

గత నవంబరులో దుబాయ్ నుంచి దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వినయ్ ఛద్దా అనే అసామీని దిగీదిగడంతోనే పోలీసులు అరెస్టు చేశారు. అతగాడు ఒక బీమా సంస్థలో మాజీ ఏజెంటు. ఎనిమిది పదుల వయసు పైబడిన ఓ సైనికాదికారిని ఏళ్ల తరబడి నమ్మకంగా వంచించాడు. రెండు దఫాల్లో దాకా రకరకాల పాలసీలు చేద్దామని ఆయనను ఒప్పించి చెల్లింపుల నిమిత్తమంటూ దపాలవారీగా సొమ్ము గుంజుకున్నాడు. పించన్ సొమ్ము తీసుకోవడానికి కర్నల్ రవీందర్‌నాథ్ పండిట్ బ్యాంకుకు వెళ్లినప్పుడల్లా అక్కడ ప్రత్యక్షమయ్యే వినయ్- ఏనాడూ కట్టని కిస్తుల కోసం సంవత్సరాల తరబడి రాబట్టిన సొమ్ము కోటీ నలభై లక్షల రూపాయలుగా లెక్కతేలింది. ఈ తరహా మోసాలు దేశం నలుమూలలా మరెన్ని చోటు చేసుకుంటున్నాయో ఎవరి కెరుక?

హరియాణాలోని కొన్ని గ్రామాల్లో 2017 లగాయతు దాదాపు వందమంది 'అధికారి కంగా' రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. అందుకు సంబంధించిన కేసులన్నీ సోనేపట్, యుజ్జర్, హిసార్, పానిపట్ పోలీస్ స్టేషన్లలోనే నమోదయ్యాయి. అంతవరకు యాదృచ్ఛికమే అనుకోవచ్చు. 'ప్రమాదవశాత్తు' మృతి చెందినవారంతా సాధారణ వ్యవసాయదారులే కావడం, మరణానికి రెండు మూడు నెలల ముందే ఇరవై లక్షల రూపాయల దాకా పాలసీ చేయడం, నామినీలుగా పేర్కొన్న వారు ఐదుమిందుకు అదే సమయంలో పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) పొందడం... సహజంగానే వివిధ బీమా సంస్థల్లో అనుమానాలు రేకెత్తించాయి. కూపీ లాగితే- మృతులందరూ క్యాన్సర్ రోగులేనని వెల్లడైంది. మృత్యుముఖంలో ఉన్నవారి పేరిట లక్షల్లో పాలసీ చేయించి, వారు మరణించడంతోనే రహదారి ప్రమాదంలో చనిపోయినట్లు పత్రాలు సృష్టించే ముఠా వెనక కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది, వైద్యులు, ఇన్సూరెన్స్ ఏజెంట్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాత్ర ప్రమేయాలు నిగ్గు తేలాయి. క్లెయిముల రూపేణా రాబట్టిన సొమ్ములో వారంతా వాటాదారులేనని స్పష్టమై బీమా సంస్థలు నిర్ఘాంతపోయాయి. కోదాడ నుంచి హరియాణా వరకు ఎక్కడైనా... పద్ధతిలో మార్పే తప్ప, బురిడీ కొట్టించడంలో ఒకటే ముద్ర!

జీవిత బీమా పాలసీలకు సంబంధించి మోసాల కట్టడి ఎంత అత్యావశ్యకమో చెబుతూ ఇన్సూరెన్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ వి.మాణిక్యం గత డిసెంబరులో ఆక్షరాలా తమ గోడు వెళ్ళబోసుకున్నారు. కాకలు తీరిన మహా వంచకుల రూపంలో తమకు పెనుముప్పు దాపురించిందని వాపోయారు. 49 శాతం మోసాలు మధ్యవర్తుల పుణ్యమేనని, పాలసీదారుల వంచనలు 28 శాతమని, ఉద్యోగుల చేతివాటమూ కొట్టిపారేయలేనిదని గణాంకాలు వివరిస్తున్నాయి. పొడిచింది ఎవరైతేనేం, సంస్థలకు తూట్లు పడుతున్నాయన్నది చేదు నిజం. బీమా సంస్థల రాబడిలో భారీ మొత్తం ఏటా ఇలా చేజారుతోందని ఉన్నతాధికార గణమే అంగీకరించడం- దగా కోరు దందాల విస్తృతిని కళ్లకు కడుతోంది.

బీమా చట్టంలో నాలుగేళ్ల క్రితం చేసిన సవరణల ప్రకారం- మోసపూరిత విధానాలతో ప్రజలకు పాలసీలు విక్రయించే ఏజెంట్లకు సంస్థలకు కోటీ నుంచి ఇరవై అయిదు కోట్ల రూపాయల వరకు జరిమానా విధించగల వీలుంది. తద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందుతాయన్న ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటన ఆచరణలో నీరుడుతోంది. ఇష్టారాజ్యంగా పోర్టరీలు చేసి, అడ్డగోలు ధ్రువపత్రాలు సృష్టించి, బతికున్నవాళ్లను చంపేసి, మరణించినవాళ్ల బతుకు కారణాలు మార్చేసి- బీమా సంస్థల పుట్టి ముంచుతున్నవాళ్ల బరతం పట్టడం ఎలాగన్నదానిపై ఖారీ కసరత్తు జరగాలి. ఎళ్కడికక్కడ నట్టు బోల్టులు బిగించి కంతలన్నీ పూడ్చాలి. లేదంటే చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనట్లు జనం సొమ్ముతో ఎదిగిన బీమా పరిశ్రమ అవినీతి తోడేళ్లకు విందు భోజనమవుతుంది. ఏమంటారు?

– బాలు

అనుకంప

దాదాపు అన్ని మతాలవారూ (ఏ మతానికీ చెందని నాస్తిక మతాలవారితో సహా) అభిమానించి ప్రశంసించే సద్గుణాల్లో, అనుకంప ఒకటి. 'అను' అంటే మరొకరితో కలిసి, వారి వెంట, వారికి తోడుగానో, మద్దతుగానో, వారిని అనుసరించో చేసే పనిని సూచిస్తుంది. 'కంప' అంటే కంపనను, కదలికను, స్పందనను సూచిస్తుంది. కనుక 'అనుకంప' అంటే మరొకరికి కష్టం, వేదన, బాధ కలిగినప్పుడు, అది తనకే కలిగినట్టుగా భావించి దాదాపు వారిలాగే స్పందించి, వారి ఆవేదనను, దుఃఖాన్ని పంచుకొని దాన్ని వీలైనంత త్వరగా తొలగించేందుకు ఆరాటపడే లక్షణం. జాలి, దయ, కారుణ్యం, కరుణ, కనికరం మొదలైన పదాలకు ఇది దాదాపు సమానార్థకమే... కానీ పూర్తిగా సమానం కాదు.

ఎందుకంటే అనుకంప కేవలం బుద్ధిపూర్వకమైన స్పందన కాదు- ముందు వెనకలు, లాభనష్టాలు, పాపపుణ్యాలు, స్వపర ప్రయోజనాలు... అప్పటికప్పుడు బేరీజు వేసుకొని తీసుకొనే నిర్ణయం కాదు. స్వభావజనితంగా అప్రయత్నంగా కలిగే భావోద్రేకపరమైన స్పందన. అనుకంప జగవల్లక్షణం. సాటి వారిపట్ల అవ్యాజంగా అనుకంప చూపేవాడు, అలాంటి అనుకంప చూపేటప్పుడు 'దైవం మానుషరూపేణ' అనిపించుకోవటానికి అర్హుడవుతాడు. అనుకంపకు స్వపరభేదం ఉండదు... మిత్రుడా, శత్రువా అన్న మీమాంస ఉండదు.

మనుషులందరిలోనూ ఈ అనుకంప అనే గుణం అంతో ఇంతో ఉండితీరుతుంది. అయితే సహజ స్వభావం వల్ల, పెరిగిన పరిస్థితుల ప్రభావం వల్ల కొందరిలో స్పల్పంగా ఉంటే- మహాత్ములో, ప్రజాసేవాభిలాషుల్లో మరింతగా ఉంటుంది. ఇలాంటి అనుకంపతో సాటివారి కష్టాలకు స్పందించి తమ శ్రమ, సమయం, శక్తి, ధనం... వీడితుల వీడను తొలగించేందుకు ధారాళంగా ధారపోసేవారినే సమాజం మహనీయులుగా, మహనుభావులుగా గుర్తిస్తుంది. మత ప్రవక్తలనైనా, సంఘ సంస్కర్తలనైనా, మహర్షులనైనా, మదర్ థెరెసాలనైనా, గౌతమ బుద్ధులనైనా, గాంధీ మహాత్ములనైనా లోకం పది కాలాలపాటు సాదరంగా, సభక్తికంగా స్మరించుకొనేందుకు ముఖ్యకారణం- వారి అపారమైన అనుకంప.

ధర్మరాజును నడిచే ధర్మంగా ముల్లోకాలు కీర్తించాయి. తనను ఆశ్రయించి, తనవెంట వచ్చిన కుక్కకు రక్షణ ఉండదని, సశరీర స్వర్గారోహణ కోసం దేవేంద్రుడు స్వయంగా తెచ్చిన రథమెక్కటానికి నిరాకరించిన ఆయన అనుకంపకు ధర్మదేవతే అబ్బురపడే ప్రశంసించటం మహాభారతంలో కనిపిస్తుంది.

గువ్వల జంటలో ఒకదాన్ని కిరాతుడు చంపగా చూసిన వాల్మీకి మహర్షి మనసులో అనుకంప శోకరూపమై రామాయణ మహావృక్షానికి బీజరూపమై నిలిచింది. గౌతమ బుద్ధుడు అనుకంపకు మరొకపేరు. జైనుల మతానికి ఒక మూలసూత్రం క్రిమికీటకాలు, పశుపక్షులు సహా సకల ప్రాణులపట్ల సహానుభూతి, అహింస, అనుకంప.

అనుకంప వెనక భావం 'అందరూ నాలాంటివారే' అనే సమదృష్టి. ఇది అహంకారానికి (అందరికంటే నేను ప్రత్యేకం, గొప్ప అనే భావానికి) సరిగ్గా విరుద్ధం అంటాడు తులసీదాసు.

పరుల దుఃఖాలు తనవిగా భావించి, ఉపకారం చేయగలవాడికే మనసులో అహంకారం (తానేదో గొప్ప, ఇతరులు లోకువ) అనే భావం దానంతటదే తొలగిపోతుంది. అది పోతే కామక్రోధాల లాంటి అంతశ్శత్రువులు అంతమైనట్టే.

ఈ ప్రయోజనాలన్నీ దృష్టిలో ఉంచుకొనే కాబోలు, 'ఇతరులను ఆనందంగా ఉంచాలన్నా అనుకంప అవసరం... నువ్వు ఆనందంగా ఉండాలన్నా అనుకంప అవసరం!' అన్నారు దలైలామా ఇంచుక మార్మికంగా. ఎంత మంచిమాట!

– మల్లాది హనుమంతరావు

Eenadu epaper

పటిష్ఠ నాయకత్వంతోనే వ్యవస్థలు బలోపేతం

- వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశ ఆర్థిక రంగం
- రానున్న రెండేళ్లలో వృద్ధిరేటు 7.5 శాతానికి
- హెచ్ఎంఏ అవార్డు ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి

హెచ్ఎంఏ అవార్డు ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ★ పురస్కార గ్రహీతలతో ఉపరాష్ట్రపతి

రాయదుర్గం - న్యూస్‌టుడే

పటిష్ఠ నాయకత్వంతోనే వ్యవస్థలు బలోపేతం అవుతాయని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో నిర్వహించిన ది హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) వార్షిక పురస్కారాలను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థికవృద్ధి రేటు 7.2% కాగా, వచ్చే రెండేళ్లలో 7.5 శాతానికి చేరుకుంటుందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొందన్నారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి బాటలు వేశారని, వాజ్‌పేయీ ప్రధానిగా విమానయానం, రైల్వేలు, గ్రామీణం, పోర్టులను అనుసంధానించి దేశ ఆర్థిక గతిని మార్చారని కొనియాడారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరుస ఆర్థిక సంస్కరణలతో దేశం మరింత పురోగతి సాధించేలా చేశారన్నారు. జీఎస్టీ కౌన్సిల్ 34 సార్లు సమావేశమై ఏకగ్రీవంగా అనేక నిర్ణయాలు తీసుకుందని, ఇదంతా పటిష్ఠ నాయకత్వంతోనే సాధ్యమైందని అన్నారు.

సృజనాత్మకంగా మానవ వనరుల వినియోగం

పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకూ జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్థిరత్వానికి, విశ్వసనీయతకు ఓటు వేశారని వెంకయ్యనాయుడు అన్నారు. పార్టీలతో తనకు సంబంధం లేదని స్థిరమైన ప్రభుత్వం ఉంటే సుస్థిర అభివృద్ధి నిరాటంకంగా సాగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వమైనా, ప్రైవేటు రంగమైనా సమాజాభివృద్ధిలో మానవ వనరులను సృజనాత్మకంగా వినియోగించుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. దిగుమతులపై ఆధార పడకుండా ఆహార ధాన్యాలను మనమే ఉత్పత్తి చేసుకోవాలని, ఉపాధి కోసం పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. హెచ్ఎంఏ వంటి సంస్థలు ప్రభుత్వం, పరిశ్రమల మధ్య వారధిగా నిలుస్తూ విధానాల అమలులో సహకారం అందించాలన్నారు. స్వచ్ఛభారత్, క్లీన్ అండ్ గ్రీన్ ఇండియా వంటివి ప్రధానమంత్రి కార్యక్రమాలు కాదని, ప్రజా ఉద్యమాలని, ప్రభుత్వమే అన్నీ చేస్తుందనే మనస్తత్వం నుంచి బయటపడాలని తెలిపారు.

ఫిరాయింపు ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ కావాలి

పార్టీ ఫిరాయింపుదారులను రీకాల్ చేసే డిమాండ్ బలంగా వినిపిస్తోందని, దేశంలో నెలకొన్న ఫిరాయింపుల పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఈ తరహా ఫిర్యాదులను మూడు నెలల్లో పరిష్కరించే దిశగా ప్రిసైడింగ్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులపై ఎన్నికల పిటిషన్లు, క్రిమినల్ కేసులపై నిర్ణీత పద్ధతిలో ప్రత్యేక కోర్టుల ద్వారా త్వరగా నిర్ణయం తీసుకునే పరిస్థితులు ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఏ అధ్యక్షుడు రవికుమార్ పీస పాటి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్నది వీరే..

హెచ్ఎంఏ '46వ వార్షిక పురస్కారాలు-2018' కార్యక్రమంలో మేనేజర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఎంటర్ ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును భాగ్యనగర్ ఇండియా లిమిటెడ్ ఎం.డి.దేవేంద్ర సురానా అందుకున్నారు. స్మాల్ స్కేల్ ఎంటర్ ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్‌గా బ్యాంబూ హౌస్ ఇండియా సహ వ్యవస్థాపకుడు ప్రశాంత్ లింగం అవార్డు తీసుకున్నారు. యంగ్ మేనేజర్ ఆఫ్ ది ఇయర్‌గా సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ జీఎం మిట్టల్, హెచ్ఆర్ మేనేజర్ ఆఫ్ ది ఇయర్‌గా మై హోం కన్‌స్ట్రక్షన్స్ సీహెచ్ఆర్ హెచ్ రషీద్ పురస్కారాలు పొందారు. సీఎస్ఆర్ అవార్డును ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, జీవన సాఫల్య పురస్కారాన్ని మిశ్ర, మెంబర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని విక్రాంత్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ అందుకున్నారు.

లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

అలంపూర్ ఎంపీపీ ఎన్నికలో లాఠీఛార్జి

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ గద్వాల జిల్లాలో కోరం లేక వాయిదాపడ్డ అలంపూర్ ఎంపీపీ ఎన్నిక తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో శనివారం జరిగింది. తెరాసలోని ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తి ఘర్షణకు దారి తీసింది. కొత్తగా ఎన్నికైన ఎంపీటీసీలు ఎంపీడీవో కార్యాలయంలోకి వెళుతుండగా ఎమ్మెల్యే అబ్రహం వర్గీయులు అడ్డుకొని బైఠాయించారు. పెద్ద సంఖ్యలో ఇరువర్గాలకు చెందినవారు అక్కడకు చేరుకోవడంతో పోలీసులు లాఠీఛార్జి చేసి సభ్యులను లోపలికి పంపాల్సి వచ్చింది. ఈ సమయంలో క్యాతూర్ ఎంపీటీసీ సభ్యురాలు అనూరాధ చేతికి గాయమైంది.

తరగతికి 30 మంది విద్యార్థులే!

- పనివేళల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతోనే ఉండాలి
- వారికి పరిపాలన పరమైన పనులు అప్పగించొద్దు
- స్పష్టం చేసిన జాతీయ విద్యావిధాన నివేదిక

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తిని 1:30కి తగ్గించాలని జాతీయ విద్యావిధానం సూచించింది. పాఠశాల విద్యలో బలమైన పునాది వేసేందుకు వీలుగా ఈ నిర్ణయం అమలు చేసి, వీలైనంత త్వరగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలని నివేదికలో స్పష్టం చేసింది. ఇటీవలే ఈ నివేదికను కేంద్రానికి సమర్పించడం తెలిసిందే. నగర, పట్టణ, గ్రామీణ, మారుమూల ప్రాంతాలనే తేడాలు లేకుండా ఇది అమలు చేయాల్సిన అవసరముందని, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల హాజరు నూరుశాతం ఉండాలని తెలిపింది. టీచర్లు పనివేళల్లో వీలైనంత సమయం విద్యార్థులతో ఉండాలని పేర్కొంది. వారు పరిపాలనపరమైన పనుల్లో నిమగ్నమవుతూ ఉండటం బోధనకు అడ్డంకులు సృష్టిస్తోందని పేర్కొంది. అసహాయవర్గాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చదువుకునే పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి 1:25గా ఉండాలని సూచించింది. పాఠశాల విద్యలో సమూల మార్పులు తీసుకువచ్చేలా పలు సంస్కరణలను సిఫార్సు చేసింది.

దేశవ్యాప్తంగా 10 లక్షల ఉపాధ్యాయ ఖాళీలు

దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ ఖాళీలున్నాయి. దీంతో కొన్నిచోట్ల ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి 1:60గా ఉంది. కొన్నిచోట్ల అవసరమైన సబ్జెక్టులకు కీలక అనుభవం కలిగిన టీచరు పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఉపాధ్యాయుల కొరతతో ఒక సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడిని మరో సబ్జెక్టులో పాఠాలు చెప్పాలంటూ ప్రధానోపాధ్యాయులు కోరుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని నివేదిక వెల్లడించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్య మంచి అనుబంధం ఉన్నపుడు ఆకారణంగా చేస్తున్న బదిలీల వల్ల విద్యార్థుల మానసిక స్థితి, నేర్చుకోవాలన్న తపనపై తీవ్ర ప్రభావం పడుతోందని వివరించింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపింది. విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించేందుకు స్థానిక భాషల్లో పుస్తకాలతో ప్రతి పాఠశాలకు ఒక లైబ్రరీ ఏర్పాటు చేయాలని సూచించింది.

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 30 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి 1:40గా అమలవుతోంది. జాతీయ విద్యావిధానం సిఫార్సులు అమల్లోకి వచ్చి, ప్రతి తరగతికి విద్యార్థుల సంఖ్యను 30కి తగ్గిస్తే.. మరిన్ని ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడే అవకాశముంది. ఇక సంక్షేమ పాఠశాలల్లో ఖాళీల సంఖ్య మరింతగా పెరిగే వీలుంది. ప్రస్తుతానికి ఎస్సీ, ఎస్టీ, టీసీ, మైనార్టీ, సాధారణ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 75 శాతానికి పైగా ఆయా సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 25కి తగ్గిస్తే టీసీ, మైనార్టీ, సాధారణ సంక్షేమ పాఠశాలల కంటే మరిన్ని ఖాళీలు అదనంగా వచ్చే అవకాశం ఉంటుంది.

రాష్ట్రంలో బెంగాల్ తరహా హత్యా రాజకీయాలు

- భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు ఆరోపణ
- దక్షిణాదిలో భాజపా అధికారం చేపట్టబోయేది ఇక్కడేనని ధీమా
- సీఎం కేసీఆర్‌పై విమర్శలు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో పశ్చిమబెంగాల్, కేరళ తరహా హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు ఆరోపించారు. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా కార్యకర్త ప్రేమ్‌కుమార్ హత్య, మహిళా ఎంపీటీసీ అభ్యర్థిపై దాడి ఘటనలు దానికి నిదర్శనమన్నారు. ఇలాంటి చర్యలతో భాజపా భయపడబోదని, మరింత ఆత్మస్థైర్యంతో పోరాడుతుందని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత అధికారం చేపట్టబోయే రాష్ట్రం తెలంగాణ అని ధీమా వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో బలపడేందుకు సామాజిక మాధ్యమం క్రియాశీలకంగా పని చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. 'వి కెన్ చేంజ్' సంస్థ ఆధ్వర్యంలో శనివారం అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో జాతీయవాదుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీధర్‌రావు మాట్లాడుతూ.. కేంద్రంలో 'కింగ్ మేకర్' అవుతానంటూ లోక్‌సభ ఎన్నికల ముందు ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఫలితాల తర్వాత 'జీరో' అయ్యారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో తాను ఒక్కడినే ఉండాలనే భావన కేసీఆర్‌లో పెరిగిపోతోందని, ఇక్కడ ప్రజాస్వామ్యం కోసం పోరాడే ఏకైక పార్టీ భాజపా మాత్రమేనన్నారు. హైదరాబాద్ కోసం పోరాడిన సమరయోధులను గౌరవించని తెరాస లౌకికవాద పార్టీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో జరిగే మార్పు కోసం సామాజిక మాధ్యమాల కార్యకర్తలు విస్తృతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే సామాజిక మాధ్యమాలలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు. భాజపా నేత యోగానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'వి కెన్ చేంజ్' ప్రతినిధులు వంశీకృష్ణ, క్రాంతిదేవ్ మిత్ర, నారపరాజు నర్సింగ్‌రావు, తరుణ్‌జీ, తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి నీలేశ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి స్వగ్రామంలో ఘన స్వాగతం

- స్నేహితులు, బంధువులు, అభిమానులతో తిమ్మాపూర్‌లో సందడి

పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి

కందుకూరు, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జి.కిషన్‌రెడ్డి శనివారం తొలిసారి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని స్వగ్రామం తిమ్మాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఉదయం వర్షం పడుతున్నా లెక్కచేయకుండా పార్టీలకతీతంగా గ్రామస్థులతోపాటు కందుకూరు, మహేశ్వరం, సరూర్‌నగర్, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల పార్టీ శ్రేణులు, ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు పెద్దసంఖ్యలో తిమ్మాపూర్‌కు తరలివచ్చి అభినందనలు తెలియజేశారు. అనంతరం గ్రామంలో తాము నిర్మించిన రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవ పూజల్లో కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. తర్వాత గ్రామానికి సమీపంలోని తమ వ్యవసాయ క్షేత్రంలోని తల్లిదండ్రుల సమాధుల వద్ద శ్రద్ధాంజలి ఘటించి స్వగృహానికి వెళ్లారు. అక్కడ ఆయనకు బంధువులు, కుటుంబ సభ్యులు మంగళహారతులతో స్వాగతం పలికారు. రాజకీయ నేపథ్యం లేని రైతు కుటుంబంలో జన్మించిన ఆయన ఈ స్థాయికి ఎదిగి గ్రామానికి రావడం సంతోషంగా ఉందని గ్రామ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. అంతకుముందు తొలిసారి కేంద్ర సహాయ మంత్రి హోదాలో హైదరాబాద్ వచ్చిన కిషన్‌రెడ్డి పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ అమరవీరులకు నివాళి అర్పించారు.

మున్సిపల్ ఎన్నికలపై వివరణివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, పలు మున్సిపల్ కార్పొరేషన్ల పాలక మండళ్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటి ఎన్నికల వ్యవహారంపై వైఖరి ఏమిటో చెప్పాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు వివరణ అడిగింది. జులై మొదటి వారంలో పాలక మండళ్ల గడువు ముగుస్తున్నప్పటికీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదంటూ టీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు 2014 జులై 3న ఎన్నికలు జరిగాయని, వాటి గడువు వచ్చే నెల 2తో ముగుస్తోందన్నారు. అయితే, వార్డుల విభజన, రిజర్వేషన్ల కేటాయింపు తదితర ప్రక్రియలను ప్రభుత్వం పూర్తి చేయలేదని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ఇంకా గడువు ఉందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది తెలిపారు. దీనిపై ప్రభుత్వ వివరణ తెలుసుకోవడానికి గడువు కావాలని కోరడంతో న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను వాయిదా చేశారు. ఈ సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ ఇదే అంశానికి సంబంధించి ఎన్నికల సంఘం కూడా పిటిషన్ దాఖలు చేసిందని, అది ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉందని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. ఓటర్ల జాబితా, వార్డులవారీగా రిజర్వేషన్ల కేటాయింపు పూర్తి చేసి వివరాలిస్తేనే తాము ముందుకెళ్లగలమన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌ను కూడా ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ముందున్న పిటిషన్‌తో జత చేయాలంటూ రిజిస్ట్రీని ఆదేశించారు.

వర్గపోరు వల్లే కాంగ్రెస్‌ను వీడుతున్నారు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గ పోరు వల్లే ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడుతున్నారని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పార్టీలో మూడు వర్గాలున్నాయని, ఎమ్మెల్యేలకు నాయకత్వంపై నమ్మకం పూర్తిగా పోయిందని చెప్పారు. అభివృద్ధిలో భాగస్వామ్యం కోసం వారు తెరాసలో చేరుతున్నారన్నారు. వాస్తవాలు బయటికి రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇందిరాపార్కు దగ్గర నాటకాలు చేస్తోందని, ఆ పార్టీ నేతలు ప్రచారం కోసం, పొటోలు దిగాలని దొంగ దీక్షలు చేస్తున్నారని విమర్శించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ తీరు దొంగే దొంగ అని అరిచినట్లుగా ఉంది. తెరాస అధికారంలోకి వచ్చాక కేసీఆర్ విపక్షాలకు గౌరవం ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చే నిధులను రూ.50లక్షల నుంచి రూ.3కోట్లకు పెంచారు. గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు 50శాతం మాత్రమే నిధులు ఇచ్చేవాళ్లు. కేసీఆర్ మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేకి ఎంత నిధులు ఇచ్చామో..ప్రతిపక్ష ఎమ్మెల్యేకి అంతే ఇవ్వాలని ఆదేశించారు. కేసీఆర్ నిర్ణయాన్ని జానారెడ్డి సైతం ప్రశంసించారు. విపక్షంగా కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది.ఏ రోజూ సభకు సరిగా రాలేదు. చర్చల్లో పాల్గొనలేదు. దీనికి తోడు విభేదాలు. ఇవన్నీ చూసి ఆ పార్టీ ఎమ్మెల్యేలలో నైరాశ్యం అలుముకుంది. కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు వారు ముందుకొచ్చారు. నిబంధనల మేరకే సీఎల్పీ విలీనం జరిగింది. విలీనం గురించి విస్తృతంగా ప్రచారం జరిగినా కాంగ్రెస్ పట్టించుకోలేదు. ఇప్పుడు ఇందిరా పార్కు దగ్గర నాటకాలు ప్రారంభించారు. ఆ పార్టీ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ముందట నుంచి కాంగ్రెస్ ఎంత మందిని ఆ పార్టీలో చేర్చుకుందో అందరికీ తెలుసు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ అని మాట్లాడే కాంగ్రెస్ నేతలు.. తెరాసలో గెలిచిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నలుగురు ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకున్నారు. కాంగ్రెస్ నేతలు ఎక్కువగా మాట్లాడితే వారి చరిత్ర మొత్తం బయటపెడతాం" అని తలసాని అన్నారు. ఏపీలో మంత్రి వర్గం అధ్యక్షతంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ స్థానమేంటి?

ప్రతిపక్షాలకు మంత్రి ఎర్రబెల్లి ప్రశ్న

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: 'ఈవీఎంల మోసంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడాం.. పార్లమెంటు ఎన్నికల్లో వెనకబడ్డాం అంటూ మాపై బురదజల్లారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ స్థానం ఎళ్కడ ఉంది' అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్, తెదేపా నాయకులను ప్రశ్నించారు. హన్మకొండలో మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈవీఎంల ద్వారా జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెరాసకు అధిక ఓట్లు వచ్చాయని ఎర్రబెల్లి గుర్తు చేశారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగిన ఎన్నికలలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇలాకాలో ఎన్ని జడ్పీటీసీ సీట్లు గెలుచుకున్నారు? భట్టి విక్రమార్క, ఇలాకాలో ఎన్ని గెలుచుకున్నారో? జవాబు చెప్పాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలు రాజ్యాంగబద్ధంగానే తెరాసలో విలీనమయ్యారని మంత్రి దయాకర్‌రావు వ్యాఖ్యానించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పని చేసేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ మారారని, వారు పార్టీ మారుతామని ప్రకటించాకే జరిగిన స్థానిక ఎన్నికల్లో ప్రజలు తెరాసకు పట్టం కట్టారన్నారు.

సీఎల్పీ విలీనం అనైతికం: నారాయణ

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని(సీఎల్పీ) తెరాస శాసనసభా పక్షంలో విలీనం చేయడం అన్యాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. దిల్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ పార్టీ శాసనసభాపక్షాన్ని ప్రాంతీయ పార్టీ శాసనసభాపక్షంలో ఎలా విలీనం చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఫిరాయింపులను ప్రోత్సహించడం తగదన్నారు. తెలంగాణలో రాజకీయంగా ఇలాంటి హోరాలు జరుగుతున్నా గవర్నర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు తెదేపా శాసనసభ్యులను చేర్చుకున్నారని... చంద్రబాబు వైకాపా సభ్యులను చేర్చుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం చంద్రబాబుకు ఎదురైన పరిస్థితే భవిష్యత్తులో కేసీఆర్‌కూ ఎదురవుతుందన్నారు. తెలంగాణలో ఎమ్మెల్యేలను తెరాసలో చేర్చుకుంటున్న తీరుపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

సామాన్యులకు అందుబాటులో న్యాయ వ్యవస్థ ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

శామీర్‌పేట, న్యూస్‌టుడే: వృత్తిలో రాణించేందుకు అవసరమైన మెలకువలు పెంపొందించుకుంటూనే.. న్యాయ వ్యవస్థ సామాన్యులకు అందుబాటులో ఉండేలా న్యాయవాదులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శైలేంద్రకుమార్ జోషి సూచించారు. తెలంగాణ స్టేట్ అడ్వొకేట్ వెల్ఫేర్ ట్రస్ట్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని నల్సార్‌లో 'వృత్తి నైపుణ్యం-మెలకువలు'పై న్యాయవాదులకు మూడో విడత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి ప్రతి రోజు ఓ పరీక్షలాంటిదని, కొత్తగా ఈ రంగంలోకి వచ్చేవారికి నల్సార్ ఆధ్వర్యంలో ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపకరిస్తాయని అభిప్రాయపడ్డారు. వృత్తిలో రాణించేందుకు అవసరమైన మెలకువలు ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి వి.నిరంజన్‌రావు, నల్సార్ ఉపకులపతి ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా, నల్సార్ రిజిస్ట్రార్ వి.బాలకిష్టారెడ్డి, సుప్రీంకోర్టు న్యాయవాది బాబా టెల్కుర్, హైకోర్టు న్యాయవాది ఏపీ సురేశ్, నల్సార్ న్యాయ పరిశోధకులు, న్యాయవాది జె.శివశరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిప్‌మర్‌లో నారాయణ విద్యార్థుల హవా

ఈనాడు, హైదరాబాద్: జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్) ప్రవేశ పరీక్షలో నారాయణ విజయదుందుభి మోగించింది ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సిందూరనారాయణ, పి.శరణి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. అఖిల భారత స్థాయిలో 1, 3, 8, 10వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు 18, 25, 39, 56, 79, 87, 91, 93 వంటి ర్యాంకులతో అన్ని కేటగిరీల్లో అధికృత ప్రదర్శించింది అందులో పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రకటించిన ఆన్లి మెడికల్ ప్రవేశ పరీక్షల్లోనూ నారాయణ విద్యార్థులు జైత్రయాత్ర కొనసాగించారని ఆనందం వ్యక్తంచేశారు. తాము అనుసరిస్తున్న ఎన్-40 వంటి వినూత్నమైన ప్రోగ్రామ్‌తోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని డైరెక్టర్లు తెలిపారు.

పరిశ్రమల మూసివేత ఆదేశాలపై వివాదం

- పీసీబీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని చిన్న పరిశ్రమల యజమానుల ఆందోళన

ఈనాడు, హైదరాబాద్: పరిశ్రమలకు నోటీసులు జారీ, మూసివేత ఆదేశాల విషయంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అనుసరిస్తున్న వైఖరి చర్చనీయాంశంగా మారింది. కొందరు అధికారులు చిన్న పరిశ్రమలపైనే ప్రతాపం చూపుతున్నారని.. అదీ కాలుష్య విభాగం పరిధిలోకి రానివాటిపై చర్యలు తీసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామికవాడల్లోని వందల సంఖ్యలో పరిశ్రమలను ఇటీవల తనిఖీ చేసిన పీసీబీ అధికారులు నిబంధనలు పాటించడం లేదంటూ మూసివేత ఆదేశాలు(క్లోజర్ ఆర్డర్) ఇచ్చారు. పరిశ్రమల్లో నడిపేందుకు అనుమతులు తీసుకోలేదని.. ఔటర్ రింగ్‌రోడ్డు బయటకు తరలించే ప్రణాళికలు సమర్పించలేదని పేర్కొన్నారు.

పీసీబీ అధికారులు మూసివేత ఆదేశాలు ఇచ్చిన పరిశ్రమల్లో ఎక్కువగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై ప్రింటింగ్ చేసే వేసిన యజమానులు ఉంటున్నారు. ఆ సంచులు ప్లాస్టిక్‌వి అయినా అవి తయారయ్యేది మరోచోటని, తాము వాటిపై ప్రింటింగ్ మాత్రమే చేస్తామని యజమానుల వాదన. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న కాలుష్య పరిశ్రమ

eenadu pellipandiri.net
Sreeja Kalyana Prapthirastu
FIND YOUR LIFE PARTNER
Register for FREE
visit : www.eenadupellipandiri.net
Note : Valid ID Proof is mandatory for registration
040-49051234, 8008928686, 8008938686

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

TG

వివాహ శుభ సమయంలో కొత్త జంట మెచ్చే పెళ్ళి కానుక ఈనాడు లో ప్రకటన
వివరాలకు మీ నగరంలోని 'ఈనాడు' కార్యాలయాన్ని సంప్రదించండి

వధువు కావలెను

KAPU 27 5'8" BE (IT) MNC 18LPA ★ 29 5'9" BE MBA MNC 23LPA ★ 28 6' BE (BITS) MNC 20LPA ★ 28 5'11" BE MS 12Sc ★ 28 6' BE (IT) MBA MNC 35 LPA ★ 99890 19946 (A)

రాజులు బ్యాంక్ ఉద్యోగి, 44 Yrs వరుడుకి పేద, మధ్యతరగతి, ఏ బాదరబందీలేని అందమైన వధువు కావలెను. ✆ 63026 38569. (B)

కమ్మ, 38 సం., 5'9", MBA వరుడుకి కమ్మ PG/ Doctor చేసిన అందమైన వధువు కావలెను. నో బ్రోకర్స్. ✆ 91214 51234. (B)

కులపట్టింపులేదు: B.Tech/38/5.6/Engg Job/ సెటిల్డ్ అయిన వరునికి వధువు కావలెను. డైరెక్ట్. నో బ్రోకర్స్. 1st or IInd OK. ✆ 9502957991.(K)

మంచి స్థోమత గల అందమైన వ్యక్తికి ఏ బాదరబందీ లేని అందమైన యువతి డైవర్సి కాని / మరో కాని 30 సం॥ నుండి 40 సంలు లోపు కావలెను. కుల పట్టింపు లేదు. 90104 66787 (J)

డైరెక్ట్ బ్రాహ్మణ రిచ్ బిజినెస్ ఓనర్, ప్రాపర్టీ 8 కోట్లు ఆస్తి 45 5'9" Ph.D జాబ్ గోల్డ్ ప్యాకేజి 2L. PM జాబ్ వధువు కావలెను బ్యూటీ తప్పనిసరి. ✆ 8096551525 (A)

కాపు డైవోర్సీ, కట్నం ప్రసక్తిలేదు, 32, 5'9", 9 LPA, అందమైన వరుడికి మొదటి సంబంధం కావలెను. Ph: 9963188823 (A)

అర్హులైళ్ళ/ 27/ 5'9"/ MS, MBA (US) PWC $ 160L/ 10Cr ★ 26/ 5'10"/ BE, MS (Bits) Intel 20L. 6రోజ్ వరుడుకి వధువుల కావలెను శుభం మాట్రిమోని ✆ 9000907047 (A)

మాదిగ/ B.Tech (IIIT)/ C.Govt సీనియర్ Exq. ఇంజనీర్ (BHEL)/ 85000/-Pm/ 5'10" ఎత్తు/ 28 సంలు వరుడికి వధువు కావలెను ✆ 9642459724 (A)

విశ్వబ్రాహ్మణ/ B.Tech, MBA/ C. Govt. A.E (BHEL)/ 80,000/- Pm/ 5'8" ఎత్తు/ 28 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

రజక/ B.Tech/ C. Govt, J.T.O (BSNL)/ 72000/- Pm, 5'10" ఎత్తు/ 28 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

రెడ్డి/ M.Tech/ C. Govt, ఇండియన్ ఎయిర్ పోర్ట్ అథారిటి ఆఫీసర్ / 80,000/- Pm, 5'10" ఎత్తు/ 28 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A)

మాదిగ/ B.Tech/ Govt. A.E (సంచాయతీ రాజ్ Dept)/ 60,000/- Pm, 5'8" ఎత్తు/ 27 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9703978131 (A)

యాదవ/ M.Tech/ Govt. A.E. (ఇరిగేషన్ Dept)/ 65000/- Pm 5'8" ఎత్తు/ 28 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9515765529 (A)

పద్మ/ B.Tech, MBA/ C. Govt. Asst Exq. (బ్రైబింగ్ ఆఫీసర్ (BHEL) 13 Lakhs P.A/ 5'9" ఎత్తు/ 28 సంలు వరుడికి వధువు కావలెను. ✆ 9985396014 (A)

కుమ్మరి/ M.Tech, NIT/ Govt. A.E.E (ట్రాన్స్కో)/ 1 Lakh. Pm, 5'9" ఎత్తు/ 28 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9989450693 (A)

SC మాదిగ/ B.Tech/ Govt. బ్యాంక్ మేనేజర్ (ఆంధ్రా బ్యాంక్)/ 70000/- Pm/ 5'8" ఎత్తు/ 28 సంలు వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8008653628 (A)

యాదవ కురువ 28 5'8" M.Tech USA 1 cr p.a., 28 5'8"MBBS, PG, Hyd, 29 5'8" B.Tech, MBA, Hyd Job 15 L.p.a.శ్రీకృష్ణ 98493 06274 (I)

రెడ్డి 1989/ 5'8" MS/ US/ 80K/ 20 CR/ 18 L.P.A (Rentals) ★ 1991/ 5'9" B.Tech/ NIT/ 200K/ US ✆ 8885559579/ 9848221166 (A)

రెడ్డి 1992/ 5'7" B.Tech/ SWE/ Wells Fargo/ 10 L.P.A ★ 1994/ 6" Advocate/ 30 CR. నచిన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో ✆ 9505651788/ 9848221166 (A)

రెడ్డి 1990/ 6'2" B.Tech/ Rental Income 90 L.P.A/ Rich/ Business/ 1985/ 5'8" MBBS/ Osmania/ 12 L.P.A/ 10 CR ✆ 8885559579/ 9848221166 (A)

కుల మతాల పట్టింపులుండవు. బ్యాక్వర్డ్/50y/5'7" వైస్రాయ్ B.Tech తగిన జత , సంలతో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇస్తున్నబ్యాచ్ గల వరుడికి మంచి మనసున్న వధువు కావలెను. దేశాలు వాళ్ళవే! సంగారెడ్డి. (వీ బ్రోకర్స్ ప్లీజ్) ✆ 9676172123

బలిజ/కాపు: 28Y/ 5'11"/ B.Tech (Bits) MBA, S/W in Banglur/ 30 Lakhs P/A, 4 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 97005 55508 (D)

కమ్మ, 2nd Match: 39/ B.Tech, MS/ S/W, USA, 1 Cr. P/A, settled Family వరునికి కమ్మ, కాపు, రెడ్డి వధువు కావలెను. 79962 20232 (D)

46/ Fair/ 5'5"/ Madiga Christian/ BA/ Gazetted officer-A.P/ Alone/ No Kids/ Seeks 38-43 Yrs/ 1 or 2nd/ Widow/ divorce/ with out Kids/ CNB/ any degree Christian/ prefers Rayalaseema/ No Mediators ak203rifle@gmail.com/ Call No: 73961 77097. (L)

కులపట్టింపు లేదు, అర్హులైళ్ళ 31, 5'6", PG 60వేలు, 10c ఆస్తి గల వరునికి PG/ Engg చదివిన లేదా చదువుతున్న అందమైన వధువు కావలెను. 8639798537 (డైరెక్ట్).

కాపు విడో 27 Y, B.Tech 20 కోట్ల ప్రాపర్టీ ప్రమోటర్లో ప్యాదిలీని కోల్పోయిన ఒంటరి వధువుకు వరుడు కావలెను (ఆస్తి, కుల పట్టింపు లేదు) Photos Whatsapp 7207214721. (N)

నైళ్ళ: 44 సం॥ 55"/బ్రాహ్మణ 45 సం॥ 5'6" గవర్నమెంట్ ఎంప్లాయి/ టీచరుకు 25 మ్యారేజుకు తగిన నైళ్ళ/ బ్రాహ్మణ వధువు కావలెను. ✆ 73308 01406. (B)

పడ్డెర, 23, 5'6", MBBS కు తగిన వధువు కావలెను. సంప్రదించండి. ✆ 91107 51962. (B)

కమ్మ/ 30 Y/ 5'10" B.Tech (CS), V.Fair, S.W.E. 55 L P/A, 3 Cr Share వరునికి కమ్మ వధువు కావలెను. ✆ 80196 58675, 73863 38574. (B)

కాపు 37 సంలు 5'11" వివాహం కాని వ్యక్తులోపు కలిగిన ప్రయివేట్ ఉద్యోగికి జీతం గల ఇంటి బ్రాహ్మణ వధువు కావలెను. ✆ 8499011133 (A)

రెడ్డి/ మోటాటి 42 సం॥/ 10Cr. ఆస్తి/ సొంత ఇల్లు/ Hyd. పోలారం దగ్గర 2 1/4 ఎ॥ 30L. సంలతో ఆరాయం కలిగిన విదేశీవరునికి తగిన వధువు కావలెను (No Dowry) 7674972466 (A)

★ ★ ★

బ్రాహ్మణ 37 సంవత్సరాలు ఇంటర్ గవర్నమెంట్ చిరు ఉద్యోగికి వరుడునకు పేద ఇంటి బ్రాహ్మణ వధువు కావలెను. ✆ 9866887177, 8985381962 (A)

SC మాల హిందూ 32 సంలు సిద్దిపేటలో బాగా స్థిరపడిన MD ఫిజిషియన్ డాక్టర్ వరునికి ఉన్నతస్థాయి కుటుంబానికి చెందిన MBBS/PG వధువు కావలెను. 9010684499 (N).

SC మాల హిందూ Hinkel బాగా స్థిరపడిన డాక్టర్ వరునికి (VIP, డాక్టర్, బిజినెస్‌మెన్) ఫ్యామిలీకి చెందిన MBBS/PG డాక్టర్ వధువు కావలెను. 8520054346.(N)

కుల, మత, ధన ప్రసక్తి లేని వయస్సు 56 Y., 5' 9" అందమైన తగిన ఆదర్శ గుణవంతురాలైన ఏ బాదరబందీ లేని వధువు కావలెను. డైరెక్ట్. 99736 59766. (P)

కాపు 34, 5'6" PG, జాబ్ నెలకు లక్ష జీతం కల వరుడుకు మొదటి/ రెండవ వధువు కావలెను. కట్నం ప్రసక్తిలేదు. డైరెక్ట్. 8465841434 (A)

'పెరుగు'తో పెరిగే బంధం

నూతన తరానికి ఆరంభం పెళ్లి.. బారతీయ వివాహ సంస్కృతి వైవిధ్యమైంది. విభిన్నమైన సంప్రదాయాల మేళవింపు. దేశంలో ఆయా ప్రాంతాలు, వర్గాలు తమకంటూ ఓ సంప్రదాయాన్ని పాటిస్తూ వివాహబంధ ఔన్నత్యం శాశ్వతమని గుర్తు చేస్తుంటాయి. మెట్టినింటి వంశ ప్రతిష్ఠను, కీర్తిని భుజస్కంధాలపై మోసేది కోడలే. తరువాతి తరాలకు వారది. ఆమెను చూస్తే పుట్టినిల్లు గర్వపడాలి. మెట్టినిల్లు మురిసిపోవాలి. మరి అంతటి ప్రాధాన్యత ఉన్న మహాలక్ష్మిని సాదాసీదాగా ఆత్రాంటికి తెచ్చుకుంటే ఎలా? అందుకే కశ్మీరీ పండిట్‌లకు వివాహమంటే అరుదైన పుట్టం. ఈ సంబరం కలకాలం గుర్తుండిపోయేలా జరుపుకుంటారు వాళ్లు.

మదిలో నిలిచే జ్ఞాపకాలు

వివాహం గురించి చర్చలు జరుపుతున్నారంటే ఆ ఇంట ఇక సంబరాలు ప్రారంభమైనట్లే. సంప్రదింపుల అనంతరం ఇరువర్గాల కుటుంబ సభ్యులు అలయానికి వెళ్లి నిశ్చితార్థానికి ముహూర్తం నిర్ణయించుకుంటారు. లివ్‌మాన్ పేరిట తమ తమ ఇళ్లను శుభ్రం చేసుకోవడం, రంగులు వేయించడం, అలంకరించుకోవడం ఇలా అన్నింటినీ బంధుమిత్రులతో సాయంత్రం సమయాల్లో సందడిగా చేసుకుంటారు. 'మాన్‌జరాత్' పేరిట నూతన వధూవరులకు సాయంత్రం సమయంలో మెహందీ వేడుక నిర్వహిస్తారు. మిత్రులంతా సరదాగా పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతారు.

అపురూపం ఆ ఘట్టం!

వివాహానికి ముందుగా వధూవరులిద్దరికీ ఇళ్లలో చేయించే మంగళస్నానాల వేడుకలనే 'దివ్‌గజ్' అని పిలుచుకుంటారు. పాలు, బియ్యం, పెరుగు, నీటితో తయారుచేసిన మిశ్రమాన్ని వధువు/వరుడి తలపై పోస్తారు బంధుగణమంతా. ఓ విధంగా ఇది బ్రహ్మచర్యాన్ని వీడి గృహస్థ ఆశ్రమాన్ని స్వీకరించే క్రతువుగా చెప్పారు. తల్లిదండ్రులు వధువుకు 'డేయూర్'గా పిలిచే బంగారు చెవి జూకాలను నూతన వస్త్రాలతోపాటు బహుమానంగా ఇస్తారు. బంధువర్గమంతా ఆశీస్సులు అందజేస్తారు. కాబోయే అత్తగారు వధువులకు 'తరంగ్'గా పిలిచే వస్త్రాన్ని చుడతారు. వివాహానంతరం మాత్రమే దీనిని తీసేందుకు వీలుంది. వరమాలగా పిలిచే పూలదండలను అందరి సమక్షంలో మార్చుకుంటారు. వధూవరులిద్దరిపైనా పలుచటి వస్త్రాన్ని ఉంచుతారు. దుష్టశక్తుల చూపులు తగలకుండా ఈ ఏర్పాటు.

కమనీయం!

పండితులు హోమగుండం వెలిగించడంతో కన్యాదాన ఘట్టం ప్రారంభమవుతుంది. వధువు తల్లిదండ్రులు వరుడి కాళ్లుకడిగి కన్యాదానం నిర్వహిస్తారు. వరుడు వధువు చేతిని పట్టుకుంటాడు. ఇద్దరి చేతులు చుట్టూ వస్త్రాన్ని కప్పుతారు. వధువుతల్లి ఇద్దరి నుదుటన 'మనస్మల్' (బాసికం)అని పిలిచే బంగారు తాడును కడుతుంది. దీనర్థం ఇకపై వారిద్దరూ దంపతులని. పండితులు అగ్నిసాక్షిగా వారితో ప్రమాణాలు చేయిస్తారు. అనంతరం వధువు ఏడు రూపాయ నాణేలు/నోట్లపై నడుస్తుంది. ఇదే మొదటి ప్రమాణం. ఇంటికొచ్చే కొత్తకోడలిని మహాలక్ష్మిగా భావించి నిర్వహించే సంప్రదాయమిది. వివాహ వేడుకకు వచ్చి నవారందరూ పూలుజల్లుతూ కలకాలం కలిసుండాలని ఇద్దరినీ ఆశీర్వదిస్తారు.

పెరుగు ప్రాముఖ్యత వేరు!

ఇంట ఏ వేడుక జరిగినా తప్పనిసరిగా పెరుగు ఉండాల్సిందే. వివాహం అనంతరం వధువు పుట్టింటికి రావడాన్ని 'సత్రాత్' పేరిట వేడుకగా జరుపుతారు. వధువు తిరిగి వెళ్లేటప్పుడు డబ్బులు, నూతన వస్త్రాలు, బహుమతులతోపాటు పెరుగు, ఉప్పు, నాబాద్ (పంచదార పలుకులు)లను తప్పనిసరిగా ఆత్రాంటికి తీసుకువెళ్తుంది. దీనికీ ఓ నిబంధన ఉంది. స్థానికంగా పాలుపోసే పాలవాడి ఇంట మట్టిముంతల్లో తోడేసిన పెరుగునే తీసుకువెళ్లాలి. పాలు తోడేసేందుకు అవసరమైన పెరుగు మాత్రం వధువు ఇంటినుంచే వెళ్తుంది. మెట్టినింట ఈ పెరుగును తమ బంధుగణానికి పంచిపే చేస్తారు. కొంత భాగాన్ని తమ ఇంట్లో పాలు తోడేసేందుకు ఉపయోగిస్తారు. దీనికి ఓ అర్థం ఉంది. ఈ పెరుగులాగే తమ కుటుంబంలోకి కొత్తగా వచ్చి చేరిన కోడలు కూడా ఏ అరమరికలూ లేకుండా తమతో ఇట్టే కలిసిపోవాలని వారి ఆకాంక్ష. కోడలికి సముచిత స్థానం ఇవ్వడంలో కశ్మీరీ పండిట్‌లు ఎప్పుడూ ముందుంటారు. నిశ్చితార్థంతో మొదలయ్యే ఈ వేడుకలు నూతన వధువు తొలిబిడ్డకు జన్మనిచ్చే వరకు పలురకాల పేర్లతో కొనసాగుతూనే ఉంటాయి.

- భానుప్రకాష్ కర్నాటి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు pelli@eenadu.net కు మెయిల్ చేయండి.

SC మాలహిందు 29/ B.Tech/ Gr-1 ఆఫీసర్, 28/ B.Tech/ AE, 28/ B.Tech/ MS/ USA 29/ B.Tech/ MBA/ 10L.PA. Cont: 7780300068 (A)

బ్రాహ్మణ 28 yrs./ 5'4" కాండిల్యసాగోత్ర/ ఇంటర్/ Pvt. జాబ్/ రిక్వెస్టింగ్/ ఎవ్ వేల్ సెటిల్ ఫ్యామిలీ/ Govt, Pvt. Job పురోహితం అయిన Ok. Ph: 9121423830(W) (A)

SC మాలహిందు, 5.2.4/ ఎత్తు 5'4" B.Tech/ IT/ SWE/ బిజినెస్ Hyd. నెలకు 50,000/- జీతంగల ఏకైక కుమార్తెకు తగిన వరుడు కావలెను. 8978799956 (A)

★ ★ ★

విశ్వబ్రాహ్మణ (కట్న ప్రసక్తి లేదు) 32 సం॥ 5'1" ఢాక్టర్ DNB Anaesthesia ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న వధువుకి PG చేసిన వరుడు కావలెను నో (బ్రోకర్) ✆ 9908663904 (A)

హిందూ మాదిగ, 37 సం॥, 5'6", B.A., TTC, వితాలు, పిల్లలు లేరు, సేమ్ కులం కలిగి జాబ్/ సెటిల్డ్ వరుడు కావలెను. డైరెక్ట్. ✆ 63008 85656.

36 Yrs 5'1" (BC D) డైవర్సి B.Ed వధువుకు వరుడు కావలెను. 1st & 2nd మ్యారేజ్ అయిన సరే. Hyd లో 2BHK ఇల్లు ఖచ్చితమను. CNB (OC/ BC) డైరెక్ట్. ✆ 9908512084 (A)

★ ★ ★

వివాహ వేదిక

20 సంలు అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక సంప్ర: 9849414098/ 040-66317515 satyasaivivahavedika.com (A)

నాపి - విజయవాడ (కృ) వారి ఆర్థిక్య వివాహము వివాహ పరంగు వేడక మరియు పునర్వివాహ పరంగు వేడక 14.7.2019 తేదీన కి.మి ఎన్.కాలేజి విజయవాడ నుండి ఇదురుగు వివాహము. ✆ 99895 00130, 81064 54284. (B)

పలపట్టింపులేని వారికి అన్నికులాల 18/ 28/ లేదీ/ డైవర్సు/ విడో/ విడోయర్స్/ ఒంటరి/ సెట్లర్స్ Age: 22-70సం॥ (స్త్రీలకు స్త్రీ, పురుషులకు సర్వీస్‌నర్స్ ఓకే) 7893683763 (A)

15 రోజు అన్ని కులాలవారికి మీకు తగిన సంబంధాలు చూపింపబడును ఇట్టి ఆదివారం 9:00 నుండి 5:00 వరకు సంప్రదించగలరు. ప్రతి ఆదివారం పరిచయవేదిక జరుగును. Hyd. 9440937900

మాల, మాదిగ, IAS, IPS, IRTS, MBBS, MD, MS, USA Govt Jobs, SWE, 789301 3265 (N).

Invites Good Family Looking Educated Below 30Yrs First Marriage Others also Hindus Only. 9790144408, 8498933643 (A)

అగ్నికులక్షత్రియులకు మాత్రమే 3 సంలుగా వరంద పెళ్ళికి చేసిన బొమ్మిరెడ్డి మ్యారేజ్ బ్యూరో కాబట్టి ప్రతి ఆదివారం పరిచయ వేదిక. స్త్రీ రిజిస్ట్రేషన్. సంప్ర: 8339 77774, 8338 88879. (G)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మశాయాదవ్ www.gokulmarriage.com, ✆ 9440831748, Gunt: 9440759945, VSP: 9441735157 (A)

పెళ్ళినందడి వివాహ సంబంధములు కొరకు Send Your Photo, Bio Data, Call/ Whats App: 9347262769, www.pellisandadi.com (A)

కాపు, బలిజ, వివాహ సంబంధములు కొరకు www.kapumatches.com మీ Cell Phone లో చూడండి లేదా మీ Photo/ Biodata ని Whats App చేయండి. 7331105279 (A)

కాపు కళ్యాణవేదిక తెలంగ బలిజ కాపు ప్రదమ, ద్వితీయ లేదు 36 సం॥ ల యేనుగల కోటేశ్వరరావు Journalist HO-Guntur. ✆ 77319 71097, Bo-Hyd. ✆ 99491 78816(I)

స్త్రీ రిజిస్ట్రేషన్: మాలమాదిగ, హిందు, క్రిస్టియన్, 1వ, 2వ, లేదీ, S/W, ప్రైవేట్, దేశవిదేశ సంలకై AP & TS అన్నిజిల్లాల నుండి సంప్ర॥ 15 సంలు Exp. 9100474440

డాక్టర్ డాక్టర్: 8000 ప్రొఫైల్స్ అన్ని కులాల MBBS/ MD/ MS/ DM/ MCH/ BDS/ MDS, బిజినెస్‌లకు 1వ, 2వ, ఇండియా & విదేశాల సంబంధాలు పాస్ట్‌గా కుదుర్చబడును. మా బ్రాంచిలు హైదరాబాద్. ✆ 9966803059 (A)

పెళ్ళిపందిరి ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లుకు ఆస్కారం లేదు.

పద్మశాలి వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd (A)

కాపు వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Charan Teja ✆ 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd (A)

ప్రాణి పరిణయ 1st, 2nd, లేదీ మ్యారేజెస్, జేబీసీ (25 L to 100 Cr) పెళ్ళి సంబంధాల కొరకు సం॥ కష్ట మరియు కష్ట Converted వారికి మాత్రమే. ✆ 80196 58675, 73863 38574. (B)

2వ పెళ్ళి వివాహ వేదిక (Free). కుల పట్టింపు లేని/ అన్ని కులాల 2nd Late వివాహములు కొరకు సంప్ర॥ 10 AM to 6 PM. ✆ 90301 42666/ 80963 93293.

రజక కులస్థులకు మాత్రమే. ఇంటింటి మ్యారేజబుల్స్ ★ డాక్టర్స్ లీడర్స్ సాఫ్ట్‌వేర్, గజాల్ట్ విడో, డైవర్సు కేసులకు సంలకై సంప్ర॥ కేశవరావు ✆ 92464 71364, వజ్రమ్ 96814 50188. (B)

మాదిగ, మాల వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Suresh ✆ 7702262508/ Blue Trend Matrimonial (P) Ltd (A)

Mala (SC) Free మాలమహానాడు ఆధ్వర్యంలో వివాహ సంబంధాల సెటిల్‌మెంట్ కొరకు సంప్ర॥ ✆ 90109 22444/ 75694 60054.

మరుమనస్సు పొందిన అన్ని కులముల క్రైస్తవ వధూవరులకు మొదటి/రెండవ వివాహములు కొరకు సంప్ర॥ ది హోలీ కమ్యూనిటి మ్యారేజ్ బ్యూరో. ✆ 73999 93599, 73999 93699. (B)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls, India & Abroad Matches, all EMP/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from All Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletiaupriyareddy@gmail.com (A)

ఓన్లీ Govt. ఎంప్లాయిస్ ★ పెళ్ళనర్స్ కొరకు అన్ని మతాలు కులాల 1వ, 2వ, లేదీ/ విడో/ డైవర్సు వివాహాలకు ప్రైవేటు, విదేశీయ, పెళ్ళనర్స్ సంబంధాల వెరిఫైడ్ సెటిల్ కొరకు మన తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద సంస్థ. ✆ 7780135625 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503, brahminformationmatri@gmail.com (A)

ఓన్లీ కమ్మ కొరకు (10 వేల ప్రొఫైల్స్), డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, గౌల్ ఎంప్లాయిస్, బిజినెస్, ఫైరింగ్ & ఆల్ 1వ, 2వ, దేశ, విదేశీ సంబంధాల పాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9959305599 (A)

ఓన్లీ ఇండియన్ & అబ్రాడ్ డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, బిజినెస్, ఫైర్ రిలర్లకు 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులాల వారికి పాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 8978915315 (A)

సైనిక్ డాక్టర్: (5 వేల ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, MDS & రాజ్ మాత్రమే. 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులముల కుదుర్చబడును. ✆ 9701656686 (A)

కాస్మోక్రీ మ్యారేజ్ బ్యూరో. 1వ, 2వ, లేటీ మ్యారేజెస్ ప్రైవేటీగ, విదేశీయ, పెళ్ళనర్స్, అన్ని కులాల వారికి పాస్ట్ సెటిల్‌మెంట్. స్త్రీలకు స్త్రీ రిజిస్ట్రేషన్ ✆ 7416330057 (A)

సెకండ్ మ్యారేజెస్ మాత్రమే. శ్రీనివాసరావు మ్యారేజ్ బ్యూరో, అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా పాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ✆ 9885144375 (A)

★ ★ ★

యాదవ, మున్నూరుకాపు, మంచిరాజ్, గంగపుత్ర మరియు వివాహ సంబంధాలు మా ప్రత్యేక 10th, డిగ్రీ, PG, N.R.I లకు స్త్రీలకు స్త్రీ, పురుషులకు రిజిస్ట్ర 2000 ✆ 9347519673 - 9247257445 (A)

కురుమ యాదవ వివాహ సంబంధాలకు విదేశీ డాక్టర్స్, ఇంజినీర్ 2వ వివాహ సంబంధాలకు సం॥ kurumapellipandhiri.com ✆ 9396649499/ 9393001666 Hyd. (A)

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, జీరోగసర్ డాక్టర్స్/ ఇంజినీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్ళి సంబంధాలకు సంప్ర॥ బ్రహ్మరావు MB ✆ 99484 83542 (P)

శుభంగెడ్స్ మ్యాట్రిమోని గెడ్స్ వధువరులకై దేశ, విదేశ, 1వ, 2వ, రాజ, ఇంజినీర్, P.G., డిగ్రీ, బిజినెస్ సంబంధాలకై సంప్ర॥ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ Hyd ✆ 9247257445, 9246214511 (A)

కాస్మోక్రీ మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాలవారు డైరెక్టుగా రిజిస్ట్రేషన్‌కై సంప్రదించండి! 1/2/లేదీ, విడో, డైవర్సు సంప్ర॥ 8008959906/ 9347136166 (A)

మాదిగ వధువు వేడక ఈ రోజు 09-06-2019 సాయం 1 వేలు * సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్. సంప్ర॥ సృష్టి వివాహ వేడక సీనియాదాబ్ సైనిక్ ✆ 9347046175 (A)

పద్మశాలి కులవారువధువుకు శుభవార్త! గత కొన్ని దశాబ్దాలుగా సామాజికపరమైన సేవలతో సేవలందిస్తున్న సీనియర్ వెర్చిన్ ట్రస్టువారి ఆధ్వర్యములో పద్మశాలి వధువుకు వధువరుల వేడుక తేది: 09-06-2019 ఆదివారం రోజున 1PM నుండి 5PM వరకు నిర్వహిస్తున్నాము సంప్ర॥ పద్మశాలిభవన్, నారాయణగూడ, హైదరాబాద్. ఫోన్ నెం. 040-24766567/8/9 (A)

★ ★ ★

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం రుజ్జు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది", పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టీపీటీఎఫ్ నూతన అధ్యక్షుడిగా వై.అశోక్‌కుమార్



అశోక్‌కుమార్

ఐఏఎస్‌బాగ్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా వై.అశోక్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీపీటీఎఫ్ అధ్యక్షుడిగా ఐదేళ్లుగా పని చేస్తున్న బి.కొండలిరెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఈయనను ఎన్నుకున్నారు. శనివారం స్థానిక దేశోద్ధారక భవన్‌లో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు ఎ.నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు కె. వేణుగోపాల్ విమర్శించారు. ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కారణమవుతుందని ఆరోపించారు. మరోవైపు నియామక పత్రాలు ఇవ్వాలని అభ్యర్థించేందుకు ప్రగతి భవన్‌కు వెళ్లిన టీఆర్‌టీఏ అభ్యర్థులను అరెస్టు చేయడాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయినందున ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరింది. ఎఐఆర్, పీఆర్సీ నివేదిక తెప్పించుకోవడం తదితర అంశాలను పరిశీలించి ఎఐఆర్ ప్రకటించాలని, మే 16న సీఎం ఇచ్చిన హామీలపై ఉత్తర్వులు ఇవ్వాలని తీర్మానించింది.

సంచార పశువైద్యశాలలకు భారీ స్పందన

- 1962 నంబరుకు గతేడాది 23 లక్షల కాల్స్
- నియోజకవర్గానికో వాహనం
- ఫోన్ చేసిన గంటలోపే సేవలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మారుమూల గ్రామాలు, పశువులను వైద్యశాలల వరకు తీసుకురాలేని రైతుల కోసం ప్రారంభించిన సంచార పశు వైద్యశాలలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇందుకోసం ఏర్పాటు చేసిన 1962 నంబరుకు భారీ స్పందన వస్తోంది. ఈ నంబరుకు ఫోన్ చేస్తే ప్రత్యేక వాహనం వెళ్లి పశువులకు వైద్యసేవలం దిస్తోంది. 2017 సెప్టెంబరులో ఈ సేవలను ప్రారంభించిన నాటి నుంచి ఫోన్‌కాల్స్ సంఖ్య పెరుగుతూ వస్తోంది. గతేడాది రోజుకు సగటున 2,500-3000 వరకు ఫోన్‌కాల్స్ వచ్చినట్లు పశుసంవర్థకశాఖ వార్షిక నివేదికలో పేర్కొంది. జీవీకే-ఈఎంఆర్‌ఐ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 99 (అంబులెన్స్) సంచార పశువైద్యశాలలను నిర్వహిస్తోంది. ఇద్దరు పశువైద్యులు, ఇద్దరు టెక్నీషియన్లు సహా పశువులకు అవసరమైన అన్నిరకాల మందులు, వైద్యపరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. నియోజకవర్గానికొకటి చొప్పున సంచార పశువైద్యశాలలు నిరంతరం సంచరిస్తుంటాయి. రైతులు ఫోన్ చేసిన అరగంట నుంచి గంటలోపే సేవలందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు ఈ సంచార పశువైద్యశాల ద్వారా సేవలు పొందినవారిలో దాదాపు 90శా

వెలగపూడి సచివాలయ మైదానంలో శనివారం జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం గవర్నర్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో నూతన మంత్రుల బృందచిత్రం

పండుగలా మంత్రుల ప్రమాణం

ఈనాడు, అమరావతి

అభిమానుల కేరింతలు.. బంధుమిత్రుల ఆనందోత్సాహాలు.. సహచరుల అభినందనల మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం కన్నుల పండుగలా సాగింది. 25 మంది మంత్రులతో తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ ప్రమాణం చేయించారు. తమ అభిమాన నాయకులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు వారి అభిమానులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మంత్రుల బంధుమిత్రులు ఉత్సాహంగా తరలివచ్చారు. పలువురు వైకాపా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మంత్రులకు శాఖలు కేటాయించారు. ముందుగా చెప్పినట్లుగానే ఐదుగురు మంత్రులకు ఉపముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారు. కాపుల నుంచి ఆళ్ల నాని, బీసీల నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్, మైనార్టీల ప్రతినిధిగా అంజాద్ బాషా, ఎస్సీల తరఫున కళత్తూరు నారాయణస్వామి, ఎస్టీ వర్గం నుంచి పాముల పుష్పశ్రీవాణిలకు ఉపముఖ్యమంత్రి హోదా దక్కింది. వీరిలో ముగ్గురికి కీలక శాఖలు కేటాయించారు. హోం మంత్రిగా ఎస్సీ వర్గానికి చెందిన మహిళ మేకతోటి సుచరితకు అవకాశం ఇవ్వడం విశేషం. వెలగపూడిలోని సచివాలయం పక్కనే ఉన్న బాలీ స్థలంలో మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఉదయం 11.44 గంటలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం నుంచి ప్రమాణస్వీకారోత్సవ ప్రాంగణానికి చేరుకున్నారు. గవర్నర్ నరసింహన్ రాక కోసం అక్కడే కాసేపు ఎదురుచూశారు. 11.47కి గవర్నర్ అక్కడికి చేరుకున్నారు. గవర్నర్‌కు ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి వేదికపైకి చేరుకున్నారు. 11.48కి పోలీసు బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించింది. గవర్నర్ అనుమతితో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు 11.49కి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రటించారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయాల్సిన వారిని ఒక్కొక్కరినీ ఆయన వేదికపైకి పిలిచారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభించి అనంతపురం వరకు వరుస క్రమంలో ఆయా జిల్లాల నుంచి మంత్రులుగా నియమితులైనవారితో ప్రమాణం చేయించారు. మొత్తం కార్యక్రమమంతా షెడ్యూల్ ప్రకారమే జరిగింది. 12.39 గంటలకు పోలీసు బ్యాండ్ జాతీయ గీతాలాపనతో ప్రమాణ స్వీకారోత్సవం ముగిసింది. ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తొలిసారి సచివాలయంలోని తన కార్యాలయంలో ప్రవేశించడం, సచివాలయం పక్కనే మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు ఉండటంతో ఉదయం నుంచే సచివాలయం, పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు తరలి వచ్చారు.

ప్రతి అడుగూ అభివృద్ధి కోసమే కావాలి

ఆంధ్రప్రదేశ్ కొత్త మంత్రివర్గానికి ఆ రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. "కొత్త మంత్రివర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు. మనం వేసే ప్రతి అడుగూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసమే కావాలి. మన పనితీరుతోనే దాన్ని నిరూపిద్దాం. ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని శనివారం ట్వీట్ చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం గవర్నర్, కొత్త మంత్రులతో దిగిన ఫొటోను సీఎం జగన్ ట్విటర్‌లో జత చేశారు.

మంత్రివర్గంలో 19 మంది కొత్త ముఖాలే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో కొలువుదీరిన 25 మంది మంత్రుల్లో 19 మంది కొత్తముఖాలే. వీరంతా తొలిసారి మంత్రులయ్యారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్నవారిలో బొత్స సత్యనారాయణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, బాలినేని శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పినిపే విశ్వరూప్‌లకు మాత్రమే గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది.

ట్రాఫిక్ నిలిచిపోవడంతో నడిచి వెళ్లిన నేతలు

ఏపీ సచివాలయం సమీపంలోని మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా తుళ్లూరు మండలం మందడం వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ప్రమాణ స్వీకారానికి రెండు గంటల ముందే బయల్దేరిన సుచరిత ట్రాఫిక్ కారణంగా వేదికకు రెండు కిలోమీటర్ల దూరంలో నిలిచిపోయారు. కొద్ది సమయం పాటు వాహనంలో నిరీక్షించిన ఆమె కార్యక్రమానికి ఆలస్యమవుతుండడంతో కాలినడకన తన అనుచరులతో కలిసి వేదికకు చేరుకున్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ కూడా నడుచుకుంటూ వెళ్లారు.

13న శాసనసభాపతి ఎన్నిక

ఏపీ శాసనసభ సమావేశం ఈ నెల 12న జరగనుంది. ఎన్నికైన శాసనసభ్యులతో తొలిరోజు ప్రొటెం స్పీకర్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రమాణస్వీకారం చేయిస్తారు. శాసనసభాపతిగా తమ్మినేని సీతారాం ఎన్నిక ఈ నెల 13న నిర్వహించనున్నారు. అదే రోజు ఆయన ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన కుటుంబసభ్యులతో సహా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. శాసనసభాపతిగా తనను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు తండ్రితో... నేడు తనయుడితో

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో పని చేసిన వారిలో ఆరుగురికి ప్రస్తుతం జగన్ మంత్రివర్గంలోనూ చోటు దక్కింది. 2004-2009 మధ్య రాజశేఖర్‌రెడ్డి హయంలో బొత్స సత్యనారాయణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, పినిపే విశ్వరూప్, మోపిదేవి వెంకటరమణ, బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించారు. మళ్లీ దాదాపు పదేళ్ల తర్వాత ఆ ఆరుగురికి రాజశేఖర్‌రెడ్డి తనయుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో చోటు లభించింది. 25 మందితో ఏర్పాటైన తాజా మంత్రివర్గంలో వీరు ఆరుగురూ సీనియర్ మంత్రులుగా ఉన్నారు.

ప్రమాణ స్వీకారంలో పదనిసలు

- ఏపీ మంత్రులు 25 మందిలో 24 మంది దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేయగా, అంజాద్ బాషా అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు.
- ప్రమాణ స్వీకారం చేసిన వారు నేరుగా వేదికపై ఉన్న సీఎం జగన్ వద్దకు వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. జగన్ మహిళా మంత్రుల తలపై చేయి ఉంచి ఆశీర్వదించారు. మిగతావారిని ఆయన ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందనలు తెలియజేశారు. పుష్పశ్రీవాణి, తానేటి వనిత, వెల్లంపల్లి శ్రీనివాస్, కె.నారాయణస్వామి జగన్‌కు పాదాభివందనం చేశారు.
- ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి శ్రీనివాస్), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), పేర్ని వెంకట్రామయ్య (నాని), బాలినేని శ్రీనివాసరెడ్డి (వాసు) ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు మొదట తమ అసలు పేరు చెప్పి, ఆ తర్వాత తమను ఎక్కువ మంది పిలిచే ముద్దు పేరు కూడా చెప్పి ప్రమాణం చేయడం విశేషం.
- సాధారణంగా మంత్రులు ప్రమాణస్వీకారంలో సార్వభౌమాధికారం, అంతఃకరణశుద్ధి వంటి పదాలను పలికేటప్పుడు తడబడతారు. ఈసారి అలాంటి తడబాటు లేకుండా అందరూ బాగానే పలికారు.

ఏపీ మంత్రులు - కేటాయించిన శాఖలు

ఉపముఖ్యమంత్రులు

పిల్లి సుభాష్ చంద్రబోస్	రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు
అంజాద్‌బాషా	మైనారిటీ సంక్షేమం
ఆళ్ల నాని	వైద్యం, ఆరోగ్యశాఖ, వైద్యవిద్య, కుటుంబ సంక్షేమం
కె.నారాయణస్వామి	ఎక్సైజ్, వాణిజ్యపన్నులు
పాముల పుష్పశ్రీవాణి	గిరిజన సంక్షేమం

మంత్రులు

మేకతోటి సుచరిత	హోంశాఖ, విపత్తునిర్వహణ శాఖ
బొత్స సత్యనారాయణ	మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ
ముత్తంశెట్టి శ్రీనివాసరావు	పర్యాటక, సాంస్కృతికం, యువజన వ్యవహారాలు
మేకపాటి గౌతంరెడ్డి	పరిశ్రమలు, వాణిజ్యశాఖ, ఐటీ శాఖ
కురసాల కన్నబాబు	వ్యవసాయం, సహకార శాఖ
తానేటి వనిత	మహిళ, శిశు సంక్షేమ శాఖ
కొడాలి నాని	పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
వెలంపల్లి శ్రీనివాసరావు	దేవాదాయ శాఖ
మోపిదేవి వెంకటరమణ	పశుసంవర్థక, మత్స్య, మార్కెటింగ్
అనిల్‌కుమార్ యాదవ్	సాగునీరు, జలవనరుల శాఖ
పినిపే విశ్వరూప్	సాంఘిక సంక్షేమ శాఖ
వెలుగువాడ శ్రీరంగనాథరాజు	గృహనిర్మాణ శాఖ
పేర్ని నాని	రవాణా, సమాచార, ప్రజాసంబంధాలు
పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గనులు, భూగర్భ శాఖ
ధర్మాన కృష్ణదాస్	రోడ్లు, భవనాల శాఖ
బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి	ఆర్థిక, ప్రణాళిక, అసెంబ్లీ వ్యవహారాలు
అదిమూలపు సురేశ్	విద్యాశాఖ
గుమ్మనూరు జయరాం	కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ
బాలినేని శ్రీనివాసరెడ్డి	విద్యుత్తు, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ
శంకర్‌నారాయణ	బీసీ సంక్షేమ శాఖ

పీపీఏలపై పునఃసమీక్ష మంచిది కాదు

- అలాంటి చర్యలతో విద్యుదుత్పాదక రంగంలో పెట్టుబడులకు విఘాతం
- ప్రజాభిప్రాయంతోనే సౌర, పవన విద్యుత్ ధరల్ని నిర్ణయిస్తారు
- ఏపీ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ లేఖ

ఈనాడు, అమరావతి: ఒకసారి చేసుకున్న సౌర, పవన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) బలమైన కారణం లేకుండా పునఃసమీక్షించాలనుకోవడం మంచిది కాదని, అది సాధ్యం కూడా కాదని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరులశాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. పునఃసమీక్షకు వీలు కల్పిస్తూ ఒప్పందంలోనే నిబంధన ఉన్నప్పుడు లేదా ఆ ఒప్పందం వెనుక బారీ కుంభకోణం జరిగిందనిగానీ, అవాంఛిత లబ్ధి చేకూరిందనిగానీ రుజువైనప్పుడు మాత్రమే అలాంటి ఒప్పందాలను పునఃసమీక్షించేందుకు అవకాశముటుందని తెలిపింది. ఈ మేరకు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరులశాఖ కార్యదర్శి ఆనంద్‌కుమార్ ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యానికి లేఖ రాశారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలించిగా ఆయన కోరారు. ఆ లేఖ సారాంశం ఇలా.. "వివిధ సౌర, పవన విద్యుదుత్పత్తి సంస్థలతో ఇది వరకు చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునఃసమీక్షించనున్నట్లు వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న కథనాల ద్వారా తెలుస్తోంది. వివిధ పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిదారులతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 62 లేదా 63 ప్రకారం పీపీఏలపై సంతకాలు చేసింది. మొదటి సందర్భంలో విద్యుత్ కొనుగోలు ధరల్ని సీఈఆర్సీ మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయిస్తుంది. రెండో సందర్భంలో బహిరంగ పోటీ బిడ్డింగ్ విధానంలో ధరల్ని నిర్ణయిస్తారు. ఈ రెండు సందర్భాల్లోనూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన తర్వాతే ధరల్ని నిర్ణయిస్తుంది. ఆ తర్వాతే పీపీఏలపై సంతకాలు చేస్తారు" అని ఆ లేఖలో ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు.

జాతీయ కార్యక్రమానికి విఘాతం: "కేంద్ర ప్రభుత్వం 2022 నాటికి దేశ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 175 గిగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయం మీకు తెలుసు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 100 గిగావాట్లు, పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 60, బయోమాస్ ప్రాజెక్టుల నుంచి 10, చిన్న జల విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 5 గిగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. నిర్దిష్టమైన కారణం లేకుండా పీపీఏలను పునఃసమీక్షించడం వల్ల ఈ లక్ష్యానికి గండి పడుతుంది. బలమైన కారణం లేకుండా పునఃసమీక్షించడం విద్యుదుత్పాదక రంగంలో పెట్టుబడి పెట్టే వారి స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. రాష్ట్రం, దేశంలోను భవిష్యత్ పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుంది" అని లేఖలో ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం?

- 10న ఏపీ మంత్రివర్గ తొలి భేటీలో చర్చ

ఈనాడు, అమరావతి: నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై ఆదివారం సచివాలయంలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ తొలి సమావేశ అజెండాలోనే దీన్ని చేర్చడం గమనార్హం. దీనితోపాటు మరో ఏడు అంశాలకు అజెండాలో చోటు కల్పించారు. పింఛను మొత్తాన్ని రూ.2,250 చేయడం తోపాటు ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతామని సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో ప్రకటించారు. ఆ నిర్ణయానికి ఇప్పుడు ఆమోద ముద్ర వేయనున్నారు.

అజెండా ఇదీ

★ పింఛనును రూ.2,250 చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించడం
★ ఆశాకార్యకర్తల వేతనాన్ని రూ.3 వేలనుంచి రూ.10 వేలకు పెంచడం
★ ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం
★ పురపాలక పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల పెంపు
★ ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ప్రకటన
★ అక్టోబరు నుంచి 'రైతు భరోసా' కింద రూ.12,500 ఇచ్చే పథకానికి ఆమోదం
★ హోంగార్డుల వేతనాల పెంపు
★ కంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్) రద్దు.

భాజపాలోకి మాజీ మంత్రి రావెల?

ఈనాడు-గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, గుంటూరు జిల్లాకు చెందిన జనసేన పార్టీ నాయకుడు రావెల కిశోర్‌బాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు లేఖ రాసి, మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి శనివారం పంపారు. గత ఎన్నికలకు ముందు ఆయన తెదేపాను వీడి జనసేనలో చేరి, ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా ఆయన భాజపాలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణను ఆయన తిరుపతిలో కలిసినట్లు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వచ్చాయి.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు 27% ఐఆర్!

- సీపీఎస్ రద్దు
- ముఖ్యమంత్రి జగన్ ప్రకటన

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి కింద 27% చెల్లిస్తామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయంలోని సీఎం ఛాంబరులోకి శనివారం తొలిసారి ప్రవేశించిన సందర్భంగా ఆయన 'గ్రీవెన్స్ హాల'లో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పని చేసినందువల్ల కొందరు ఉద్యోగులు ఆయనతో సన్నిహితంగా ఉన్నా.. దానిని తప్పుగా భావించనని స్పష్టం చేశారు. ఏదైనా పనులు చేయించుకునేందుకు సీఎంతో సన్నిహితంగా ఉండాల్సిన పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు 27% ఐఆర్ ఇస్తామని, భాగస్వామ్య పింఛను పథకం (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం- సీపీఎస్)ను రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ రెండు అంశాలపై సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి అధికారికంగా నిర్ణయం తీసుకున్న అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అవసరమైతే కమిటీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. "పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలు పెంచుతాం. ఒప్పంద విధానంలో పనిచేస్తున్న వారి అర్హతలు, అనుభవం, ఇతర అంశాల ప్రతిపాదిక పీలైనంతవరకు ఎక్కువ మంది సేవలను క్రమబద్ధీకరిస్తాం. ఎన్నికల హామీలు అమలు చేస్తాం. ప్రభుత్వం మంచి పాలన అందించాలంటే ఉద్యోగుల సహకారం అవసరం. ప్రతి విభాగంలో ప్రతి కార్యదర్శి, హెచ్‌వోడీ దగ్గర ఎన్నికల మేనిఫెస్టో ఉండాలి. మళ్లీ ఎన్నికల నాటికి ఈ మేనిఫెస్టోలో ప్రతి హామీని నెరవేర్చామని ప్రజలకు దగ్గరకు వెళ్లి ఓట్లడిగే పరిస్థితి ఉండాలి. ప్రజలు మంచి ప్రభుత్వాన్ని కోరి ఓటు వేస్తారు. మంచి ప్రభుత్వం అంటే సేనాళ్ళుడినే కాదు. అందరం కలిసిమెలిసి పని చేయాలి. ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు సంబంధించి భయపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం సానుకూలంగానే వ్యవహరిస్తోంది" అని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు ముఖ్యమంత్రిని సత్కరించారు.

నన్ను ఓడించేందుకు రూ. 150 కోట్లు ఖర్చు చేశారు

పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: శాసనసభ ఎన్నికల్లో తీమవరంలో తనను ఓడించేందుకు రూ.150 కోట్లు ఖర్చు చేశారని తెలిసిందని, శాసనసభలో తాను అడుగు పెట్టకుండా ఎలాగైనా ఓడించాలనేదే దాని వెనుక లక్ష్యమని జనసేనాధిపతి పవన్ కల్యాణ్ సంచలనాత్మక ఆరోపణ చేశారు. ప్రజా తీర్పును గౌరవిస్తానని, ఒక్క ఓటమి తమ పార్టీని నిలువరించబోదన్నారు. తాను ఓటమిని అంగీకరించేదిని కాదని, విజయం సాధించే వరకు పోరాడతానని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల్లో ఎవరెవరు ఎక్కడి నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు.

లెక్కలేనితనం

- ఆదాయం, వ్యయం అడిగేదెవరు?
- ఆడిట్ నివేదికలు ఇవ్వని ప్రైవేట్ పాఠశాలలు
- సమర్పణకు ఏటా సెప్టెంబరు 30వ తేదీ గడువు
- విద్యాశాఖ అడగదు..యాజమాన్యాలు ఇవ్వవు
- ఆ నివేదికతో పాఠశాలల అక్రమాలను కొంతైనా నియంత్రించవచ్చంటున్న నిపుణులు

భారీగా రుసుములు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు... ఆదాయ, వ్యయాలకు సంబంధించి ఆడిట్ నివేదికను మాత్రం విద్యాశాఖకు సమర్పించడం లేదు. విద్యాశాఖ సైతం యాజమాన్యాలను అడగకపోవడంతో వారు మిన్నకుండిపోతున్నారు. ఏటా అడ్డగోలుగా పాఠశాలలు ఫీజులు పెంచుతుంటే అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు తప్ప నియంత్రణకు ప్రయత్నించడం లేదు. యాజమాన్యాలు ప్రతి ఏటా సెప్టెంబరు లోగా గడిచిన ఆర్థిక సంవత్సర ఆడిట్ నివేదికను ఇవ్వాల్సి ఉన్నా విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

ఇంజినీరింగ్, మెడికల్, ఇతర ఏ కోర్సుల రుసుములను అయినా ఆయా కమిటీలు లేదంటే విశ్వవిద్యాలయాలు, సంబంధిత బోర్డులు నిర్ణయిస్తాయి. అందుకు కొన్ని కొలమానాలను పరిగణనలోకి తీసుకొని ఫీజు ఎంత ఉండాలో చెబుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల రుసుములపై మాత్రం ఏ ఒక్క ప్రభుత్వ సంస్థ నియంత్రణ లేకుండాపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో విద్యాశాఖ ఆ దిశగా ప్రయత్నించినా యాజమాన్యాలు న్యాయస్థానం నుంచి స్టే తెచ్చుకున్నాయి. దాంతో పాఠశాల యాజమన్యాల ఇష్టారాజ్యమైపోయింది. డిమాండ్ ఉన్న బడుల్లో అయితే చెప్పినంత రుసుములతోపాటు సీటు దొరకాలంటే డొనేషన్లు ఇవ్వాల్సిందే. పలు పాఠశాలల్లో వందల నుంచి వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి లాంటి జిల్లాల్లో కొన్ని పాఠశాలలు ఎల్‌కేజీకే రూ.లక్షకుపైగా వార్షిక ఫీజు వసూలు చేస్తున్నాయి. ఇక డొనేషన్లు అదనం. పలితంగా యాజమాన్యాలు ఏటా రూ.కోట్లు వెనకేసుకుంటున్నాయి. భవిష్యత్తులో ఈ పరిస్థితి మరింత పెరిగే ప్రమాదం ఉందని 25 సంవత్సరాల క్రితమే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది.

ఆడిట్ మంత్రం వేసినా...

పాఠశాల విద్యాశాఖకు గుండెకాయగా భావించే జీవో 1ని 1994లో ప్రభుత్వం జారీ చేసింది. అందులో నిబంధన 20 ప్రకారం ప్రతి ఏటా సెప్టెంబరు 30వ తేదీలోపు ఆయా ప్రైవేట్ పాఠశాలలు ఆదాయ, వ్యయాలకు సంబంధించి ఆడిటర్ ధ్రువీకరించిన ఆడిట్ నివేదికను విద్యాశాఖకు సమర్పించాలి. అంటే జీవో జారీ చేసి 25 సంవత్సరాలవుతున్నా దీన్ని విద్యాశాఖ పట్టించుకోవడం లేదు. అధికారులు అడగడం లేదు కదాని యాజమాన్యాలు నివేదికలు సమర్పించడం లేదు. జిల్లాస్థాయిలో ఈ పని చేయాల్సిన డీఈవోలు యాజమాన్యాలతో కుమ్మక్కై నివేదికలు ఎందుకు ఇవ్వడం లేదని అడగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

జీవో 1 ప్రకారం ఆదాయాన్ని ఇలా ఖర్చు చేయాలి...	
బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు	50%
వారి ఇతర ప్రయోజనాలకు	15%
పాఠశాల అభివృద్ధికి	15%
నిర్వహణ ఖర్చులు	15%
యాజమాన్యం లాభం	5%

(గమనిక: 2017 డిసెంబరులో అప్పాల తిరుపతిరావు కమిటీ అభివృద్ధి పనులకు 15 శాతం, మిగిలిన 85 శాతం ఇతర వాటికి ఖర్చు చేసుకోవచ్చని సిఫారసు చేసింది)

ఆ నివేదికలతో ఇదీ ప్రయోజనం...

ఆడిట్ నివేదిక వల్ల ఒక ఏడాదిలో వచ్చిన ఆదాయం ఎంత? దేనికి ఎంత ఖర్చు చేశారన్నది తెలుస్తుంది. జీవో 1 ప్రకారం దేనికి ఎంత ఖర్చు చేయాలన్న నిబంధనలు ఉన్నందున వాటి ప్రకారం చేశారా? లేదా అన్నది తనిఖీ చేయవచ్చని విద్యాశాఖ అధికారి ఒకరు చెప్పారు. రుసుముల రూపంలో వచ్చిన ఆదాయంలో 50 శాతం ఆదాయాన్ని వేతనాలుగా ఇవ్వాలి. అంత ఇచ్చారా? ఒకవేళ ఇస్తే బ్యాంకు ఖాతాలు, డబ్బు బదిలీ లాంటివి తనిఖీ చేసి అవకతవకలు ఉంటే చర్యలు తీసుకోవచ్చు. లోతుగా వెళితే యాజమాన్యాలు చేసే అక్రమాలన్నీ బయటకు తీయవచ్చు. అసలు ఆడిట్ నివేదికలే అందకపోవడంతో ఇక వాటిపై ఆరా తీసేదెక్కడ అన్న ప్రశ్నను నిపుణులు కొందరు లేవనెత్తుతున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

ఈనాడు బిజినెస్ వారాంతం

నిన్న ముద్దు నేడు హద్దు రేపు వద్దు

- డీజిల్ కార్ల ప్రస్థానమిది
- 2020 ఏప్రిల్‌తో వీడ్కోలు పలికేందుకు మారుతీ నిర్ణయం
- ఇదే బాటలో ఇంకొన్ని కంపెనీలు!

గతం..

పెట్రోలు కారా? డీజిల్ కారా? అంటే ఎక్కువ మంది ఓటు డీజిల్ కారుకే. ధర తక్కువగా ఉంటుండటం, అధిక మైలేజీ ఇందుకు కారణాలు.

అమ్మకాల వాటాల్లోనూ కీలక పాత్ర పోషిస్తుండటంతో కార్ల కంపెనీలకు కూడా డీజిల్ కార్లే ముద్దు..

వర్తమానం..

కాలుష్యంపై పెరుగుతున్న ఆందోళన కావచ్చు.. ప్రభుత్వం, కోర్టుల జోక్యం కావచ్చు... డీజిల్ ఇంజిన్ల వినియోగంపై ఆంక్షలు పెరిగాయ్..

కొనుగోలుదార్ల సెంటిమెంటుపైనా ప్రభావం పడింది.. దాంతో కంపెనీలు డీజిల్ కార్ల తయారీకి 'హద్దు'లు విధించుకోవాల్సిన పరిస్థితి

భవిష్యత్..

2020 నాటికి బీఎస్-6 ప్రమాణాలు, కఠిన ఉద్గార నిబంధనలు అమల్లోకి వస్తుండటంతో పెరగనున్న డీజిల్ కార్ల తయారీ భారం..

పెట్రోలు కార్ల ధరతో పోలిస్తే గణనీయంగా తగ్గనున్న ధర వ్యత్యాసం.. అందుకే అప్పటి నుంచి డీజిల్ కార్ల తయారీ వద్దు అంటున్నాయ్ కార్ల కంపెనీలు.

అలా.. ముద్దు నుంచి వద్దు అనేవరకు సాగిన డీజిల్ కార్ల ప్రస్థానం 2020 మార్చి 31తో ముగియనుందా..??

దీని ప్రభావం కంపెనీల అదాయాలకే పరిమితమవుతుందా? కొనుగోలుదారు సెంటిమెంటుపైనా పడుతుందా?

ఈనాడు వాణిజ్య విభాగం

2020 మార్చి 31.. డీజిల్ కార్ల తయారీని నిలిపివేసేందుకు మారుతీ సుజుకీ నిర్దేశించుకున్న గడువు. ఆ మర్నాటి నుంచి వీటి జోలికి వెళ్లమని ఇప్పటికే స్పష్టం చేసింది. టాటా మోటార్స్ సహా మరికొన్ని కార్ల కంపెనీలు కూడా వీటిని అనుసరించే అవకాశం లేకపోలేదు. అంటే ఏప్రిల్ 1 నుంచి భారత్‌లో డీజిల్ కార్ల తయారీ గురించి పెద్దగా మాటలు వినిపించకపోవచ్చన్న మాట. ఇవి ఇంత కీలకమైన నిర్ణయాన్ని తీసుకుంటుండటానికి ప్రధాన కారణం.. 2020 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తున్న బీఎస్-6 నిబంధనలు. ఈ నిబంధనలకు అనుగుణంగా డీజిల్ ఇంజిన్ల తయారీ ఎంతో వ్యయంతో కూడుకున్నదని కంపెనీల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయం.

అంతేకాకుండా ప్రస్తుతం పెట్రోలు- డీజిల్ మోడళ్ల మధ్య ధరల వ్యత్యాసం సుమారు రూ.లక్ష వరకు ఉండగా.. బీఎస్-6 అమలు తర్వాత వీటి మధ్య ధరల తేడా సుమారు రూ.2.5 లక్షల వరకు చేరొచ్చని వాహన పరిశ్రమ అంచనా. అలాంటప్పుడు డీజిల్ ఇంజిన్లను తయారు చేయడం వల్ల పెద్ద ప్రయోజనం ఉండకపోవచ్చని భావిస్తున్నాయి. మారుతీ సుజుకీ ఇండియా ఛైర్మన్ ఆర్.సి.భార్గవ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. అయితే ఒకవేళ బీఎస్-6 డీజిల్ కార్లకు వినియోగదార్ల నుంచి గిరాకీ లభిస్తే 1500 సీసీ డీజిల్ ఇంజిన్ మోడళ్లను తయారు చేస్తామని, అంతకంటే తక్కువ సామర్థ్యమున్న ఇంజిన్ మోడళ్ల జోలికి వెళ్లబోమని ఆయన చెప్పడం డీజిల్ కార్ల ప్రేమికులకు కొంతలో కొంత ఊరట కలిగించే విషయం.

వదిలించుకోవాలా? వద్దా?

దేశీయంగా మారుతీ విక్రయించే మొత్తం కార్ల సంఖ్యలో డీజిల్ కార్ల వాటా దాదాపు 23 శాతం వాటా వరకు ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో 4.63 లక్షల డీజిల్ కార్లను కంపెనీ విక్రయించింది. మారుతీనే కాకుండా మిగతా కార్ల కంపెనీల అమ్మకాల్లోనూ డీజిల్ కార్లే కీలక పాత్ర పోషిస్తుంటాయి. మైలేజీ, ధరల పరంగా డీజిల్ కార్లే లాభదాయకం కావడంతో కొనుగోలుదార్లు కూడా వీటికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. దేశంలో వీటిని వినియోగించే వారి సంఖ్య కూడా బాగానే ఉంటుంది. మరి ఇప్పుడు డీజిల్ కార్ల తయారీని నిలిపివేస్తున్నట్లు మారుతీ, టాటాలు తీసుకున్న నిర్ణయం ఓ విధంగా వీళ్లకు ఆందోళన కలిగించే విషయమే. అంతేకాదు.. డీజిల్ కార్ల విడిభాగాల వ్యాపారాన్ని నిర్వహించే వాళ్లను కూడా ఇది కలవరపెట్టే అంశమే. భవిష్యత్ అంతా పెట్రోలు, సీఎన్‌జీ కార్లదే రాజ్యమైనప్పుడు వీటికి సంబంధించిన విడిభాగాలు విక్రయించేందుకే ఆయా సంస్థలు ప్రాధాన్యం ఇస్తాయి. అప్పుడు డీజిల్ కార్లకు విడిభాగాల కొరత ఉండే.. రిపేరింగ్ విషయంలో ఇబ్బందులు ఎదురుకావొచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. అందుకే ప్రస్తుతం తాము వినియోగిస్తున్న డీజిల్ కార్లను వదిలించుకోవాలా? కొనసాగించాలా? అనే సందిగ్ధ స్థితిలో కొందరు వినియోగదార్లు ఉన్నారు.

కాలుష్యంలో కనుమరుగు

డీజిల్ కార్లకు స్వస్తి పలికేందుకు నిర్ణయం తీసుకోవడానికి కాలుష్యం కూడా ఓ ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. దిల్లీలో కాలుష్యం విపరీతంగా పెరగడంపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకున్న సంగతి తెలిసిందే. డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేవరకు ఈ పరిస్థితి వెళ్లింది. ఒక్క దిల్లీలోనే కాదు మనదేశంలో కాలుష్య తీవ్రత అధికంగా ఉన్న పట్టణాలు చాలానే ఉన్నాయి. అందుకే డీజిల్ ఇంజిన్ల వినియోగంపై నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కఠిన ఉద్గార నిబంధనలను కూడా అమల్లోకి తీసుకొని రానుంది. పోక్స్‌వ్యాగన్ ఉద్గార నిబంధనల ఉల్లంఘన కేసు, భారీ జరిమానాల నేపథ్యంలో నిబంధనల పాటింపులో కంపెనీలు జాగ్రత్త వహిస్తున్నాయి. అందుకే కఠిన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా డీజిల్ ఇంజిన్లను తీసుకొని రావాంటే బాగా ఖర్చు పెట్టాల్సి వస్తుండటంతో వీటి తయారీని నిలిపివేయడమే మంచిదనే ఆలోచనలో కంపెనీలు ఉన్నాయి.

పర్యావరణహితానికే ప్రాధాన్యం..

డీజిల్ కార్లపై కఠిన ఉద్గార నిబంధనలను తీసుకొని రావడమే కాకుండా.. విద్యుత్ వాహనాల తయారీని ప్రోత్సహించేందుకు కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే కొన్ని విధానాలను తీసుకొని వచ్చింది. మరికొన్నింటిని కూడా తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. విద్యుత్, సీఎన్‌జీ వాహనాల తయారీకి అనువైన వాతావరణం కల్పించడం, సీఎన్‌జీ పంపుల ప్రారంభం లాంటివి ఇందులో కొన్ని. ఎలాగూ కంపెనీలు డీజిల్ వాహనాల తయారీని నిలిపివేసేందుకు నిర్ణయం తీసుకుంటుండటంతో కొనుగోలుదార్ల ధోరణిలో కూడా మార్పు రావచ్చు. భవిష్యత్ అంతా విద్యుత్, పెట్రోలు, సీఎన్‌జీ వాహనాలదే అనే అభిప్రాయానికి వచ్చేసే అవకాశం ఉంది. అప్పుడు ఈ తరహా వాహనాలకు డిమాండు క్రమక్రమంగా పెరుగుతుంది. మరోవైపు ప్రభుత్వం విద్యుత్ వాహనాల తయారీకి ప్రోత్సాహకాలు కల్పిస్తుండటంతో అందుబాటు ధరకే ఇవి లభిస్తాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

కొందరలా.. కొందరిలా..

జాతకాలు మారిన బిలియనీర్లు

ఒకే సమయంలో సంపద సృష్టి, సంపద నాశనం సాధ్యమేనా? భారత్‌లో సాధ్యమే. ఇప్పుడు అదే జరుగుతోంది. సంపదకు దారులు వెతుక్కుంటూ కొత్త తరం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విజయాల బాట పట్టి.. బలియనీర్ల అవతారం ఎత్తుతుండగా.. ఇప్పటికే కుబేరులుగా పేరుకెక్కిన వారు మాత్రం ఆ పేరును పోగొట్టుకుంటున్నారు. ఎక్కడ మొదలు పెట్టారో మళ్లీ అక్కడికే చేరుతున్నారు. అయితే కొత్త తరం రాక వల్ల భారత కుబేరుల సంఖ్య మాత్రం ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతుండడం ఊరట కలిగించే అంశం.

ఓడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలవుతాయి అన్నది ఎంత నిజమో మన భారత కుబేరులను చూస్తే అర్థమవుతుంది. అప్పులు తీసుకుని మరీ వ్యాపారాలను విస్తరించుకున్న పలువురు వ్యాపారవేత్తలు చివరకు ఎగవేతలకు పాల్పడ్డారు. ఇది విద్యుదుత్పత్తి రంగం నుంచి విమానయాన రంగం వరకూ కనిపించింది. గత కొన్నేళ్లుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటువంటి రుణస్వీకర్తలపై గట్టిగానే కొరడా ఝుళిపించింది. బ్యాంకులు సైతం ఎగవేతదార్ల ఆస్తులను జప్తు చేసింది. ఒక్కప్పుడు దేశంలో ఒక వెలుగు వెలిగిన వారే విదేశాలకు వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది.

పాతతరం బిలియనీర్లే ఇప్పటికీ భారత కుబేరుల జాబితాలో ప్రముఖంగా కనిపిస్తారు. 1990లో స్వేచ్ఛా విపణి కారణంగా వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. ఇక సాంకేతికత వంటి కొత్త రంగాలు రావడంతో కొత్త తరం బిలియనీర్లు రావడం మొదలైంది. ముఖ్యంగా 2013 నుంచి 2018 మధ్య వీరి సంఖ్య రెట్టింపై 119కి చేరిందని నైట్ ఫ్రాంక్ అనే సంస్థ తెలుపుతోంది. ఇక సంపన్నులు (అల్ట్రాహై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్) 2023 కల్లా 39% పెరిగి 2,697కు చేరుకుంటారన్న అంచనాలున్నాయి. గత కొన్నేళ్లుగా వ్యాపార వాతావరణం మెరుగవుతోందనే అంచనాలు ఉన్నాయి. వెంచర్ క్యాపిటల్, ప్రైవేటు ఈక్విటీ లభ్యత; అవకాశాలు పెరుగుతున్నాయని.. దీని వల్ల వచ్చే కొద్ది సంవత్సరాల్లో మరిన్ని అంకురాలు కనిపిస్తాయని చెబుతున్నారు.

వీరు పోగొట్టుకున్నారు..

- ✦ ఆసియాలోనే అత్యంత సంపన్నుడైన ముకేశ్ సోదరుడు అనిల్ అంబానీ తను అన్నతో విడిపోయిన సమయానికి, ఇప్పటికి బాగా కిందకు వచ్చారు. ధీరూభాయ్ అంబానీ మరణంతో 2005లో సోదరులు ఆస్తులు పంచుకున్నారు. అప్పుడు ఇద్దరు సోదరులూ ఫోర్బ్స్ జాబితాలో పక్కపక్కనే ఉండేవారు. దశాబ్దం గడిచింది. పరిస్థితి మారింది. ఆర్‌కామ్ దివాలా దిశగా వెళ్లింది. కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. పలు కేసులు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2008లో 3100 కోట్ల డాలర్లుగా ఉన్న అనిల్ సంపద కాస్తా ఇప్పుడు 12 కోట్ల డాలర్లకు చేరుకున్నట్లు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ల సూచీ చెబుతోంది.
- ✦ 1969లో తొలితరం పారిశ్రామికవేత్తలుగా శశి, రవి రూయాలు ఎస్సార్ గ్రూప్‌ను ప్రారంభించారు. నిర్మాణ కంపెనీగా ప్రారంభమైనా.. ఆ తర్వాత కొత్త వ్యాపారాల్లోకి అడుగులు వేశారు. 2008-12 మధ్య 18 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టారు. గ్రూప్ తీసుకున్న అదనపు అప్పుల వల్ల, అధ్వాన విధాన నిర్ణయాల వల్ల వారి ఆస్తులు కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. 2015లో రుయా సోదరుల సంపద 4 బిలియన్ డాలర్లకు తగ్గింది. ఆ తర్వాత బిలియనీర్ల టాగ్‌నూ కూడా కోల్పోయారు.
- ✦ జర్మనీకి చెందిన ఆర్‌పవర్ సిస్టమ్స్‌ను 2007లో 2 బిలియన్ డాలర్లతో తులసి తంతికి చెందిన సుజ్లాన్ ఎనర్జీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత పరిస్థితులు మారాయి. ఒకప్పుడు ప్రపంచంలోనే అగ్రగామి టర్బైన్ తయారీదారుగా ఉన్న ఈ సంస్థ అప్పులు కూడా భారీగా పెరిగాయి. 2012లో తొలిసారి రుణ ఎగవేతదారుగా నిలవాల్సి వచ్చింది. ఏడేళ్ల తర్వాత ఇప్పుడు కంపెనీ ఆర్థిక పరిస్థితికి మరమ్మతులు చేసుకుంటూనే ఉన్నారు.

2007లో 5.7 బి. డాలర్ల సంపద ఉన్నప్పటికీ.. ఇప్పుడు బిలియనీర్ అన్న పేరు కూడా లేకుండా పోయింది.

- ✦ విజయ్ మాల్యా కథ అందరికీ తెలిసిందే. తన తండ్రి ద్వారా వచ్చిన లిక్కర్ సామ్రాజ్యాన్ని మరింత విస్తరించడం కోసం కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేశారు. అదే కొంప ముంచింది. ఏర్పాటు చేసిన ఏడేళ్లలో కార్యకలాపాలు నిలిపివేయాల్సి వచ్చింది. బ్యాంకుల కేసులు తప్పించుకోవడం కోసం లండన్‌కు పారిపోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు లండన్ నుంచి ఆయన్ని తిరిగి రప్పించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

వీరు వెలుగుతున్నారు..

- ✦ ఫ్లిప్‌కార్ట్‌ను ఏర్పాటు చేసినపుడు బిన్నీ బన్సల్, సచిన్ బన్సల్‌లు కూడా అంత విజయాన్ని సాధిస్తామని అనుకుని ఉండరు. దశాబ్ద కాలంలోనే అది భారత అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్ స్థాయికి చేరుకుంది. గతేడాది వాల్‌మార్ట్‌కు ఈ కంపెనీని విక్రయించి వీరిరువురూ బిలియనీర్లయ్యారు.
- ✦ 2000 సంవత్సరంలో ఒన్97 కమ్యూనికేషన్స్‌ను స్థాపించారు విజయ్ శేఖర్ శర్మ. అప్పట్లో కోటి మంది కూడా ఆన్‌లైన్‌లో ఉండేవారు కాదు. అయితే పెద్ద నోట్ల రద్దు సమయానికి కానీ పేటీఎమ్ అనే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సామర్థ్యం తెలియరాలేదు. ఆగస్టు 2018 నాటికి ఒన్97 విలువ 10 బి. డాలర్ల కంటే ఎక్కువకు చేరడం విశేషం. ప్రస్తుతం శర్మకు సంస్థలో 15 శాతం వరకూ వాటా ఉంది.
- ✦ బైజు రవీంద్రన్ 2015లో బైజూస్ కే-12 ఎడ్యుకేషన్ యాప్‌ను ప్రారంభించారు. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సీఈఓ అయిన బైజూ తీసుకొచ్చిన ఈ యాప్‌కు ఇప్పుడు 1700 నగరాల్లో 3 కోట్ల మంది వినియోగదార్లున్నారు. కంపెనీ విలువ 3.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రవీంద్రన్, ఆయన భార్య సోదరులకు కలిసి కంపెనీలో 36% వాటా ఉంది.

ఏటా 6-8 కొత్త ఔషధాలు

నాట్కో ఫార్మా లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: నాట్కో ఫార్మా ఇకపై ఏటా 6 నుంచి 8 కొత్త ఔషధాలు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీ గత కొన్నేళ్లుగా కేన్సర్ విభాగంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న విషయం విదితమే. ఎప్పటికప్పుడు కొత్త ఔషధాలను అందించటానికి కసరత్తు చేస్తూ అందుకు అనుగుణంగా అనుమతులు సంపాదిస్తోంది. ఈ నేపథ్యంలో ఇకపై కొత్త ఔషధాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో నాట్కో ఫార్మా 6 కొత్త ఔషధాలను విడుదల చేసింది. దీన్ని కొనసాగిస్తూ ముందుకు సాగాలని నిర్ణయం తీసుకుంది. దేశీయ మార్కెట్లో హెపటైటిస్-సి విభాగంలో అగ్రస్థానంలో ఉన్నట్లు, త్రాంబోసిస్ సిండ్రోమ్ తో బాధపడే రోగుల కోసం ఉద్దేశించిన అర్గట్రోబన్ ఇంజెక్షన్, డాబిగట్రాన్ ఔషధాన్ని విడుదల చేసినట్లు పేర్కొంది. కేన్సర్ విభాగంలో రూ.10 కోట్లకు పైగా అమ్మకాలు నమోదు చేసే 10 బ్రాండ్లు తమకు ఉన్నట్లు వెల్లడించింది.

యూఎస్ అనుమతులు...

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు జనరిక్ ఔషధ సంస్థలతో నాట్కో ఫార్మాకు భాగస్వామ్యాలు ఉన్నాయి. అదేవిధంగా యూఎస్‌లోని కొన్ని కంపెనీలతో మార్కెటింగ్ ఒప్పందాలు కూడా కుదుర్చుకుంది. ఈ సంస్థలతో అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ) వద్ద మార్కెటింగ్ అనుమతులు (ఏఎన్‌డీఏ) సంపాదించే అవకాశం కలుగుతోంది. ఇప్పటికే ఈ పద్ధతిలో కొన్ని ఔషధాలకు మార్కెటింగ్ అనుమతులు సంపాదించిన విషయం విదితమే. యూఎస్‌లో నాట్కో ఫార్మాకు చెందిన 36 ఔషధాలకు మార్కెటింగ్ అనుమతులు లభించాయి. ఇందులో పారా-4 హోదా కల ఔషధాలు 20 ఉన్నాయి. యూఎస్‌లో ఏదైనా ఒక ఔషధానికి పేటెంట్ గడువు తీరిపోయిన తర్వాత ఆరు నెలల పాటు ఒక జనరిక్ ఔషధానికే అనుమతి ఇచ్చే పద్ధతిని పారా- 4 అనుమతి అని వ్యవహరిస్తారు. ఇవేకాకుండా 45 ఔషధాలకు యూఎస్ డీఎంఎఫ్ (డ్రగ్ మాస్టర్ ఫైల్) దాఖలు చేసింది. ఇటీవలి కాలంలో ఈ కంపెనీ యూఎస్ వెలుపలి మార్కెట్లపై దృష్టి సారించింది. ప్రధానంగా కెనడా, బ్రెజిల్, ఆఫ్రికా మార్కెట్లలో విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కెనడాలో పలు కేన్సర్ ఔషధాలకు అనుమతి కోసం దరఖాస్తు చేసింది. ఇప్పటికే 16 ఔషధాలకు అనుమతి వచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. బ్రెజిల్‌లో లెట్రోజోల్, ఎమెరోలిమస్ ఔషధాలకు అనుమతి సంపాదించినట్లు, మరికొన్ని ఔషధ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంది.

పరిశోధనలకు అధికంగా నిధులు

కొత్త ఔషధాల ఆవిష్కరణకు అనుగుణంగా పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలకు నాట్కో ఫార్మా ఏటేటా నిధుల కేటాయింపు పెంచుతోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలకు టర్నోవర్‌లో 6.2 శాతం నిధులు కేటాయించగా, ఆ మరుసటి ఏడాదిలో ఇది 7.8 శాతానికి పెరిగింది. 2018-19లో ఈ కేటాయింపులు 9.3 శాతానికి పెరగడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.197.5 కోట్లు పరిశోధన కార్యకలాపాలకు ఖర్చు చేసింది. పరిశోధనా విభాగంలో 400 మందికి పైగా శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారని కంపెనీ వెల్లడించింది.

అధిక వృద్ధి ఆ అయిదేళ్లలోనే

2014-18పై నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ రాజీవ్ కుమార్

దిల్లీ: గత ఐదేళ్లలో నమోదైన వృద్ధి భారత్ అంతకుముందెన్నడూ సాధించి ఉండకపోవచ్చని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ చెప్పారు. ఓ ఐదేళ్ల కాలంలో భారత్ 6.5 శాతం నుంచి 7 శాతం వృద్ధిని నమోదుచేసిందంటే బహుశా ఇప్పటివరకు అది 2014- 2018 సమయంలోనే అని అన్నారు. ఓ వైపు స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూనే.. ఈ స్థాయిలో వృద్ధి నమోదుకావడం గతంలో జరిగి ఉండకపోవచ్చని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఓ సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. 'ద్రవ్యోల్బణం 4 శాతం లోపు నియంత్రిత స్థాయిలోనే ఉంది. కరెంటు బాతాలోటు 2.5%, ద్రవ్యలోటు 3.5 శాతంగా ఉన్నాయి. స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూనే 7 శాతం వృద్ధి రేటును సాధించామనే విషయాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని కుమార్ తెలిపారు. 'పెరుగుతున్న జనాభా అవసరాలను, కోరికలను తీర్చాలంటే వరుసగా మూడు దశాబ్దాల పాటు సగటున 8 శాతం స్థిరమైన వృద్ధిని భారత్ సాధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'ప్రైవేట్ పెట్టుబడులు గత 6-7 ఏళ్లుగా తగ్గుతూ వస్తున్నాయి. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వీటిని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలో ప్రైవేట్ రంగానికి వ్యాపారానుకూల పరిస్థితులను సృష్టించేందుకు ఏమైతే మార్గాలు ఉన్నాయో వాటిపై దృష్టిసారించడం కొనసాగిస్తామని తెలిపారు.

కోడి గుడ్లు

8వ ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	348
చిల్లరగా (ఒక్కటి)	4.05	విశాఖపట్నం	360
బెంగళూరు	375	చెన్నై	405
9వ తేదీకి విజయవాడ/గేదెపల్లి	338	చిత్తూరు	398
		నమక్కల్	395

చెత్త సేకరణ ఓ సువర్ణావకాశం

రోషన్ మిరందా

ఈనాడు - హైదరాబాద్

చెత్త.. ఎక్కడ చూసినా.. కనిపిస్తూనే ఉంటుంది. దీనిలో అధిక భాగాన్ని పునర్వినియోగంలోకి (రీసైక్లింగ్) తీసుకు రావచ్చు.. తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మరి.. ఈ చెత్తను సేకరించి, దాన్ని తిరిగి వినియోగంలోకి తేవడం పెద్ద ప్రక్రియే. అందులోనే వ్యాపార అవకాశాలను గుర్తించిన అంకురమే వేస్ట్ వెంచర్స్ సామాజిక కోణంతో.. వ్యాపారం చేయాలనే ఆలోచన నుంచే ఈ సంస్థను నెలకొల్పామని చెబుతున్నారు సహ వ్యవస్థాపకుడు రోషన్ మిరందా. అమెరికాలో ఉన్నప్పుడు. . వచ్చిన ఆలోచనతో ఇక్కడికి వచ్చి, మరో ఇద్దరు మిత్రుల సహాయంతో ఈ అంకురాన్ని ప్రారంభించిన ఆయన తన సంస్థ గురించి చెబుతున్న వివరాలు..

అంకురం

వేస్ట్ వెంచర్స్

భారత్‌లో ఎక్కడ చూసినా చెత్తే అని అంటుంటారు కానీ.. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలోనే చెత్త నిర్వహణ, దాన్ని పునర్వినియోగంలోకి తేవడం అధికం. ఇక్కడ మనకు చెత్త సేకరించే వారు ఎక్కువ. కాబట్టి, వీధుల్లో ఖాళీ వాటర్ బాటిళ్లు, ఇతర కొన్ని పునర్వినియోగంలోకి వచ్చే వస్తువులు చాలా తక్కువగా కనిపిస్తుంటాయి. దీన్నే మేము గుర్తించాం. 2015లో మేము సంస్థను ప్రారంభించినపుడు ముఖ్యంగా టెట్రా ప్యాక్‌లను సేకరించేందుకు ప్రయత్నించాం. వీటిని ఎక్కువగా రీసైక్లింగ్‌కు పంపించాం. మాకన్నా ముందు వీటిని సేకరించిన వారు ఎవరూ లేరు. మేము తొలిసారిగా ఇలా ఖాళీ టెట్రా ప్యాక్‌లను కొంటాం అంటే. . ఎవరూ ముందుకు రాలేదు. రెండు నెలల తర్వాత 4 కిలోల టెట్రా ప్యాక్‌లతో ఒక వ్యక్తి ముందుకు వచ్చాడు. అక్కడి నుంచి ఇప్పుడు నెలకు దాదాపు 1.3 టన్నుల టెట్రా ప్యాక్‌లను మాకు చెత్త సేకరించేవారి నుంచి వస్తోంది. ఇదంతా ఒకరి నుంచి ఒకరికి నోటి మాట ద్వారా జరిగిన ప్రచారమే. సేకరించిన చెత్తను బట్టి వారికి కిలోకి రూ.5 నుంచి రూ.20 వరకూ చెల్లిస్తుంటాం. మా వద్దకు వచ్చిన ఈ చెత్తను విభాగాలుగా వేరు చేసేందుకు హైదరాబాద్‌లో మూడు పోట్ల గోదాములు ఉన్నాయి. ఇక్కడంతా యాంత్రికంగా ఆ చెత్త వేరు పడుతుంది.

రూ.2 కోట్లతో...

మా సంస్థను ప్రారంభించేందుకు వివిధ మార్గాల నుంచి రూ.2 కోట్ల వరకూ సేకరించాం. ప్రస్తుతం హైదరాబాద్‌లో మా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాదిలో మరో రెండు మూడు నగరాలకు విస్తరించాలని ఆలోచిస్తున్నాం. ఇప్పటికే బెంగళూరులో కొంత మేరకు పనిచేస్తున్నాం. ఈ నగరంతోపాటు, చెన్నై, ముంబయిలో పూర్తిస్థాయిలో ప్రవేశించేందుకు ప్రణాళికలు ఉన్నాయి. దీనికోసం కొత్తగా రూ.7 కోట్లను సమీకరించాలనే లక్ష్యంతో ఉన్నాం. అక్కడ గోదాములు, ఇతర ఏర్పాట్లను చేయడానికి ఈ డబ్బు అవసరం అవుతుంది. ప్రస్తుతం మేము ఏడాదికి రూ.5 కోట్ల వరకూ టర్నోవర్‌ను సాధించాం. విస్తరణ పూర్తయితే ఇది మరింత పెరుగుతుంది. మాకు ఆదాయం రెండు విధాలుగా వస్తుంది.. రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను దేశవ్యాప్తంగా ఉన్న రీసైక్లింగ్ యూనిట్లకు పంపిస్తాం. చిప్స్ పాకెట్లు, చాక్లెట్ రేపర్లవంటివి ఆయా బ్రాండ్లకే పంపిస్తుంటాం. (ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా సంస్థలు ప్యాకింగ్‌కు వాడిన ప్యాకింగ్‌లో తప్పనిసరిగా కొంత శాతం సేకరించాలి). ముఖ్యంగా టెట్రా ప్యాక్‌లవంటి వాటి పైనే ఎక్కువగా దృష్టి పెట్టాం.

1,500మందికి పైగా...

మా వ్యాపారం ప్రధానంగా చెత్త సేకరించే వారితోనే జరుగుతుంది. ప్రస్తుతం మాకు అనుబంధంగా 1,500 మందికి పైగా చెత్త సేకరించేవారు ఉన్నారు. వీరితోపాటు 27 కార్పొరేట్లు, 31 హౌసింగ్ సొసైటీలు, 13 పాఠశాలలతో మేము ఒప్పందం కుదుర్చుకొని, వారి నుంచి పొడి, తడి చెత్తను సేకరిస్తున్నాం. పొడి చెత్తకు మేమే కిలోల లెక్కన చెల్లిస్తాం. తడి చెత్త సేకరించినందుకుగాను వారి నుంచి కొంత వసూలు చేస్తాం. చెత్త సేకరించేందుకు 12 వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం మా వద్ద 70 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 17 మంది వరకూ గతంలో చెత్త సేకరించిన వారు కూడా ఉన్నారు.

నెలకు 180 టన్నుల వరకూ..

ప్రస్తుతం మా సంస్థ ద్వారా 180 టన్నుల వరకూ చెత్తను సేకరించి, దానిని రీసైక్లింగ్‌కు పంపిస్తున్నాం. ఇందులో 60-70 టన్నుల వరకూ తక్కువ బరువు ఉండే చిప్స్ పాకెట్లు, చాక్లెట్ రేపర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులవంటివే ఉంటున్నాయి. 40-60 టన్నుల వరకూ తడి చెత్తను సేకరిస్తున్నాం. తడి చెత్త నుంచి కంపోస్ట్ ఎరువును తయారు చేసి, ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న వారికి విక్రయిస్తున్నాం.

జే & కే బ్యాంక్ ఛైర్మన్ పర్వేజ్ అహ్మద్‌కు ఉద్వాసన

దిల్లీ: జే అండ్ కే బ్యాంక్ సీఎండీ పర్వేజ్ అహ్మద్‌కు జమ్ము-కాశ్మీర్ ప్రభుత్వం ఉద్వాసన పలికింది. తాత్కాలిక ఛైర్మన్‌గా ఆర్.కె.చిబ్బర్‌ను నియమించింది. నియామకాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలపై బ్యాంకు కార్పొరేట్ కార్యాలయంలో సీబీఐ తనిఖీలను కూడా నిర్వహించింది. 'బ్యాంకుకు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్న పర్వేజ్ అహ్మద్‌ను బోర్డు నుంచి తొలగించాం. ఇక నుంచి ఛైర్మన్, ఎండీగా ఆయన కొనసాగరని ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి విశాల్ శర్మ జారీ చేసిన అధికారిక ప్రకటన వెల్లడించింది. పర్వేజ్ స్థానంలో ఆర్.కె.చిబ్బర్‌కు డైరెక్టర్ల బోర్డులో ఛైర్మన్, డైరెక్టరుగా తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపింది. ఈ మార్పు చేర్పులు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది.

మలి జీవితంలో ఫిక్స్‌డ్ తోడు..

ఉద్యోగంలో ఉన్నన్ని రోజులు క్రమం తప్పని ఆదాయం ఉంటుంది. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఆ ఆదాయం ఆగిపోకుండా ఉండాలంటే.. దానికోసం పదవీ విరమణ నాటికి ఒక పెద్ద నిధిని జమ చేయాలి. ఆ మొత్తంపై వచ్చిన ఆదాయంతోనే మలి జీవితాన్ని ప్రశాంతంగా గడిపేలా ఏర్పాటు ఉండాలి. చాలామంది ఈ విషయంలో ముందునుంచీ జాగ్రత్తగా ఉండరు. తీరా పదవీ విరమణ చేసే రోజులు దగ్గరకొచ్చే సరికి ఆందోళన పడుతుంటారు. క్రమంగా కొంత మొత్తం జమచేస్తూ.. సంపదను సృష్టించేందుకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నా.. ఫిక్స్‌డ్ డిపాజిట్లు వీటికి కొంచెం భిన్నం. మలి మీ కష్టార్జితాన్ని దీర్ఘకాలం పాటు ఫిక్స్ చేసినప్పుడు ఏం జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందామా!

మ్యూచువల్ ఫండ్లు.. ఈక్విటీలు.. ఇతర అనేకానేక పెట్టుబడి పథకాలు.. అందుబాటులో ఉన్నప్పటికీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) స్థానం దానికి ప్రత్యేకంగానే ఉంది. నిజంగా ఒక వ్యక్తి పెట్టుబడుల జాబితాలో ఎఫ్‌డీలు లేకపోతే అది అసంపూర్తిగా ఉన్నట్టే లెక్క. ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదును వెనక్కి తీసుకోవడం, పారదర్శకంగా ఉండటం, ఏ వ్యవధికైనా ఎంచుకోవడం ఇందులో ఉండే ప్రధాన అంశాలైతే.. మార్కెట్ పరిస్థితులతో నిమిత్తం లేకుండా కచ్చితమైన రాబడిని అందించడం వీటి ప్రధాన ఆకర్షణ. వీటిని ఎంచుకున్నప్పుడు పెట్టుబడికి రక్షణ, వడ్డీకి హామీ ఉండటం వల్ల దీర్ఘకాలంలో ఎలాంటి నష్టం లేకుండానే మంచి నిధిని సమకూర్చుకోవచ్చు. కాస్త జాగ్రత్తగా ప్రణాళిక వేసుకొని, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేస్తే.. పదవీ విరమణ అనంతర జీవితానికి ఇది కచ్చితమైన భరోసానిస్తాయి.

వడ్డీ చెల్లింపు ఎలా?

వడ్డీ చెల్లింపు ఎలా చేస్తున్నారు అనేదాన్ని బట్టి, ఫిక్స్‌డ్ డిపాజిట్లను రెండు రకాలుగా వర్గీకరిస్తారు. ఇందులో క్యుములేటివ్, నాన్ క్యుములేటివ్ రకాలుంటాయి. క్యుములేటివ్‌ను ఎంచుకున్నప్పుడు.. ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ లెక్కించి, దాన్ని అసలులో కలుపుతారు. వ్యవధి తీరాక మొత్తం డబ్బును చెల్లిస్తారు. ఇది చక్రవడ్డీ విధానంలో పనిచేస్తుందన్నమాట. నాన్ క్యుములేటివ్ ఎఫ్‌డీల్లో మదుపు చేసినప్పుడు.. నెలకు, మూడు నెలలకు, ఆరు నెలలకోసారి వడ్డీని చెల్లిస్తారు. సంపదను సృష్టించాలంటే.. క్యుములేటివ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకోవడమే మంచిది. వడ్డీ మొత్తం అసలుకు కలవడం వల్ల దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున సొమ్ము జమ అవుతుంది. పదవీ విరమణ కోసం మదుపు చేయాలన్న ఆలోచనతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎంచుకునే వారికి ఈ ఐచ్ఛికం ఎంతో అనుకూలం.

వ్యవధులను మార్చండి..

జీవితంలో అనేక దశలు ఉంటాయి. ఒక్కో సమయంలో అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎఫ్‌డీల వ్యవధిని ఎంచుకునేందుకు ప్రయత్నించాలి. అప్పుడు ఎలాంటి ఇబ్బందీ లేకుండా డిపాజిట్ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. గడువు తీరిన తర్వాత ఎంత మొత్తం వస్తుందనేది సులువుగా లెక్కేసుకోవచ్చు. కాబట్టి, ఆ లెక్కల ఆధారంగా మన లక్ష్యం ఎంత దూరంలో ఉంది, దానికోసం ఇప్పుడు ఎంత పెట్టుబడి పెట్టాలి అనేది తెలుసుకోవచ్చు. దాన్ని బట్టి పెట్టుబడిని నిర్ణయించుకోవచ్చు.

వెనక్కి తీసుకుంటున్నారా?

భారతీయులు సహజంగానే పొదుపరులు. వారి పొదుపు అలవాటుకు సరిగ్గా సరిపోయే పథకాలుగా ఎఫ్‌డీలను చెప్పొచ్చు. కాలానుగుణంగా ఎన్నో పరీక్షలకు ఎదురొడ్డి నిలిచిన పథకాల్లో ఇవి ముందు వరుసలో ఉంటాయి. వీటిలో మదుపు చేసిన తర్వాత వెనక్కి తీసుకునేప్పుడు కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యవధి పూర్తికాకముందే పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే.. రుసుములు వర్తిస్తాయి. దీనివల్ల మనం ఆర్జించినదానికన్నా తక్కువే చేతికి వస్తుంది. ఆనుకోని పరిస్థితుల్లో తప్పనిసరిగా డిపాజిట్‌ను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడితే.. డిపాజిట్‌ను రద్దు చేసుకోకుండా.. దానిపై రుణం తీసుకునే అవకాశాన్ని పరిశీలించండి. దీనివల్ల మీ అవసరానికి డబ్బు అందుతుంది. అదే సమయంలో ఎఫ్‌డీ కూడా రద్దు కాకుండా చూసుకోవచ్చు. సాధారణ వ్యక్తులతో పోలిస్తే సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేటు కాస్త అధిక వడ్డీ రేటు వస్తుంది.

ఆన్‌లైన్ బాటలో..

ఎఫ్‌డీ చేసేందుకు బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల శాఖలను నేరుగా సంప్రదించవచ్చు. కానీ, దీనికన్నా ఆన్‌లైన్ మార్గంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేందుకు ప్రయత్నించవచ్చు. దీనివల్ల ఖాతాలో ఉన్న డబ్బును వెంటనే ఎఫ్‌డీగా మార్చేయొచ్చు. పైగా అనేక పత్రాల్లో సంతకాలు చేయడంలాంటి లాంఛనాలూ ఉండవు.

- సచిన్ సిక్కా, సీఈఓ- రిటైల్, కార్పొరేట్ లయబిలిటీస్, బజాజ్ ఫైనాన్స్

సరైన చోటును ఎంచుకోండి..

అన్ని రకాల బ్యాంకులూ, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలూ ఫిక్స్‌డ్ డిపాజిట్లను వివిధ వ్యవధులకు అందిస్తున్నాయి. అయితే, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేప్పుడు ఆయా సంస్థల పనితీరును బేరీజు వేసుకోవాలి. ముఖ్యంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను (ఎన్‌బీఎఫ్‌సీ) ఎంచుకునేప్పుడు వాటికి ఇక్రా, క్రిసిల్ వంటి సంస్థలు ఇచ్చే క్రెడిట్ రేటింగులను పరిశీలించాలి. ఒక సంస్థకు చెల్లింపుల సామర్థ్యం ఎంత ఉంది అనేది ఈ రేటింగ్ ఏజెన్సీలు చెబుతుంటాయి. సురక్షితంగా ఉంటూ.. మంచి రాబడిని ఇచ్చే సంస్థలను ఎంచుకోవడం ఎప్పుడూ అవసరం.

పన్ను భారం చూసుకోండి..

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి పన్ను వర్తిస్తుంది. వ్యక్తుల మొత్తం ఆదాయంలో ఈ వడ్డీ రాబడిని కలిపి చూపించాలి. అందువల్ల ఈ వడ్డీపై 0% - 30% వరకూ పన్ను వర్తించే అవకాశం ఉంది. వచ్చిన వడ్డీలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు వడ్డీ ఆదాయం రూ.10,000 దాటితే.. 10శాతాన్ని మూలం వద్ద పన్ను కోత విధిస్తాయి. ఒకవేళ పాన్ వివరాలు తెలియజేయకపోతే ఇది 20శాతం వరకూ ఉంటుంది. ఆదాయం తక్కువగా ఉన్నవారు ఫారం-15జి, ఫారం 15హెచ్ ఇవ్వడం ద్వారా మూలం వద్ద పన్ను పడకుండా చూసుకోవచ్చు.

ఒక నిర్ణీత సమయంలో ఒక కచ్చితమైన నిధిని జమ చేసేందుకు ఎఫ్‌డీలు ఎంతో ఉపయోగపడతాయి. దీర్ఘకాలంపాటు పొదుపు చేసిన పెద్ద మొత్తంతో సరైన పెట్టుబడి పథకాన్ని ఎంచుకొని, మలి జీవితాన్ని ఆనందంగా మలచుకోవచ్చు.

క్యాన్సర్ కోసం ప్రత్యేక పాలసీ..

జీవనశైలి జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్, గుండె జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య అధికమవుతోంది. ఇలాంటి వ్యాధులు వచ్చినప్పుడు చికిత్స కోసం అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో పరిహారం ఇచ్చేం

కొత్త పథకం

దుకు ఎడిల్‌వైజ్ టోకియో లైఫ్ ప్రత్యేక పాలసీని తీసుకొచ్చింది. దీని పేరు హెల్త్ షీల్డ్ ప్లస్. అన్ని రకాల క్యాన్సర్లతోపాటు, 17 రకాల గుండె జబ్బులకు ఈ పాలసీ పరిధిలోకి వస్తాయి. ఇందులో మూడు రకాల ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. టర్మ్ ట్రిగ్గర్‌ను ఎంచుకున్నప్పుడు.. ఒకేసారి పాలసీ మొత్తం చెల్లించడంతోపాటు, పాలసీ కొనసాగుతుంది. వ్యవధి ముగిసేంత వరకూ ఎలాంటి క్లెయిమ్ లేకపోతే.. ప్రీమియం వెనక్కి వచ్చేలా ఎంచుకోవచ్చు. ప్రీమియం వైవర్ ఆప్షన్ మరోటి. కనీస పాలసీ మొత్తం రూ.5లక్షలు. గరిష్ఠంగా రూ.50లక్షల వరకూ పాలసీని ఎంచుకోవచ్చు. 0-65 ఏళ్ల వయసులోపు వారెవరైనా ఈ పాలసీని ఎంచుకునేందుకు వీలుంది. 80 ఏళ్లు వచ్చే వరకూ పునరుద్ధరించుకోవచ్చు.

బహుళజాతి కంపెనీల్లో..

ప్రపంచ వ్యాప్తంగా సేవలనందించే బహుళ జాతి కంపెనీ షేర్లలో మదుపు చేసే వ్యూహంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ కొత్త ఎంఎన్‌సీ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఇది ఈక్విటీ సెక్యూరియల్ విభాగానికి చెందిన ఓపెన్ ఎండెడ్ ఫండ్. కనీస పెట్టుబడి రూ.5,000. ఏడాది లోపు మదుపు మొత్తాన్ని వెనక్కి తీసుకుంటే 1శాతం అమ్మకపు రుసుము వర్తిస్తుంది. ఎన్ఎఫ్ఓ జూన్ 11 వరకూ అందుబాటులో ఉంది.

పెట్టుబడికి రక్షణ...

❑ పెట్టుబడికి కాస్త తక్కువ నష్టభయం ఉండాలని కోరుకునే వారికోసం ఎస్‌బీఐ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఓరియంటెడ్ ఫండ్- సిరీస్ ఏ (ప్లాన్ 4) అందుబాటులోకి వచ్చింది. ఇది క్లోజ్ ఎండెడ్ ఫండ్. ఇందులో కనీస పెట్టుబడి రూ.5,000. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ జూన్ 18.

నా వయసు 28 ఏళ్లు. నాకు, మా అమ్మకు కలిపి ఏడాదికి రూ.10లక్షల వరకూ ఆదాయం వస్తుంది. ఏడాది వయసున్న పాప ఉంది. రూ.50లక్షల గృహ రుణం తీసుకొని ఇల్లు కట్టుకోవాలి అనుకుంటున్నాను. గృహ రుణ వ్యవధి 20 ఏళ్లకు బదులు 30 ఏళ్లు పెట్టుకుంటే.. రూ.50 లక్షల రుణం వస్తుంది అని బ్యాంకు చెబుతోంది. అంత దీర్ఘకాలం రుణ వాయిదాలు చెల్లించడం ఇష్టం లేదు. పాప చదువు, పెళ్లి కోసం ఎలా పొదుపు చేస్తే మంచిది? - వెంకట్

గృహరుణం ఎంత కావాలని ముందు మీరు నిర్ణయించుకోండి. 9.5శాతం వడ్డీతో రూ.50లక్షల గృహరుణం తీసుకొని, 20 ఏళ్ల వ్యవధిని ఎంచుకుంటే.. నెలకు రూ.46,607 చెల్లించాలి. అదే.. 30 ఏళ్ల వ్యవధి అయితే.. నెలసరి వాయిదా రూ.42,043 అవుతుంది. 20 ఏళ్లకు బదులు 30 ఏళ్లను ఎంచుకోవడం వల్ల మీకు అవసరమైనంత రుణం లభించడమే కాకుండా.. నెలకు చెల్లించే వాయిదా రూ.4,554 తగ్గుతుంది. ఇలా నెలకు మిగిలే రూ.4,554లను మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయండి. ఈ పథకాల్లో మదుపు చేయడం ద్వారా సిప్‌లో సగటున 13శాతం రాబడి వచ్చినా.. 20 ఏళ్లలో రూ.47,35,000 చేతికి అందే అవకాశం ఉంటుంది. 30 ఏళ్ల వ్యవధి పెట్టుకున్న మీ ఇంటి రుణంలో 20 ఏళ్ల తర్వాత చెల్లించాల్సిన మొత్తం రూ.32,49,112 ఉంటుంది. అప్పటికి మీ ఫండ్లలో పెట్టుబడి రూ.47,35,000 నుంచి ఇంటి రుణం రూ.32,49,112 చెల్లించగా మీ వద్ద సుమారు రూ.15 లక్షల వరకూ ఉంటాయి. 20 ఏళ్ల తర్వాత కూడా ఇంటి రుణం కొనసాగించాలి అంటే.. మీ ఫండ్లలో జమైన నిధిని మీ పాప చదువుకు ఉపయోగించుకోవచ్చు. మీ దంపతులిద్దరి పేరుతో ఇంటి రుణం తీసుకొని, ఇల్లు కొనుగోలు చేస్తే.. ఇద్దరికీ ఆదాయపు పన్ను మినహాయింపు కూడా లభిస్తుంది.

నా డబ్బు తిరిగి వస్తుందా?

నాకు డెబిట్ కార్డు నుంచి నాకు తెలియకుండానే రూ.20వేలు డెబిట్ అయ్యాయి. నేను ఆ విషయాన్ని వారం తర్వాత గమనించాను. ఇప్పుడు నేను ఏం చేయాలి? - శ్రీనివాస్

డెబిట్ కార్డు, ఆన్‌లైన్ మోసాలు జరిగిన సందర్భంలో 15 రోజుల్లోపు బ్యాంకుకు ఫిర్యాదు చేయాలి. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం మొత్తం రూ.1,00,000 దాటితే ఎఫ్ఐఆర్ కూడా అవసరం. కార్డు దురుపయోగం అయినట్లు తెలియగానే బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించి, కార్డును నిలిపివేయాలి. ఫోన్‌లో వచ్చిన సంక్షిప్త సందేశం వివరాలు భద్రపరిచి, బ్యాంకుకు సమర్పించండి. దుర్వినియోగం అయిన మొత్తం వివరాలు ఉన్న బ్యాంకు ఖాతా వివరాలనూ సమర్పించాలి. ఇటువంటి లావాదేవీల్లో వినియోగదారులకు నష్టం కలగకుండా బ్యాంకులు బీమా పాలసీని తీసుకుంటాయి. మీ స్వీయ ప్రమేయం లేకుండా ఖాతా దుర్వినియోగం అయితే మీ డబ్బులు తిరిగి వస్తాయి.

మా వారు వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్నారు. సుమారు రూ.30లక్షల వరకూ వస్తాయి. ఈ మొత్తం ఖర్చు కాకుండా.. మంచి పథకాల్లో పెట్టాలని మా ఆలోచన. ఏం చేయాలి? - ఇందిర

చేతిలో పెద్ద మొత్తం కనిపిస్తే ఎవరికైనా ఖర్చు చేయాలని అనిపిస్తుంది. ఉదారంగా ఉండాలని అనిపించడమూ సహజమే. అందుకే మన దగ్గర ఉండే పెద్ద నిధిని చిన్న మొత్తాలుగా విడదీసి చూసుకుంటే అనవసర ఖర్చులు చేయం. పదవీ విరమణ తర్వాత కనీసం 30 ఏళ్లు జీవిస్తారని అంచనా. ఈ సమయంలో అవసరమైన అన్ని ఖర్చులూ ఈ మొత్తంతోనే వెళ్లదీయాలి. అందుకే మీ వారికి వచ్చే డబ్బును 60-70, 70-80, 80-90 ఏళ్ల వయసులో వాడుకునేలా మూడు భాగాలుగా చేసి పొదుపు, పెట్టుబడులకు మళ్లించండి. ఈ విధంగా చేయడం వల్ల 60-70 ఏళ్ల వయసులో వాడుకోవడానికి మీ వద్ద రూ.10 లక్షలే ఉన్నట్లు లెక్క. అంటే ఏడాదికి మీరు ఖర్చు పెట్టుకోగలిగిన మొత్తం రూ.1లక్ష. నెలకు రూ.8,000 వరకే అన్నమాట. చేతిలో రూ.30లక్షలకు బదులు రూ.8,000-9,000 కనిపించినప్పుడు డబ్బు వృథా కాదు. 60-70 ఏళ్ల వయసు ఖర్చుల కోసం కేటాయించిన మొత్తాన్ని నష్టభయం తక్కువగా ఉండే బ్యాంకు డిపాజిట్లు, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం వంటి సురక్షిత మార్గాల్లో దాచుకోండి. 70-80ఏళ్ల మధ్య కాలానికి కేటాయించిన రూ.10 లక్షలను నష్టభయం మధ్యస్థంగా ఉండే బ్యాలెన్స్‌డ్ మ్యూచువల్ ఫండ్లలో, 80-90 ఏళ్ల వయసు ఖర్చుల కోసం కేటాయించిన మొత్తాన్ని నష్టభయం ఉన్నా.. కాస్త అధిక రాబడిని ఇచ్చే రియల్ ఎస్టేట్, ఈక్విటీ ఫండ్లలోని పెట్టుబడులను పరిశీలించండి.

- వంగా రాజేంద్ర ప్రసాద్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

బీమా లెక్క.. సరిపోయిందా?

జీవిత బీమా పాలసీ తీసుకోవాలని అనుకునే వారికి.. ఎదురయ్యే మొదటి సందేహం.. ఎంత మొత్తానికి పాలసీ తీసుకోవాలి అనేది. ఇది ఎప్పుడూ ఓ చిక్కు ప్రశ్నే. ఒక వ్యక్తికి ఎంత బీమా ఉంటే ధీమాగా ఉంటారనే విషయాన్ని కచ్చితంగా లెక్కించడం అంత తేలికేమీ కాదు. కానీ.. కొన్ని ప్రధాన అంశాలను పరిగణనలోనికి తీసుకొని, ఎంత మొత్తం విలువైన పాలసీ తీసుకుంటే మంచిదనేది తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

కుటుంబంలో మీరు ఒక్కరే ఆర్జించే వ్యక్తా? మీపై ఆధారపడిన వారు ఉన్నారా? ఎలాంటి సందేహం లేకుండా మీకు జీవిత బీమా పాలసీ అవసరమే. అనుకోనిది ఏదైనా జరిగినప్పుడు ఆతను/ఆమె మీద ఆధారపడిన వారికి ఆర్థికంగా ఇబ్బంది కలగకుండా చూడటం బీమా పాలసీ ప్రధాన లక్ష్యం. ఉన్న బాధ్యతలు, కుటుంబ లక్ష్యాలు, కుటుంబ ప్రస్తుత జీవన శైలికి ఇబ్బంది కలగకుండా చూసుకోవడంలాంటివన్నీ బీమా పాలసీతోనే సాధ్యం. తనపై ఆధారపడిన జీవిత భాగస్వామి, పిల్లలు, ఆధారపడిన తల్లిదండ్రులందరికీ మీరు లేనప్పుడు ఈ బీమా పాలసీలే ఆధారంగా మారతాయి.

ఒక వ్యక్తి లేని లోటును తీర్చడం ఎవరి వల్లా కాదు. ఆ వ్యక్తి ఆర్థిక విలువకు ప్రత్యామ్నాయంగా మాత్రమే బీమా ఉపయోగపడుతుంది. పాలసీదారుడు మరణించినప్పుడు.. పాలసీ ద్వారా వచ్చిన డబ్బు ఆ వ్యక్తి ఆదాయానికి ప్రత్యామ్నాయంగా మారుతుంది. కాబట్టి, నాకు బీమా పాలసీ అవసరమా? అనే ప్రశ్నకు సమాధానం.. ఒక్కటే.. కుటుంబానికి ఆర్థిక రక్షణ కావాలంటే.. బీమా తీసుకోవాల్సిందే.

ఎక్కువగా ఉన్నా నష్టమే..

కావాల్సిన మొత్తం కన్నా బీమా తక్కువ ఉంటే.. అది కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చలేకపోవచ్చు. అదే.. అవసరానికి మించి ఉంటే.. ప్రీమియం భారం అవుతుంది. అందుకే, బీమా పాలసీని సరైన మొత్తానికి తీసుకోవాలి.

వయసు, ఆదాయాన్ని బట్టి, పాలసీ విలువ వార్షికాదాయానికి 10, 15, 20 రెట్లు ఉండాలి. సాధారణంగా ప్రతి వ్యక్తికీ ఈ సూత్రం వర్తిస్తుంది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ మొత్తం కూడా సరిపోకపోవచ్చు. ఈ నిబంధనతోపాటు.. కుటుంబ బాధ్యతలు, అప్పులు, ఇతర లక్ష్యాలనూ పరిగణనలోనికి తీసుకొని బీమా పాలసీని నిర్ణయించుకోవడం ఎప్పుడూ అవసరం.

అప్పులు తీర్చేలా..

ఒక వ్యక్తి హఠాత్తుగా మరణించాడనుకుందాం.. అప్పటికప్పుడు అతను తీర్చాల్సిన అప్పుల జాబితా ఏమిటి? అనేది చూడాలి. ఒక వ్యక్తి అప్పులకు సంబంధించిన వివరాలను సరిగా లెక్క చూడకపోయినా ఇబ్బంది లేదు.. కానీ, అప్పులను గడించడంలో పొరపాటు చేస్తే నికర విలువను అంచనా వేయడం కష్టమే. ఆ వ్యక్తి లేనప్పుడు ఆ కుటుంబాన్ని ఇది చాలా ఇబ్బందులపాలు చేస్తుంది. ఇది ఏ వ్యక్తీ కోరుకోడు.

మీకు ఉన్న ప్రతి అప్పునూ.. జీవిత బీమా పాలసీని లెక్కించేందుకు పరిగణనలోనికి తీసుకోవాలి. దీనివల్ల మీ కుటుంబానికి ఆ అప్పుల నుంచి ఒక రక్షణ లభిస్తుంది. ఉదాహరణకు మీరు కారు రుణం రూ.10లక్షలు తీసుకున్నారు.. గృహరుణం రూ.50లక్షలు తీసుకున్నారనుకోండి.. అప్పుడు రూ.60లక్షల అప్పు ఉన్నట్లు. జీవిత బీమా పాలసీని తీసుకునేప్పుడు కచ్చితంగా ఇంతకు తక్కువగా మాత్రం ఉండకూడదు.

ఆదాయానికి ప్రత్యామ్నాయం..

జీవిత బీమా పాలసీల ప్రధాన లక్ష్యం.. ఒక వ్యక్తి లేనప్పుడు.. ఆ వ్యక్తి ద్వారా వచ్చే ఆదాయానికి ప్రత్యామ్నాయం చూపడం. జీవిత భాగస్వామి గృహిణిగా ఉండి, పిల్లలు ఇంకా చదువుకునే దశలోనే ఉన్నప్పుడు క్రమం తప్పని ఆదాయం లేకపోతే ఎంత ఇబ్బందో మాటల్లో చెప్పలేం. కుటుంబ ఆర్థిక పరిస్థితి, అవసరాల ఆధారంగా వారికి నెలకు ఎంత మొత్తం కావాలన్నది పరిశీలించండి. ఇలా ఎన్నేళ్లు ఆ ఆదాయం కొనసాగాలి అనేది చూసుకోవాలి. అప్పుడే సరైన మొత్తం ఎంత అనేది తేలుతుంది.

అవసరాల ఆధారంగా..

ఒక్కో వ్యక్తి ఆర్థిక అవసరాలు ఒక్కో విధంగా ఉంటాయి. బీమా మొత్తాన్ని నిర్ణయించేప్పుడు వీటినీ ప్రధానంగా లెక్కలోకి తీసుకోవాలి. ఆర్థిక పరిస్థితులను పూర్తిగా విశ్లేషిస్తేనే కచ్చితమైన బీమా మొత్తం గణించగలం. అప్పులు, ఆదాయం, తనఖాలు, చదువు.. సాధారణంగా ఈ నాలుగు అంశాలే జీవిత బీమా మొత్తాన్ని నిర్ణయిస్తాయి. ఇదంతా ఎందుకంటే.. ఒక వ్యక్తిపై ఆధారపడిన వారి ప్రతి అవసరమూ.. తాను లేనప్పుడూ తీరాలి. ముఖ్యంగా కుటుంబంలో ఒక్కరే ఆదాయాన్ని ఆర్జిస్తున్నప్పుడు ఇది తప్పనిసరిగా పాటించాల్సిందే.

చదువు ఆగకుండా..

ఎలాంటి పరిస్థితులు ఎదురైనా పిల్లల చదువులు ఆగిపోవద్దనేది మన లక్ష్యంగా ఉంటుంది. అదే సమయంలో చదువుల ఖర్చులూ బాగా పెరుగుతున్నాయి. ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకొని జీవిత బీమా పాలసీని ఎంచుకోవాలి. పాలసీని ఎంచుకునేప్పుడు వారి చదువు పూర్తయ్యే సరికి ఎంత మొత్తం అవసరం అవుతుంది? అనేది విశ్లేషించాలి. ఆ మొత్తానికి తగిన రక్షణ ఉండేలా జాగ్రత్తపడాలి. ఇద్దరు పిల్లలు ఉన్నప్పుడు.. ఒక్కొక్కరికి కనీసం రూ.20లక్షల వరకూ చదువులకు కేటాయించేలా పాలసీ విలువ ఉండాలి.

గృహరుణం తీసుకున్నారా?

ఇల్లు కొనాలంటే గృహరుణం తీసుకోవడం తప్పనిసరి. ఇది సాధారణంగా 20-30 ఏళ్ల కొనసాగే దీర్ఘకాలిక అప్పు. ఈ మధ్యలో గృహరుణం తీసుకున్న వ్యక్తి మరణిస్తే.. దానికి వాయిదాలు చెల్లించడం ఇబ్బంది. దీన్ని నివారించేందుకు లోన్ కవర్ టర్మ్ పాలసీల్లాంటివి ఎంచుకోవాలి. జీవిత బీమాకు ఇది అదనంగా ఉండేలా చూసుకోవాలి. ఈ మార్టిగేజ్ ఇన్సూరెన్స్ ద్వారా రుణ మొత్తం పూర్తిగా చెల్లించాక.. జీవిత బీమా పాలసీ కుటుంబ ఆర్థిక అవసరాలకు ఉపయోగపడుతుంది.

- సంతోష్ అగర్వాల్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, Policybazaar.com

..ఖర్చు చేసేద్దాం!

దేశంలో వినియోగం కొత్త పుంతలు తొక్కుతోంది. భారతీయుడి వినియోగపు అలవాట్లు శరవేగంగా మారిపోతున్నాయి. ఆదాయాల పెరుగుదల దీనికో ప్రధాన కారణమైతే... ఉన్నప్పుడే ఖర్చుపెట్టేద్దామనే ధోరణి పెచ్చుమీరడం, మనుషుల అభిరుచులు మారడం, యువతరం ఆలోచనల సరళి మరికొన్ని కారణాలు. భవిష్యత్తు కోసం దాచుకుందాం అనే పాతకాలపు ధోరణి నుంచి నెమ్మదిగా పక్కకు జరుగుతూ.. ఖర్చుపెట్టడానికే జనం ఎక్కువగా ఇష్టపడుతున్నారు. 2030 నాటికి దేశంలో వినియోగ వ్యయం నాలుగురెట్లు పెరుగుతుందని ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్), బెయిన్ అండ్ కంపెనీ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో వెల్లడయింది.

అన్ని చోట్లా వినియోగమే

2030 నాటికి దేశంలో మరో 14 కోట్ల కుటుంబాలు మధ్యాదాయ, 2 కోట్ల కుటుంబాలు ఉన్నతాదాయ వర్గంలోకి మారబోతున్నాయి. వీరు ఆహారం, పానీయాలు, దుస్తులు, ఎలెక్ట్రానిక్ పరికరాలు, రవాణా, గృహాలపై రెండు నుంచి రెండున్నర రెట్లు ఎక్కువగా వెచ్చిస్తారు. అలాగే ఆరోగ్యం, విద్య, వినోదం, గృహోపకరణాలపై మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా వ్యయంచేస్తారు. ఎగువ మధ్యతరగతి, ఉన్నతాదాయ వర్గాల వారు వాషింగ్‌మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు, వ్యక్తిగత వాహనాల్లాంటి వాటిపై 15 నుంచి 20 శాతం ఎక్కువగా ఖర్చుచేస్తారు.

నవతరం ప్రాధాన్యతలే కీలకం

సహస్రాబ్ది బిడ్డలు(మిలీనియల్స్), జనరేషన్ జెడ్ ప్రాధాన్యతలు వినియోగ మార్కెట్ స్వరూప స్వభావాల్ని సమూలంగా మార్చేయనున్నాయి. 1980ల తర్వాత జన్మించిన వారు 2030 నాటికి దేశంలో 77% మంది ఉండనున్నారు. ఈ తరం వినియోగదారులు తమ మునుపటివారి కన్నా మరిన్ని వస్తు, సేవలవైపు మొగ్గుచూపుతారు. అయితే ప్రతి వస్తువునూ కొనేముందు అందులో ఉత్తమమైన వాటిని ఎంచుకోవడానికే ప్రయత్నిస్తారు. తమకు, తమ కుటుంబాలకు ఎలాంటివి అవసరమో గుర్తెరిగి కొంటారు కాబట్టి.. వినియోగ మార్కెట్ రూపురేఖలు మారతాయి.

ఆదాయాల పెరుగుదల

దేశంలో ఎగువ మధ్యతరగతి, ఉన్నతాదాయ వర్గాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం వినియోగ మార్కెట్ విస్తృతికి ప్రధాన కారణం. ప్రస్తుతం దేశంలోని ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒకటి ఇలాంటిది ఉంటే.. 2030 నాటికి ప్రతి రెండు కుటుంబాల్లో ఒకటి ఉంటుందని అంచనా. వ్యక్తుల వ్యక్తిగత ఆదాయాల పెరుగుదల వల్ల దిగువ మధ్యతరగతి వినియోగపు అభిరుచులు సైతం విపరీతంగా మారిపోతున్నాయి. ప్రాధాన్యతలకు పట్టం కడుతున్నారు. దేశంలోని కోట్ల మంది యువత రాబోయే దశాబ్ద కాలంలో మొదటిసారి వినియోగదారులుగా మారబోతున్నారు. దీనికి నాలుగో పారిశ్రామిక విప్లవం తోడై దేశంలో వినియోగ స్వరూపమే సమూలంగా మారబోతోంది.

మధ్య తరగతి మహాభారతం

2030 నాటికి అచ్చంగా మధ్యతరగతి నిర్వహించే ఆర్థిక వ్యవస్థగా భారత్ మారబోతోంది. రాబోయే 11 ఏళ్లలో దేశంలోని 80 శాతం కుటుంబాలు మధ్యాదాయ వర్గంగా మారతాయి. ప్రస్తుతం ఇవి 50% కుటుంబాలే. 2030 నాటికి దాదాపు 75% వినియోగ వ్యయం మధ్యతరగతి వారిదే ఉంటుంది.

పట్నం, పల్లె తేడా లేదు

వినియోగదారుల అభిరుచులు గణనీయంగా మారుతున్నాయి. దీనికి పట్నం, పల్లె అన్న తేడా లేదు. 40 పెద్ద నగరాలు తప్ప... చిన్న పట్టణాలు, గ్రామీణుల ఆదాయ స్వరూపాల్లో పెద్దగా మార్పులేదు. ఒక నిర్దిష్ట ఆదాయ స్థాయిలో ఇరువురూ ఒకే తరహా జీవితాన్ని గడుపుతున్నారు. ఒకే రకం వస్తువులు కొంటున్నారు. సాంకేతిక ఆధార వినియోగం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరింత వినియోగం పెరగకుండా అధ్వాన్న రోడ్లు, విద్యుత్తు, అరకొర ఆర్థిక సేవల్లాంటివి అడ్డంకిగా ఉంటున్నాయి.

- దేశంలో వినియోగం కొత్త పుంతలు
- 2030 నాటికి ఖర్చు 4 రెట్లు పెరుగుదల

అంతా కొనుగోళ్లకే..

పెరిగే ఆదాయంలో దాదాపు సగం మొత్తాన్ని మరికొన్ని వస్తువులు కొనడానికి వినియోగదారులు వెచ్చిస్తారు. మిగతా సగాన్ని ఇప్పుడు వినియోగించేవి కాకుండా కొత్తవాటిని సొంతం చేసుకోవడానికి వినియోగిస్తారు. సేంద్రీయ ఆహారం, సరికొత్త చర్మ సంరక్షణ ఉత్పత్తులు, అధునాతన వస్త్రాలు, సెల్‌ఫోన్లు, డేటా ప్యాక్‌లు, గాడ్జెట్లపై వెచ్చిస్తారు.

డబ్బుకు తగిన వస్తువులు

పెట్టే డబ్బుకు తగినట్టుగా వస్తువులు ఉండాలని కోరుకునే వినియోగదారులు ఎక్కువ. ఈ వేట ఎక్కువగా సాగుతుంది కాబట్టి ఈ కామర్స్ వృద్ధి జరుగుతుంది. 2030 నాటికి ఈ తరహా వినియోగం మరింత పెరుగుతుంది.

డిజిటల్ ప్రభావం తప్పదు

వినియోగ ప్రాధాన్యతలపై 'అనుసంధానత' గణనీయ ప్రభావం చూపుతోంది. డిజిటల్‌తో అనుసంధానమై ఉన్న అన్ని ఆదాయ వర్గాల్లోని 50 నుంచి 70 శాతం మంది ప్రస్తుతం వస్తువుల గురించి శోధించడానికి డిజిటల్ ప్లాట్‌ఫాంలను వినియోగిస్తున్నారు. 2030 నాటికి దాదాపు 40 శాతానికి పైగా అన్ని కొనుగోళ్లు డిజిటల్‌పైనే ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఇది 20-22 శాతమే. భవిష్యత్తులో డిజిటల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలకు వినియోగదారుడు ఎంతవరకు అనుసంధానమై ఉన్నాడనేది కొనుగోలు ప్రాధాన్యతలను నిర్ణయిస్తుంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

కరదీపికను ఆవిష్కరిస్తున్న వైద్యులు దినేష్ కుమార్, నాగేశ్వరరావు, తపన్‌కుమార్

శిశువుల గుండె జబ్బులకు ఆధునిక చికిత్స

హార్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభ సభలో నిపుణులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: మారుతున్న జీవనశైలితోపాటు విటమిన్ లోపాల కారణంగా..గుండెజబ్బులతో జన్మించే శిశువుల సంఖ్య పెరుగుతోందని వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వెయ్యిమందిలో 10 మంది అటువంటి వ్యాధులతో బాధపడుతుంటే, అందులో 20% అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనాల్సి వస్తోందన్నారు. నూతనంగా రెయిన్‌బో గ్రూపు ఆస్పత్రుల ఆధ్వర్యాన శనివారం బంజారాహిల్స్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌సీహెచ్ఐ) ప్రారంభమైంది. ప్రత్యేకంగా చిన్నారుల గుండెజబ్బుల చికిత్సల కోసమే 100 పడకలతో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటుచేసిన ఆస్పత్రి ఇది. ప్రారంభ కార్యక్రమంలో ఆర్‌సీహెచ్ఐ డైరెక్టర్ దినేష్‌కుమార్ చిత్రతో పాటు టీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్టు కోనేటి నాగేశ్వరరావు, చీఫ్ కార్డియో థొరాసిక్ సర్జన్ తపన్‌కుమార్ దాస్ పాల్గొని లోగోను ఆవిష్కరించారు. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, పిల్లలకు సమగ్రమైన గుండె సంబంధిత వైద్యసేవలు అందించేందుకే దీన్ని ప్రారంభించామన్నారు. క్యాథెరైజేషన్ ప్రాసెస్‌ను నిర్వహించే 'కేవర్ ఎంఎఫ్‌పీ' యంత్రం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్వేత, అనూరాధ, కపిల్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాల జాబితా విడుదల వాయిదా

బాసర, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ-బాసర) ప్రవేశాల జాబితా విడుదల తేదీ వాయిదా పడింది. నిర్మల్ జిల్లా బాసరలో ఉన్న ఈ విద్యాలయానికి ఎంపికైన విద్యార్థుల మొదటి జాబితా ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. సీబీఎస్ఈ పదో తరగతి మార్కుల ఈ జాబితా విడుదలలో జాప్యంతో ఈ నెల 15న జాబితా విడుదల కానుంది.

రవిప్రకాశ్ విచారణ వీడియోలో నిక్షిప్తం

అవసరమైతే మళ్లీ పిలుస్తాం: ఏసీపీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వీడియో చిత్రీకరణ మధ్య టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌ను శనివారం బంజారాహిల్స్ పోలీసులు విచారించారు. అసోసియేట్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి.కౌశిక్ రావు ఫిర్యాదు మేరకు ఆయనను రెండోరోజు బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ కె.ఎస్.రావు ఆరుగంటలపాటు విచారించారు. ముందుగా సిద్ధం చేసుకున్న ప్రశ్నావళితో సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. డైరెక్టర్ల ఏర్పాటు, ట్రేడ్‌మార్క్-షేర్ల విక్రయం వంటి ఆరోపణలపై ప్రశ్నలు సంధించారు. ట్రేడ్‌మార్క్ విక్రయించడానికి తనకు హక్కు ఉందని, అందుకే విక్రయించానని రవిప్రకాశ్ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. సంబంధించిన పత్రాలను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టంచేసినట్లు సమాచారం. రవిప్రకాశ్, శివాజీల మధ్య షేర్ల ఒప్పందం, ట్రేడ్‌మార్క్ విక్రయానికి సంబంధించి కూడా వివరాలు సేకరించారు. వాటిని సమాధానాలతో సరిపోల్చుతున్నారు. తప్పుడు తేదీలతో రవిప్రకాశ్ తన షేర్ల వాటాను శివాజీకి విక్రయించినట్లు తెలిపే కొన్ని సాంకేతిక ఆధారాలను పోలీసులు ఇప్పటికే స్వాధీనంచేసుకున్నట్లు తెలుస్తోంది. మొదటి రోజు కొన్ని ప్రశ్నలకు బదులిచ్చేందుకు కొంత విముఖత చూపిన రవిప్రకాశ్.. రెండో రోజు అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. విచారణానంతరం రవి ప్రకాశ్ మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు. బంజారాహిల్స్ ఏసీపీ రావు మీడియాతో మాట్లాడుతూ..ట్రేడ్‌మార్క్, పేటెంట్, కాపీరైట్, పోర్టలీ, తదితర అంశాలపై విచారించామన్నారు. ఆయా ప్రశ్నలకు రవిప్రకాశ్ సమాధానం చెప్పడంతో పాటు, సంతకం చేసి అందించారన్నారు. ఆయన చెప్పిన అంశాలను సరిపోల్చుకుని, వాస్తవమా కాదా? పరిశీలిస్తామన్నారు. చెప్పిన అంశాలపరంగా దస్తావేజులు ఏవీ లేవన్నారని, లోగో విక్రయానికి సంబంధించిన పత్రాలను అందిస్తానని పేర్కొన్నారని ఏసీపీ వివరించారు. అవసరమైతే రవిప్రకాశ్‌ను మళ్లీ విచారణకు పిలుస్తామన్నారు.

విచారణానంతరం బంజారాహిల్స్ కాలా పడ్డ రవిప్రకాశ్

సామాన్య ప్రయాణికులకు రైల్వే కోత

- నారాయణాద్రి, వెంకటాద్రి సహా పది రైళ్లలో ఒక్కో స్లీపర్ బోగీకి మంగళం!
- థర్డ్ ఏసీ పెట్టెల పెంపుపై దృష్టి
- అధిక ఆదాయమే లక్ష్యం
- అక్టోబరు నుంచి అమల్లోకి
- పెంచకపోగా.. తగ్గించడంపై నిపుణుల అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: రైళ్లలో బోగీలు పెంచాలని సామాన్య ప్రయాణికులు కోరుతుంటే రైల్వేశాఖ మాత్రం ఉన్న స్లీపర్ బోగీలకు కోతేస్తోంది. వెంకట్రాది, నారాయణాద్రి, గౌతమి, సింహపురి, దేవగిరి.. (రాను పోను కలిపి) 10 రైళ్లలో ఒక్కో స్లీపర్ బోగీని తగ్గించి, వాటి స్థానంలో థర్డ్ ఏసీ బోగీలను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. మరికొన్ని రైళ్లలోనూ ఈ విధానం అమలుకు యోచిస్తోంది.

నిరీక్షణ సంఖ్య 150 పైనే..

సికింద్రాబాద్, కాచిగూడ నుంచి తిరుపతికి వెళ్లే రైళ్లు శ్రీవారి భక్తులతో కిటకిటలాడుతుంటాయి. కనీసం రైలుకో స్లీపర్ బోగీ పెంచితే కానీ సమస్యతీరదు. ద.మ.రైల్వే మాత్రం ఒక్కో బోగీని తగ్గించాలని నిర్ణయించడం పయాణికుల కష్టాలను మరింత పెంచనుంది. కాకినాడ, నెల్లూరు వెళ్లే గౌతమి, సింహపురిలోనూ ఇదే రకమైన పరిస్థితి.

★ తెలుగురాష్ట్రాల ఉమ్మడి రాజధాని నుంచి తిరుపతికి: సగటున రోజుకు 9 రైళ్లు

★ స్లీపర్ ప్రయాణానికి రిజర్వేషన్ ఖరారు కాకుండా వెయిటింగ్‌లో ఉండేవారు: ఒక్కో రైల్లో సగటున రోజుకు 150 మంది

★ ఒక స్లీపర్ బోగీలో రిజర్వేషన్ సదుపాయం: 72 బెర్తులు, 8 ఆర్‌ఏసీ.. మొత్తం 80 మందికి

★ తాజా నిర్ణయంతో.. ఒక్కో రైలులో రోజూ 80 మందికి స్లీపర్ టికెట్లు తగ్గిపోతాయి

★ మధ్యలో ఎక్కే, దిగే ప్రయాణికులతో కలిపిచూస్తే ఒక్కో బోగీలో 150 మంది వరకు ప్రయాణిస్తారు

తరగతి	సికింద్రాబాద్-తిరుపతి	సికింద్రాబాద్-కాకినాడ	నెల్లూరు-సికింద్రాబాద్
స్లీపర్	రూ.370/ 385	రూ.345	రూ.365
థర్డ్ ఏసీ	రూ.990/ 1,020	రూ.910	రూ.960

ఏసీలో వెళితే ప్రయాణం భారం

దక్షిణ మధ్య రైల్వే నిర్ణయంపై నిపుణులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏసీ బోగీలు పెంచడంపై అభ్యంతరం లేదని, సామాన్యులు వెళ్లే స్లీపర్ బోగీలు తగ్గించడం సరికాదని అంటున్నారు. 'స్లీపర్‌లో దొరక్కపోతే థర్డ్ ఏసీ మినహా మరో ప్రత్యామ్నాయం ఉండదు. అంతే కానీ, సామాన్య ప్రయాణికులు నేరుగా థర్డ్ ఏసీ బోగీలకు ప్రయత్నించరు' అని ఓ నిపుణుడు అన్నారు.

ఇప్పటికే 45 బోగీల మార్పు

ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మారుస్తున్న రైల్వే శాఖ ఇటీవల పలు రైళ్లలో మార్పుచేర్పులు చేసింది. 45 స్లీపర్ బోగీలను తొలగించి.. వాటిస్థానంలో థర్డ్ఏసీ, సెకండ్ ఏసీ బోగీలు ఏర్పాటుచేసింది.

ఏసీ బోగీలు అందుబాటులో ఉన్నాయి

థర్డ్ ఏసీ బోగీల లభ్యతను బట్టి కొద్దిరోజుల నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. అక్టోబరు నుంచి శాశ్వత ప్రాతిపదికన అమలుచేస్తాం. ప్రకటించిన రైళ్లలో ఒక్కో స్లీపర్ బోగీ తగ్గి, ఒక్కో థర్డ్ ఏసీ బోగీ పెరుగుతుంది.

– సీహెచ్ రాకేశ్, సీపీఆర్వో, ద.మ.రైల్వే

'రోడ్డు ప్రమాదాల'పై సమగ్ర అధ్యయనం

- శాస్త్రీయ శోధనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- మూడు శాఖల అధికారులతో కమిటీలు

ఈనాడు-హైదరాబాద్: రోడ్డుప్రమాదాలకు అసలు కారణాలను శోధించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ప్రాణాంతక ప్రమాదానికి మూలమేమిటి, లోపం ఎక్కడ ఉంది, ప్రధాన బాధ్యత వహించాల్సిన శాఖ ఏది..అని కనుగొనడంతో పాటు ప్రమాద నివారణకి అనుసరించాల్సిన వ్యూహంపైనా సమగ్ర అధ్యయనం చేయనుంది. దేశంలో అనేకచోట్ల ప్రమాదాల సంఖ్య పెచ్చుమీరడంపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన నేపథ్యంలో..ఇటీవల ఓ ఉన్నతస్థాయి సంహాన్ని సుప్రీంకోర్టు నియమించింది. ఆ కమిటీ చేసిన మార్గదర్శకాల్లో కొన్నింటిని తెలంగాణలో తు.చ.తప్పక అమలుచేయాలన్నదే పాలకుల సంకల్పం. అందులో భాగంగానే, ఇకనుంచి ప్రతి ప్రమాద సంఘటన తీరుతెన్నులనూ సమగ్రంగా శాస్త్రీయ రీతిలో పరిశీలిస్తారు. ప్రవంచవ్యాప్తంగా రహదారి ప్రమాదాల మృతుల్లో 54 శాతం- పాదచారులతో పాటు మోటారు సైకిళ్లు, సైకిళ్లపై వెళ్లేవారే ఉంటున్నారన్నది- ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా అధ్యయన సారాంశం. అటువంటి కారణాల వల్లనే ఏటా 13.50 లక్షలమంది మృత్యువాత పడుతున్నారని తేలింది. తెలంగాణలోనూ ఏటేటా ఏడువేలమంది దాకా అవే కారణాలతో మరణిస్తున్నారు. ఈ తరహా ప్రమాద మృతుల సంఖ్యను పది శాతం తగ్గించాలని రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రతి జిల్లలోనూ సంఘాల ఏర్పాటు: ప్రమాదాల సంపూర్ణ అధ్యయనానికి జిల్లాల వారీగా అధికారులతో కమిటీలు నియమించాలని ప్రభుత్వం నిశ్చయించింది. ప్రమాద పరిష్కార బృందం(యాక్సిడెంట్ రీ సొల్యూషన్ టీమ్-ఆర్)' పేరుతో వాటిని నెలకొల్పుతారు. ఇందులో రహదారులు-భవనాల శాఖతో పాటు రవాణా, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రమాదం జరిగిన ప్రతి ప్రాంతానికీ ఈ బృందం వెళ్లాల్సి ఉంటుంది. మృతి లేదా గాయపడటానికి కారణాలను పరిశోధించాల్సి ఉంది. దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వ విభాగాన్ని ఇదే బృందం గుర్తిస్తుంది. అన్ని అంశాలతోనూ నివేదిక రూపొందించి జిల్లా కలెక్టరుకు అందచేస్తుంది. ఆయా మార్గాలు రాష్ట్ర లేదా జాతీయ రహదారులైతే, హైదరాబాద్‌లోని ఆయా శాఖలకు నివేదిక వివరాలు పంపుతారు. జిల్లాస్థాయి రహదారులైతే, రోడ్డు మరమ్మతులకు కలెక్టరు నుంచి అనుమతులతో పాటు పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూస్తారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకూ ఇప్పటికే లేఖలందాయి.

రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

వివిధ సంఘాల నేతల డిమాండ్

ఈనాడు, దిల్లీ: దేశ వ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలో పెట్టిన రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. భీమా కోరెగావ్ కేసులో హక్కుల కార్యకర్తలను అరెస్టు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా వివిధ ప్రజా, సాంస్కృతిక సంహాల ఆధ్వర్యంలో దిల్లీలోని జంతర్‌మంతర్‌లో శనివారం నిరసన సభ నిర్వహించారు. సభలో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ నేత రవి కిరణ్ జైన్ మాట్లాడుతూ.. పార్లమెంటరీ వ్యవస్థలోని పార్టీలే ప్రజల హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. న్యూట్రేడ్ యూనియన్ ఇనిషియేటివ్ నేత గౌతమ్ మోదీ మాట్లాడుతూ.. మజ్దూర్ సంఘర్ష్ సమితిని నిషేధించడం, వివిధ పోరాటాల్లో పాల్గొంటున్న కార్మికులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలను అక్రమంగా అరెస్టు చేయడం రాజ్య అణచివేత దోరణికి తార్కాణమన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి (ఏపీడీఆర్) నేత తపస్ చక్రవర్తి మాట్లాడుతూ.. హక్కుల కార్యకర్తలు భయానికి చోటు లేని రాజ్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. హక్కుల కార్యకర్తలైన మహేశ్ రౌత్, రోనా విల్సన్, సోమన్ సేన్, సుధీర్ ధావలే, సురేంద్ర గాడ్లింగ్, అరుణ్ ఫెరీరా, వరవరరావులను అక్రమంగా అరెస్టు చేశారని.. ఏడాది నుంచి బెయిల్ ఇవ్వకపోవడం దారుణమని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆంధ్రప్రదేశ్-తెలంగాణ చాప్టర్ ప్రధాన కార్యదర్శి బళ్ల రవీంద్రనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దళితులు, మైనారిటీలపై గోరక్షక కమిటీల పేరుతో దాడులు చేస్తుంటే రాజ్యాంగానికి బదులు మను ధర్మ శాస్త్రం అమలు చేస్తున్నట్లు అర్థమవుతోందని పౌర హక్కుల సంఘం తెలంగాణ కమిటీ నేత జి.లక్ష్మణ్ అన్నారు. సభలో పలువురు అధ్యాయులు, విద్యార్థి, రైతు, కార్మిక, న్యాయవాదుల సంహాల నేతలు పాల్గొన్నారు.

'ఉద్యోగులను స్వరాష్ట్రాలకు పంపించాలి'

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ స్థానికతగల జోనల్, మల్టీ జోనల్, జిల్లా క్యాడర్ ఉద్యోగులను వెంటనే స్వరాష్ట్రానికి తీసుకొచ్చేలా రెండు తెలుగు ప్రభుత్వాలు చొరవ చూపాలని తెలంగాణ నేటివ్ ఎంప్లాయీస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అసోసియేషన్ కోరింది. శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్, జి.తిరుపతి మాట్లాడుతూ.. రెండు తెలుగు ప్రభుత్వాలు మానవతా దృక్పథంతో అంగీకరించి తెలంగాణలో పని చేస్తున్న 900మంది ఏపీ స్థానికత కలిగిన ఉద్యోగులను ఏపీకి బదిలీ చేయాలని, అలాగే ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలన్నారు. న్యాయం కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కమిటీ వేసి స్థానికత ఆధారంగా ఉద్యోగులను వారివారి రాష్ట్రాలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యానికి డ్రోన్ సాయం

తెహ్రీ: అత్యవసర వైద్యసేవలు అందించేందుకు భవిష్యత్తులో డ్రోన్లు తిరుగులేని ప్రత్యామ్నాయంగా మారనున్నాయి. ఇందుకోసం ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన ఓ ప్రయోగం సఫలమైంది. అక్కడి తెహ్రీ జిల్లాలో డ్రోన్ సాయంతో రక్తం తరలించడంలో వైద్యులు విజయం సాధించారు. నందగావ్ నుంచి రక్తాన్ని తెహ్రీ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించేందుకు డ్రోన్‌ను వినియోగించి విజయం సాధించారు. బొగోళికంగా డ్రోన్ ప్రయాణానికి అంత సానుకూలం కాని ప్రాంతాల్లోనూ ఈ ప్రయోగం సఫలమైంది. ప్రయోగంలో భాగంగా నందగావ్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా ఆసుపత్రిలోని రక్తనిధికి విజయవంతంగా రక్తాన్ని తరలించామని, ఇందుకు డ్రోన్‌కు కేవలం 18 నిమిషాల సమయం పట్టిందని తెహ్రీ జిల్లా ఆసుపత్రి సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్ఎస్ పంగ్ని తెలిపారు. డ్రోన్ పనితీరును మరిన్ని ప్రయోగాలు చేస్తామని జిల్లా కలెక్టర్ సారిక చెప్పారు.

దేవుడు లేని ఆలయం.. ప్రకృతే ప్రేరణం

రాయ్‌పుర్: ఆలయంలో దేవుడికి పూజలు చేయడం అందరికీ తెలుసు. ప్రకృతికి ఆలయం ఉండటం ఎప్పుడైనా చూశారా? ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ జిల్లా అమెరి గ్రామంలో పర్యావరణ్ ధామ్ అనే ఆలయం ఉంది. అక్కడ ప్రకృతినే దేవతగా పూజిస్తారు. ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నది ఆ గ్రామవాసుల విశ్వాసం. అందుకే వారు ఏకంగా ఆలయం నిర్మించి ప్రకృతిని దేవతగా కొలుస్తున్నారు. ఇరవై ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాంతంలో ఓ భక్తుడు మొక్కలు నాటడం ప్రారంభించాడు. ఆయనకు తోడుగా మరికొందరు కూడా మొక్కలు నాటారు. అనంతరం ఆలయానికి పర్యావరణ్ ధామ్ అని పేరు పెట్టారు. ఆలయంలో ఐదు తత్వాలు ఉన్నాయి. పంచతత్వాల్లో భ అంటే భూమి, గ అంటే గగన్ (ఆకాశం), వ అంటే వాయువు (గాలి), అ అంటే అగ్ని, న అంటే నీరు. భ, గ, వ, అ, న అనే ఐదు తత్వాలు కలగలిపిన భగవంతుడు ఈ ఆలయంలో కొలువై ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు.

చవగ్గా ఆరోగ్య పరికరాలు

బెంగళూరు: దీర్ఘకాలిక అనారోగ్యం బారిన పడినవాళ్లకు ఇంట్లో ఏదో ఒక ఆరోగ్య పరికరం అవసరం ఉంటుంది. చక్రాల కుర్చీలు, చేతికర్రలు, కమోడ్ కుర్చీల్లాంటివి కావాల్సి ఉంటాయి. అలాంటివాటిని చవగ్గా అందించేందుకు కర్ణాటకలోని బాష్ట్స్ ఆసుపత్రి 'మెర్సీ డ్రాప్స్' పేరిట ప్రజల భాగస్వామ్యంతో కొత్త సేవను ప్రారంభించింది. ఇందులో అవసరమైన పరికరాలను కొనుక్కోవచ్చు. మనకు అవసరం లేని పరికరాలను ఇవ్వొచ్చు. ఆసుపత్రి పడకలు, నెబ్యులైజర్లు, స్ట్రెచర్లు, స్నానపు కుర్చీలు... ఇలా వేటినైనా స్వచ్ఛందంగా అందించొచ్చు. ఈ పరికరాల అవసరం ఉన్నవారు తక్కువ ధరకే వాటిని కొనుగోలు చేసే అవకాశం లభిస్తోంది. పరికరాల్లో ఏమైన లోపాలుంటే వాటిని బాగుచేయించి ఇస్తున్నారు. తమ ఆసుపత్రి వైద్యబృందం ఇళ్లలో చికిత్స అందిస్తున్నప్పుడు ఈ ఆలోచన వచ్చిందని.. కొందరు ఆరోగ్య పరికరాలు లేక ఇబ్బందులు పడుతుంటే... మరికొందరి వద్ద వినియోగంలో లేని పరికరాలను ఉన్నట్లు గుర్తించారని బాష్ట్స్ ఆసుపత్రి ఆసోసియేట్ డైరెక్టర్ సన్నీ కురువిల్లా తెలిపారు. ఇలాంటివి ఇప్పటివరకు 100 పరికరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మెర్సీ డ్రాప్స్ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఈ భారత్

యాప్ స్టోర్ & గూగుల్

జడ్పీలన్నీ తెరాస వశం

ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులన్నీ ఆ పార్టీ సభ్యులకే

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో 32 జిల్లా పరిషత్‌లూ తెరాస వశమయ్యాయి. అన్నిచోట్ల ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలు ఆ పార్టీకి చెందిన సభ్యులకే లభించాయి. ఆయా జిల్లాల్లో మెజార్టీ సంఖ్యలో తెరాస జడ్పీటీసీ సభ్యులు విజయాన్ని సాధించడం వల్లనే పంచాయతీరాజ్ వ్యవస్థలోని అతి కీలకమైన జడ్పీలన్నీ అధికార పార్టీపరం కాగలిగాయి. అదిలాబాద్‌లో చేతులెత్తే పద్ధతిలో ఎన్నికల జరగ్గా.. మిగతా అన్ని జిల్లాల్లోనూ పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయి. నూతనంగా ఎన్నికైన వారు జులై 5వ తేదీన పదవీ బాధ్యతలను చేపడతారు. కొత్త వారు బాధ్యతలను చేపట్టేవరకు పాత పాలకవర్గాలే ప్రస్తుత 9 జడ్పీల ప్రాతిపదికన విధులను నిర్వహిస్తాయి. జడ్పీ ఎన్నికలతో పంచాయతీరాజ్ సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ పరిసమాప్తమైంది.

రాష్ట్రంలోని హైదరాబాద్ మినహా 32 రెవెన్యూ జిల్లాలు ఉండటంతో రాజ్యాంగం ప్రకారం ప్రతి జిల్లాలోనూ ఒక్కో జడ్పీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగానే పాత 9 జడ్పీలు 32కు పెరగనున్నాయి. సవరించని చట్టప్రకారమైతే.. ఈ జడ్పీలన్నీ ఏర్పాటై.. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన మరుసటిరోజు మాత్రమే పాలకవర్గాలకు ఎన్నికలను చేపట్టాల్సి ఉంటుంది. జడ్పీటీసీ విజేతలుగా ప్రకటించిన ప్పటి నుంచి పాలకవర్గాలు అవతరించేవరకు గల వ్యవధిని 40 రోజుల నుంచి నాలుగు రోజులకు కుదించడం కోసమే ప్రభుత్వం ఆర్డినెన్సు ద్వారా చట్టసవరణను తెచ్చింది. దీంతో ఈనెల 4వ తేదీన విజేతలుగా తేలిన జడ్పీటీసీ సభ్యులంతా. . రాష్ట్రవ్యాప్తంగా శనివారం అన్ని జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల్లో పాల్గొనగలిగారు. అదిలాబాద్ జడ్పీకి తప్ప మిగతా అన్ని జడ్పీలకు ఒక్కో పదవికి తెరాస నుంచి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో అక్కడి ఎన్నికలు ఏకగ్రీవయ్యాయి. దీంతో ఎన్నికల ప్రక్రియ అన్నిచోట్లా దాదాపుగా అరగంట వ్యవధిలోనే ముగిసిపోయింది.

అదిలాబాద్‌లో ఓటింగ్

అదిలాబాద్‌లో మొత్తం 17 జడ్పీటీసీల్లో తెరాసకు 9, భాజపాకు 5, కాంగ్రెస్‌కు 3 స్థానాలు ఉండటంతో అక్కడ పోటీకి దారితీసింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఒక సభ్యురాలు తెరాస అభ్యర్థికి అనుకూలంగా చెయ్యి ఎత్తటంతో అక్కడ తెరాసకు 10 ఓట్లు లభించినట్లయింది. ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్‌పర్సన్ ఎన్నికలకు ముందు.. ప్రతి జడ్పీకి ఇద్దరేసి చొప్పున మొత్తం 64 కో-ఆప్టెడ్ సభ్యులను జడ్పీటీసీ సభ్యులు ఎన్నుకున్నారు. అదిలాబాద్‌తో సహా అన్ని జిల్లాల్లోను ఈ కో-ఆప్టెడ్ సభ్యులు ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు.

మరో 26 రోజుల తర్వాతనే పాలనా వర్గాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన వారంతా పాలనాపగ్గాలు చేపట్టేందుకు 26 రోజులపాటు ఎదురు చూడకతప్పదు. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం జులై 4వ తేదీన ముగుస్తుంది. ఆ మరుసటి రోజునే అన్ని జడ్పీల్లోనూ 'మొదటి సమావేశాలను' నిర్వహించి ఇప్పుడు ఎన్నికైనవారు, జడ్పీటీసీ సభ్యులు పదవీ ప్రమాణాలు చేస్తారు. ఇక అప్పటి నుంచి వారు విధులను చేపట్టినట్లవుతుంది. ఇలాంటి మొదటి సమావేశం తేదీని ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. కొత్తవి అధికారంలోకి వచ్చేవరకు పాత 9 జడ్పీ పాలకవర్గాలే మొత్తం 32 జిల్లాల పరిధిలోని విధులను నిర్వహిస్తాయి. ఏపీలో మండలాల విలీనం అంశాల వల్ల 2014లో ఎన్నికలు నెలరోజుల పాటు ఆలస్యమైనందున ఇప్పుడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కొత్త పాలకవర్గాలపైనా ఆ ప్రభావం పడుతుంది. ఈరెండు జిల్లాల కొత్త పాలకవర్గాలు ఆగస్టు 7వ తేదీన మాత్రమే బాధ్యతలను చేపట్టాల్సి ఉంటుంది.

ఖమ్మంలో తెరాస శ్రేణుల సంబురాలు

32 జడ్పీలకు ఎన్నికైన వారి వివరాలు

జడ్పీ	ఛైర్‌పర్సన్ రిజర్వేషన్	ఛైర్‌పర్సన్	వైస్ ఛైర్‌పర్సన్
ఆదిలాబాద్	ఎస్టీ	రాథోడ్ జనార్దన్	ఆరె రాజన్న
కుమురంభీం	ఎస్టీ(మహిళ)	కోవ లక్ష్మి	జీనేరు కృష్ణ
నిర్మల్	మహిళ	కొరిపెల్లి విజయలక్ష్మి	బి.సాగరబాయ్
మంచిర్యాల	ఎస్సీ(మహిళ)	ఎన్.భాగ్యలక్ష్మి	టి.సత్యనారాయణ
కరీంనగర్	ఎస్సీ(మహిళ)	కనుమల్ల విజయ	పేరాల గోపాలరావు
రాజన్న సిరిసిల్ల	మహిళ	న్యాలకొండ అరుణ	సిద్దం వేణు
జగిత్యాల	బీసీ	దవా వసంత	వి.హరిచరణ్‌రావు
పెద్దపల్లి	బీసీ	పుట్ట మధు	మండిగ రేణుక
నిజామాబాద్	జనరల్	దాదన్నగారి విఠల్‌రావు	ఎం.రజిత
కామారెడ్డి	బీసీ(మహిళ)	డఫేదర్ శోభ	పరిక్షి ప్రేంకుమార్
ఖమ్మం	ఎస్సీ	లింగాల కమల్‌రాజు	మరికంటి ధనలక్ష్మి
భద్రాద్రి కొత్తగూడెం	ఎస్టీ	కోరం కనకయ్య	కంచర్ల చంద్రశేఖరరావు
వరంగల్ అర్బన్	ఎస్సీ	మారేపల్లి సుధీర్‌కుమార్	గజ్జెల శ్రీరాములు
వరంగల్ రూరల్	మహిళ	గండ్ర జ్యోతి	ఆకుల శ్రీనివాస్
ములుగు	జనరల్	కుసుమ జగదీశ్వర్	బి.నాగజ్యోతి
జయశంకర్ భూపాలపల్లి	ఎస్సీ(మహిళ)	జక్కు శ్రీ హర్షిణి	కల్లెపు శోభ
మహబూబాబాద్	ఎస్టీ(మహిళ)	అంగోత్ బింయ	ఎస్.వెంకటేశ్వరరెడ్డి
జనగామ	జనరల్	పాగాల సంపత్‌రెడ్డి	గిరబోయిన భాగ్యలక్ష్మి
సిద్దిపేట	మహిళ	వేలేటి రోజాశర్మ	ఆర్.రాజారెడ్డి
మెదక్	బీసీ(మహిళ)	ఆర్. హేమలత	ఎం.లావణ్య రెడ్డి
నల్గొండ	జనరల్	బండా నరేందర్‌రెడ్డి	ఇరిగి పెద్దయ్య
యాదాద్రి భువనగిరి	జనరల్	ఎలిమినేటి సందీప్‌రెడ్డి	ధనావత్ బిక్యునాయక్
సూర్యాపేట	మహిళ	గుజ్జ దీపిక	జి.వెంకట నారాయణ
రంగారెడ్డి	మహిళ	తీగల అనితాహరినాథ్‌రెడ్డి	ఇ.గణేశ్
సంగారెడ్డి	మహిళ	పట్లోళ్ల మంజుశ్రీ	కుంచాల ప్రభాకర్
మేడ్చల్ మల్కాజిగిరి	జనరల్	ఎం.శరత్ చంద్రారెడ్డి	బి.వెంకటేశ్
వికారాబాద్	మహిళ	పట్నం సునీతారెడ్డి	బి.విజయకుమార్
మహబూబ్‌నగర్	జనరల్	ఎస్.స్వర్ణలత	గొల్లపల్లి యాదయ్య
వనపర్తి	జనరల్	రాకాసి లోకనాథ్‌రెడ్డి	జి.వామన్ గౌడ్
జోగులాంబ గద్వాల	బీసీ(మహిళ)	కురువ సరిత	బోయ సరోజమ్మ
నాగర్‌కర్నూల్	ఎస్సీ	పెద్దపల్లి పద్మావతి	రాథూర్ బాలాజీసింగ్
నారాయణపేట	బీసీ	కలాల్ వనజమ్మ	గౌని సురేఖ

కొత్త జడ్పీ పీఠాధీశులు వీరే...

కనుమల్ల విజయ (కరీంనగర్) | దవ వసంత (జగిత్యాల) | పుట్ట మధు (పెద్దపల్లి) | న్యాలకొండ అరుణ (రాజన్న సిరిసిల్ల)
పాగాల సంపత్‌రెడ్డి (జనగామ) | అంగోతు బింధు (మహబూబాబాద్) | మారేపల్లి సుధీర్‌కుమార్ (వరంగల్ అర్బన్) | గండ్ర జ్యోతి (వరంగల్ గ్రామీణ)
కుసుమ జగదీశ్వర్ (ములుగు) | జక్కు శ్రీహర్షిణి (జయశంకర్ భూపాలపల్లి) | తీగల అనితరెడ్డి (రంగారెడ్డి) | మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి (మేడ్చల్)
పట్లోళ్ల మంజుశ్రీ (సంగారెడ్డి) | పట్నం సునీతారెడ్డి (వికారాబాద్) | దాదన్నగారి విఠల్‌రావు (నిజామాబాద్) | డఫేదార్ శోభ (కామారెడ్డి)
కోరం కనకయ్య (భద్రాద్రి కొత్తగూడెం) | లింగాల కమల్‌రాజ్ (ఖమ్మం) | ఎలిమినేటి సందీప్‌రెడ్డి (యాదాద్రి భువనగిరి) | బండా నరేందర్‌రెడ్డి (నల్గొండ)
గుజ్జ దీపిక (సూర్యాపేట) | కొరిపెల్లి విజయలక్ష్మి (నిర్మల్) | కోవ లక్ష్మి (కుమురం భీం) | నల్లాల భాగ్యలక్ష్మి (మంచిర్యాల)
రాథోడ్ జనార్దన్ (అదిలాబాద్) | హేమలత (మెదక్) | రోజాశర్మ (సిద్దిపేట) | లోకనాథ్‌రెడ్డి (వనపర్తి)
స్వర్ణ సుధాకర్‌రెడ్డి (మహబూబ్‌నగర్) | కె.సరిత (జోగులాంబ గద్వాల) | పి.పద్మావతి (నాగర్‌కర్నూల్) | కె.వనజ (నారాయణపేట)

మావి చరిత్రాత్మక విజయాలు

- జడ్పీలన్నింటిలోనూ గెలుపు
- ఛైర్‌పర్సన్ పదవుల్లో సామాజిక సమతూకం
- రాష్ట్రంలో విపక్షం అక్కర్లేదని ప్రజలనుకుంటున్నారు
- కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు లేదు
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

నాడు తెరాస ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యల క్లిప్పింగ్‌ను చూపుతున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో 32 జిల్లా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోఆప్షన్ స్థానాలను నూటికి నూరుశాతం తెరాస దక్కించుకొని కొత్త చరిత్ర సృష్టించిందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలు చరిత్రాత్మక విజయాలను అందించారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. విపక్ష పార్టీలకు దారుణ పరాభవం ఎదురైందని చెప్పారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, ఉపాధ్యక్షుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించామని, ఎస్సీఎస్టీబీసీ, మైనారిటీలకు పెద్దపీట వేశామని తెలిపారు. గెలిచిన అభ్యర్థులు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పే మాటలను ఆచరించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజాసేవ చేయాలని సూచించారు. గ్రామ స్వరాజ్యం సాధనే లక్ష్యంగా పనిచేయాలని ఎన్నికైన అభ్యర్థులకు సూచించారు. రాష్ట్రంలో అసలు ప్రతిపక్షమే అవసరం లేదని ప్రజలు భావిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. శనివారం జడ్పీ ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం ఆయన తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆరికపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, గణేశ్‌గుప్తా, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి లతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

"తెలంగాణలో 32 జిల్లా పరిషత్‌లతో పాటు, 85 శాతానికి పైగా ఎంపీపీ స్థానాలను తెరాస కైవసం చేసుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో విజయంతో తెరాసకు ప్రాత్యామ్నాయం తామేనని చెప్పిన ఆ రెండు ప్రధాన పార్టీలు ఓటమి పాలయ్యాయి. ఆరు జిల్లాల్లో తెరాస మొత్తం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను సాధించడం మా ప్రజాదరణకు నిదర్శనం. వైస్‌పర్సన్, ఉపాధ్యక్ష ఎంపికలో సామాజిక సమతూకం పాటించాం. 50 శాతానికి పైగా వైస్‌పర్సన్ స్థానాలను బలహీనవర్గాలకు ఇచ్చాం. మొత్తం 32లో 17 ఎస్సీఎస్టీబీసీ, మైనారిటీలకు ఇచ్చాం. 15 ఓసీలకు కేటాయించాం. 32 ఉపాధ్యక్ష స్థానాల్లో 23 బలహీనవర్గాలకు కేటాయించాం. తొమ్మిది ఓసీలకు ఇచ్చాం. కొత్తగా ఎన్నికైన జడ్పీ వైస్‌పర్సన్‌లకు శుభాకాంక్షలు. ఇంతటి ఘన విజయాలను అందించిన ప్రజలకు కృతజ్ఞతలు.

ఆ సంస్కృతి కాంగ్రెస్‌దే

ప్రజాస్వామ్యం గురించి కాంగ్రెస్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమే. వారు చేస్తే ఒప్పు.. ఇతరులు చేస్తే తప్పు అనడం సరికాదు. అసలు దేశంలో ప్రజాప్రతినిధులు పార్టీలు మార్చేలా ప్రోత్సహించిందే కాంగ్రెస్ పార్టీ. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలకు ముందు కూడా మా పార్టీ ఎంపీ, ఎమ్మెల్యీలను చేర్చుకోవడం గుర్తు లేదా? అప్పుడు ప్రజాస్వామ్య విలువలు ఆ పార్టీ నేతలకు గుర్తు రాలేదా? వాళ్లతో పోలిస్తే మేం చాలా మర్యాదగా వ్యవహరించాం. రాజ్యాంగబద్ధంగానే విలీనం జరిగినట్లు సభాపతి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసిన తీరును ప్రజలు చూసి నవ్వుతున్నారు. అయినా పార్టీ మార్పిడులు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. సాక్షాత్తూ ప్రధాని మోదీనే పశ్చిమబెంగాల్‌కు వెళ్లి మాతో 40 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు, 50 మంది కౌన్సిలర్లు టీఎంసీ నుంచి బాజపాలో చేరారు. రాహుల్‌గాంధీ ఎంతో మందికి కాంగ్రెస్ కండువా కప్పుతున్నారు.

కలిసి వస్తానంటే వద్దనం

తెరాస పార్టీతో మేము కలిసి వస్తాం అంటే మేము వద్దనలేం కదా! మా పార్టీ నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు ఉత్తమ్ వద్దకు వెళ్లి చేరతామంటే వద్దంటారా? రాష్ట్రంలో అన్ని ఎన్నికల్లో తెరాసకు ప్రజలు ఘనవిజయం అందిస్తున్నారు. ప్రజలే ప్రతిపక్షం అవసరం లేదని భావిస్తున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇది ప్రజా విజయం: కేసీఆర్

కొత్త జడ్పీ, మండల పరిషత్ అధ్యక్షులకు శుభాకాంక్షలు

పంచాయతీరాజ్ వ్యవస్థలో అనితర సాధ్యమైన రీతిలో తెరాస అద్భుత విజయాలను సాధించారని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. పల్లెపల్లెనా ఇది ప్రజా విజయమన్నారు. రాష్ట్రంలోని కొత్త మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులకు, ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులకు ఆయన శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ఇంత పెద్దఎత్తున విజయం అందించిన ప్రజలకు, ఓటర్లకు ధన్యవాదాలు చెప్పారు. విశేష కృషి చేసి తెరాసకు అఖండ విజయం సాధించిపెట్టారని పార్టీ కార్యకర్తలు, నేతలను ఆయన అభినందించారు. ప్రజాప్రతినిధులుగా వారంతా రాణించాలని, ప్రజలకు సేవ అందించాలని సీఎం ఆకాంక్షించారు.

జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన అనంతరం మంత్రి ఎర్రబెల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న బిందు

23 ఏళ్లకే జడ్పీ పీఠం

ఈనాడు డిజిటల్, మహబూబాబాద్: తన చిన్నమ్మ అయిన ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని మహబూబాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ అంగోతు బింధు పేర్కొన్నారు. 23 ఏళ్లకే ఆమె ఈ పదవిని చేపట్టారు. చిన్న వయసులోనే జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికవడం సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. బింధు 2018లో హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేశారు.

స్త్రీశక్తిపీఠం..!

- జోగులాంబ కొలువైన అలంపూర్ మండలంలో అతివల రాజ్యం
- జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలన్నింటా మహిళలే విజేతలు

శంషాద్ ఇస్మాయిల్ బేగం, జడ్పీటీసీ సభ్యురాలు | పింజరీ బేగం, ఎంపీపీ (కాశీపురం ఎంపీటీసీ) | అనూరాధ, వైస్ ఎంపీపీ (క్యాతూరు ఎంపీటీసీ)

జోగులాంబ అమ్మవారు కొలువైన శక్తిపీఠం.. పరిషత్ ఎన్నికల్లో మరో ప్రత్యేకతను చాటుకుంది. అలంపూర్ మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలన్నింట్లోనూ అతివలే కొలువుదీరడం విశేషం. ఇక్కడి ప్రజలు రాజకీయ అనుభవం ఉన్న పురుషులను కూడా కాదని.. రిజర్వేషన్లకు అతీతంగా జనరల్ స్థానాల్లోనూ మహిళలకే పట్టంకట్టారు. మండలంలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలన్నింట్లో మహిళలను ఎన్నుకుని కొత్త చరిత్ర లిఖించారు.

వంద శాతం అక్షరాస్యత కలిగిన మండలంగా అలంపూర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. శాసనసభ నియోజకవర్గ కేంద్రమైన ఈ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానం ఉన్నాయి. మొన్నటివరకు ఎంపీపీగా ఉన్న శంషాద్ ఇస్మాయిల్ బేగం(32) ఈ సారి జడ్పీటీసీ పదవికి పోటీ చేసి విజయం సాధించారు. బుక్కాపురం, సుల్తానాపురం, క్యాతూరు ఎంపీటీసీ స్థానాలు వివిధ కేటగిరీల కింద జనరల్ స్థానాలైనప్పటికీ.. ఆయాచోట్ల మహిళలు మంచి ఆధిక్యంతో పురుషులపై విజయం సాధించడం విశేషం. శనివారం జరిగిన పరోక్ష ఎన్నికలో పింజరీ బేగం ఎంపీపీగా, అనూరాధ వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. మహిళల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని, సమర్థ పాలకులుగా నిరూపించుకుని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వారంతా చెబుతున్నారు. రాష్ట్ర సరిహద్దులోని మండలం కావటంతో ఇక్కడివారు ఎక్కువగా 'స్థానికత' సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. జోగులాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరుడి ఆలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

–ఈనాడు, మహబూబ్‌నగర్ డెస్క్

తెరాస, కాంగ్రెస్ వర్గాల మధ్య దాడులు

- కొత్తూరులో హింస..విధ్వంసం

ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన గోపి

తమ్మారం (మొళ్లచెరువు), న్యూటౌడే: అధిపత్య పోరు..సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని కొత్తూరులో శనివారం కాంగ్రెస్, తెరాస వర్గీయుల పరస్పర దాడులకు దారితీసింది. కాంగ్రెస్ వర్గీయులు మూకుమ్మడిగా తెరాసకు చెందినవారి ఇళ్లల్లోకి దూసుకెళ్లారు. వస్తు సామగ్రిని ధ్వంసం చేశారు. అడ్డొచ్చినవారిపై దాడులకు దిగారు. ఈ సంఘటనల్లో అయిదుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎంపీపీ ఎన్నిక అనంతరం కొత్తూరులో శుక్రవారం రాత్రి ఎంపీటీసీ సభ్యురాలు (తెరాస) మారుడి సైదమ్మ, పార్టీ ఇతర నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆ క్రమంలో కాంగ్రెస్, తెరాస వర్గీయులమధ్య వివాదం చెలరేగింది. సర్పంచి అరుణ (కాంగ్రెస్) ఇంటిపైకి కొందరు రాళ్లు విసిరారు. అదే సమయంలో ఇరువర్గాలవారూ పరస్పరదాడుల దిగారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చెదరగొట్టారు. మళ్లీ శనివారం ఉదయం కాంగ్రెస్ వర్గీయులు తెరాస వారి ఇళ్లపై రాళ్లు రువ్వారు. కర్రలు, గడ్డపారలతో ఇళ్లలోపలికి దూసుకెళ్లి దాడులతో పాటు ద్విచక్ర వాహనాలు, కూలర్లు, తలుపులు, ఇతర వస్తుసామగ్రిని ధ్వంసం చేశారు. శ్రీనివాసాచారి, మాజీ సర్పంచి మల్లిరెడ్డి ఆదిలక్ష్మి, మారుడి మోహన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఇళ్లల్లోని సామగ్రి ధ్వంసమైంది. నర్సింహారెడ్డి, మారుడి వెంకటరెడ్డి, నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, జానకమ్మలకు గాయాలయ్యాయి. గ్రామాన్ని డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి, సీఐ రవి సందర్శించి బాధితుల ఇళ్లను పరిశీలించారు. ఫిర్యాదు మేరకు నర్సిరెడ్డి, అబ్బుల్, గనీతో పాటు 40మందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీ జరిపినందుకు నిర్వాహకులపైనా కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో పికెటింగ్‌ను చింతలపాలెం, అనంతగిరి ఎస్సైలు నగేష్, రామాంజనేయులు ఏర్పాటు చేశారు. తమ వర్గానికి చెందిన గోపి, వెంకటరెడ్డి, రవి, జానీమియా, కృష్ణమూర్తి, నర్సింహారెడ్డి గాయపడ్డారని సర్పంచి అరుణ తెలిపారు. ఈ ఫిర్యాదుపైనా దర్యాప్తు చేపడతామని డీఎస్పీ చెప్పారు.

ఏ ఫార్మాట్లో అయినా సరే.. ప్రస్తుతం స్మిత్ అత్యుత్తమ బ్యాట్స్‌మన్. అతను ఒక ప్రణాళికతో బ్యాటింగ్ చేస్తున్నాడు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో అతడి బ్యాటింగ్ మా అందరికీ ఒక పాఠం. కోహ్లీ లాంటి ఆటగాళ్లకు కుదురుకునే అవకాశమిస్తే ఆపడం కష్టం. రోహిత్ అయినా అంతే. వీరిని సాధ్యమైనంత త్వరగా పెవిలియన్‌కు చేర్చాలి. అలాగని కేవలం ఒక రిద్దరిపై దృష్టిసారించలేం. ధోని, ధవన్ కూడా ప్రమాదకారులే.

– ఫించ్, ఆస్ట్రేలియా కెప్టెన్

136

భారత్, ఆస్ట్రేలియా తలపడ్డ వన్డేలు. భారత్ 49 మ్యాచ్‌లో గెలిస్తే.. ఆస్ట్రేలియా 77 నెగ్గింది. 10 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. ప్రపంచకప్‌లో రెండు జట్లు 11 మ్యాచ్‌లు ఆడాయి. 8 మ్యాచ్‌లు ఆస్ట్రేలియా గెలిస్తే.. మూడు మాత్రమే భారత్ నెగ్గింది. చివరగా 2015 ప్రపంచకప్ సెమీస్‌లో రెండు జట్లూ తలపడగా.. ఆస్ట్రేలియానే గెలిచింది.

వార్నర్ షాట్.. ఆస్పత్రిలో బౌలర్

లండన్: ఆస్ట్రేలియా నెట్ ప్రాక్టీస్‌లో దురదృష్టకర ఘటన చేసుకుంది. వార్నర్ షాట్‌కు ఓ నెట్ బౌలర్ తలకు తీవ్ర గాయం కావడం అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఆ బౌలర్ ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. భారత్‌తో ఆదివారం మ్యాచ్ నేపథ్యంలో శనివారం ప్రాక్టీస్ సందర్భంగా జరిగిందీ ఘటన. వార్నర్ బలమైన డ్రైవ్‌ను ఆడ్డుకునే ప్రయత్నంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఫాస్ట్‌బౌలర్ జైకిషన్ గాయపడ్డాడు. తలకు బంతి బలంగా తగలడంతో అతడు నొప్పితో విలవిల్లాడుతూ కుప్పకూలిపోయాడు. వెంటనే వైద్య సిబ్బంది అక్కడికి వచ్చారు. ఆస్ట్రేలియా ఆటగాళ్లంతా అతడి చుట్టూ గుమిగూడారు. జైకిషన్ స్పృహలోనే ఉండడం, చికిత్సకు స్పందించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

చాంపియన్

నేడు ఆస్ట్రేలియాతో కీలక పోరు

మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఇది గెలిస్తే...

ఈసారి ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగుతున్న కోహ్లీసేనకు, టైటిల్‌కు మధ్యగా అడ్డుగా నిలిచే జట్లుగా అందరూ పేర్కొంటున్నది ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలనే. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగుతున్న టోర్నీలో ఈ రెండు జట్లనూ లీగ్ దశలో ఎదుర్కోబోతోంది టీమ్‌ఇండియా. నాకౌట్‌కు చేరాలన్నా.. నాకౌట్లో వీటిని ధీమాగా ఎదుర్కోవాలన్నా.. లీగ్ దశలో వాటిని ఓడించడం కీలకం. వీటిలో ఒకటి టోర్నీ ఆరంభ దశలోనే కోహ్లీసేనకు ఎదురవుతోంది. దక్షిణాఫ్రికాను ఓడించి టోర్నీలో శుభారంభం చేసిన టీమ్‌ఇండియా.. ఆదివారం తన రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఢీకొంటోంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే భారత జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు కావడం, సెమీస్‌కు బాటలు పరుచుకోవడం ఖాయం.

8

ఆస్ట్రేలియాతో మ్యాచ్ ఆడబోయే ఓవల్ మైదానంలో భారత్ ఆడిన వన్డేలు. రెండు మాత్రమే నెగ్గి ఐదు ఓడిపోయింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. ఈ మ్యాచ్ లన్నింట్లో భారత్ ప్రత్యర్థి ఇంగ్లాండే.

- కోహ్లీ సేనకు కఠిన సవాల్
- నెగ్గితే సెమీస్ రేసులో ముందడుగే

లండన్

వన్డే ప్రపంచకప్‌లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. కప్పుపై కన్నేసిన భారత్, ఆస్ట్రేలియా ఆదివారం కెనింగ్టన్ ఓవల్ మైదానంలో లీగ్ మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. రెండు జట్లలో ప్రపంచకప్‌లో తొలి ఓటమి రుచి చూసేదెవరో మరి? ఈ రెండు జట్ల అభిమానులే కాదు.. మొత్తం క్రికెట్ ప్రపంచం ఆమితాసక్తితో చూడబోయే మ్యాచ్ ఇదనడంలో సందేహం లేదు. బలాబలాల్లో సమానంగా కనిపిస్తున్న ఈ రెండు జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగుతుందని అంచనా. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిచినా.. ఆత్మవిశ్వాసం ఎంతగానో పెరుగుతుంది. ఈ నెల 16న పాకిస్థాన్‌ను ఢీకొనబోతున్న భారత్.. ఆస్ట్రేలియాను ఓడించిన ఊపుతో ఆ మ్యాచ్‌కు వెళ్లాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో కోహ్లి, రోహిత్, ధోని.. బౌలింగ్‌లో బుమ్రాపై భారత్ ఎన్నో ఆశలతో ఉంది.

పరుగుల పండేనా: ఓవల్ పిచ్ ప్రధానంగా బ్యాటింగ్‌కు అనుకూలం. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటిదాకా ఇక్కడ జరిగిన మూడు మ్యాచ్‌ల్లో రెండింట్లో స్కోర్లు 300 దాటాయి. బంగ్లాదేశ్ లాంటి జట్టు దక్షిణాఫ్రికాపై 330 పరుగులు చేయడం గమనార్హం. మూడు మ్యాచ్‌ల్లోనూ ఫాస్ట్‌బౌలర్లు సత్తా చాటారు. బంగ్లాపై హెన్రీ, దక్షిణాఫ్రికాపై ఆర్చర్ చెలరేగిన తీరు చూస్తే ఆదివారం బుమ్రాతో కంగారూలకు.. స్టార్క్, కమిన్స్‌లతో భారత బ్యాట్స్‌మెన్‌కు చిక్కులు తప్పకపోవచ్చు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగే ఎంచుకునే అవకాశముంది.

ఆ ముగ్గురు..

కొన్ని నెలల కిందటి వరకు ఆస్ట్రేలియాకు బ్యాటింగ్ పెద్ద తలనొప్పిగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ విభాగం బలంగా తయారైంది. నిషేధం పూర్తి చేసుకుని పోటీ క్రికెట్లోకి అడుగుపెట్టిన వెంటనే వార్నర్ ఫామ్ చాటుకున్నాడు. వెస్టిండీస్‌పై విఫలమైనప్పటికీ.. భారత బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొనే వార్నర్‌తో ముప్పు తప్పదు. ఇక నిషేధం తర్వాత అరంభంలో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్న స్మిత్.. తర్వాత నిలకడగా ఆడుతున్నాడు. గత మ్యాచ్‌లో ఆసీస్‌ను నిలబెట్టింది అతనే. భారత జట్టుపై అతడికి చాలా మంచి రికార్డుంది. ఇక విధ్వంసక వీరుడు మ్యాక్స్‌వెల్ ఎంత ప్రమాదకారో, భారత్‌పై పలుమార్లు ఎలా చెలరేగాడో తెలిసిందే. బాగస్వామ్యాలు నెలకొల్పడంలో, సమయానుకూలంగా ఎదురుదాడి చేయడంలో వీరు నివుణులు. ఆరంభంలో వార్నర్‌ను ఆపడం బుమ్రా, చివర్లో మ్యాక్స్‌వెల్ చెలరేగిపోకుండా చూసుకోవడం బుమ్రా బాధ్యత. మధ్య ఓవర్లలో కీలక పాత్ర పోషించే అవకాశమున్న స్మిత్‌ను పాండ్య, స్పిన్నర్లు ఎలా కట్టడి చేస్తారో చూడాలి. ఉన్న కాసేపట్లో విధ్వంసం సృష్టించే ఫించ్‌పైనా భారత బౌలర్లు ఓ కన్నేయాల్సిందే.

ఈ ముగ్గురు..

గత ఏడాది కాలంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ వల్ల ఎక్కువ సమస్యలు ఎదుర్కొంది కానీ.. ఆ జట్టు బౌలింగ్ బాగానే సాగుతోంది. స్టార్క్, కమిన్స్ లాంటి ప్రపంచస్థాయి ఫాస్ట్‌బౌలర్లు ఆ జట్టు సొంతం. వేగం, కచ్చితత్వం, వైవిధ్యం.. ఎందులో అయినా వీళ్లిద్దరికీ తిరుగులేదు. ప్రపంచకప్ రెండు మ్యాచ్‌ల్లోనూ వీళ్లిద్దరూ సత్తా చాటారు. ఓవల్ పిచ్ ఫాస్ట్‌బౌలర్లకు అనుకూలిస్తుంది కాబట్టి ఈ జోడీని ఎదుర్కోవడం భారత బ్యాట్స్‌మెన్‌కు సవాలే. ముఖ్యంగా పేస్ పిచ్‌లపై నిఖార్సయిన ఫాస్ట్‌బౌలర్లను ఎదుర్కోవడానికి ఇబ్బంది పడే ఓపెనర్లు రోహిత్, ధావన్‌లకు స్టార్క్, కమిన్స్‌ల నుంచి పరీక్ష ఎదురవడం ఖాయం. ఓపెనర్లు సంయమనంతో ఆడటం కీలకం. ఆరంభంలో వికెట్ పడితే ఇన్నింగ్స్‌ను నిలబెట్టాల్సిన బాధ్యత కోహ్లీదే. రాహుల్ కూడా తన వంతు పాత్ర పోషించాల్సి ఉంది. స్టార్క్, కమిన్స్‌ల తర్వాత ఎక్కువ ముప్పు పొంచి ఉన్నది స్పిన్నర్ జంపా నుంచే. భారత్‌పై అతడికి మంచి రికార్డు ఉంది.

వీళ్లతోనే ముప్పు

ప్రపంచకప్‌లో భారత్ లాగే చక్కటి సమతూకం ఉన్న జట్టు ఆస్ట్రేలియా. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ ఆ జట్టుకు నాణ్యమైన ఆటగాళ్లున్నారు. ఐతే రెండు విభాగాల్లోనూ ప్రధానంగా ముగ్గురు ముగ్గురు ఆటగాళ్లు భారత్‌కు సవాలు విసిరే అవకాశముంది.

షమి వస్తున్నాడా?

చక్కటి ఫామ్‌లో ఉన్న మహ్మద్ షమిని తొలి మ్యాచ్‌లో ఆడించకపోవడం, ఇద్దరు స్పిన్నర్లను ఎంచుకోవడం ఆశ్చర్యకరమే. ఐతే స్పిన్ ఆడటంలో దక్షిణాఫ్రికా బలహీనతను దృష్టిలో ఉంచుకునే ఇద్దరు స్పిన్నర్లను ఆ మ్యాచ్‌కు ఎంపిక చేశారు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ స్పిన్ ఆడటంలో దిట్టలే. భారత గడ్డ పైనే స్పిన్నర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. ఓవల్ పిచ్ పేసర్లకే ఎక్కువ అనుకూలం కాబట్టి.. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌కు స్పిన్నర్ ఒకరే ఉండే అవకాశముంది. మరి తొలి మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన చేసిన చాహల్‌ను ఎంపిక చేస్తారా.. ఆస్ట్రేలియాపై మంచి రికార్డున్న కుల్‌దీప్‌కు అవకాశమిస్తారా అన్నది ఆసక్తికరం. ఒక స్పిన్నర్‌ను తగ్గించుకుని షమిని ఆడించడం దాదాపు ఖాయం. తొలి మ్యాచ్‌లో బుమ్రా అంచనాల్ని అందుకుంటూ విజృంభించాడు. భువనేశ్వర్ తొలి స్పెల్‌లో సాధారణంగానే కనిపించినా.. రెండో స్పెల్‌లో ఆకట్టుకున్నాడు. వీరికి షమి తోడైతే పేస్ మరింత పదునెక్కుతుందనడంలో సందేహం లేదు.

తానాడిన చివరి ఐదు వన్డేల్లోనూ ఆస్ట్రేలియా విజయం సాధించింది. భారత్ తన చివరి 5 వన్డేల్లో రెండే గెలిచింది.

నన్ను ఆడించరేమో

లండన్: వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో 92 పరుగులు చేసి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా అందుకున్నాడు కౌల్టర్‌నైల్. అయితే తనను భారత్‌తో మ్యాచ్‌లో ఆడించరేమో అంటున్నాడతను. "వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో నేను వికెట్ తీయకుండా 70 పరుగులిచ్చాను. రెండు మ్యాచ్‌ల్లోనూ వికెట్లు తీయలేకపోయాను. నేను జట్టులో ఉన్నది పరుగులు చేయడానికి కాదు. ఆ పని టాప్ ఆర్డర్ చేస్తుందని ఆశిస్తున్నా. తర్వాతి మ్యాచ్‌కు నన్ను తుది జట్టు నుంచి తప్పిస్తే ఆశ్చర్యపోను" అని కౌల్టర్‌నైల్ చెప్పాడు.

భారతే.. నా ఫేవరెట్!

జెఫ్ థాంప్సన్

ప్రస్తుతం ప్రపంచంలో భారత్‌దే అత్యుత్తమ పేసదళం. ఇందులో సందేహం లేదు. ఎలాంటి టాప్ ఆర్డర్‌నైనా భువనేశ్వర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ భయపెట్టగలరు. స్వింగ్, బౌన్స్, యార్కర్.. ఇలా ఎలాంటి బంతులునైనా వీరు సంధించగలరు. చాహల్, కుల్‌దీప్‌లతో భారత్ స్పిన్ విభాగం కూడా పటిష్ఠంగా ఉంది. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో వీరిద్దరు చాలా ప్రభావం చూపిస్తున్నారు. మరోవైపు ఆదివారం పోరులో ఆస్ట్రేలియా విజయం సాధించాలంటే డేవిడ్ వార్నర్ రాణించడం కీలకం. ఎందుకంటే విండీస్‌తో మ్యాచ్‌లో ఆసీస్ టాప్ ఆర్డర్ తడబాటుకు లోనైంది. మిడిలార్డర్ కూడా చాలా జాగ్రత్తగా ఆడాలి. చాహల్, కుల్‌దీప్ సవాల్‌ను ఎదుర్కొవడం అంత తేలిక కాదు. చాహల్, కుల్‌దీప్ కాకుండా పాండ్య రూపంలో వికెట్ తీయగల ఆల్‌రౌండర్ కూడా భారత్‌కు ఉన్నాడు. కాబట్టి ఈ మ్యాచ్‌లో నా ఫేవరెట్ టీమ్‌ఇండియానే.



అతడి తొలి స్పెల్‌లో వికెట్లు కోల్పోవద్దు

హర్ష భోగ్లే

కంగారూలతో ప్రపంచకప్ పోరుకు భారత్ సన్నద్ధమైంది. రెండు జట్లకూ తమ బలాలు, బలహీనతలేంటో బాగా తెలుసు. దక్షిణాఫ్రికాపై రోహిత్‌శర్మ గొప్పగా ఆడాడు. ఒత్తిడిలో స్థిరంగా ఆడి సెంచరీ సాధించడమే కాక జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అంతకుముందు సఫారీ జట్టును బుమ్రా అద్భుత బౌలింగ్‌తో కట్టడి చేశాడు. అతనిప్పుడు గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తున్నాడు. భారత్

విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమిని కొద్దిలో తప్పించుకుంది. వాళ్లకు విండీస్ బౌలర్ నుంచి అనూహ్యమైన పేస్, బౌన్స్ ఎదురైంది. మిచెల్ స్టార్క్, మళ్లీ ఫామ్‌లోకి రావడం ఆస్ట్రేలియాకు ఆనందం కలిగిస్తే.. భారత్‌కు ఆందోళన కలిగించే పరిణామమే. అతని తొలి స్పెల్‌లో వికెట్లు కోల్పోకుండా ఆడడమే కీలకం.

ఆ పర్యటనే మార్చింది

సౌరభ్ గంగూలీ

ప్రపంచకప్‌లో రెండు బలమైన జట్లు.. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం కీలక పోరు జరగనుంది. ఈ మ్యాచ్ ఫలితం ద్వారా.. ఏ జట్టు పటిష్ఠంగా ఉండో, ప్రపంచకప్ చివరివరకు చేరగలిగే మానసిక స్థైర్యం ఏ జట్టుకు ఉందో తేలనుంది. విండీస్‌పై సాధించిన విజయం గత ఆరు నెలల్లో ఆస్ట్రేలియా పడిన కష్టాన్ని స్పష్టం చేసింది. భారత పర్యటన వాళ్ల తలరాతను మార్చింది. ఆ సిరీస్ విజయం ఆస్ట్రేలియాను తిరిగి గాడినపడేలా చేసింది. ఓవల్‌లో పిచ్ బాగానే ఉంది. కానీ గత రెండ్రోజులుగా అక్కడ వర్షం పడుతుండడం మ్యాచ్‌పై ప్రభావం చూపనుంది. ఆస్ట్రేలియా బౌలింగే కాదు.. బ్యాటింగూ బలంగానే ఉంది. ఐతే భారత స్పిన్ ద్వయం చాహల్, కుల్‌దీప్ నుంచి ఆ జట్టు బ్యాట్స్‌మెన్‌కు సవాళ్లు ఎదురుకానున్నాయి.

"ఇది నమ్మశక్యంగా లేదు. మాటలు రావట్లేదు. ఫైనల్లో పూర్తిస్థాయి ప్రదర్శన చేశా. నా పట్ల, నా బృందం పట్ల ఎంతో గర్వంగా ఉన్నా. ఈ రెండు వారాలు అద్భుతంగా గడిచాయి"
– బార్టీ

"బార్టీకి అభినందనలు. నువ్వు నాకో పాఠం నేర్పావు. ఫైనల్లో గెలవకపోయినా ఇక్కడివరకు వచ్చినందుకు ఆనందంగా ఉంది"
- మార్కెటా



ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్ నేడు

నాదల్ × థీమ్

సాయంత్రం 6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	టై/ర	పా	నె.రేట్
న్యూజిలాండ్	3	3	0	0	6	+2.163
ఇంగ్లాండ్	3	2	1	0	4	+1.307
ఆస్ట్రేలియా	2	2	0	0	4	+1.059
శ్రీలంక	3	1	1	1	3	−1.517
పాకిస్థాన్	3	1	1	1	3	−2.412
వెస్టిండీస్	2	1	1	0	2	+2.054
భారత్	1	1	0	0	2	+0.302
బంగ్లాదేశ్	3	1	2	0	2	−0.714
దక్షిణాఫ్రికా	3	0	3	0	0	−0.952
అఫ్గానిస్థాన్	3	0	3	0	0	−1.493

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్

టీమ్‌ఇండియాకు భారతీయ వంటకాలు

లండన్: ప్రపంచకప్ వేటలో ఉన్న భారత ఆటగాళ్లకు తిండి పరంగా ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటోంది బీసీసీఐ. ఈ మేరకు ఇంగ్లాండ్‌లోని స్థానిక భారత హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం అన్ని రకాల భారతీయ వంటకాలు ఆటగాళ్ల ఏ స్టేడియానికి వెళ్లినా లభ్యమయ్యేలా చూస్తోంది. అన్ని స్టేడియాలకు సమీపంలో ఇండియన్ రెస్టారెంట్లు ఉండడంతో టీమ్‌ఇండియా ఆటగాళ్లకు వేడి వేడి వంటలు సులభంగా దొరుకుతున్నాయి.

చాంపియన్స్

పాకిస్థాన్ చేతిలో అనూహ్య ఓటమి చవిచూసిన ఇంగ్లాండ్ వెంటనే పుంజుకుంది. మళ్లీ తనదైన శైలిలో పరుగుల వరద పారించింది. జేసన్ రాయ్ భారీ శతకంతో ప్రపంచకప్‌లో తన అత్యధిక స్కోరు నమోదు చేసిన ఆతిథ్య జట్టు.. బంగ్లాదేశ్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కొండంత ఛేదనలో బంగ్లా చాలా ముందే చేతులెత్తేసింది. షకిబ్ శతకం వృథా అయింది.

ఇంగ్లాండ్ దంచేసింది

బంగ్లాదేశ్ చిత్తు చిత్తు • జేసన్ రాయ్ భారీ సెంచరీ

కార్టిఫ్

ఇంగ్లాండ్ అదరగొట్టింది. శనివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 106 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. జేసన్ రాయ్ (153; 121 బంతుల్లో 14×4, 5×6)తోపాటు బట్లర్ (64; 44 బంతుల్లో 2×4, 4×6), బెయిర్‌స్టో (51; 50 బంతుల్లో 6×4) విరుచుకుపడడంతో మొదట ఇంగ్లాండ్ 6 వికెట్లకు 386 పరుగులు చేసింది. స్టార్క్ (3/23), ఆర్చర్ (3/29), వుడ్ (2/52) ధాటికి చేదనలో బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో 280 పరుగులకే ఆలౌటైంది. షకిబ్ అల్ హసన్ (121; 119 బంతుల్లో 12×4, 1×6) పోరాటం ఏమాత్రం సరిపోలేదు. జేసన్ రాయ్‌కి 'మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

షకిబ్ మెరిసినా..: అంత భారీ లక్ష్యాన్ని ఛేదించడం చాలా కష్టమైన పనే. పైగా బంగ్లాదేశ్ 12 ఓవర్లలో 63 పరుగులకే ఓపెనర్లు సౌమ్య సర్కార్ (2), తమీమ్ ఇక్బాల్ (19)లను ఇద్దరినీ కోల్పోయింది. కానీ షకిబ్.. ఇంగ్లాండ్ పని మరీ అంత తేలిక కాని వ్వలేదు. చక్కని బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును నడిపించాడు. ముష్ఫికర్ రహీమ్ (44; 50 బంతుల్లో 2×4) పరిస్థితిని చక్కదిద్దాడు. దీంతో బంగ్లా 28.5 ఓవర్లలో 169/2తో నిలిచింది. అప్పటికి చేయాల్సిన రన్‌రేట్ పది దాటిపోయినా.. బంగ్లా గట్టి పోటీ ఇస్తుందేమో అనిపించింది. కానీ ఒక్క పరుగు తేడాతో ముష్ఫికర్, మిథున్ (0)లను ఫ్లంకెట్, రషీద్ ఔట్ చేయడంతో ఆ జట్టుకు గట్టి దెబ్బ తగిలింది. 95 బంతుల్లో శతకం పూర్తి చేసి జోరుమీదున్న షకిబ్‌ను 40వ ఓవర్లో స్టార్క్ ఔట్ చేయడంతో బంగ్లాదేశ్ ఓటమి ఖాయమైపోయింది. బంగ్లా చివరి పది ఓవర్లలో విజయానికి 163 పరుగులు చేయాల్సిన స్థితిలో..మెరిసిన ఆట లాంచనమే అయింది.

రాయ్ విధ్వంసం: విధ్వంసక జట్టుగా తనకున్న పేరుకు తగినట్లే ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ పరుగుల వరదపారిస్తోంది. టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ మూడొందలు దాటింది. బంగ్లా బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ ఓపెనర్ జేసన్ రాయ్ కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్ వీర బాదుడుకు నాయకత్వం వహించాడు. అతడి రెండు కీలక భాగస్వామ్యాలు.. ఓపెనర్ బెయిర్‌స్టోతో తొలి వికెట్‌కు 128, రూట్ (21) రెండో వికెట్‌కు 77 పరుగులు, ఇంగ్లాండ్ భారీ స్కోరుకు బాటలు వేశాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్.. రాయ్, బెయిర్‌స్టో దూకుడుతో తొలి పవర్ ప్లే ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 67 పరుగులు చేసింది. ఆ తర్వాత 15వ ఓవర్లో 100 దాటింది. 20వ ఓవర్లో మొర్తజా బౌలింగ్‌లో మెహదీ హసన్ అందుకున్న ఓ కళ్లు చెదిరే క్యాచ్‌కు బెయిర్‌స్టో నిష్క్రమించినా రాయ్ జోరు కొనసాగించాడు. 27వ ఓవర్లో శతకం (92 బంతుల్లో) పూర్తి చేసుకున్న అతడు.. ఆ తర్వాత దూకుడు మరింత పెంచాడు. షకిబ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6 దంచేశాడు. ఆ తర్వాత మెహదీ హసన్ వేసిన ఇన్నింగ్స్ 35వ ఓవర్లో వరుసగా మూడు సిక్స్‌లు బాదాడు. నాలుగో సిక్స్ దంచబోయి క్యాచ్ ఔటయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు 235. అంతకు కొన్ని ఓవర్ల ముందే రూట్ ఔటయ్యాడు. రాయ్ 100 నుంచి 150కు చేరుకోవడానికి 28 బంతులే ఆడడం విశేషం. రాయ్ ఔటైనా బట్లర్, మోర్గాన్ (35; 33 బంతుల్లో 1×4, 2×6) జోడీ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. బట్లర్ ఎక్కువ దూకుడుతో ఆడాడు. ముసాదెక్ ఓవర్లో అతడు రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ దంచాడు. నాలుగో వికెట్‌కు 95 పరుగులు జోడించిన బట్లర్ 46వ ఓవర్లో, జట్టు స్కోరు 330 వద్ద ఔటయ్యాడు. తర్వాత ఓవర్లో మోర్గాన్, ఆ తర్వాతి ఓవర్లోనే స్టోక్స్ (6) కూడా నిష్క్రమించినా.. ఫ్లంకెట్ (27 నాటౌట్; 9 బంతుల్లో 4×4, 1×6), వోక్స్ (18 నాటౌట్; 8 బంతుల్లో 2×6) మెరుపులు మెరిపించడంతో ఇంగ్లాండ్ నాలుగొందలకు చేరువగా వెళ్లింది.

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) మొర్తజా (బి) మెహదీ హసన్ 153; బెయిర్‌స్టో (సి) మెహదీ హసన్ (బి) మొర్తజా 51; రూట్ (బి) సైఫుద్దీన్ 21; బట్లర్ (సి) సౌమ్య సర్కార్ (బి) సైఫుద్దీన్ 64; మోర్గాన్ (సి) సౌమ్య సర్కార్ (బి) మెహదీ హసన్ 35; స్టోక్స్ (సి) మొర్తజా (బి) ముస్తాఫిజుర్ 6; వోక్స్ నాటౌట్ 18; ఫ్లంకెట్ నాటౌట్ 27; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (50 ఓవర్లలో 6 వికెట్లకు) **386; వికెట్ల పతనం:** 1-128, 2-205, 3-235, 4-330, 5-340, 6-341; **బౌలింగ్:** షకిబ్ 10-0-71-0, మొర్తజా 10-0-68-1; సైఫుద్దీన్ 9-0-78-2, ముస్తాఫిజుర్ 9-0-75-1; మెహదీ హసన్ 10-0-67-2, ముసాదెక్ హుస్సేన్ 2-0-24-0

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ (సి) మోర్గాన్ (బి) వుడ్ 19; సౌమ్య సర్కార్ (బి) ఆర్చర్ 2; షకిబ్ (బి) స్టోక్స్ 121; ముష్ఫికర్ (సి) రాయ్ (బి) ఫ్లంకెట్ 44; మిథున్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 0; మహ్మదుల్లా (సి) బెయిర్‌స్టో (బి) వుడ్ 28; ముసాదెక్ హుస్సేన్ (సి) ఆర్చర్ (బి) స్టోక్స్ 26; సైఫుద్దీన్ (బి) స్టోక్స్ 5; మెహదీ హసన్ (సి) బెయిర్‌స్టో (బి) ఆర్చర్ 12; మొర్తజా నాటౌట్ 4; ముస్తాఫిజుర్ (సి) బెయిర్‌స్టో (బి) ఆర్చర్ 0, ఎక్స్‌ట్రాలు 19 **మొత్తం:** (48.5 ఓవర్లలో ఆలౌట్) **280; వికెట్ల పతనం:** 1-8, 2-63, 3-169, 4-170, 5-219, 6-254, 7-261, 8-264, 9-280

బౌలింగ్: వోక్స్ 8-0-67-0; ఆర్చర్ 8.5-2-29-3; ఫ్లంకెట్ 8-0-36-1; వుడ్ 8-0-52-2, రషీద్ 10-0-64-1; స్టోక్స్ 6-1-23-3

7 వన్డేల్లో 300పై స్కోరు సాధించడం ఇంగ్లాండ్‌కు ఇది వరుసగా ఏడోసారి. ఏ జట్టు కూడా వరుసగా ఇన్నిసార్లు మూడొందల ఘనత సాధించలేదు. ఆసీస్ 2007లో వరుసగా ఆరుసార్లు 300పై స్కోరు చేసింది.

386 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ అత్యధిక స్కోరిది. మొత్తంగా ప్రపంచకప్‌లో ఏడో అత్యధిక స్కోరు. ఎక్కువ స్కోరు రికార్డు ఆస్ట్రేలియా (417/6) పేరిట ఉంది.

అంపైర్‌ను పడేశాడు...

జేసన్ రాయ్ సూపర్ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో తొమ్మిదో శతకం పూర్తి చేసుకున్నాడు. కానీ అంపైర్‌ను డీకొట్టడంతో అతడి శతక సంబరం కాస్త ఆలస్యమైంది. 27వ ఓవర్లో జరిగిందీ ఘటన. అప్పటికి 96 మీదున్న రాయ్.. ముస్తాఫిజర్ బంతిని డీప్ మిడ్‌వికెట్లోకి కొట్టాడు. ఫీల్డర్ తప్పిదంతో బంతి బౌండరీ దాటేంది. అయితే ఈ క్రమంలో రాయ్ బంతిని చూస్తూ నాన్‌స్ట్రైకర్ ఎండ్ వైపు పరుగెత్తాడు. అంపైర్ విల్సన్ కూడా బంతి వైపే చూడసాగాడు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకోలేదు. ఆఖరి క్షణంలో రాయ్ చూసినా.. నియంత్రించుకునే అవకాశం లేకపోవడంతో విల్సన్‌ను డీకొట్టాడు.రాయ్.. ఆతణ్ని పట్టుకోబోయినా అంద లేదు. అంపైర్ వెల్లకిలా పడిపోయాడు. అదృష్టవశాత్తు అతడికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

జేసన్ రాయ్
153
(121 బంతుల్లో 14×4, 5×6)

అది బౌల్డ్ సిక్స్...!

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో సందర్భంగా ఓ చిత్రం జరిగింది. నాలుగో ఓవర్లో ఆర్చర్.. సౌమ్య సర్కార్‌ను బౌల్డ్ చేశాడు. బంతి.. బెయిల్స్‌ను పడేస్తూ వికెట్ కీపర్ మీద నుంచి అమాంతం గాల్లోకి లేచి ఏకంగా బౌండరీ లైన్ అవల పడింది. ఆశ్చర్యపోవడం ప్రేక్షకుల వంతైంది.

బార్టీదే కిరీటం

ఫ్రెంచ్ ఓపెన్ సొంతం చేసుకున్న ఆస్ట్రేలియా భామ

ఆస్ట్రేలియా ముద్దుగుమ్మ ఆష్లీ బార్టీ అదరగొట్టింది. అంచనాలే లేకుండా ఫ్రెంచ్ ఓపెన్‌లో అడుగుపెట్టిన ఆమె మహిళల సింగిల్స్ టైటిల్ దక్కించుకుంది. మధ్యలో రెండేళ్ల పాటు టెన్నిస్‌కు దూరంగా ఉండి, తిరిగి ఆటలో అడుగుపెట్టిన బార్టీ.. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ విజయాన్ని రుచిచూసింది. ఫైనల్లో పందొమ్మిదేళ్ల మార్కెటా వొండ్రుసోవాను వరుస సెట్లలో చిత్తుచేసి సగర్వంగా ట్రోఫీని ముద్దాడింది. 46 ఏళ్ల తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ కిరీటాన్ని దక్కించుకున్న ఆస్ట్రేలియా క్రీడాకారిణిగా రికార్డు నమోదుచేసింది. మరోవైపు పురుషుల సెమీస్‌లో ప్రపంచ నంబర్‌వన్ జకోవిచ్‌కు షాక్ తగిలింది. కెరీర్ స్లామ్ సొంతం చేసుకుందామనుకున్న జకో ఆశలను ఆవిరిచేస్తూ థీమ్ ఫైనల్లో అడుగుపెట్టాడు.

ఫైనల్లో మార్కెటాపై విజయం • జకోవిచ్‌కు తప్పని ఓటమి

పారిస్

ఫ్రెంచ్ ఓపెన్‌లో సరికొత్త విజేత. టోర్నీ సొంతం అద్భుత ప్రదర్శనతో అలరించిన 23 ఏళ్ల ఆష్లీ.. తన పనిని పూర్తి చేసింది. చివరి మెట్టు దాటి విజయతీరాలకు చేరింది. టైటిల్‌ను అందుకొని మార్గరెట్ కోర్టు (1973) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన తొలి ఆస్ట్రేలియా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ తుదిపోరులో ఎనిమిదో సీడ్ బార్టీ 6-1, 6-3తో మార్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చలాయించిన ఆష్లీ 70 నిమిషాల్లో మ్యాచ్ ముగించింది. ఆరంభం నుంచే బార్టీ దూకుడు మొదలైంది. తొలి సెట్‌లో వరుసగా నాలుగు గేమ్‌లు గెల్చుకొన్న ఆమె తన ఉద్దేశాన్ని బలంగా చాటింది. ఐతే ఆ తర్వాత గేమ్‌ను మార్కెటా సొంతం చేసుకున్నప్పటికీ ఆ ఆనందం కాసేపే. ఆ తర్వాతి రెండు గేమ్‌లను దక్కించుకున్న బార్టీ సెట్ సొంతం చేసుకుంది. రెండో సెట్‌లోనూ బార్టీదే జోరు. మ్యాచ్‌లో మూడు ఏస్‌లు సంధించిన బార్టీ.. ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది.

జకోకు షాక్

వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచి దూకుడు మీదున్న జకోవిచ్ జోరుకు బ్రేక్ పడింది. వర్షం వల్ల రెండు రోజుల పాటు సాగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 6-2, 3-6, 7-5, 5-7, 7-5 తేడాతో నాలుగో సీడ్ జకోవిచ్‌పై విజయం సాధించాడు. శుక్రవారం వర్షంతో మ్యాచ్ నిలిపివేసే సమయానికి మూడో సెట్లో 3-1తో ఆధిక్యంలో ఉన్న థీమ్ శనివారం అదే జోరు కొనసాగించాడు. ఐతే తిరిగి పుంజుకొన్న జకో.. నాలుగో సెట్లో విజయంతో పోటీలోకి వచ్చాడు. ఇక నిర్ణయాత్మక ఐదో సెట్లో ఆటగాళ్లిద్దరూ పాయింట్ల కోసం పోటాపోటీగా తలపడ్డారు. ఆరంభంలో చెరో గేమ్‌ను గెలిచారు. ఐతే ఆ తర్వాత థీమ్ మరోసారి సత్తాచాటాడు. వరుసగా మూడు గేమ్‌లు సొంతం చేసుకొని 4-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ జకో అంత సులభంగా వదిలిపెట్టేలా కనిపించలేదు. దాంతో ఓ దశలో స్కోరు 5-5తో సమమైంది. కీలక దశలో పాయింట్లు దక్కించుకొన్న థీమ్ వరుసగా గేమ్‌లు గెలిచి మ్యాచ్ నెగ్గాడు. ఆదివారం ఫైనల్లో థీమ్.. డిఫెండింగ్ ఛాంపియన్ నాదల్‌తో తలపడనున్నాడు.

డొమినిక్ థీమ్

గాలి విపరీతంగా వీస్తున్న ఇలాంటి వాతావరణంలో పూర్తి సామర్థ్యంతో ఆడడం కష్టం. మన ప్రత్యర్థితో పాటు ఇంకొకరితోనూ పోరాడినట్లు అనిపిస్తోంది. ఓటమికి సాకులు చెప్పాలని అనుకోవట్లేదు. నా కెరీర్‌లో ఇప్పటిదాకా అత్యంత దారుణమైన వాతావరణంలో ఆడిన మ్యాచ్ ఇదే
- జకోవిచ్

న్యూజిలాండ్ హ్యాట్రిక్

- ప్రపంచకప్‌లో వరుసగా మూడో విజయం
- నీషమ్, ఫెర్గూసన్ ధాటికి కుప్పకూలిన అఫ్గాన్

టాంటన్: వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. ఆ జట్టు వరుసగా మూడో విజయం సాధించింది. శనివారం ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన కివీస్.. అఫ్గానిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 173 పరుగుల చిన్న లక్ష్యాన్ని ఆ జట్టు 32.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి చేదించింది. కెప్టెన్ విలియమ్సన్ (79 నాటౌట్; 99 బంతుల్లో 9×4) చక్కటి ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గప్టిల్ (0) తొలి బంతికే వెనుదిరిగినప్పటికీ.. మరో ఓపెనర్ మన్రో (22)తో, సీనియర్ ఆటగాడు రాస్ టేలర్ (48; 52 బంతుల్లో 6×4, 1×6)తో విలియమ్సన్ భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును గెలుపు బాటలో నడిపాడు. టేలర్ ఔటయ్యాక లేథమ్ (13 నాటౌట్)తో కలిసి అతను లాంచనాన్ని ముగించాడు. కివీస్ కోల్పోయిన మూడు వికెట్లూ అఫ్తాబ్ (3/45) తీశాడు. అంతకుముందు జిమ్మీ నీషమ్ (5/31), లోకీ ఫెర్గూసన్ (4/37)ల దాటికి అఫ్గాన్ 41.1 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు హజ్రతుల్లా (34), నూర్ అలీ (31) తొలి వికెట్‌కు 66 పరుగులు జోడించి మంచి ఆరంభాన్నిచ్చినా.. నీషమ్, ఫెర్గూసన్ విజృంభించడంతో క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన అఫ్గాన్ కేలుకోలేకపోయింది. హస్మతుల్లా (59) పోరాడకుంటే అఫ్గాన్ ఆమాత్రం స్కోరైనా చేసేది కాదు. తొలి మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసిన కివీస్.. రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై చెమటోడ్చి నెగ్గిన సంగతి తెలిసిందే. అఫ్గాన్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఆ జట్టు తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా, శ్రీలంకల చేతుల్లో పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

అఫ్గానిస్థాన్: 172 (హజ్రతుల్లా 34, నూర్ అలీ 31, హస్మతుల్లా 59; జిమ్మీ నీషమ్ 5/31, లోకీ ఫెర్గూసన్ 4/37); **న్యూజిలాండ్:** 173/3 (మన్రో 22, విలియమ్సన్ 79 నాటౌట్, రాస్ టేలర్ 48; అఫ్తాబ్ ఆలమ్ 3/45)

నీషమ్ (5/31)

ఆ జట్టు నిరుత్సాహపరిచింది

కుమార సంగక్కర

ప్రపంచకప్‌లో తొలి వారం అద్భుతంగా గడిచింది. కొన్ని అనూహ్య ఫలితాలు వచ్చాయి. మరికొన్ని మ్యాచ్‌లు కనువిందు చేశాయి. ముఖ్యంగా టోర్నీ ఫేవరెట్ ఇంగ్లాండ్‌ను పాకిస్థాన్ ఓడించడం ముచ్చటగా అనిపించింది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ దూకుడు ముందు నిలువలేకపోయిన పాక్.. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో మాత్రం చాలా భిన్నంగా కనిపించింది. ముందు బాలీ స్కోరు చేసిన పాక్.. ఆ తర్వాత తెలివిగా బౌలింగ్ చేసి ఇంగ్లాండ్‌ను నిలువరించింది. ముఖ్యంగా లెఫ్ట్ ఆర్మ్ పేసర్లు రియాజ్, ఆమిర్ ఆకట్టుకున్నారు. ఈ ఓటమి ఇంగ్లాండ్‌పై ప్రభావం చూపించకపోయినా.. ఏ జట్టయినా కప్ కోసం పోటీపడగలదనే విషయం స్పష్టమవుతోంది. ట్రైటెల్ రేసులో ఉన్న భారత్, ఆస్ట్రేలియా కూడా స్థాయికి తగ్గట్టే ఆడుతున్నాయి. దక్షిణాఫ్రికాపై భారత్ అద్భుత విజయాన్ని సాధించింది. అటు బ్యాటింగ్, ఇటు వైవిధ్యమైన స్పిన్, పేస్‌తో టీమ్‌ఇండియా సమతూకంగా ఉంది. మిగిలిన జట్లతో పోలిస్తే దక్షిణాఫ్రికా నిరుత్సాహపరిచింది. ఎంపిక లోపాలతో పాటు పరిస్థితులను అర్థం చేసుకోవడంలో జట్టు విఫలమైంది.

THE ULTIMATE INVERTER BATTERY
EXIDE INVATUBULAR

Eenadu epaper



ప్రధాని మోదీ, అమిత్‌షా సహా
కేంద్ర మంత్రుల్లో 18 మంది గడ్డంవాలాలు

ఈనాడు-దిల్లీ: ఒకే మాట, ఒకే బాటగా సాగే ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాల మధ్య పలు అంశాల్లో సారూప్యతలున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. ఆరెస్సెస్‌తో సుదీర్ఘ అనుబంధం, దేశవ్యాప్తంగా బాజపా క్షేత్రస్థాయి శ్రేణులతో అనుసంధానం, అపరిమితమైన శక్తి సామర్థ్యాలు, విజయకాంక్ష, పార్టీని తిరుగులేని విధంగా తీర్చిదిద్దటం వంటివి ఇద్దరిలోనూ ఉమ్మడిగా కనిపిస్తుంటాయి. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ అత్యున్నత నిర్ణయాధికారం కలిగిన ఈ నేతల్లో మరో ఆసక్తికరమైన అంశం...ఇద్దరూ ఎంతో ఇష్టంగా గడ్డం పెంచుకోవటం. కొత్త ప్రభుత్వంలో కొలువుదీరిన కేంద్ర మంత్రిమండలిలోనూ ఇదే సారూప్యత కనిపిస్తోంది. మొత్తం 58 మంది మంత్రుల్లో ప్రధాని మోదీ సహా 18 కేంద్ర మంత్రులు గడ్డం వాలాలే. కేంద్ర మంత్రుల్లో ఇంత మంది గడ్డం పెంచే వారు ఉండటం ఇదే తొలిసారి అని చెబుతున్నారు. అయితే, ఇది యాదృచ్ఛికమైన అంశమేనని, దీని వెనుక ప్రత్యేక కారణాలు ఏమీ లేవని బాజపా నేతలు నవ్వుతూ తోసిపుచ్చారు.

పాసవాన్ గిరిరాజ్

కేబినెట్ మంత్రుల్లో..

విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జయ్‌శంకర్, వినియోగదారుల వ్యవహారాల మంత్రి రాంవిలాస్ పాసవాన్, పర్యావరణ మంత్రి ప్రకాశ్ జావడేకర్, మైనార్టీ వ్యవహారాలమంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, పశుసంవర్ధకశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్.

జయ్‌శంకర్

స్వతంత్ర హోదా మంత్రుల్లో...

కార్మిక మంత్రి సంతోష్ గంగ్వార్, సాంస్కృతికపర్యాటకశాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్, విమానయాన మంత్రి హర్‌దీప్ పూరీ.

జావడేకర్

సహాయ మంత్రుల్లో..

జి.కిషన్‌రెడ్డి, అశ్వనీ చౌబె, కృష్ణ పాల్ గుర్జర్, పురుషోత్తం రూపాలా, రాందాస్ అథవాలే, బాబుల్ సుప్రియో, అనురాగ్ ఠాకుర్, ప్రతాప్ చంద్ర షడంగీ.

నఖ్వీ

ఇక రైళ్లలోనూ మసాజ్!

దిల్లీ: భారతీయ రైల్వేల చరిత్రలో తొలిసారిగా ప్రయాణికులకు మసాజ్ సేవలు అందించనున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి బయల్దేరే 39 రైళ్లలో ఈ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. దేహ్రాదూన్ - ఇండోర్ ఎక్స్‌ప్రెస్ (14917), దిల్లీ - ఇండోర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (12416), ఇండోర్ - అమృతసర్ ఎక్స్‌ప్రెస్ (19325) రైళ్లలో వీటిని ప్రారంభిస్తారని రైల్వేశాఖ అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమరైల్వే జోన్‌లోని రత్లాం డివిజన్ నుంచి ఈ ప్రతిపాదన వచ్చింది. దీనివల్ల ఆదాయం పెరగడమే కాక.. ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతుందని రైల్వేబోర్డు మీడియా అండ్ కమ్యూనికేషన్ సంచాలకుడు రాజేశ్ బాజ్‌పేయీ తెలిపారు. రైల్వేలకు ఏడాదికి రూ. 20 లక్షల ఆదాయంతో పాటు, 20వేల మంది ప్రయాణికుల టికెట్ల ద్వారా అదనంగా మరో రూ. 90 లక్షలు వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సేవలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య అందుబాటులో ఉంటాయి. తల, కాళ్ల మసాజ్‌కు ఒక్కో దానికి రూ. 100 చొప్పున వసూలు చేస్తారు. ఒక్కో రైల్లో మసాజ్ చేసేందుకు ముగ్గురి నుంచి అయిదుగురి వరకు అందుబాటులో ఉంటారు. వారికి రైల్వేశాఖ గుర్తింపు కార్యులు ఇస్తుంది. టికెట్ల ద్వారానే కాకుండా ఆదాయం పెంచడానికి ఇతరత్రా వినూత్న మార్గాలు చూడాలని వివిధ జోన్లు, డివిజన్లను రైల్వేశాఖ కోరడంతో ఈ కొత్త ఆలోచన వచ్చింది.

ఐరాసలోనూ క్రికెట్ స్ఫూర్తి!

ఐరాస: ప్రపంచ క్రికెట్ పోటీల స్ఫూర్తి ఐరాసనూ తాకింది! ఐరాసలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్‌లకు చెందిన శాశ్వత దౌత్య ప్రతినిధులతో కూడిన జట్టు... బ్రిటన్ రాయబారుల నేతృత్వంలోని జట్టుపై విజయం సాధించింది. శుక్రవారం రాత్రి యూకే మిషన్ ఈ క్రికెట్ పోటీలను నిర్వహించింది.

ధోని చేతి తొడుగులపై నిర్ణయం ఐసీసీదే: సైన్యం

దేహ్రాదూన్: ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా ఈ నెల 5న ఇంగ్లండ్‌లో భారత్-దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ జరిగింది. ఆ సందర్భంగా మహేంద్రసింగ్ ధోని పారాచ్యూట్ రెజిమెంట్ స్పెషల్ ఫోర్స్‌కు చెందిన 'బలిదాన్ బ్యాచ్' ఉన్న చేతి తొడుగులను ధరించడం వివాదాస్పదమైంది. సాధారణంగా క్రీడాకారులంతా తమ ప్రాయోజిత సంస్థల లోగోలనే వాడాలి. దీనిపై శనివారమిక్కడ జీఓసీ-ఇన్-సి (నైరుతి) లెఫ్టినెంట్ జనరల్ చెరిష్ మాథెసన్ స్పందించారు. లోగోను ధరించడం ధోని వ్యక్తిగత నిర్ణయమన్నారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అని స్పష్టం చేశారు. ఈ విషయంలో తాము చెప్పేదేం లేదన్నారు. పారాచ్యూట్ రెజిమెంట్‌లో ధోని గౌరవ లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్న నేపథ్యంలో ఆయన ఈ లోగోతో ఉన్న చేతి తొడుగులను వినియోగించారు.

యూపీలో పాత్రికేయునిపై కేసు

లఖ్‌నవూ: సామాజిక మాధ్యమాల్లో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై అభ్యంతరకర సమాచారం పెట్టిన పాత్రికేయునిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ప్రశాంత్ కనోజియా అనే పాత్రికేయుడు ముఖ్యమంత్రి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్న ఓ వీడియోను షేర్ చేశారని చెప్పారు. ఆయనను ప్రశ్నించనున్నట్టు తెలిపారు.

క్రికెట్ దౌత్యంతో స్నేహ బంధం

- మాల్దీవుల పర్యటనలో ప్రధాని మోదీ
- ఆ దేశ అధ్యక్షునికి క్రికెట్ బ్యాట్
- స్టేడియం నిర్మాణానికి సహకారం

మాలే: క్రికెట్ దౌత్యంతో ప్రధాని నరేంద్ర మోదీ తన విదేశీ పర్యటనలను ప్రారంభించారు. ప్రధానిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా శనివారం మాల్దీవులకు వచ్చారు. రెండురోజుల పాటు ఇక్కడ పర్యటించనున్నారు. మాలే విమానాశ్రయంలో ఆయనకు విదేశాంగ మంత్రి అబ్దుల్లా, షహీద్ రిపబ్లిక్ స్క్వేర్‌లో అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలిహ్ స్వాగతం పలికారు. అధ్యక్షుడు సోలిహ్ క్రికెట్ అభిమాని కావడంతో ఆయనకు మోదీ క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. దీనిపై ప్రస్తుత ప్రపంచకప్‌లో పాల్గొన్న సభ్యులంతా సంతకాలు చేశారు. ఆ దేశంలో క్రికెట్ స్టేడియం నిర్మించడానికి, ఆ దేశ క్రికెట్ క్రీడాకారులకు శిక్షణ ఇప్పించడానికి కూడా అంగీకరించినట్టు విదేశీ వ్యవహారాల కార్యదర్శి విజయ్ గోఖలే చెప్పారు. మాల్దీవుల అధ్యక్షుడు సలేహ్ గత ఏప్రిల్‌లో బెంగళూరు వచ్చి ఇండియన్ ప్రీమియర్ లీగ్ పోటీలను తిలకించారు. ఆ సందర్భంగానే క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన సలేహ్ ప్రమాణ స్వీకారానికి మోదీ హాజరుకావడం గమనార్హం.

అత్యున్నత పురస్కారం బహూకరణ

విదేశీ ప్రముఖులకు బహూకరించే అత్యున్నత పురస్కారమైన 'రూల్ ఆఫ్ నిషాన్ ఇజ్జుద్దీన్'ను ప్రధాని నరేంద్ర మోదీకి.. అధ్యక్షుడు సోలిహ్ ప్రదానం చేశారు. ఇరువురు నేతలు వివిధ అంశాలపై చర్చలు జరిపారు. తాము 'భారతే ప్రథమం' అన్న విధానాన్ని పాటిస్తున్నామని సోలిహ్ చెప్పారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు ఆరు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. సముద్ర జలాలపై అధ్యయనం, ఆరోగ్యం, నౌకాయానం, సుంకాలు, సుపరిపాలన, రక్షణ, అధికారులకు శిక్షణ వంటి అంశాలపై పరస్పరం సహకరించుకొనే విషయమై అవగాహన కుదిరింది. కోచి నుంచి మాలే సమీపంలోని కుల్హుధుఫుషికి ప్రయాణ, కార్గో నౌకలను ప్రారంభించడానికి ఒప్పందం కుదిరింది. మాల్దీవుల్లో రుపే కార్డు చెల్లుబాటయ్యేలా చూసేందుకు అంగీకారం లభించింది.

గురువాయూర్ శ్రీకృష్ణ మందిరంలో కమలాలతో తులాభారం తూగుతున్న ప్రధాని మోదీ

ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదంతో ముప్పు

మాల్దీవుల పార్లమెంటు 'మజ్లిస్'లో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం కారణంగా ప్రపంచానికి ముప్పు ఏర్పడిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలన్నీ కలిసి పనిచేస్తున్నట్టుగానే ఉగ్రవాదం సమస్య నిర్మూలనకూ కృషి చేయాలని సూచించారు. హిందూ మహాసముద్రంలో శాంతి నెలకొనడానికి ఇరుదేశాలు కృషి చేయాలన్నారు.

కేరళ...వారణాసి అంత ప్రియమైనది

గురువాయూర్: కేరళ తనకు వారణాసి అంత ప్రియమైన ప్రాంతమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. శనివారం కేరళలోని గురువాయూర్‌లో బాజపా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో తమ పార్టీ ఒక్క స్థానాన్నీ గెలవకపోయినా రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు చెప్పడానికి, వారితో బంధం పెంచుకోవడానికి వచ్చానని చెప్పారు. ఎన్నికల్లో ప్రజల మనోభావాలను గుర్తించడంలో రాజకీయ పండితులు, పార్టీల నేతలు విఫలమయ్యారని అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ పనితీరును సమర్థించి బాజపాకు ఘనవిజయాన్ని కట్టబెట్టారని తెలిపారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని నూతన భారత్ నిర్మాణానికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

కమలాలతో తులాభారం

సంప్రదాయ కేరళ దుస్తులు ధరించిన నరేంద్ర మోదీ గురువాయూర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేశారు. అక్కడ కమలాలతో తులాభారం తూగారు. ఐదుకోసం ఆలయ అధికారులు వంద కిలోల పువ్వులను సిద్ధం చేశారు. కోచిలోని నౌకాదళ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి దిగిన ఆయన శనివారం ఉదయం హెలికాప్టర్‌లో గురువాయూర్ వచ్చారు. ఆయనకు గవర్నర్ పి.సదాశివం, విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి.మురళీధరన్, కేరళ దేవాదాయ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ స్వాగతం పలికారు. తిరిగి కోచిలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మాల్దీవులకు బయలుదేరారు.

అసోం కార్గిల్ యోధుడికి విముక్తి

గువహాటి: కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న భారత సైనికుడు మహ్మద్ సనావుల్లా శనివారం అసోంలోని నిర్బంధ కేంద్రం నుంచి విడుదలయ్యారు. గత నెలలో ట్రైబ్యునల్ ఆయనను విదేశీయుడిగా నిర్ధరించడంతో అరెస్టయ్యారు. శుక్రవారం గౌహతి హైకోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేయడంతో విముక్తి లభించింది. విడుదల అనంతరం సనావుల్లాను కామరూప్ ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లి, కోర్టు ఆదేశాల మేరకు కొన్ని లాంచనాలను పూర్తిచేశారు. తర్వాత కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు వెంటరాగా ఆయన బోకో ప్రాంతంలోని తన నివాసానికి చేరుకున్నారు. సనావుల్లా 2017లో సైన్యం నుంచి పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ తర్వాత ఆయన అసోం సరిహద్దు పోలీసు దళంలో ఎస్సైగా పనిచేస్తున్నారు. ఆయనను విదేశీయుడిగా ట్రైబ్యునల్ ప్రకటించాక సర్వీసు నుంచి ఉద్వాసనకు గురయ్యారు.

ఇక రైతులందరికీ కిసాన్ సమ్మాన్

దిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకొస్తూ కేంద్రప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కిసాన్ సమ్మాన్ పథకం కింద గతంలో విధించిన భూమి పరిమితిని తొలగించి రైతులందరికీ వర్తింపజేస్తామని బాజపా వాగ్దానం చేసింది. ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మే 31న జరిగిన తొలి కేబినెట్ భేటీలో ఆమోద ముద్ర వేసింది. దీని ప్రకారం ప్రతి రైతుకూ ఏటా మూడు విడతల్లో మొత్తం రూ.6 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. అర్హులైన రైతులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. సంస్థల పేరుతో భూములు కలిగినవారు, రాజ్యాంగ పదవుల్లో ఉన్న రైతు కుటుంబీకులు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లోని వారికి ఈ పథకం వర్తించదు.

21న రాంచీలో యోగా దినోత్సవం

దిల్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రదాన కార్యక్రమాన్ని ఈ నెల 21న రాంచీలో నిర్వహించనున్నట్టు ఆయుష్ మంత్రిత్వ శాఖ అధికారులు శనివారం తెలిపారు. అక్కడి ప్రభాత్ తారా స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. యోగాను ప్రోత్సహించే మీడియా సంస్థలకు అంతర్జాతీయ యోగా పురస్కారాలను ఇవ్వనున్నట్టు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జావ్‌డేకర్ తెలిపారు. పత్రికలు, టీవీ, రేడియో రంగాలకు విడివిడిగా 11 వంతున మొత్తం 33 బహుమతులు ఇస్తామని చెప్పారు.

అలీగఢ్ నిందితుడిపై గతంలో పోక్సో కేసులు!

అలీగఢ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో రూ. 10 వేల అప్పు కోసం రెండేళ్ల చిన్నారిని దారుణంగా హతమార్చిన కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అరెస్టయిన వారిలో అస్లాం మీద గతంలో చిన్నారులపై అమానుషత్వాలకు పాల్పడినట్లు కేసులున్నాయి. ప్రధాన నిందితులిద్దరిలో ఒకరైన జహీద్ భార్య, సోదరుడిని ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. జహీద్ (27)తో పాటు అస్లాం (43)ను చిన్నారి మృతదేహం కనిపించిన తర్వాత అరెస్టుచేశారు. అస్లాం పై గతంలో పోక్సో కేసులున్నాయని, దిల్లీలో అపహరణ కేసులో జైలుకు కూడా వెళ్లడని అలీగఢ్ సీనియర్ ఎస్పీ ఆకాశ్ కుల్హరీ తెలిపారు.

జయ్‌శంకర్ అత్యుత్తమ దౌత్యవేత్త

వాషింగ్టన్: భారత నూతన విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయ్‌శంకర్ ప్రపంచంలోనే అత్యుత్తమ దౌత్యవేత్త అని అమెరికా నిపుణులు ప్రశంసిస్తున్నారు. జయ్‌శంకర్ 2013-15 మధ్య అమెరికాలో భారత రాయబారిగా పనిచేశారు. భారత విదేశీ విధానం రూపకల్పనలో ఆయన పాత్ర ఎంతో ఉందని నిషా దేశాయి బిశ్వాల్ అభిప్రాయపడ్డారు. సంక్లిష్ట సమస్యలు పరిష్కరించడంలో ఆయనకు నేర్పరితనం ఉందని భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేసిన రిచర్డ్ వర్మ అన్నారు.

భూటాన్ రాజుతో భేటీ

థింపు: బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి పర్యటనగా భూటాన్‌కు వచ్చిన జయ్‌శంకర్ శనివారం రాజు జిగ్మే ఖెసర్ వాంగ్‌చుక్‌తో సమావేశమయ్యారు. ప్రధాని లోటయ్ షెరింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి తండి దోర్జీలతోనూ ఆయన పలు అంశాలపై చర్చలు జరిపారు.

భూకుంభకోణంలో బాబా రాందేవ్: కాంగ్రెస్

దిల్లీ: బాజపా నేతృత్వంలోని మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వం సహాయంతో బాబా రాందేవ్ హరియాణాలో వందలాది ఎకరాల భూకుంభకోణానికి పాల్పడ్డారని కాంగ్రెస్ ఆరోపించింది. పతంజలి యోగ్‌వీర్ అనుబంధ కంపెనీలు, ఆచార్య బాలకృష్ణ అనుబంధ కంపెనీలు లబ్ధి పొందాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా చెప్పారు. ఈ భూకుంభకోణంలో సూత్రధారిగా వ్యవహరించిన వ్యక్తి, రాందేవ్, బాలకృష్ణకు సన్నిహితుడని ఆరోపించారు. భూమిని ఆయన సోదరి, బావల పేరిట కొనుగోలు చేసి 99శాతం వాటా బాలకృష్ణ కంపెనీ పేరిట వాటాలు రాసిచ్చారన్నారు.

బిహార్‌లో పంజా విసిరిన మెదడువాపు వ్యాధి

పట్నా: బిహార్‌లోని ముజఫర్‌పుర్ జిల్లాలో మెదడువాపు వ్యాధి విజృంభిస్తోంది. వారం రోజుల్లో ఈ వ్యాధి సోకిన 12 మంది చిన్నారులు మృతి చెందారు. వీరిలో అయిదుగురు గత రెండు రోజుల్లో ప్రాణాలు కోల్పోయారు. మరో 36 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో అత్యధికులు తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారని జిల్లా వైద్యులు తెలిపారు.

అమిత్‌షా ప్రిన్సిపల్.. ప్రశాంత్ కిశోర్ విద్యార్థి

కోలకతా: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌ను తమ సలహాదారుడిగా నియమించుకుంటున్న మమతా బెనర్జీని బాజపా ఎగతాళి చేసింది. బాజపా అధ్యక్షుడు అమిత్‌షా కంటే ప్రశాంత్ కిశోర్ గొప్ప వ్యూహకర్త ఏమీ కాదంది. ఎన్నికల వ్యూహాల విషయానికి వస్తే అమిత్‌షా కళాశాల ప్రిన్సిపల్ అయితే అందులో ప్రశాంత్ కిశోర్ విద్యార్థిలాంటివాడని బాజపా ప్రధాన కార్యదర్శి పశ్చిమ బెంగాల్‌లో పార్టీ బాధ్యుడు కైలాశ్ విజయవర్గీయ అన్నారు.

పోలీసులు, బాజపా కార్యకర్తలకు గాయాలు

గంగారాంపుర్: బెంగాల్ పోలీసులు, బాజపా కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు పోలీసులు, కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు. ఉత్తర దినాజ్‌పుర్ జిల్లా గంగారాంపుర్ ప్రాంతంలో శనివారం ఈ ఘర్షణ చోటు చేసుకుంది.

మరోవైపు డార్జిలింగ్ మున్సిపాలిటీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు శనివారం తమ పార్టీలో చేరారని బాజపా నాయకుడు ముకుల్‌రాయ్ తెలిపారు.

మోదీ ప్రచారం.. వంచన, విద్వేషమే!

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ విమర్శ
- వయనాడ్‌లో పర్యటన

వయనాడ్: ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారమంతా అసత్యాలు, విషం, విద్వేషంతోనే సాగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. తమ పార్టీ మాత్రం సత్యం, ప్రేమ, ఆప్యాయతలకు బద్ధమై ఉందన్నారు. కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఆయన శనివారం రెండో రోజు నియోజకవర్గంలో పర్యటించారు. కల్పెట్టా, కంబాలకాడు, పనమారం తదితర చోట్ల వందలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, యూడీఎఫ్ మద్దతుదారులతో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. రాహుల్ మాట్లాడుతూ- "అసత్యాలు, విద్వేషాలే ఆయుధాలుగా మోదీ తన ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. దేశ ప్రజలను విభజించి మాట్లాడారు. అలాంటి దుష్ట భావాలపై మా పార్టీ పోరాటం కొనసాగుతుంది. వయనాడులోని సమస్యలను అందరం కలిసికట్టుగా పరిష్కరించుకుందాం" అన్నారు.

మూడు రోజుల పర్యటనలో భాగంగా వయనాడ్‌లో ఉన్న రాహుల్‌గాంధీకి శనివారం వివిధ వర్గాలు, ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. కలెక్టరు కార్యాలయానికి వచ్చిన ఆయన... ప్రజల నుంచి విన్నాదులు, వినతులను స్వీకరించారు. రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు చెందిన నేతలు ఆయనను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. నియోజకవర్గంలో నెలకొన్న కీలక సమస్యల గురించి పార్టీ కార్యకర్తలు, అధికారులను రాహుల్ అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కేరళలోని వయనాడ్‌లో ఎంపీ రాహుల్‌గాంధీకి సమస్యలు వివరిస్తున్న స్థానిక యువత

టెక్ దిగ్గజాలపై డిజిటల్ పన్ను

- జీ20 ఆర్థిక మంత్రుల సదస్సు పిలుపు

దిల్లీ, ఫుకూవోకా: బహుళజాతి టెక్నాలజీ కంపెనీలపై 'డిజిటల్ పన్ను' వేయాలని జీ-20 సభ్యదేశాల ఆర్థిక మంత్రులు పిలుపునిచ్చారు. అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్ తదితర అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఆయా దేశాల్లో ఆర్జిస్తున్న ఆదాయం, అక్కడ వారికున్న వినియోగదారుల సంఖ్యను బట్టి పన్ను విధించాలని అమెరికా, చైనా, ఫ్రాన్స్, జపాన్, బ్రిటన్ ప్రతిపాదించాయి. దక్షిణ జపాన్‌లోని ఫ్యూకూవోకాలో నిర్వహిస్తున్న జీ20 సభ్యదేశాల ఆర్థికమంత్రుల సదస్సులో ఈమేరకు చర్చించాయి. ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో ఆయా దేశాల కేంద్ర బ్యాంకుల గవర్నర్లు కూడా పాల్గొన్నారు. అంతర్జాతీయ పన్నుల వ్యవస్థపై డిజిటలైజేషన్ ప్రభావాన్ని చర్చించడానికి, ఏకాభిప్రాయానికి రావడానికి జీ20 నాయకులు అంగీకరించారని జపాన్ ఆర్థికమంత్రి తారో ఏసో తెలిపారు.

బ్రిటన్, ఫ్రాన్స్‌లలో జాతీయ విధానం

'ఓఈసీడీ' అధినేత ఏంజెలా గుర్రియా మాట్లాడుతూ డిజిటల్ పన్ను అనేది ప్రధానంగా రెండు ముఖ్య విషయాలపై ఆధారపడి ఉందన్నారు. కంపెనీ ఏ దేశంలో ఉందో అక్కడే పన్ను విధించడానికి ముగింపు పలకడం మొదటిదన్నారు. పన్ను పోటీతో పాటు తక్కువ పన్నులు ఉన్న దేశాలకు కంపెనీలు వలస పోకుండా ఆపడం రెండోదన్నారు. కొత్త పన్ను విధానాన్ని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్ మూచిన్ స్వాగతించారు.

దక్షిణ అమెరికా నుంచి వలసదారులను అడ్డుకోకుంటే సోమవారం నుంచి అన్ని మెక్సికో వస్తుసామగ్రిపై ఐదు శాతం సుంకాలు విధిస్తానన్న ట్రంప్ హెచ్చరికలు పని చేశాయి. అమెరికా ప్రతినిధులతో మూడు రోజులపాటు చర్చించిన మెక్సికో అగ్రరాజ్యానికి అన్నివిధాలుగా సహకరించడానికి అంగీకరించిందని ట్రంప్ ట్వీట్ చేశారు.

పన్నులు ఎగవేయకుండా చర్యలు

పన్నులు పడకుండా చట్టవ్యతిరేకంగా వ్యవహరించడం, పన్నుల ఎగవేతలను అరికట్టడానికి భారత్ తీసుకుంటున్న చర్యలను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ సదస్సులో వివరించారు.

80 ఏళ్ల అత్తపై దాడి

చండీగఢ్: ఏ మాత్రం కనికరం లేకుండా 80 ఏళ్ల వృద్ధురాలైన అత్తని దారుణంగా చితకబాదిన ఒక మహిళను హరియాణాలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడి వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైన నేపథ్యంలో ఈ చర్యను చేపట్టారు. మహేంద్రగఢ్ జిల్లాలోని నివాజ్‌నగర్‌లో ఈ ఘటన జరిగింది. కాంతాదేవి అనే మహిళ తన అత్త చాందీబాయిని మంచంపై గట్టిగా తోసేసి, జుట్టు పట్టుకొని లాగి దాడిచేసింది. ఈ పాశవిక చర్యను పొరుగునున్న ఒక అమ్మాయి తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించడంతో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనను హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఖండించారు. అత్తని భారంగా ఆమె భావిస్తోందని మహేంద్రగఢ్ జిల్లా ఎస్పీ చందర్ మోహన్ పేర్కొన్నారు. బాధితురాలు చాంద్ బాయి భర్త టీఎస్ఎఫ్‌లో ఏఎస్ఐగా పనిచేసి, పదవీ విరమణ పొందాడని తెలిపారు. ఆయన చనిపోవడంతో చాంద్ బాయికి పింఛను అందుతోందన్నారు.

భారత్‌కు సాయుధ డ్రోన్లు

- విక్రయానికి అమెరికా సంసిద్ధత

వాషింగ్టన్: భారత్‌కు సాయుధ డ్రోన్లను విక్రయించడానికి డొనాల్డ్ ట్రంప్ సర్కారు ఆమోదం తెలిపింది. సమగ్ర వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థను కూడా ఇవ్వజూపింది. తమ వద్ద ఉన్న అత్యుత్తమ రక్షణ పరిజ్ఞానాలను భారత్‌కు అందించేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమని ఆ దేశ అధికారులు తెలిపారు. 2017లో ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య జరిగిన భేటీలో భారత్‌కు గార్డియన్ నిఘా డ్రోన్లను విక్రయించేందుకు అమెరికా సంసిద్ధత వ్యక్తంచేసింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సాయుధ డ్రోన్లను ఇవ్వజూపుతోంది. దీనితోపాటు సమీకృత క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని కూడా అమెరికా ఇవ్వజూపుతోంది. అది 'టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్' (థాడ్), పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థకు సంబంధించి రెండు అధునాతన వెర్షన్లు అయ్యి ఉండొచ్చని భావిస్తున్నారు. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులపై 'థాడ్' వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. రష్యా నుంచి ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థను కొనుగోలు చేయడానికి భారత్ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది.

గుజరాత్‌లోని వాలాసినోర్ సమీపంలోని రయోలీలో ఏర్పాటు చేసిన డైనోసార్ ప్రదర్శనశాల, శిలాజ పార్కులోని డైనోసార్ శిల్పాలు ఇవి. ఇది దేశంలోనే తొలి త్రీడీ డైనోసార్ ప్రదర్శనశాల, శిలాజ పార్కు

భారత హైకమిషనర్‌తో భారత క్రికెట్ జట్టు భేటీ

లండన్: ప్రపంచ కప్ క్రికెట్ పోటీల నిమిత్తం ఇక్కడున్న భారత క్రికెట్ జట్టు... శుక్రవారం మిక్కడ భారత హైకమిషనర్ రుచి గణశ్యామ్‌తో ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా సమావేశమైంది. కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రి, ఇతర క్రీడాకారులు, సిబ్బంది ఈ భేటీలో పాల్గొన్నారు.

INTER : MEC/CEC - 12 June
B.Com+

ఫ్లాట్‌ఫామే పరుపు పేపరే దుప్పటి

తేజయం

జూబ్లీహిల్స్... ఓ రాతి ప్రహరీకి అతి చిన్న ఇనుప గేటు.. ఇల్లన్నారు.. 'చిత్రం'గా అక్కడ బండరాళ్లు కనిపించాయి. 'ధైర్యం' చేసి లోపలికి అడుగులు వేసి... ఆ పెద్ద బండరాళ్లు దాటితే 'నిజం' అది ఇల్లే. నా జీవితానికి 'నేనే రాజు... నేనే మంత్రి' అనే దర్శకులు తేజ... నవ్వుతూ స్వాగతం పలికారు. ఇంటర్వ్యూ మొదలు పెడితే... జీవితాన్నే మన ముందుంచారు. ఈ బండరాళ్లు, గోడల్లోకి చెట్లు ఏంటి? అంటే... అవి చెక్కుచెదరకుండా... ఇల్లు కట్టాలనేది నా ఆశయమన్నారు. ఒక పూట కడుపు నింపుకోడానికి పడిన అవస్థల నుంచి... కెమెరామెన్‌గా వి'జయం' సాధించిన క్రమం వివరించారు. బతుకుదెరువుకు కార్లు కడిగిన పరిస్థితి నుంచి దర్శకుడిగా మారిన క్రమాన్ని కళ్లకు కట్టారు. కొన్ని కన్నీళ్లు... కొంచెం పట్టుదల... ఎంతో స్ఫూర్తి నిండిన సంఘటనలను 'హాయ్'తో పంచుకున్నారు.

పూట ఎలా గడుస్తుందో..!

బతకడానికి హోటల్‌లో క్లీనింగ్ దగ్గరి నుంచి ఆఫీసుల్లో టీ ఇచ్చే వరకూ అన్ని పనులు చేశా. లారీ క్లీనర్‌గానూ వెళ్లా. ప్రతిరోజూ ఈ పూట ఎలా గడుస్తుందో అని ఎదురు చూడటమే. నాదగ్గర కొంచెం డబ్బుంటే పొర(బ్రెడ్డు ముక్క)ను నీళ్లలో అద్దుకొనే తినేవాడిని. ఇంకొంచెం ఎక్కువుంటే... పొరను టీలో అద్దుకొనే తినేవాడిని. దీనికంటే ఎక్కువుంటే ఇడ్లీ, అంతకన్నా మించి ఉంటే భోజనం చేసేవాడ్ని.

ఇంట్లోంచి బయటికి వచ్చేశా

నాన్న బలరామకృష్ణది చెన్నైలో ఎక్స్‌పోర్ట్ వ్యాపారం. అమ్మ రాణి వ్యాపార లావాదేవీలు చూసుకొనేవారు. అక్క, నేను, చెల్లి ముగ్గురం. అమ్మానాన్న ఉన్నప్పుడు మాకు రాజభోగాలు ఉండేవి. స్కూల్‌కి కారులో వెళ్లేవాణ్ని. అమ్మ చనిపోయాక నాన్న బాగా కుంగిపోయారు. వ్యాపారంలో నష్టమొచ్చింది. ఆస్తులన్నీ పోయాయి. మా ముగ్గురిని బంధువులు ఒక్కొక్కరూ పంచుకున్నారు. అక్కను మా అత్త, నన్ను మా బాబాయ్, చెల్లిని ఇంకో బాబాయ్ తీసుకెళ్లారు. మా చెల్లిని కొన్ని రోజులకు ఒక స్వచ్ఛంద సేవా సంస్థలో వదిలేశారు. అక్క అత్త వాళ్లింట్లో అడ్జెస్ట్ అయ్యింది. నేను బాబాయ్ వాళ్ల ఇంట్లో ఉండలేకపోయాను. బయటకి వచ్చేశాను. హనుమాన్ జంక్షన్లో మాకు బంధువు ఉంటాడు. ఆయన ఒకసారి నన్ను చూసి 'ఏదైనా సమస్య ఉంటే నా దగ్గరికి వచ్చేయ్' అన్నాడు. సరేలే అని ఆయన ఇంటికి వెళ్లాను. తలుపు తట్టాను. ఆయన బయటికి వచ్చి 'ఏరా ఇలా వచ్చావ్' అన్నాడు. పరిస్థితి చెబితే... 'రమ్మంటే వచ్చేయడమేనా రా' అన్నాడు. అంతే అక్కడే ఉంచి వెనుదిరిగాను.

పెరుగు సరిగ్గా లేదని...

నాకు భోజనంలో తప్పకుండా పచ్చడి, పెరుగు ఉండాలి. ఇంట్లో ఒకసారి మూడు రోజులుగా పెరుగు సరిగ్గా ఉండటం లేదు. నా భార్య శ్రీవల్లి పై సీరియస్ అయ్యాను. ఆ తర్వాతా పెరుగు రుచి మారలేదు. దీంతో మా ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. ఆ గొడవ విడాకుల వరకూ వెళ్లింది. అది తర్వాత సద్దుమణిగింది లేండి. 'ఏంటి నాన్న... పెరుగు బాలేదని అమ్మకు విడాకులిస్తానన్నావా?' అంటూ ఇప్పటికీ పిల్లలు నన్ను ప్రశ్నిస్తూనే ఉంటారు.

పిల్లను ఇవ్వనన్నారు...

మా చెల్లికి తెలిసిన అమ్మాయే శ్రీవల్లి. తనతో మాట్లాడి పెళ్లికి ఒప్పించాక... వాళ్లింట్లో వాళ్లు కుదరదన్నారు. నేనప్పుడు 'రాత్రి' సినిమాకు పనిచేస్తున్నా. 'ఇతని సినిమా ఇంకా రిలీజ్ కాలేదు. పైగా కుటుంబం లేదు. ఈ పరిస్థితుల్లో మా అమ్మాయిని ఇవ్వలేం' అన్నారు. అప్పుడు అక్కినేని వెంకట్ గారి భార్య జ్యోత్స్న గారు వెళ్లి శ్రీవల్లి వాళ్లింట్లో ఒప్పించారు. ఇప్పటికీ జ్యోత్స్న గారు శ్రీవల్లికి ఫోన్ చేసి తేజ ఎలా ఉంటున్నాడని చెక్ చేస్తుంటారు(నవ్వు).

ఒక ప్యాంటు... రెండు చొక్కాలు

సినిమాలకు కెమెరా అసిస్టెంట్‌గా పనిచేసేటప్పుడు... నా దగ్గర ఒకే ప్యాంటు, రెండు చొక్కాలు ఉండేవి. వీటి కొలాయి దగ్గర స్నానం చేసి షర్ట్ పిండుకొని ఆరేసుకునేవాడ్ని. ప్యాంటు రెండు, మూడురోజులకు ఒకసారి అక్కడే ఉతుక్కోవడం అలవాటు. ప్రొడక్షన్ వాహనం వచ్చినప్పుడు ఒక పెద్ద ఇంటి దగ్గర నిలబడి ఐండి ఎక్కేవాడ్ని. నాకు ఇల్లే లేదంటే వారు గౌరవించరని అలా చేసేవాడ్ని. ఏ ఫ్లాట్‌ఫామ్ మీదో పడుకొని నిద్రపోయే వాడ్ని. దుప్పట్లు కూడా ఉండేవి కావు. నేలను ఊడ్చుకొని పేపర్ కప్పుకొని పడుకొనేవాడ్ని. షూటింగ్ సమయాల్లో సాయంత్రం పూట ఇడ్లీ పెట్టేవారు. అప్పుడే ఎక్కువగా తినేవాడ్ని... ఎందుకంటే రాత్రికి ఫుడ్ దొరకదు కదా! ఒక్కోసారి అక్కడా ప్రొడక్షన్ వాళ్లు కడుపునిండా తిననిచ్చేవాళ్లు కాదు. రెండే ఇడ్లీలని పెట్టేవారు. మళ్లీ అడిగితే లేదు పొమ్మనేవారు. రోజూవారీ ఖర్చులకు కార్లు కడిగేవాడిని. నెలంతా కడిగితే రూ.100 ఇచ్చేవాళ్లు.

వద్దన్నా హైదరాబాద్‌కు

కెమెరామెన్ రవికాంత్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసేవాడ్ని. అప్పుడు ఒక మెస్‌లో కూర్చొని సినిమా కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లం. అక్కడికి ఒక వ్యక్తి వచ్చాడు. నువ్వు కెమెరా అసిస్టెంట్ అంటున్నావు కదా... గదిలో సూర్యరశ్మి వస్తున్నట్లు చూపించడానికి నువ్వు ఏం చేస్తావో చెప్పు అన్నాడు. నేను దాన్ని ఎన్నో రకాలుగా తీయొచ్చేనని చెప్పాను. 'నేను త్వరలోనే ఒక సినిమా చేయబోతున్న. నువ్వు కెమెరామెన్‌గా పనిచేద్దువు నాతో పాటు హైదరాబాద్‌కు వచ్చేయ్' అన్నాడు అతను. నేను వెళ్లి ఈ విషయం రవికాంత్ గారికి చెప్పాను. ఆయన తిట్టాడు. 'అతను రెండు సినిమాలకూ అసిస్టెంటుగా పనిచేయలేదు. నీకేమో అనుభవం లేదు. మీరిద్దరూ కలిసి ఏం సినిమా చేస్తారుః వద్దు నా మాట విని ఇక్కడే ఉండు' అన్నాడు. నేను వినలేదు. అతనితో కలిసి హైదరాబాద్ వచ్చేశాను. అతనెవరో కాదు రాంగోపాల్ వర్మ. ఇద్దరం కలిసి 'శివ' స్క్రిప్ట్ రాసుకున్నాం. అది పెద్ద హిట్. తర్వాత 'క్షణక్షణం', 'రాత్రి' సినిమాకు నన్ను కెమెరామెన్‌గా పరిచయం చేశాడు. అంతం, మనీ, రక్షణ చేశాను. అలా చేస్తున్నప్పుడు ఆమీర్‌ఖాన్ బాలీవుడ్‌కు ఆహ్వానించారు. అలా బాలీవుడ్‌లో 30 సినిమాలకు కెమెరామెన్‌గా పనిచేశా.

అప్పుడు బాధపడ్డాను

సాధారణంగా ఏ కష్టం వచ్చినా బాధపడను. అవన్నీ జీవితంలో భాగమనుకుంటాను. అయితే నేను పెయింట్రర్స్‌లో ఉన్నప్పుడు ఎవరూ నా ఫోన్ లిఫ్ట్ చేయడానికి ఇష్టపడే వాళ్లు కాదు. ఒక కుర్ర హీరో నా దగ్గరికి వచ్చి 'సార్ మీరు నాతో సినిమా చేయాలి' అన్నాడు. నేను 'ప్రొడ్యూసర్ ఉన్నాడా?' అన్నా. 'ఉన్నాడు సార్.. మీరొక్కసారి ఫోన్ చేయండి' అన్నాడు. నేను రెండు సార్లు ఫోన్ చేశా. అతను తీయలేదు. అప్పుడు బాధేసింది. 'నేను ఎప్పుడూ ఇలాగే ఉండను. మీకు జీవితంలో సినిమా చేయను' అని ఆయనకు మెసేజ్ పెట్టాను.

సైకిల్ కొనుక్కోవడమే లక్ష్యం

కెమెరామెన్ కావాలనో... దర్శకుడ్ని అయిపోవాలనో నేను పరిశ్రమకు రాలేదు. బతకడానికి వచ్చాను. అయితే... కెమెరామెన్‌కంటే దర్శకుడికి ఎక్కువ డబ్బు వస్తుందని ఇలా దర్శకత్వం వైపు వచ్చాను. అప్పట్లో మా నాన్నకు తెలిసిన వ్యక్తి నన్ను ఒక సినిమా ఆఫీసులో పెట్టించాడు. వాళ్లు చెప్పిన పనులన్నీ చేస్తే రోజూ రూ.5 ఇచ్చేవారు. అక్కడికి వెళ్లాలంటే 10 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. అందుకే ఎప్పటికైనా సైకిల్ కొనుక్కోవాలని అనుకునేవాడ్ని. సినిమాల్లోకి వచ్చాక కార్లున్నా. సైకిల్ ఆశ తీరలేదు. 'జయం' రిలీజ్ అయిన తర్వాత ఆ కోరిక నెరవేర్చుకున్నా. మెస్‌లో నెలవారీ భోజనానికి బోనెస్లు కొనుక్కుంటే చాలనీ అనుకునేవాడ్ని. అందుకే ఇప్పటికీ ఎక్కడైనా మెస్ కన్పిస్తే మనసు లాగేస్తుంది. చెన్నై, కర్ణాటక వెళ్లినప్పుడు మెస్‌లోనే తింటూ ఉంటా.

డైటింగ్

అంటూ ప్రత్యేకంగా ఏమీ చేయను. కొంచెం కడుపు ఖాళీ ఉండగానే తినడం మానేస్తా. ఎటువంటి అలవాట్లు లేవు.

పిల్లలపై ఒత్తిడి తేవొద్దు

ఇప్పుడు తల్లిదండ్రులు పిల్లలను ర్యాంకుల కోసం ఎక్కువ ఒత్తిడి చేస్తున్నారు. మార్కులే జీవితమంటున్నారు. అందుకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ముందు తల్లిదండ్రులు మారాలి. పిల్లల్లో ఉన్న ప్రతిభ ఏంటో గుర్తించి... ప్రోత్సహించాలి. అంతేగానీ పక్కింటి వాళ్లమ్మాయి ఐఐటీ ర్యాంకు కొట్టిందని, ఎదురింటి అబ్బాయి మెడిసిన్ సీటు సంపాదించాడని పిల్లలను దెప్పిపొడవడం మానేయాలి. ఇతరులతో పోల్చడం మానేయాలి. మన పిల్లల్ని పక్కింటి వాళ్లలా పెంచడం ఎందుకు?

హీటును తలకు ఎక్కించుకుంటే పొగరు ఎక్కువ అవుతుంది. ఫ్లాపును మనసుకు తీసుకుంటే కుంగిపోతాం. ఈ రెండు మన భవిష్యత్తుకు నష్టమే. అందుకే నేను ఈ రెండింటినీ పిద్దగా పట్టించుకోను. ఈ రోజు నా పని ఏంటి? అని ఆలోచించుకుంటూ వెళతాను.

అలా 'చిత్రం' జరిగింది

నేను హిందీ సినిమాలకు పనిచేసేటప్పుడు ఎక్కువగా రామోజీ ఫిల్మ్‌సిటీలోనే షూటింగ్‌లు చేసేవాడ్ని. ఎందుకంటే మా ఆవిడ, పిల్లలు ముంబయికి రామనేవారు. దీంతో వాళ్లు ఇక్కడ. నేనక్కడ. అవకాశం దొరికినప్పుడల్లా హైదరాబాద్‌లో షూటింగ్ పెట్టుకునే వాడ్ని. ఇలా రామోజీ ఫిల్మ్‌సిటీలో ఎక్కువ సినిమాలు తీశాను. అలా రామోజీరావు గారికి 'చిత్రం' కథ వినిపించాను. వాస్తవానికి ఈ కథ నేను క్షణక్షణం సినిమాకు పనిచేసేటప్పుడే రాసుకున్నా. ఎవరికి చెప్పినా ఆసక్తి చూపించేవారు కాదు. 16ఏళ్ల అమ్మాయి గర్భవతి కావడం ఏమిటిః అని ప్రశ్నించేవారు. రామోజీరావ్ గారు కథ విని... ఓకే అన్నారు. దాన్ని రూ.40లక్షల్లో పూర్తిచేశాను. అది సెన్సేషన్. ఇక తర్వాత మీకు తెలుసు కదా!

ఇప్పటికే 1150 మందిని వివిధ విభాగాలలో పరిత్రమకు పరిచయం చేశాను. దీన్ని 10000కు పెంచాలని ఆశ. చిత్రం-2 తీయమని అడుగుతున్నారు. దాని పనిలో ఉన్నానిప్పుడు.

పెద్ద బండరాయిని చూపించి దీన్ని ఎలా ఉపయోగించుకుంటారో మీ ఇష్టమంటే... ఒకరు దాన్ని కంకరగా పగులగొట్టి అమ్ముకొంటాడు. రెండోవాడు ఇష్టంగా పనిచేసి దాన్ని ఒక శిల్పంలా మలుస్తాడు. దీన్ని అమ్మి ఎక్కువ డబ్బు గడిస్తాడు. పేరూ సంపాదిస్తాడు. ఏ మార్గం ఎంచుకుంటే మేలో యువతే ఆలోచించాలి. ఏపని అయినా మనసుతో చేస్తే విజయం తప్పక వరిస్తుంది.

చెన్నైవెళ్లి నేను ఫ్లాట్‌ఫాం మీద పడుకున్న ప్రదేశాలు, భోజనానికి ఇబ్బంది పడిన స్థలాలను అప్పుడప్పుడూ చూసుకుంటూ ఉంటాను.

పిల్లలకు ఆస్తులివ్వను

మా అబ్బాయి అమితవ్ తేజ్, అమ్మాయి ఎలాతేజ్. అమితవ్ నా దగ్గరకి వచ్చి 'నాన్న... ఇంటర్లో ఏ గ్రూప్ తీసుకోవాలో చెప్పు' అన్నాడు. నీ ఇష్టమని చెప్పాను. నువ్వు చదవకపోయినా నాకేం పర్వాలేదన్నాను. పిల్లలకు ఎలా ఇష్టం ఉంటే అలా బతకమని చెబుతాను. పక్కింటి వాళ్లలా చదువుకోవాలని, ర్యాంకర్లు కావాలని ఒత్తిడి పెట్టను. ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వను అన్నాను. వాళ్లే కష్టపడి ఎదగాలని సూచించాను. అప్పుడే వాళ్లకు కష్టం విలువ తెలుస్తుంది. బతికే తెలివితేటలు ఇస్తే చాలనేది నా సిద్ధాంతం. ఇప్పుడు అమితవ్ బాక్సింగ్ ప్రాక్టిస్ చేస్తున్నాడు. ఒక సంవత్సరంలో వాణ్ని ఇంటి నుంచి పంపించేస్తా. అమ్మాయి అమెరికాలో చదువుకుంటోంది. వాళ్లకు పెళ్లికూడా చేయనని చెప్పాను. మీకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోమని ఇప్పటికే చెప్పేశాను. కావాలంటే... పెళ్లయ్యాక నేను ఒక డిన్నర్ ఇస్తానంతే!(నవ్వు)

– వీరా కోగటం
చిత్రాలు : జయకృష్ణ

ప్రేమ వాళ్లది.. కవిత్వం నాది!

ప్రేమలో పడ్డారంటే ఎవ్వరైనా కవి కావాల్సిందే. యువ రచయిత శ్రీమణి స్నేహితుల ప్రేమ కోసం కవిగా మారాడు. తన కవిత్వంతో ఎన్నో ప్రేమకథల్ని కంచికి చేర్చాడు. ఆ అనుభవమే ఆయన్ని ప్రేమ పాటల స్పెషలిస్టుగా మార్చేసింది. చిత్రసీమలో కొత్త కలాల పదునెంతో చాటి చెప్పిన రచయితల్లో శ్రీమణి ఒకరు. పదాల్ని సరికొత్తగా పేర్చి... లోతైన భావుకతని నింపి... గుర్తుండిపోయే పాటలెన్నో రాశారు. ఇటీవల 'మహర్షి' కోసం ఆయన రాసిన పాటలన్నీ శ్రోతలకి చేరువయ్యాయి. శ్రీమణి విజయవంతమైన పాటల ప్రయాణం, ఆయన నేపథ్యం గురించి...

పాటకు మణిహారం

● **పాటల రచయితగా ప్రయాణం ఎలా సాగుతోంది?**

ఒక దశ నుంచి మరో దశలోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతోంది. 'మహర్షి', 'మిస్టర్ మజ్ను' చిత్రాల్లోని గీతాలకు, 'చిత్రలహరి'లోని ప్రేమవెన్నెల పాటకూ మంచి స్పందన వచ్చింది.

● **పాటలు మొత్తం రాయాలన్నప్పుడు ఎదురయ్యే సవాళ్లేంటి?**

మహేశ్‌బాబుకు ఒక పాట రాస్తే చాలనుకొన్నవాళ్లలో నేనూ ఉన్నా. మహర్షికి పాట రాయడం మొదలు పెట్టగానే... దర్శకుడు వంశీ 'మొత్తం మీరే రాయండి' అన్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ప్రోత్సహించారు. 'లవ్ పెయిల్యూర్', 'రైట్ రైట్', 'తొలిప్రేమ', 'మిస్టర్ మజ్ను'... చిత్రాలకు మొత్తం పాటలు రాశాను. ఎక్కువగా ప్రేమ నేపథ్యంలో పాటలు రాయడానికి ఇష్టపడేవాణ్ని. కాలేజీలో రాసిన ప్రేమకవిత్వమే కారణం. ప్రేమలో పడిన నా స్నేహితులు నాతో కవిత్వం రాయించుకొని తీసుకెళ్లేవాళ్లు. ప్రేమ వాళ్లది... కవిత్వం నాది అన్నమాట (నవ్వుతూ). నేను మాత్రం ప్రేమలో పడలేదండి. 'మహర్షి' సినిమా ప్రయాణం చాలా నేర్పింది. మొదటి పాటలో హీరో గెలుపుని చెబుతున్నా. విరామం సమయంలో వచ్చే పాటలో ఇదేనా నీ గెలుపుః అని ప్రశ్నిస్తా. పదరా పదరా... పాటతో ఇది కదా నీ దారి అని చెబుతున్నా. పతాక సన్నివేశాలకి వచ్చేసరికి ఇది కదా గెలుపంటే అని ఒక చిన్న సంతృప్తితో... విజయానికి నిర్వచనం చెబుతాను. గమనిస్తే సినిమా కథంతా ఈ నాలుగు పాటలతో ప్రయాణమవుతుంది. నాకు ఇలాంటి అవకాశం నిజంగా ఒక పెద్ద సవాల్. దర్శకుడు, సంగీత దర్శకుడు, కథానాయకుల ప్రోత్సాహంతో దాన్ని పూర్తిచేశా.

● **అవకాశాల కోసం మీరు పడిన పాట్లు..?**

పోరాటం చేయకుండా ఏదీ సులభంగా రాదు. హైదరాబాద్ వచ్చిన తొలినాళ్లలో ఒక పక్క సినిమా ప్రయత్నాలు చేస్తూ, మరో పక్క పార్ట్ టైమ్ ఉద్యోగాలు వెతుక్కున్నా. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 11 వరకు పిజ్జా డెలివరీ బాయ్‌గా చేశా. ఆపోలో ఆస్పత్రిలో బి పాజిటివ్ అనే మేగజైన్‌కి సర్క్యులేషన్ మేనేజర్‌గా పనిచేశా. అలా 'ఆర్య2' సమయంలో కాశీ అనే ఒక స్నేహితుడి వల్ల తోట శ్రీనివాస్ పరిచయమయ్యారు. ఆయనవల్ల దర్శకుడు సుకుమార్‌కి సాహిత్యం అంటే ఎంత ఇష్టమో తెలిసింది. ఆర్య2 సినిమాలో సందర్భాలకి తగ్గట్టుగా నాకు నేను ఊరికే పాటలు రాసిచ్చాను. అవి నచ్చి '100% లవ్' చిత్రంలో సుకుమార్‌గారు అవకాశం ఇచ్చారు.

● **పాటకి ఇంత శక్తి ఉందా అని మీకనిపించిన మొదట సందర్భం ఏమిటి?**

'100 % లవ్'లో 'అహో బాలు... పాటతో నా సినిమా ప్రయాణం మొదలైంది. ఇప్పటివరకు 300కి పైగా పాటలు రాసుంటా. 'సెగ చిత్రంలో వర్షం ముందుగా... అంటూ సాగే పాటను దామినిగారు 'పాడుతా తీయగా' కార్యక్రమంలో పాడారు. అది నచ్చి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారు చాలా బాగుందని నన్ను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. దాంతో టీవీ, ఈనాడుల్లో ఆ పాట గురించి నా ఇంటర్వ్యూ వచ్చింది. అది చూసే దర్శకుడు త్రివిక్రమ్‌గారు నాకు 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాలకి పాటలు రాసే అవకాశాన్నిచ్చారు. ఆ పాట గురించి ఎవరో ఒకరు ఏదో ఒక సందర్భంలో గుర్తు చేస్తుంటారు. అలా గొప్ప గొప్ప దర్శకులతో కలిసి పనిచేసే అవకాశాన్నిచ్చిన పాట అది.

● **గీత రచయిత కావాలనే ఆలోచన ఎప్పుడు కలిగింది?**

ఇంటర్‌మీడియట్ చదువుతున్నప్పుడు 'వర్షం' సినిమా పాటలు విడుదలయ్యాయి. ఆ పాటలే రచయిత కావాలనే లక్ష్యానికి బీజం వేశాయి. అంతకుముందు చిన్న చిన్న కథలు, వ్యాసాలు, పద్యాలు రాసి స్కూల్‌లో వినిపించేవాణ్ని.

● **మన కథానాయకులు సాహిత్యంపై చూపుతున్న మక్కువ ఎంతో ప్రోత్సాహాన్నిస్తోంది.** పవన్‌కల్యాణ్‌కి సాహిత్యం అంటే చాలా ఇష్టం. 'అజ్ఞాతవాసి'కి పనిచేస్తున్నప్పుడు 'ధగ ధగ...' అనే పాట గురించి చర్చించడానికి వెళ్లా. ఆ సందర్భంలో ఆయన సాహిత్యం గురించి చెప్పిన మాటలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. అలాగే మహేశ్‌బాబు పదాల లోతు తెలుసుకుంటూ ఉంటారు.

● **దర్శకుల్లో సుకుమార్ ఒక ప్రయోగశాల అయితే... త్రివిక్రమ్ ఓ పాఠశాల.** సుకుమార్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు ఎన్ని ప్రయోగాలైనా చేయొచ్చు. త్రివిక్రమ్‌తో ప్రయాణంలో ఎన్ని పాఠాలైనా నేర్చుకోవచ్చు. దిల్‌రాజుగారి ప్రోత్సాహం గొప్పగా ఉంటుంది.

● **చిన్నప్పుడే రచనా వ్యాసంగంపై దృష్టి ఎలా మళ్లింది?**

మాది ప్రకాశం జిల్లా చీరాల. అమ్మానాన్న నా చిన్నప్పుడే పోయారు. దాంతో అమ్మమ్మ రమణమ్మగారు, తాతయ్య కె.దత్తాత్రేయులుగారి దగ్గర పెరిగాం. చిన్నప్పట్నుంచీ నేను చదువుల్లో చురుకే. తాతయ్య శివభక్తుడు. స్తోత్రాలు చదివేవారు. అమ్మమ్మ రామాయణం పారాయణం చేసేవారు. అలా వాళ్లిద్దరివల్లే పుస్తక పఠనం అలవాటైంది. ఆ అభిరుచే నన్ను ఇలా నడిపింది. డిగ్రీ తొలి ఏడాది పూర్తి కాగానే హైదరాబాద్‌కి వచ్చా. డిగ్రీ చదువుకుంటూనే గీత రచయితగా ప్రయత్నాలు మొదలు పెట్టా. నేనింత దూరం వచ్చానంటే కారణం మా అమ్మమ్మ, తాతయ్యలే.

–నర్సిమ్ ఎర్రకోట

ఈనాడు సినిమా

క్లిక్.. తళుక్

ఫొటో షూట్‌లతో అదరగొడుతున్న తారలు

కాజల్.. తమన్నా ఓ వేడుకకి హాజరవుతున్నారు. ఇద్దరూ అందంగా ముస్తాబయ్యారు. ఇక అక్కడ ఒక ఫొటో షూట్ జరిగి తీరాల్సిందే. కాసేపట్లో ఆ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేయాల్సిందే.

పూజా హెగ్డే

కాజల్

శ్రుతిహాసన్ ఓ ఫ్యాషన్ షోలో ఎర్ర తివాచీపై నడిచేందుకు సిద్ధమైంది. అంతకంటే ముందే ఆ డ్రెస్సు ధరించి కెమెరా ముందుకొస్తుంది. క్లిక్ క్లిక్‌మంటూ కెమెరా శ్రుతి అందాల్ని ఒడిసి పడుతుంది. వెంటనే ఆ ఫొటోలు అంతర్జాలంలో వైరల్ అయిపోతాయి.

కొత్తగా అడుగులు వేస్తున్న ఓ కథానాయిక ట్రెండీ పాత్రల్లోనే బాగుంటుందనీ, సంప్రదాయ పాత్రలు ఆమెకి నప్పవనే ఓ అభిప్రాయాన్ని వింటుంది. తాను సంప్రదాయ దుస్తుల్లో ఎలా ఉంటానో వీళ్లకి చూపించాల్సిందే అంటూ చీర కట్టుతో కెమెరా ముందుకొస్తుంది. రకరకాల భంగిమల్లో ఫొటోలకి పోజులిచ్చి... ఇదీ నా ప్రతిభ అంటూ ఆ ఫొటోల్ని ఆన్‌లైన్‌లో పెట్టేస్తుంది. దాని గురించి పరిశ్రమలో చర్చ మొదలవుతుంది.

సామాజిక మాధ్యమాల్లో సందడే సందడి

తమన్నా

పాయల్ రాజపుత్

శ్రుతి హాసన్

రకుల్ ప్రీత్ సింగ్

అదొక కళ

ఫొటోలకి పోజులివ్వడం ఓ కళ అంటుంది అగ్ర కథానాయిక శ్రుతి హాసన్. "నాకు చిన్నప్పట్నుంచే అది బాగా అలవాటైంది. అందుకే నా ఫొటోలు అంత బాగా వస్తుంటాయని ఆమె చెబుతోంది. కాస్ట్యూమ్స్‌కి, మన ఫొటో షూట్‌కి తగ్గట్టు పోజులివ్వడం తెలిసుండాలని, అప్పుడే అనుకొన్నట్టుగా ఫొటోలు వస్తాయంటోంది శ్రుతి. ఈ ట్రెండ్ గురించి కాజల్ మాట్లాడుతూ... "ఎక్కడ ఫొటోలు క్లిక్‌మన్నా అవి ఇన్‌స్టాగ్రామ్‌లోకి రావల్సిందే. ఇప్పుడదే కీలక పాత్ర పోషిస్తోంది. కొన్ని మేగజీన్ కవర్ ఫొటోల కోసం ఆ మధ్య ఫొటో షూట్‌ల్లో పాల్గొన్నా. వాటికి మంచి స్పందన లభించిందని చెప్పింది. నాయికలు తరహా కెమెరా ముందుకు వెళ్లడానికి ఈమధ్య మరో ట్రెండ్ కూడా కారణమవుతోంది. కొన్ని సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్ నాయికలకి డబ్బు చెల్లించి, రోజూ కొన్ని ఫొటోలతో పాటు వీడియోలు పోస్ట్ చేస్తూ ఉండాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి. నాయికల అందమైన ఫొటోల కోసమైనా తమ యాప్స్‌ని చూస్తారనేది వారి ఉద్దేశం.

కథానాయికలు ఫొటో షూట్‌లతో గ్లామర్ ఒలకబోస్తున్నారు. కాజల్, తమన్నా, శ్రుతిహాసన్, పూజా హెగ్డే, పాయల్ రాజ్‌పుత్, రకుల్ ప్రీత్ సింగ్ లాంటి తారలు తమ ఫొటోషూట్ చిత్రాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంటూ వారి అందం గురించి చర్చ లేవనెత్తుతున్నారు. ఇదివరకు ఒక కథానాయిక అందం గురించి మాట్లాడాలంటే ఆమె చేసిన కొత్త సినిమా విడుదల కావల్సిందే. సెట్‌లో కెమెరాల ముందుకు వెళుతున్నప్పుడే అందంగా కనిపించే విషయం గురించి వారు శ్రద్ధ తీసుకొనేవారు. ఇప్పుడలా కాదు. అందాల ప్రదర్శనపై రోజూ కసరత్తులే. రోజూ చర్చే. పదిమంది దృష్టి పడితే తప్ప అవకాశాలు రావనుకొన్న వాళ్లు... ఫ్యాషన్ పరంగా తాము అప్‌డేట్ అవుతున్నామనే విషయం అందరికీ తెలియాలనుకొనేవాళ్లు.. తాము అన్ని రకాల పాత్రలకీ పనికొస్తామనే సంకేతం పరిశ్రమకి చేరాలనే తలంపుతో ఉన్నవాళ్లు... కొత్త కథానాయికలు, పేరున్న కథానాయికలు... అందరూ ఫొటోషూట్‌లని ఆశ్రయిస్తున్నవాళ్లే. ఇన్‌స్టాగ్రామ్‌లోకి వెళితే వెండితెరని మించిన గ్లామర్ కనిపిస్తుంది. కథానాయికల్ని ఎంపిక చేసుకోవాలంటే దర్శకులు వాళ్లని పరిశీలించి, ఫొటో షూట్‌లు చేయించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటారు. ఇప్పుడు ఆ అవసరమే ఉండటం లేదు. సామాజిక మాధ్యమాల్ని పరిశీలిస్తే కావల్సిన కథానాయిక దొరుకుతుందనే నమ్మకం పరిశ్రమలో కనిపిస్తోంది. అలా ఎంపికైనవాళ్లు కూడా చాలా మందే.

ఖర్చు ఎక్కువే...

బాలీవుడ్‌కి వెళ్లి మరీ ఫొటో షూట్‌లు చేయించుకొనే దక్షిణాది కథానాయికలు చాలా మందే. కెమెరా ముందుకెళ్లి పోజిస్తే ఫొటో షూట్ అయిపోయినట్టు కాదు. దానికి ముందు చాలా కసరత్తులు ఉంటాయి. ఫొటో షూట్‌కి తగ్గట్టుగా స్టైలింగ్, మేకప్‌పై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలి. కొరుకున్నట్టుగా ఫొటో షూట్ చేయించుకోవడానికి, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌లని ఆశ్రయించి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒక సినిమాలో నటించి పేరు తెచ్చుకొన్న తెలుగు కథానాయికకి.. మరిన్ని కొత్త అవకాశాలు రావాలంటే ఓ మంచి ప్రొఫైల్ ఉంటే బాగుంటుందని సన్నిహితులు సలహా చెప్పారట. దాంతో ఆమె ముంబయికి వెళ్లి రూ.5 లక్షల వ్యయంతో ప్రొఫైల్ ఫొటో షూట్ చేయించుకొంది. ఆ ఫొటోలు ప్రత్యేకంగా ఉండటంతో అంతర్జాలంలో వైరల్‌గా మారాయి. దుస్తులు, మేకప్, స్టూడియో ఖర్చులతో కలిపి ఫొటో షూట్‌కి వెల కడుతుంటారు. అయితే కొద్దిమంది ఫొటోగ్రాఫర్లు నాయికలకి ఉచితంగా ఫొటో షూట్ చేయించి ఇస్తుంటారు. ఆ ఫొటోలపై వాళ్ల స్టూడియో పేర్లు కనిపించేలా ఉండాలని షరతు పెడుతుంటారు.

కొత్త దర్శకులతో...

చంటి అడ్డాల

"సినిమా రంగంలో 38 ఏళ్ల అనుభవం సంపాదించా. ప్రభాస్, ఎన్టీఆర్‌తో సహా పలువురు ప్రముఖ హీరోలతో చిత్రాల్ని నిర్మించా. త్వరలో ఇద్దరు దర్శకుల్ని పరిచయం చేస్తూ రెండు చిత్రాల్ని నిర్మించబోతున్నా" అన్నారు చంటి అడ్డాల. కళా దర్శకుడిగా ప్రయాణం మొదలుపెట్టిన ఆయన ఆ తర్వాత నిర్మాతగా మారారు. ఆదివారం చంటి అడ్డాల పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన తదుపరి నిర్మించబోయే కొత్త చిత్రాల్ని ప్రకటించారు. త్రివిక్రమ్ దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన హరిహరన్, బొమ్మరిల్లు భాస్కర్ సహాయ దర్శకుడు సుబ్బుని పరిచయం చేస్తూ చిత్రాల్ని నిర్మించనున్నట్టు చంటి అడ్డాల తెలిపారు. "ప్రేక్షకుల అభిరుచి, ట్రెండ్‌లకి తగ్గట్టుగా పది సినిమాలు నిర్మించాను. తదుపరి చిత్రాలు కూడా అదే తరహాలో ఉంటాయ"న్నారు చంటి.

ఎస్వీఆర్ గురించి చెప్పాకే నటుడిని కావాలనే కోరిక కలిగింది!

- 'మహానటుడు' పుస్తకావిష్కరణ వేడుకలో చిరంజీవి

మండలి బుద్ధప్రసాద్, సంజయ్ కిషోర్, చిరంజీవి, తనికెళ్ల భరణి, బ్రహ్మానందం, తమ్మారెడ్డి భరద్వాజ, రోజా రమణి

"ఎస్వీ రంగారావు గారు ఇక్కడ పుట్టడం తెలుగు వారిగా మనందరం చేసుకున్న అదృష్టం. అలాంటి మహానటుడిని ఒక్కసారీ నేరుగా చూడలేదు.. ఒక్కసారీ కలవలేదు.. ఆయనతో ఒక్క ఫొటో కూడా లేదనే లోటు నా జీవితాంతం ఉంటుంది" అన్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. ప్రముఖ నటులు ఎస్వీ రంగారావు జీవితాన్ని ఫొటోలతో విశదీకరించి రచించిన 'మహానటుడు' పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. సంజయ్ కిషోర్ ఈ పుస్తకాన్ని రచించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి తొలి ప్రతిని ఆవిష్కరించి పెద్దాల హరినాథ బాబుకి అందజేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ "ఎంతో ఓపిక, దీక్ష ఉంటే తప్ప ఇలాంటి పుస్తకం బయటికి రాదు. ఎస్వీఆర్ లాంటి గొప్ప వ్యక్తి పుస్తకాన్ని ఆవిష్కరించే అర్హత నాకుండా లేదా అనిపించింది. కానీ ఇది భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను. ఎస్వీఆర్, సావిత్రి, కన్నాంబ... ఈ ముగ్గురంటే చాలా ఇష్టం. ఎస్వీఆర్‌గారి మీద అభిమానం పెరగడానికి మా నాన్నగారు ఓ కారణం. ఆయన 'జగత్ కిలాడీలు', 'జగత్ జంత్రీలు' చిత్రాల్లో చిన్న పాత్రలు వేశారు. ఆయన అదృష్టం కొద్దీ ఎస్వీఆర్‌తో కలిసి నటించే అవకాశం వచ్చింది. చిత్రీకరణ అయిపోయాక ఇంటికొచ్చి ఆ విశేషాలు చెప్పేవారు. నాకు అప్పుడే నటుడిని కావాలనే కోరిక కలిగింది. చరణ్ సినిమాల్లోకి వస్తున్నప్పుడు కూడా ఎస్వీ రంగారావుగారి వీడియోలు, సినిమాలు చూపించేవాడిని. నటన అంటే అంత సహజంగా ఉంటుందా అని ఆశ్చర్యపోయి స్ఫూర్తి పొందాడు. అలా నాకూ, చరణ్‌కే నటన విషయంలో ఎస్వీఆర్ స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. అప్పట్లో ఎస్వీఆర్ గురించి గుమ్మడి ఒక మాట అన్నారు. ఎస్వీఆర్ తెలుగువాడిగా పుట్టడం ఆయన దురదృష్టం, హాలీవుడ్‌లో పుట్టుంటే ప్రపంచ ప్రఖ్యాతిగాంచేవారని బాధపడ్డారని గుర్తు చేసుకున్నారు. బ్రహ్మానందం మాట్లాడుతూ "నటనకి స్వరూపమన్తే అది ఎస్వీ రంగారావు. ప్రభుత్వం సహకారం అందిస్తే ఇలాంటి మంచి పుస్తకాలు ఇంకా వస్తాయ"న్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "ప్రభుత్వం, పరిశ్రమ చెయ్యాల్సిన పనిని రచయిత సంజయ్ కిషోర్ ఒక్కడే చేస్తున్నాడు. ఇలాంటి పుస్తకాలు చాలా అవసరం. చిరంజీవిలాంటి వ్యక్తి ఆవిష్కరిస్తేనే ఇలాంటి పుస్తకాలకి ఒక విలువ వస్తుంది" అన్నారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ "పది ఆస్కార్‌లు ఇవ్వదగిన స్థాయి ఉన్న నటుడు ఎస్వీఆర్. ఆయన దూరమైన 45 ఏళ్ల తర్వాత కూడా ఆయన గురించి మాట్లాడుకుంటున్నాం అంటే ఆ జన్మకి అంతకంటే సార్థకత ఏముంటుంద"న్నారు. "దవళేశ్వరం అనగానే కాటన్ దొర, ఎన్టీఆర్ గుర్తొస్తారు. ఆ కాటన్ బ్యారేజీ ఉన్నంత కాలం ఎస్వీఆర్‌ని గుర్తు పెట్టుకుంటామ"న్నారు ఆలీ. సంజయ్ కిషోర్ మాట్లాడుతూ "ఈ పుస్తకంలో ఎస్వీఆర్ బాల్యం నుంచి ఆయన జీవన ప్రయాణం మొత్తం ఫొటోల రూపంలో విశదీకరించా" అన్నారు. కార్యక్రమంలో మండలి బుద్ధప్రసాద్, రావికొండలరావు, రోజా రమణి, జయలలిత, కృష్ణయ్య, రచిచంద్రరాజు, ఎ.బి.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరి పేరుని నిలబెడతాడు మేఘామ్ష్

సత్య నారాయణ, నక్షత్ర, జీవిత, మేఘామ్ష్, శాంతి శ్రీహరి

నటుడు శ్రీహరి రెండో కుమారుడు మేఘామ్ష్ శ్రీహరి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'రాజ్‌దూత్'. నక్షత్ర, ప్రియాంక వర్మ నాయికలు. అర్జున్ - కార్తీక్ దర్శకత్వం వహించారు. ఎమ్.ఎల్.వి.సత్యనారాయణ (సత్తిబాబు) నిర్మాత. హైదరాబాద్‌లో నటి జీవితా రాజశేఖర్ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది. అనంతరం ఆమె మాట్లాడుతూ "సినిమా రషెస్‌ని చూసినప్పుడే మేఘామ్ష్‌లో శ్రీహరిని చూశా. చురుకైన నటన, నృత్యాలతో శ్రీహరిని మించి పేరు సంపాదిస్తాడ"న్నారు. "మేఘామ్ష్‌తో రెండో చిత్రాన్నీ తీస్తాం" అన్నారు నిర్మాత. శాంతి శ్రీహరి మాట్లాడుతూ "మేఘామ్ష్ చేసిన ఒకే ఒక షాట్‌ని చూశా. అందులో శ్రీహరిని కళ్లముందు నిలిపాడు. ఓ పాటలోని తన నృత్యాన్నీ చూశా. ఆ డ్యాన్స్‌లో నా ముద్ర కనిపించింది. శ్రీహరి పేరుని మేఘామ్ష్ నిలబెడతాడు" అన్నారు. మేఘామ్ష్ మాట్లాడుతూ "మా అమ్మానాన్నల వల్లే ఇక్కడిదాకా వచ్చా. సుదర్శన్‌కీ, నాకూ మధ్య సన్నివేశాలు నవ్విస్తాయి. జులైలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. "నవరసాలతో కూడిన కథ ఇది" అన్నారు దర్శకులు. ఈ కార్యక్రమంలో నటులు ఏడిద శ్రీరామ్, రవివర్మ, సుదర్శన్, మోదుకూరి ఆశోక్‌కుమార్, విద్యాసాగర్, విజయ్‌వర్ధన్‌తో, శ్రీహరి తనయుడు శశాంక్ పాల్గొన్నారు.

విద్య ఉంది.. మరి బుద్ధి?

చేతన్ మద్దినేని, కశిష్ ఓరా నటించిన చిత్రం 'ఫస్ట్ ర్యాంక్ రాజు'. నరేష్ కుమార్ దర్శకుడు. మంజునాథ్ నిర్మాత. 21న చిత్రం విడుదలవుతోంది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ "కన్నడలో విజయంసాధించిన చిత్రాన్ని తెలుగులో పునర్నిర్మించాను"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఫస్ట్ ర్యాంక్ సాధించిన యువకుడి జీవితంలో

నరేష్ కుమార్, మంజునాథ్, కశిష్ ఓరా, చేతన్

ప్రేమ వల్ల ఏర్పడిన పరిస్థితుల్ని వినోదాత్మకంగా తెరకెక్కించాం. రాజుకి విద్య ఉన్నా బుద్ధి శూన్యం. తన ప్రేయసి అతన్ని ఎలా మార్చిందనేది ఆసక్తికరం" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "ప్రేమకథకి వినోదాన్ని మేళవించిన తీరు బాగుంది. త్వరలో ట్రైలర్‌ని విడుదల చేస్తాం" అన్నారు. రమ్య, అమిత్, రామ్ కుమార్, అయ్యన్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

? నేను బీటెక్ చదువుతున్నా. నాకు ఫ్యాషన్‌గా కనిపించడం ఇష్టం. దానికి చెవిపోగులు కీలకం అని నా భావన. ఏ ముఖాకృతికి ఎలాంటివి నప్పుతాయి? ఎలాంటి దుస్తుల మీదకు ఏవి ఎంచుకోవాలో అర్థం కావడం లేదు. సలహా ఇవ్వగలరు.
– ఓ సోదరి!

నా ముఖానికి ఏం నప్పుతాయి!

ఇయర్‌వేర్‌లో స్టడ్స్, హ్యాంగింగ్స్, హూప్స్, చాంద్‌బాలీలు, బుట్టలు ఇలా బోలెడన్ని రకాలు మనకి అందుబాటులో ఉన్నాయి. కనిపించినవన్నీ పెట్టుకోవాలనిపించినా అవి మన ముఖానికి నప్పాలి. వేసుకున్న దుస్తులకు సరిపోవాలి. అప్పుడే అదనపు ఆకర్షణ తెచ్చిపెడతాయి. గుండ్రటి ముఖం ఉన్నప్పుడు పొడవాటి లేదా కోలగా ఉండే చెవి పోగుల రకాలు నప్పుతాయి. వీరికి స్టడ్స్ అంతగా బాగోవు. మరీ పొడవు ఇష్టపడనివారు మధ్యస్థంగా ఉండే రకాల్ని ఎంచుకోవచ్చు. ఇలాంటప్పుడు టియర్ డ్రాప్ తరహావి బాగుంటాయి. మెరిసే రాళ్లు, పూసలతో డిజైను చేసిన కర్ణాభరణాలు పార్టీవేర్‌గా పెట్టుకోవచ్చు. కోలముఖం ఉన్నప్పుడు ఎలాంటివి ఎంచుకున్నా వరవాలేదు. హృదయాకారం, గుండ్రటి ఆకృతిలో ఉన్న స్టడ్స్ పెట్టుకుంటే ప్రత్యేకంగా కనిపించొచ్చు. షాండ్లియర్ ఇయర్‌రింగ్స్, జామెట్రికల్ రకాలు, చాంద్‌బాలీలు వీరికి నప్పుతాయి. హృదయాకృతి ముఖం ఉన్నవారికి వేలాడే జుంకాలు, బుట్టలు భలే అందాన్ని తెచ్చిపెడతాయి. ఎవరైనా సరే! తమ ముఖాకృతికి భిన్నంగా ఉండే షేప్‌లలో ఇయర్‌రింగ్స్ ఎంచుకోవడం వల్ల కొత్తగా కనిపిస్తారు. అవే నప్పుతాయి కదాని ఎప్పుడూ ఒకేలాంటివి పెట్టుకోవడం సరికాదు. వేసుకునే దుస్తులు, సందర్భాన్ని బట్టి వీటిని మార్చుకుంటూ ఉండాలి. క్యాజువల్‌వేర్‌గా కాంటెంపరరీ ఇయర్‌రింగ్స్ బాగుంటాయి. సాయంత్రపు పార్టీలకు వీటిని పెట్టుకుంటే ఆ అందమే వేరు. సంప్రదాయ వేడుకలకు భారీగా ఉండే జుంకాలు, చాంద్‌బాలీలు ఎంచుకోవడం మంచిది.

డియర్ వసుంధర

నిహారికారెడ్డి
డిజైనర్

మీ ప్రశ్నలు ఇకపై vasufash@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

8న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(10గ్రా)	33,880	33,850	33,880	33,640
ఆర్నమెంట్	31,640	31,560	31,400	31,150
వెండి (కిలో)	38,254	38,150	38,300	38,100
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(10గ్రా)	33,650	33,550	33,880	33,790
ఆర్నమెంట్	30,110	30,930	31,420	31,310
వెండి (కిలో)	38,300	37,790	38,300	38,200
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(10గ్రా)	33,690	33,580	-------	-------
ఆర్నమెంట్	31,340	31,230	3,142	3,123 గ్రా
వెండి (కిలో)	38,000	38,000	40.31	40.10 గ్రా

రాక్‌బ్యాండ్‌తో సేవ

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని సంగీతం ద్వారా సాధారణ ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకుంది లఖనవూ చెందిన జయ తివారి. పాటలతో ఎన్నో సమస్యల్ని సలుగురికీ తెలియజేస్తోంది. ఇంతకీ ఆమె ఎవరంటే...

జయది లఖ్‌నవూ. ఆమె సంగీతంలో పీహెచ్‌డీ చేసింది. దీంతోనే సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకుంది. 'మేరీ జిందగీ' పేరుతో రాక్‌బ్యాండ్‌ని ప్రారంభించింది. ఇందులో జయ తనలాగే సంగీతం తెలిసి, సామాజిక సేవ చేయాలనుకున్నవారిని చేర్చుకుంది. వీరంతా మహిళా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, బాలికావిద్య, గృహహింస... ఇలా మహిళలు ఎదుర్కొనే అన్ని సమస్యలపై వారు గళం విప్పుతున్నారు.

తొలినుంచే కష్టాలు...

దీన్ని ప్రారంభించినప్పుడు చాలామంది రాక్‌బ్యాండ్‌లో చేరినా రకరకాల కారణాల వల్ల తప్పుకొనేవారు. ప్రస్తుతం ఇందులో జయతో కలిపి ఎదుగురు ఉన్నారు. నిహారిక సింథసైజర్‌గా పనిచేస్తే, పూర్వి మాలవ్య గిటార్ వాయిస్తుంది. అనామిక డ్రమ్స్ వాయిస్తుంది. సౌభాగ్య దీక్షిత్ పాటలు పాడుతుంది. వీళ్లు ఇప్పటి వరకు జింగిల్స్ ఫర్ ఆల్ ఇండియా రేడియో, యూపీ మహిళా పోలీస్, గుడ్‌గావ్ సీఆర్‌ఎస్ మొదలు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దాదాపు 70 పాటల్ని రూపొందించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో ఇప్పటివరకు 100 ప్రదర్శనలు చేశారు. 'మేం ఇలా చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మా రాక్‌బ్యాండ్‌ను పెద్ద సంఖ్యలో పురుషులు కూడా పాలో అవడం విశేషం' అని చెబుతుంది జయ.

పిల్లలు కోరిందల్లా కొనిస్తాం... ఎంత అల్లరి చేస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తాం... వాళ్ల మాటలకు, చేతలకు మురిసిపోతాం. ఆ అతి గారాబమే సమస్యలు తెచ్చిపెడుతుంది. పెరిగి, పెద్దయ్యాక వాళ్లను ఎలా మార్చాలా అని ఆలోచించే బదులు... చిన్నప్పుడే ఆ గారాబాన్ని అదుపులో ఉంచడం మంచిదంటారు నిపుణులు.

పిల్లలు-పెంపకం

గారాబానికీ ఓ సరిహద్దు

ప్రతి తల్లిదండ్రికీ తమ బిడ్డ ప్రత్యేకమే. తమలా పిల్లలు కష్టపడకూడదని, తమకు లభ్యం కానివి వాళ్లకు దక్కాలని ఆరాటపడుతుంటారు. ఎందులోనూ లోటు రాకూడదనుకుంటారు. ఇదేమీ తప్పు కాదు కానీ ఈ ప్రత్యేక శ్రద్ధ, వాళ్లకు ఇచ్చే స్వేచ్ఛ, నిర్ణయాధికారం పిల్లలకే వదిలేయడం, అవసరానికి మించి అడిగింది ఇవ్వడం... వంటివన్నీ మితిమీరితేనే సమస్య. పిల్లలు ఇతరుల దగ్గరా అలాగే ప్రవర్తిస్తారు. అందరిలో తాము ప్రత్యేకమని అనుకుంటారు. ఎదిగేకొద్దీ సమస్యలు కొని తెచ్చుకోవడమే కాదు, మరికొన్ని ఇబ్బందుల బారినా పడతారు.

గారాబం ఎలా అలవాటవుతుందంటే...

చిన్నారులకు నచ్చిన వస్తువులతో మొదలుపెడదాం. వాళ్లు ఏదయినా కావాలనుకుంటే మొదట అభ్యర్థిస్తారు. వెంటనే ఇస్తే ఆ తరువాత అడగడం నేర్చుకుంటారు. అప్పుడూ ఇవ్వారనుకోండి... అడిగిందల్లా ఇస్తున్నారు కదాని ఇంకా కావాలంటూ మంకుపట్టు పట్టడం మొదలుపెడతారు. ఒకవేళ అది ఇచ్చే స్థోమత లేదనే ఉద్దేశంతో నిరాకరిస్తే గోల చేస్తారు. ఇలా దశల వారీగా సాధించుకునేందుకు ప్రయత్నిస్తారు. పిల్లలు ఏదయినా పెద్ద మాటలు మాట్లాడినప్పుడు మురిసిపోయామా... పదేపదే అదే కొనసాగిస్తారు. క్రమంగా వద్దని వారిస్తున్నా వినిపించుకోని స్థితికి చేరుకుంటారు. ఈ రెండూ మాత్రమే కాదు... అమ్మానాన్న ఏమనరనే ఉద్దేశంతో చేసే విపరీతమైన అల్లరి, పెద్దవాళ్లను ఎదిరించడం, మంకుపట్టు పట్టడం, సరిగ్గా చదవకపోవడం... ఇవన్నీ గారాబంతోనే మొదలవుతాయి.

మార్చడానికీ పద్ధతులున్నాయి...

అతిగా గారాబం చేసిన పిల్లల్లో మార్పు తేవడం ఒక్కరోజులో సాధ్యం కాదు. ముందు కారణాలు తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేయాలి.

అడిగిందల్లా ఎందుకు: మీ బాల్యం గుర్తు చేసుకోండి. మీ తల్లిదండ్రులు మీకేం చేయలేదు కాబట్టే మీరు మీ పిల్లలకు చేయాలనుకుంటున్నారా... పిల్లలు అడిగిందల్లా ఇవ్వడం వల్ల మీకు ఆనందం కలుగుతుందా... అంచనా వేసుకోండి. ఇకపై అలా వద్దు. ప్రతిదానికి తొందరపడి కొనేయకుండా... పిల్లల్ని బాధ్యతాయుతంగా పెంచేలా చూడండి. చేతినిండా డబ్బు ఉన్నా లేకపోయినా, అడిగిన ప్రతిదీ దక్కదని వాళ్లకు స్పష్టం చేయండి. ఇన్నాళ్లూ అలవాటు చేసి ఇప్పుడు కాదంటే వాళ్లు విసిపించుకోరు కానీ..ఓపికపడితే అది సాధ్యమే.

సమయం అవసరం: పిల్లల్ని గారాబం చేయాలి కానీ... వాళ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, అకారణంగా అడిగిందల్లా కొనిచ్చేయడం వల్ల ఉపయోగం ఉండదు. వాళ్లకు హాని చేసినవాళ్లమవుతాం. బదులుగా వాళ్లతో నాణ్యమైన సమయం గడిపేలా చూడండి. వాళ్లు ఏదయినా అడిగినా... రాబోయే సందర్భమో, పరీక్షకో ముడిపెట్టి.. 'అప్పుడు కొనివ్వడానికి ప్రయత్నిస్తా...' అని చెప్పండి.

స్వతంత్రంగా ఎదిగేలా: బాల్యంలో వాళ్లకు మీరెంత అండగా ఉన్నా సరే... ఎదిగేకొద్దీ వాళ్లే స్వతంత్రంగా పనులన్నీ చేసుకోవాలి. అది గుర్తుపెట్టుకుని... చిన్నతనం నుంచీ వాళ్ల పనులు వాళ్లే చేసుకునేలా ప్రోత్సహించాలి. చదువు అయినా, వ్యక్తిగత అవసరాలు అయినా...వాళ్లంతట వాళ్లే చేసుకునేలా ప్రోత్సహించాలి. అవసరాన్ని బట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకునేలా చూడాలి.

గీత గీయండి: పిల్లల్ని పెంచేటప్పుడు రెండు విషయాలు గుర్తుంచుకోవాలి. ఒకటి వాళ్లు ఏదయినా పని చేయగలరని తెలిసినప్పుడు మనం కల్పించుకోకూడదు. రెండోది వాళ్లు పిల్లలు, మనం తల్లిదండ్రులమని గుర్తుపెట్టుకోవాలి. కోరింది ఇస్తూనే బాధ్యతను అలవాటు చేయాలి. కష్టం, సుఖానికి మధ్య తేడా వాళ్లకు అర్థం కావాలి. అవసరం అయితే... కష్టపడేందుకు వాళ్లను సిద్ధం చేయాలి .ఒక గ్యాడ్జెట్ ఇచ్చినా పరిమితి పెట్టాలి. డబ్బు ఇచ్చినా... వివరాలు తెలుసుకోవాలి. స్నేహితులతో వెళ్తున్నా... ఎంత సేపట్లో రావాలో చెప్పాలి. మీరు అన్నీ గమనిస్తున్నారని పిల్లలు అర్థంచేసుకుంటారు. జాగ్రత్తగా ఉంటారు.

బహుమతులు వద్దు: పిల్లలు ఏదయినా సాధించగానే ఓ బహుమతి కొనిచ్చి అభినందిస్తాం. అలా ప్రతిసారి అవసరంలేదు. అదే జరిగితే... బహుమతి వస్తుందని సాధించేందుకు ప్రయత్నిస్తారు. వాళ్లకు కష్టం విలువ తెలియజేయండి. బహుమతి అయినా సరే... అవసరానికి, విలాసానికి మధ్య తేడా వివరించండి. ఏదీ అంత సులువుగా రాదనే విషయం వాళ్లకు అర్థమయ్యేలా చెప్పండి.

ప్రేమ మంచిదే కానీ: మీరు పిల్లల్ని ప్రేమిస్తారనే విషయాన్ని వాళ్లకు తెలియజేయాలి కానీ అక్కడితోనే ఆగిపోకూడదు. తప్పు చేస్తే తిడతారని వాళ్లకు అర్థమయ్యేలా చెప్పాలి. ప్రేమను మాటలతో చెప్పాలి. మంచి పని చేస్తే అభినందించాలి. తప్పుచేస్తే వెంటనే ఖండించాలి. అవసరం అనుకుంటే శిక్షించాలి. ఈ తేడాను వివరించగలిగితే గారాబం సమస్యగా మారదు.

పక్కాగా దినచర్య: పిల్లలు పెద్దయ్యేకొద్దీ దురలవాట్ల బారినపడటం చూస్తూనే ఉంటాం. ఈ సమస్య ఎదురుకాకూడదంటే... మొదటి నుంచీ వాళ్ల జీవితం పక్కాగా ఉండేలా చూడాలి. వేళకు నిద్రపోవడం, ఓ సమయానికి చదవడం, పోషకాహారం తీసుకోవడం, ప్రత్యేకమైన అభిరుచులు... తప్పనిసరి. సాంకేతికతకు వీలైనంతవరకూ దూరంగా ఉంచడం మంచిది. ఇవన్నీ చిన్నారులకు భవిష్యత్తులో మేలుచేస్తాయి. ఇవన్నీ వారిని క్రమశిక్షణలో పెడతాయి.

మొండికేస్తారు...

చిన్నప్పుడు గారాబం చేసినా పెద్దయ్యాక మారతారనుకుంటాం కానీ... కొందరి విషయంలో అది సాధ్యం కాకపోవచ్చు. ఆ గారాబం ప్రభావం వాళ్ల జీవితంపైనా పడుతుంది. ఎలాగంటే...

- నేను చెప్పిందే జరగాలనే ధోరణి వారిలో మొదలవుతుంది. పెద్దవాళ్ల మాటలు వినరు. ఇతరుల నుంచి నేర్చుకోవడానికి ఆసక్తి చూపించరు. అధిపత్య ధోరణి కనిపిస్తుంది. ఇతరులతో సర్దుకుపోలేరు.
- ఇటువంటి పిల్లలు ఏ విషయాన్ని, పనిని నేర్చుకోవడానికి ఇష్టపడరు. అన్నింటికీ ఇతరులపై ఆధారపడతారు.
- అబద్ధాలు చెప్పే అవకాశాలూ ఎక్కువే. బద్ధకం, మాట వినకపోవడం, మొండిపట్టుదల వంటి సమస్యలూ కనిపిస్తాయి.
- పెద్దలను, ఇతరులను గౌరవించరు. డబ్బు విలువా తెలియదు. అహంకార భావం పెరుగుతుంది.

కౌన్సెలింగ్ ఉంది...

గారాబం చేయడం వల్ల కొందరు చిన్నారులు అధిపత్య ధోరణి ప్రదర్శిస్తారు. తల్లిదండ్రులు దాన్ని నాయకత్వ లక్షణాలని అనుకుంటారు కానీ కాదు. అదే కొనసాగితే పెద్దయ్యేకొద్దీ ఎదిరించడం మొదలుపెడతారు. చిన్నప్పటినుంచీ వాళ్లకంటూ పరిధి పెట్టాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో విచక్షణతో ఆలోచించాకే వారికి సమకూర్చాలి. అప్పటివరకూ గారాబం చేసిన పిల్లల్ని మార్చాలనే ఉద్దేశంతో వాళ్లతో కఠినంగా ఉంటే వారిలో అభద్రతాభావం పెరుగుతుందని గుర్తుంచుకోవాలి. నిదానంగా వారిని మార్చాలి. పిల్లల పెంపకం విషయంలో పెద్దవాళ్లు ఒకేమాటమీద ఉండాలి. లేదంటే చిన్నారులు దాన్ని అవకాశంగా తీసుకుని... ఇద్దరినుంచీ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తారు. గారాబానికి విపరీతంగా అలవాటైతే మానసిక నిపుణులను సంప్రదిస్తే... కౌన్సెలింగ్ చేస్తారు.

డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

మొటిమల్ని నివారించేందుకు క్రీంలు రాయడమే కాదు... ఈ ఆసనాలు వేస్తూ, కొన్ని జాగ్రత్తలు తీసుకుని చూడండి. చాలా తక్కువ సమయంలో మార్పు కనిపిస్తుంది.

మొటిమలకు కటిచక్రాసనం

ముందు శరీరంలోని వ్యర్థాలను తొలగించుకోవాలి. శంఖ ప్రక్షాళనతో మొదలుపెట్టాలి. పూర్తి శంఖ ప్రక్షాళన యోగా నిపుణుల సహకారంతోనే చేయాలి. నెలసరి సమయంలో, గర్భంతో ఉన్నప్పుడు దీన్ని చేయకూడదు. అధిక రక్తపోటు, మధుమేహం లాంటి అనారోగ్య సమస్యలు ఉన్నవారు నిపుణులను సంప్రదించాలి.

కటి చక్రాసనం: శ్వాస పీలుస్తూ పక్కలకు మెలి తిరగాలి. శ్వాస వదులుతూ మధ్యకు రావాలి.

ఇలా చేయాలి:

రెండు లీటర్ల గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల ఉప్పు కలిపి ఉంచాలి. కాలకృత్యాలు తీర్చుకున్నాక లీటరు నీరు తాగి ఈ ఆసనాలు ఒక్కొక్కటి ఏడుసార్లు వేయాలి. ఇప్పుడు అరలీటరు నీరు తాగి, ఆసనాలు వేసి మళ్లీ నీరు తాగాలి. కావాలనుకుంటే మధ్యలో కొద్దిగా విరామం తీసుకోవచ్చు. అవసరం అయినప్పుడు బాత్రూంకి వెళ్లొచ్చు.

మూడు లేదా నాలుగు విరేచనాలు తరువాత పొట్ట ఖాళీ అయినట్లు అనిపిస్తుంది. ఒక గంట ఆగి అల్పాహారంగా పల్చని పెసరపప్పు అన్నం (కిచిడీ) బాగా నెయ్యి వేసుకుని తినాలి. ఇలా నెలకోసారి చేయొచ్చు.

ఈ జాగ్రత్తలూ...

- కనీసం వారానికి రెండురోజులు ఒక లీటరు నీటికి ఒక చెంచా ఉప్పు కలిపి తీసుకోవాలి. మలబద్ధకం ఉన్నవారు రోజూ ఈ ప్రక్రియ చేయాలి.
- రోజూ పది నిమిషాలు సూర్య నమస్కారాలు చేయాలి.
- రోజంతా తరచూ నీరు తాగుతూనే ఉండాలి.
- జంక్‌ఫుడ్స్ మీకు సరిపడని ఆహారం తీసుకోకూడదు.
- భోజనం కాకుండా... రోజులో మధ్యమధ్య పండ్లు, పచ్చి కూరగాయల సలాడ్ తినాలి.
- కంటినిండ నిద్ర పోవాలి. ఆరోగ్యవంతమైన, అందమైన చర్మం మీదువుతంది.

ఈ జాగ్రత్తలు తీసుకుంటూ ఆసనాలు వేస్తేనే మొటిమల సమస్య అదుపులోకి వస్తుంది.

అర్ధ తిర్యక్ భుజంగాసనం: శ్వాస పీలుస్తూ ఛాతీభాగాన్ని పైకిలేపి పక్కకు చూడాలి. శ్వాస వదులుతూ మధ్యకు వచ్చి ఛాతీభాగాన్ని కిందకు దించాలి.

– వైశాలి,
బోధి-యోగా ట్రైనింగ్ అకాడెమీ

మెడ నల్లగా మారిందా... రెండు చెంచాల కాఫీపొడిలో కొద్దిగా గులాబీనీరు, రెండు చెంచాల నిమ్మరసం కలిపి మెడభాగానికి రాసి ఆరాక కడిగేయండి. నలుపు సమస్య అదుపులోకి వస్తుంది.

నజరానా

అన్ని పుస్తక విక్రయ కేంద్రాలలో 'బాలభారతం' మాసపత్రిక లభిస్తుంది. మీ ప్రతి కోసం ఈనాడు ఏజెంటును సంప్రదించండి.
మీకెంతో ఇష్టమైన బాలభారతం పాత సంచికలను teluguvelugu.inలో చూడవచ్చు.

కిట్టూతో జట్టూ.. విజ్ఞానానికి తొలిమెట్టు..
రామోజీ ఫౌండేషన్ బాలభారతం

ఆహా! .. ఏమి రుచి
ఈనాడు
కరీంనగర్
ఆదివారం జూన్ 9, 2019

బుజ్జాయిల డబ్బా రోజుకో రుచబ్బా!

"ఒక్క మెతుకైనా వదిలావో.." ఉదయం పిల్లాడికి లంచ్ బాక్స్ పెడుతూ అమ్మ బెదిరింపు."తినాలనిపించలేదు మమ్మీ" స్కూల్ నుంచి వచ్చాక బాక్స్ ఇస్తూ పిల్లాడి ఫిర్యాదు. బాక్స్ చూసిన నిమిషం కోపం వచ్చినా.. ఖాళీ కడుపుతో నకనకలాడుతున్న బిడ్డను చూసి తల్లి మనసు తల్లడిల్లిపోతుంది. ఈ సమస్య చాలామంది తల్లిదండ్రులకు ఎదురవుతూనే ఉంటుంది. దీనికి పరిష్కారంగా.. ఎన్నో ప్రయోగాలు చేస్తుంటారు. పాకశాస్త్రంలో ప్రావీణ్యాన్నీ సంతరించుకుంటారు. రోజుకో రకం వంటకం పెట్టేవుండే.. ఎప్పుడెప్పుడు లంచ్‌టైమ్ అవుతుందా అని ఎదురు చూస్తారు పిల్లలు. మీ ప్రేమతో పాటు సరికొత్త రుచిని రంగరించండి.. లొట్ట లేసుకుంటూ తినేస్తారు. కావాల్సిన పోషకాలూ పొందుపరిస్తే.. పిల్లలకు మేలు.. కన్నవారికి హ్యాపీలు..

సోమవారం — వెజ్ ఫ్రైడ్‌రైస్

కావాల్సినవి: బాస్మతి బియ్యం- కప్పుకి కాస్త వెలితిగా, క్యారెట్- ఒకటి, బీన్స్- రెండు, క్యాబేజీ తురుము- పావుకప్పు, ఉల్లిపాయముక్కలు- మూడు చెంచాలు, ఉల్లికాడలు- ఐదు, వెల్లుల్లి ముక్కలు- అరచెంచా, క్యాప్సికమ్- ముక్కలు రెండు చెంచాలు, సోయాసాస్- రెండు చెంచాలు, చిల్లీసాస్- అరచెంచా, అజినమోటో- పావుచెంచా (తప్పనిసరి కాదు), మిరియాల పొడి- పావుచెంచా, నూనె- ఒకటిన్నర చెంచా, ఉప్పు- రుచికి తగినంత

తయారీ: అన్నాన్ని పలుకుగా వార్చుకోవాలి. ఉడికేటప్పుడు కొద్దిగా నూనె వేసుకుంటే అన్నం పొడిగా వస్తుంది. కడాయిలో నూనె వేసుకొని వెల్లుల్లి ముక్కలు, ఉల్లికాడల తురుము వేసి ముదురురంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. ఇప్పుడు క్యారెట్, బీన్స్, క్యాబేజీ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించుకోవాలి. ఆపై సోయాసాస్, చిల్లీసాస్, మిరియాలపొడి, అజినమోటో, ఉప్పు వేసుకుని కాయగూరలతో అన్ని సాసులు సమానంగా కలిసేట్టుగా చూడాలి. ఇప్పుడు ఇందులో ఉడికిన అన్నం వేసి కాయగూరలతో కలుపుకోవాలి. చివరిగా ఉల్లిపొరకని సన్నగా తరిగి వేసి ఐదు నిమిషాల పాటు ఉంచి దింపుకోవడమే.

మంగళవారం — మొఘలాయి పరోటా

కావాల్సినవి: గోధుమపిండి- రెండు కప్పులు, నూనె- రెండు చెంచాలు, ఉల్లిపాయ-సగం, పచ్చిమిర్చి- రెండు, అల్లంవెల్లుల్లి పేస్ట్- చెంచా, క్యాప్సికమ్ ముక్కలు- రెండు చెంచాలు, క్యారెట్ తురుము- రెండు చెంచాలు, పసుపు- పావుచెంచా, కారం- అరచెంచా, ధనియాలపొడి- అరచెంచా, జీలకర్రపొడి- పావుచెంచా, అమ్‌చూర్‌పొడి- పావుచెంచా, గరంమసాలా- పావుచెంచా, ఉప్పు- తగినంత, పనీర్- రెండు కప్పులు

తయారీ: గోధుమపిండిలో ఉప్పు కలుపుకొని చపాతి పిండిలా చేసుకుని ఇరవై నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. ఒక కడాయిలో నూనె వేసి వేడి చేసుకుని... ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి వేగాక అందులో అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి రెండు నిమిషాలపాటు వేయించుకోవాలి. ఇప్పుడు క్యాప్సికమ్ ముక్కలు, క్యారెట్ ముక్కలు వేసి వేయించుకోవాలి. అవి వేగాక పసుపు, కారం, ధనియాలపొడి, జీలకర్రపొడి, అమ్‌చూర్, గరంమసాలా, ఉప్పు వేసి చక్కని వాసన వచ్చేంతవరకూ వేయించుకుని చివరిగా పనీర్ వేసి వేయించి దింపుకోవాలి. ఇప్పుడు చపాతీలను కాస్త మందంగా ఒత్తుకుని అందులో పనీర్ మిశ్రమాన్ని ఉంచి అన్నివైపుల నుంచీ మూసేయాలి. పెనంపై నూనె రాసి అన్ని వైపులా కాలేట్టుగా చూసుకోవాలి. మధ్యలోకి కత్తిరించి బాక్సుల్లో పెడితే పిల్లలు ఇష్టంగా తింటారు.

బుధవారం — బనానా పూరీ

కావాల్సినవి: బాగా పండిన అరటిపండు- రెండు, పంచదార- రెండు చెంచాలు, పెరుగు- పావుకప్పు, జీలకర్ర- చెంచా, బేకింగ్‌సోడా- చిటికెడు, ఉప్పు- పావుచెంచా, మైదా- రెండు కప్పులు, నూనె- వేయించడానికి తగినంత

తయారీ: ఒక పాత్రలో అరటిపండు, తగినంత పంచదార తీసుకుని ఫోర్క్‌తో బాగా చిదిమి పెట్టుకోవాలి. దీనిలో పెరుగు, జీలకర్ర, బేకింగ్‌సోడా, ఉప్పు వేసి చెంచాతో అన్నింటిని కలుపుకోవాలి. చివరిగా మైదా వేసి ఎక్కడా ఉండల్లేకుండా మెత్తగా చపాతీపిండిలా ఒత్తుకోవాలి. దీనికి కొద్దిగా నూనెరాసి పైన ఒక తడివస్త్రం కప్పి రాత్రంతా ఉంచేయాలి. తెల్లారి వాటిని చిన్న ఉండలుగా చేసుకుని కొద్దిగా మందంగా ఉండేట్టుగా పూరీల మాదిరిగా ఒత్తుకోవాలి. నూనెలో వేయిస్తే ఇవి బన్స్ మాదిరిగా పొంగుతాయి. పిల్లలు ఇష్టంగా తింటారు.

గురువారం — పండ్లతో ఇడ్లీ

కావాల్సినవి: బొంబాయి రవ్వ- ముప్పావు కప్పు, మామిడిపండు గుజ్జు- ముప్పావుకప్పు, పంచదార- పావుకప్పు, పెరుగు- పావుకప్పు, నీళ్లు- పావుకప్పు, బేకింగ్ సోడా- పావుచెంచా, ఉప్పు- పావుచెంచా, నేతిలో వేయించిన జీడిపప్పులు- రెండు చెంచాలు, నెయ్యి- చెంచా

తయారీ: బొంబాయిరవ్వని బంగారు రంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. రవ్వలో మామిడిపండు గుజ్జు, పంచదార, పెరుగు వేసి ఇడ్లీపిండిలా కలుపుకొని పదిహేను నిమిషాలపాటు పక్కన ఉంచుకోవాలి. చివరిగా బేకింగ్‌సోడా, ఉప్పు కలిపి ఇడ్లీ పిండిని ప్లేట్లలో వేసుకుని నేతిలో వేయించిన జీడిపప్పులని ఒక్కో దాంట్లో ఒక్కోటి పెట్టాలి. ఇడ్లీ పాత్రలో పావుకప్పు నీళ్ల పోసుకుని అవి మరుగుతున్నప్పుడు ఇడ్లీ ప్లేట్లని ఉంచాలి. పావుగంటపాటు ఆవిరిమీద ఉడికించుకోవాలి. టూత్‌పిక్ లేదా దాతుతో గుచ్చి చూసినప్పుడు వాటికి ఇడ్లీ పిండి అంటుకోకుండా ఉంటే ఇడ్లీలు ఉడికిపోయినట్టే.

శుక్రవారం — పెరుగు శాండ్‌విచ్

కావాల్సినవి: బ్రెడ్ స్లైసులు- ఎనిమిది, నీళ్లు లేకుండా వడకట్టిన గట్టి పెరుగు- ముప్పావుకప్పు, ఉల్లిపాయ ముక్కలు- నాలుగు చెంచాలు, టమాటా ముక్కలు- నాలుగు చెంచాలు, క్యాప్సికమ్- రెండు చెంచాలు, క్యారెట్ తురుము- రెండు చెంచాలు, పచ్చిమిర్చి ముక్కలు- చెంచా, కొత్తిమీర తురుము- చెంచా, స్వీట్‌కార్న్ గింజలు- మూడుచెంచాలు, ఉప్పు- తగినంత, కారం- కొద్దిగా, చాట్‌మసాలా- పావుచెంచా, నెయ్యి- కొద్దిగా

తయారీ: ఒక పాత్రలో తరిగిన కాయగూర ముక్కలన్నింటిని తీసుకోవాలి. దీనికి గట్టి పెరుగుని కలపాలి. ఇప్పుడు తక్కిన చాట్‌మసాలా, ఉప్పు, కారం, కొత్తిమీర వంటివన్నీ కలుపుకోవాలి. బ్రెడ్ స్లైసులకి పెరుగు రాసి ఆపై ఈ కాయగూర ముక్కల మిశ్రమాన్ని ఉంచి మరో బ్రెడ్‌తో కలిపి శాండ్‌విచ్ తయారుచేసుకోవాలి. వీటిని పెనం లేదా గ్రిల్‌పై కాల్చి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.

శనివారం — రాగి, నువ్వుల లడ్డు



కావాల్సినవి: మొలకెత్తిన రాగులతో చేసిన పిండి- కప్పు, నువ్వులు- పావుకప్పు, పచ్చ యాలకులు- నాలుగు, వేయించిన పల్లీలు- పావుకప్పు, కొబ్బరికోరు- పావుకప్పు, బెల్లం- 150గ్రా, నెయ్యి- మూడు చెంచాలు

తయారీ: కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి అందులో రాగి పిండిని చక్కని వాసన వచ్చేంతవరకూ వేయించుకోవాలి. పల్లీలను వేయించి పొట్టు తీసి పెట్టుకోవాలి. నువ్వులు, కొబ్బరి కూడా విడివిడిగా వేయించుకోవాలి. ఇప్పుడు పల్లీలు, నువ్వులు, కొబ్బరి, పచ్చ యాలకులు అన్నింటిని కలిపి మిక్సీలో పొడి కొట్టుకోవాలి. చివరిగా బెల్లం తరుగు, రాగిపిండి కూడా మిక్సీలో వేసి తిప్పితే లడ్డూ చేయడానికి వీలుగా మిశ్రమం మారుతుంది. నెయ్యి చేతికి అద్దుకుని ఈ మిశ్రమంతో లడ్డూలు చుట్టుకోవాలి. పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇది.

వాహ్‌వా.. నీలి గోధుమ!

గోధుమరంగు... అనగానే ఇంతవరకూ మదిలో మనకి ఒక రంగే గుర్తుకొచ్చేది. ఇక నుంచి గోధుమరంగు అనగానే ఊదా, నీలం, నలుపు రంగులు కూడా

గుర్తుకురావాలేమో! ఎందుకంటే మన దేశంతోపాటు ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, సింగపూర్, చైనా దేశాలు.. నీలి, నలుపు రంగు గోధుమల్ని పండిస్తున్నాయి. ఇలా రంగులు మార్చడం వెనుక ఏం ప్రయోజనం ఉంటుందనే అనుమానం రావొచ్చు. ఈ రంగు గోధుమల్లో యాంథోసయానిన్ పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ యాంథోసయానిన్ను బరువు తగ్గించుకోవడానికి, గుండెజబ్బులు అదుపులో ఉంచడానికి, మధుమేహ నివారణకి ఉపకరిస్తాయని

పరిశోధనల్లో తేలింది. ఫలితంగా... భారతీయ ఆహార ఉత్పత్తి సంస్థలు నీలి, నలుపు, ఊదా రంగు గోధుమలని పండించడానికి ముందుకొచ్చాయి. ఇప్పటికే సింగపూర్‌లో కోకా పర్పుల్ సంస్థ ఊదా రంగు నూడుల్స్‌ని తయారుచేసి మార్కెట్లోకి విడుదల చేసింది. త్వరలో బిస్కెట్లు, బ్రెడ్‌తోపాటు చపాతీ, పరోటా, పుల్కా, పూరీ, పిజ్జా, బిస్కెట్, కేక్, బర్గర్లు సైతం నీలం, ఊదా వంటి నోరూరించే రంగుల్లోకి మారబోతున్నాయన్నమాట. తక్కిన వర్ణాలతో పోలిస్తే నలుపు రంగు గోధుమల్లో యాంథోసయానిన్లు అధికంగా ఉండటంతోపాటు ఆ ఉత్పత్తుల ధరలు కూడా అన్నింటికంటే ఎక్కువగా పలుకుతున్నాయట.

కొడగు... రుచుల గొడుగు!

కూర్గ్ పేరుచెబితే ప్రకృతి అందాలే గుర్తుకొస్తాయి ఎవరికైనా! భోజన ప్రియులకు మాత్రం కొడగు లేదా కూర్గ్ శైలి ప్రత్యేక వంటకాలే ముందుగా నోరూరిస్తాయి. ప్రకృతి అందాలని వర్ణించేటప్పుడు 'స్కాట్లాండ్ ఆఫ్ ఇండియా'గా చెప్పుకొనే కొడగుని వంటకాల విషయంలో మాత్రం 'ల్యాండ్ ఆఫ్ కాఫీ' అంటారు ముద్దుగా! కొడగు అద్భుతమైన కాఫీ రుచులకు పెట్టింది పేరు. భౌగోళికంగా వైవిధ్యంగా ఉండే కూర్గ్ వంటకాల్లోనూ అదే ప్రత్యేకతను కనబరుస్తుంది. అదవి మామిడికాయలతో చేసిన కడ్‌మాంగే కూర, పనసపండుతో చేసే కులేపుట్టు, వరిపిండితో చేసే నూల్‌పుట్టు, వెదురుచిగుళ్ల కూరతో పాటు వేటపంది మాంసం ఇక్కడ ప్రత్యేకమైన వంటకాలు. అలాగే ఇక్కడ తయారుచేసే కాచమ్ పులి అనే స్థానిక వెనిగర్ అంటే భోజన ప్రియులు ప్రాణం పెడతారు. తేలిగ్గా చేసుకునే కడ్‌మాంగే కూరను ఎలా వండుకుందామో చూద్దాం.

కడ్‌మాంగే

కులేపుట్టు

కావాల్సినవి: పండిన మామిడికాయలు- నాలుగు, పచ్చిమిర్చి- ఐదు, బెల్లం- పావుకప్పు, ఉప్పు- తగినంత

తాలింపు కోసం: నూనె- చెంచా, ఆవాలు- చెంచా, ఎండుమిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు, కరివేపాకు రెబ్బ- ఒకటి

తయారీ: మామిడిపండ్లని కడిగి శుభ్రం చేసుకోవాలి. ముచ్చికలు తీసేసి అక్కడక్కడ కత్తితో పండ్లకి గాట్లు పెట్టుకోవాలి. లోతు గిన్నెలో తగినన్ని నీళ్లు పోసుకుని తక్కువ మంట మీద మామిడిపండ్లని ఉడికించుకోవాలి. పది నిమిషాలకల్లా పండ్లు పూర్తిగా ఉడికిపోతాయి. స్టౌ కట్టేసి నీళ్లను వేరుచేసి పక్కన పెట్టుకోవాలి. పండ్లపై ఉన్న తొక్కని తీసేయాలి. చేత్తో గుజ్జు తీసి పెట్టుకుని టెంకలని అందులోనే ఉంచాలి. ఈ మిశ్రమాన్ని స్టౌ మీద ఉంచి దీనికి పచ్చిమిర్చి, ఉప్పు, బెల్లం కలిపి తక్కువ మంట మీద ఉడకనివ్వాలి. మరీ చిక్కగా అనిపిస్తే కాసిని నీళ్లు కలిపి స్టౌ కట్టేయాలి. ఇప్పుడు ఆవాలు, ఇంగువ, ఎండుమిర్చి, కరివేపాకుతో తాలింపు వేసుకుని దాన్ని ఉడికించుకున్న మామిడిగుజ్జులో వేసి మూతపెట్టేయాలి. తాలింపు ఊరి.. కూర మహా రుచిగా ఉంటుంది. దోసెలతో కలిసి ఈ కూరని తింటూ ఉంటారు కూర్గ్ వాసులు.